# క్రాంతి

లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| మార్క్స్-ఏంగెల్స్ | ... | 5 |
| రెండవ ఇంటర్నేషనల్ | ... | 13 |
| తడపాల అమరులు | ... | 30 |
| మార్క్స్-అంబేద్కర్ | ... | 37 |
| మేడే | ... | 42 |
| కేంద్ర బడ్జెట్ | ... | 45 |
| న్యాయవ్యవస్థ | ... | 47 |
| ఎ.ఒ.బి. రిపోర్ట్ | ... | 50 |
| పత్రికా ప్రకటన | ... | 56 |




**సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎస్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక**

**సంపుటి: 42 సంచిక: 1 2018, మే వెల: పది రూపాయలు**


**కారల్ మార్క్స్ 200వ జయంతి సందర్భంగా జీవిత విశేషాలు**

## మానవ సమాజ పరిణామ చరిత్రను శాస్త్రీయంగా ఆవిష్కరించిన విప్లవకారుడు కారల్ మార్క్స్ జీవితం చిరస్మరణీయం

కారల్ మార్క్స్ 1818 మే 5వ తేదీన జర్మనీ దేశపు రైన్‌లాండ్ ప్రాంతంలోని ట్రయర్ నగరంలో జన్మించాడు. 1883 మార్చి 14న మరణించాడు. మార్క్స్ జీవించిన కాలం చిన్నదే. గత కాలాన్నీ, వర్తమానాన్ని లోతుగా విశ్లేషిస్తూ చేసిన అధ్యయనంతో భవిష్యత్‌కు నూతన బాటలు వేయగలిగాడు. మార్క్స్ రూపొందించిన సిద్ధాంతాలు, నిర్మించిన పార్టీ, ఉద్యమ కార్యాచరణ మార్క్సిజంగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి వెలుగొందుతుంది.



మార్క్స్ జీవితం విజ్ఞానదాయకం. స్కూలు జీవితంలోనే తెలివిగల విద్యార్థి. ప్రాచీన సాహిత్యం, జర్మన్ భాష, చరిత్ర పాఠాలలో ప్రతిభతో పాటు గణితంలో అమోఘ ప్రజ్ఞను చూపాడు. ఒక వ్యాసంలో **"ప్రజలందరి మేలుకోరి పని చేస్తూ ఆ క్రమంలో అభివృద్ధి చెందిన వారినే చరిత్ర మహానుభావులుగా గుర్తిస్తుంది"** అని వృత్తి ఎంపికలో తన భావాల్ని రాసి మెరిపించాడు. ఈ మాటలకు నూరు శాతం కట్టుబడిన మహానుభావుడు మార్క్స్.

1839లో "డెమక్రటిస్-ఎపిక్యురస్ ప్రకృతి తత్వాల మధ్య వ్యత్యాసం" అన్న అంశంపై తన డాక్టరేట్ పరిశోధన ప్రారంభించాడు. వారి భౌతికవాద దృక్పథంను లోతుగా అర్థం చేసుకుని విశ్లేషించాడు. తన థీసిస్‌ను అభివృద్ధి నిరోధక సిద్ధాంత వేత్తలు తిష్ట వేసియున్న బెర్లిన్ యూనివర్సిటీకి సమర్పించడం అప్రతిష్టగా భావించి జేనా యూనివర్సిటీకి సమర్పించాడు. ఎంత అధ్యయనం వుందో అంత మేధాశక్తి, నిశిత దృష్టి ఉందని ప్రశంసలందుకున్నాడు. 24 సంవత్సరాల వయస్సుకే (1841కే) సునిశితమైన తాత్విక చిత్తశుద్ధి, పదునైన వాక్చాతుర్యంతో మధ్య యుగాల మత రాజకీయాలకు చివరి దెబ్బ కొడతాడనీ, రూసో, వాల్టేర్, హోల్బక్, లెసింగ్, హైనా, హెగెల్ వీరందరూ డాక్టర్ మార్క్స్‌లో వున్నారని మిత్రులు యువ హెగెలియన్లు నమ్మారు.

**మార్క్స్ ద్వి శత జన్మదిన ప్రత్యేక సంచిక**

మార్క్స్ దృష్టిలో వినోదమంటే సాహిత్య పఠనమే. పలువురు ప్రముఖ సాహిత్య వేత్తలకన్నా ఎక్కువ సాహిత్య జ్ఞానం ఉందతనికి. అన్ని తరాల మహా కవులు, రచయితలు అందరూ ఆయనకి ఇష్టమే. జర్మన్ సాహిత్యం గురించి ఆయనకు పూర్తి అవగాహన ఉంది. మధ్యయుగాల కవులను కూడా అధ్యయనం చేశాడు. ఫ్రెంచ్ సాహిత్యం, ఇంగ్లీష్ సాహిత్యం విస్తృతంగానే అధ్యయనం చేశాడు.

వర్గ చైతన్యం విప్లవానికి ఎరువులాంటిది అని మార్క్స్ అభిప్రాయం. జర్మన్ కార్మికవర్గం, యూరోపియన్ కార్మికవర్గానికి సిద్ధాంత కర్తని, ఇంగ్లీషు కార్మికవర్గం ఆర్థికవేత్తని, ఫ్రెంచ్ కార్మికవర్గం రాజకీయ వేత్తని రాశాడు. తర్వాత రోజుల్లో ఈ మూడు ధోరణుల సమ్మేళనమే 'మార్క్సిజం' అని ఏంగెల్స్ అన్నాడు.

హెగెల్ తాత్విక ప్రభావంలో యువ హెగెలియన్‌గా వున్న మార్క్స్‌ను ఫ్యూయర్‌భా రాసిన 'క్రైస్తవ మత సారాంశం' గ్రంథం బాగా ఆకర్షించింది. హెగెల్ తత్వశాస్త్రంలోని కొన్ని అంశాలను విమర్శనాత్మకంగా మెరుగుపరచిన ఫ్యూయర్‌భా ప్రపంచ అంతస్సారాన్ని మతం, హెగెల్ భావవాదం గ్రహించలేదని ఖచ్చితంగా తేల్చి చెప్పాడు. 'మనిషి ఉనికికి మూలం ప్రకృతి మాత్రమే' అన్న భౌతికవాదాన్ని విశ్వసించడంతోపాటు "దేవుణ్ని, మతాన్ని మనిషే సృష్టించాడన్న" ఫ్యూయర్‌భా తర్కంలోని నిజాన్ని గుర్తించిన మార్క్స్, మనిషిని సామాజిక జీవిగా చూడకుండా ప్రాణం వున్న పదార్థంగానే చూసిన పరిమితి కారణంగా ఫ్యూయర్‌భా సమాజాన్ని, చరిత్రను విస్మరించాడని కూడా అర్థం చేసుకున్నాడు. ఈ రకమైన విమర్శనాత్మక దృష్టి, సమగ్ర అవగాహన మార్క్స్‌లో పరిపక్వం కావడానికి రాజకీయ కార్యకలాపాలు దోహదం చేశాయి. ప్రసిద్ధ సోషలిస్టు సిద్ధాంత వేత్తలు చార్లెస్ ఫొరియర్, సైంట్ సైమన్, రాబర్ట్ ఓవెన్‌ల రచనలు చదివాడు. వారంతా పెట్టుబడిదారీ సమాజంలోని దురన్యాయాలనూ, దౌర్భాగ్య లక్షణాలనూ, కుళు్ళను విమర్శించి ఎండగట్టి దోపిడీ పీడనలు లేని సుహృద్భావ మానవ సమాజ స్థాపనకు కలలు కన్నారు. వారి సిద్ధాంతాలకు శాస్త్రీయ ప్రాతిపదిక లేదనీ, వారు కార్మిక శక్తినీ, వర్గపోరాట అవసరాన్ని గుర్తించకుండా, పాలకులు, యజమానులు దయాదాక్షిణ్యాలను ప్రదర్శించాలని కోరుకున్నారని వారు చేప్పే మార్గాలు పరిష్కారానికి పనికి రావని మార్క్స్ గుర్తించాడు.

1844లో పారిస్‌లో మార్క్స్, ఏంగెల్స్ ఇద్దరు 10 రోజులు కలిసి ఉన్నారు. ఇద్దరి మధ్య సైద్ధాంతిక విషయాల్లో జరిగిన చర్చల సందర్భంగా ఏకాభిప్రాయం కుదిరింది. ఆ నాటి నుండే సమిష్టి కృషి ప్రారంభమైంది. మార్క్స్ జీనియస్. 'జీనియస్' అనేది కోరుకుంటే లభించేది కాదు. ప్రయత్నించి సాధించగలిగేది. అలాంటి వారిని చూసి అసూయ పడేవారు అల్పబుద్ధులు అంటాడు ఏంగెల్స్. మార్క్స్‌కు ఉన్నది జ్ఞాన సంపదయితే, ఏంగెల్స్‌కు ఉన్నది సంపద గురించిన జ్ఞానం. మార్క్స్ జీవితమంతా దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించాడు. ఎన్ని ఆటంకాలున్నా తాను మార్క్స్ తర్వాతే ఉంటానని, మార్క్స్‌కు ఆర్థికంగా, మేధోపరంగా వీలైనంత సహాయం చేయడమే తన విధి అనుకుని అంకిత భావంతో ఏంగెల్స్ కృషిచేశాడు.

బ్రస్సెల్స్ తిరిగి వచ్చిన మార్క్స్, ఏంగెల్స్ ఇద్దరూ కృషి చేసి 'జర్మన్ ఐడియాలజీ' అనే సిద్ధాంత చర్చా గ్రంథాన్ని రచించారు. తొలిసారిగా గతితార్కిక చారిత్రక భౌతికవాదానికి సమగ్రమైన, క్రమబద్ధమయిన మూలసూత్రాలు రూపొందించారు. హెగెల్ గతితార్కాన్నీ, ఫ్యూయర్‌భా భౌతికవాదాన్ని అభివృద్ధి చేసి గతితార్కిక భౌతికవాదాన్ని రూపొందించి సామాజిక చరిత్రకు అన్వయించి చారిత్రకంగా శాస్త్రీయ సిద్ధాంతాన్ని రూపొందించారు. మార్క్స్ సిద్ధాంతాన్ని, విప్లవ కార్యాచరణను మేళవించి 'ప్రపంచాన్ని మార్చాల'న్నాడు. ఈ గొప్ప విషయమే మార్క్స్ ప్రత్యేకతగా చరిత్ర పొడవునా తన జ్ఞానంగా నిలుపుకుంది.

యూరప్ దేశాల పరిస్థితి గురించి బాగా తెలిసిన మార్క్స్, ఏంగెల్స్‌లు దాని వర్గ స్వభావాన్ని పూర్తిగా గ్రహించారు. '1847లో లీగ్ ఆఫ్ జస్టిస్' ఆహ్వానం మేరకు అందులో చేరారు. దాని పునర్వ్యవస్థీకరణకూ, కార్మికవర్గ పార్టీ స్థాపనకు ఎంతో కృషి చేశారు. సరికొత్త దృక్పథానికీ, విజ్ఞానానికి అనుగుణంగా కేంద్రీకృత ప్రజాస్వామిక నిర్మాణ సూత్రాలను రూపొందించారు. దానికి కమ్యూనిస్టు లీగ్‌గా పేరు ప్రతిపాదించడంతో పాటు "ప్రపంచ కార్మికులారా, ఏకంకండి" అనే అంతర్జాతీయ స్వభావంతో కూడిన నినాదాన్నిచ్చారు. 1847 జూన్‌లో లండన్‌లో కమ్యూనిస్టు లీగ్ ప్రథమ మహాసభ జరిగింది. కానీ మార్క్స్ తిండికి కూడా లేని ఆర్థిక ఇబ్బందుల వలన హాజరు కాలేదు. అయితే ఆ పేరు, నినాదం ఆమోదం పొంది ఒక కార్మికవర్గ పార్టీ ఏర్పాటుకు పునాదులు పడ్డాయి. అదే సంవత్సరం నవంబర్ 29న ప్రారంభమైన అంతర్జాతీయ మహాసభ ఎనిమిది రాత్రులు జరిగింది. పగలు శ్రమ చేసి రాత్రి సభలకొచ్చారు ప్రతినిధులు. నిబంధనావళి, సిద్ధాంత సూత్రాలు ఏకగ్రీవంగా ఆమోదించడంతో పాటు ఒక ప్రణాళికను రూపొందించమని మార్క్స్, ఏంగెల్స్‌లను మహాసభ కోరింది. 1848 ఫిబ్రవరిలో 23 పేజీల చిన్న సాదా పుస్తకం 'కమ్యూనిస్టు ప్రణాళిక' వెలువడింది. మానవ సమాజ చరిత్రలో మున్నెన్నడూ, తర్వాత కూడా అంత మహత్తర ప్రభావం వేసిన పుస్తకం కానరాలేదు. కమ్యూనిజాన్ని అప్పటికే ఐరోపాలోని రాజ్యాలు ఒక శక్తిగా అంగీకరించాయి.

1857–58 ఆర్థిక సంక్షోభం అనంతరం అమెరికా, యూరప్ విప్లవాలు ఉవ్వెత్తున లేచాయి. మొత్తం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కంపించిపోయింది. వందల సంఖ్యలో సంస్థలు దివాళా తీసాయి. నిరుద్యోగం ప్రబలిపోయింది. బూర్జువా ఆర్థిక వేత్తల ప్రయత్నాలు ఏమి చేసినా ఫలించవని మార్క్స్ చెప్పిన జోస్యం నిజమయింది.

సంక్షోభాలకు ఈ వ్యవస్థే మూలమని స్పష్టం అయింది. 1861-65 అమెరికా అంతర్యుద్ధం, 1863-64 ఆస్ట్రియా పాలనకు వ్యతిరేకంగా పోలెండ్‌లో ప్రజావెల్లువ, రష్యాలో వచ్చిన తీవ్రమైన మార్పులు, ఇటలీ సంఘటనలు ఇలానే ఎన్నో పోరాటాలు ప్రపంచ పరిణామాలలో చోటు చేసుకున్నాయి. ఇదే కాలంలో ముందుకొచ్చిన సంస్కరణవాదాన్ని (లాసెల్లియనిజం) ఓడించారు. పోలెండ్ ప్రజల సమస్యకు అంతర్జాతీయ దృక్పథంతో జర్మనీ కార్మికులు, ఇంగ్లీషు, ఫ్రెంచి కార్మికులు అందించిన సహకారం వెనుక మార్క్స్ చేసిన విశ్లేషణ, రాజకీయ ప్రచారం ఉన్నాయి.

మార్క్స్ ప్రోత్సాహంతో పెంపొందిన ఐరోపా కార్మికవర్గ మహోద్యమం ఒక అంతర్జాతీయ కార్మికసంస్థ స్థాపనకు అవసరమైన ప్రాతిపదికను సృష్టించింది. ఐరోపాలోని వివిధ దేశాలలో కార్మికోద్యమం మరోసారి బలం సంతరించుకుంది. 1964లో సరైన సమయం వచ్చింది. జర్మన్ కార్మికులు ఎక్కువగా ఉన్న కమ్యూనిస్టు వర్కర్స్ సొసైటీతో సహా ఇతర దేశాల కార్మికులు కూడ ఇందులో పాల్గొంటామని హామీ ఇచ్చారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, పోలెండ్, ఇటలీ, స్విట్జర్లాండ్ కార్మికులు, ప్రవాసులైన ప్రజాస్వామిక వాదులు, వందలాది మంది 1864 సెప్టెంబరు 28 సాయంత్రం సైంట్ మార్టిన్ హాల్‌లో సమావేశమయ్యారు. హాల్ ప్రతినిధులతో కిటకిటలాడింది. ప్రజాతంత్ర స్వేచ్ఛ, జాతీయ స్వతంత్రం, సామాజిక పురోభివృద్ధి కోసం సాగే పోరాటాల్లో అన్ని దేశాల కార్మికులకు ఉమ్మడి ప్రయోజనాలున్నాయని వక్తలందరూ గుర్తించారు. కార్మికవర్గ ప్రయోజనాలను కాపాడేందుకై ఒక అంతర్జాతీయ కార్మిక సంఘాన్ని నెలకొల్పాలనే నిర్ణయాన్ని సమావేశం ఎంతో ఉత్సాహంగా ఆమోదించింది. ఆ విధంగా మొదటి ఇంటర్నేషనల్ ఆవిర్భవించింది. మార్క్స్ దాని కమిటీకి ఎన్నికయ్యాడు. దానినే కేంద్ర కౌన్సిల్, జనరల్ కౌన్సిల్ అని పిలిచారు.

ఇంటర్నేషనల్ మొదటి దశలో మార్క్సిస్టు దృక్పథం పెద్దగా ప్రాచుర్యానికి రాలేదు. అది నిలదొక్కుకోవడానికి కార్యక్రమం, నిబంధనలు రూపొందించడంలో భిన్నాభిప్రాయాల మధ్య గట్టి పోరాటాలే జరిగాయి. కార్మికవర్గపు విప్లవ లక్ష్యాలను విస్పష్టంగా ప్రకటిస్తూనే విభిన్న ధోరణులు కలవారికి ఆమోదయోగ్యంగా ఉండేట్లుగా దాన్ని తయారు చేయడం ఒక సమస్య. కాగా, ఆనాటి కార్మికవర్గ పరిపక్వతకు తగిన స్థాయిలో శాస్త్రీయ కమ్యూనిజం సూత్రాలను రూపొందించడం కూడా తేలికయిన పనికాదు. అలాంటి పని మార్క్స్ భుజాల పైనే పడింది. కార్మిక నాయకులు పెట్టుబడిదారీ వ్యవస్థ కూల్చివేత వారి లక్ష్యంగా భావించలేదు. ఉన్న పరిధిలోనే కొన్ని హక్కుల సాధన వారిలక్ష్యం. ప్రౌదన్, బ్లాంక్వీలకు వర్గపోరాటం అవసరం లేదు. ఆర్థికవాదం, సంస్కరణవాదం, అరాచకవాదం వీరి విధానాలుగా ఉన్నాయి. ఈ విధంగా అంతర్జాతీయ కార్మికోద్యమంలోని వివిధ వర్గాలు సిద్ధాంత పరంగా అస్తవ్యస్తంగాను, నిర్మాణ రీత్యా ఏకీకృతం కాకుండాను ఉన్నాయి. అనేక మంది కార్మికులు పోరాటాల్లో పాల్గొంటున్నా వారికి శాస్త్రీయ కమ్యూనిజం గురించి తెలియదు. సంకుచిత ఏర్పాటువాద ధోరణులను, అవకాశవాదంతో కూడిన పలాయనవాద ధోరణులకు వ్యతిరేకంగా పోరాడి సంయుక్త కార్యాచరణ, చర్చల ద్వారా కార్మికవర్గ ఐక్యత సాధించడానికే ప్రాధాన్యతనిచ్చాడు. ఉమ్మడి అంశాల ప్రాతిపదికను వివిధ ప్రాంతాల కార్మికుల మధ్య సంఘీభావం పెంపొందేలా కృషిచేస్తూ కార్మికవర్గ పోరాట విజయానికి ఒక స్వతంత్ర కార్మిక సంఘం అవసరమని నొక్కి చెప్పాడు. చైతన్యం అంటే సామాజికాభివృద్ధికి సంబంధించినది అట్టి చైతన్యంతో కూడిన రాజకీయ సంస్థ కార్మికవర్గ పార్టీ అన్నాడు మార్క్స్. "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అన్న విప్లవ నినాదంతో మార్క్స్ ప్రారంభోపన్యాసం ముగిసింది. కమ్యూనిస్టు లీగ్ కొనసాగింపును అది ప్రతిబింబించింది. అంతర్జాతీయ కార్మికోద్యమ ప్రగతికి అది నిదర్శనం. విప్లవ కార్మికవర్గాలకి స్వభావ సిద్ధమైన లక్షణాలు రెండు 1.వర్గ సౌహార్ద్రత, 2. కార్మికవర్గ అంతర్జాతీయత. దీనికి ఐక్య కార్యాచరణే ఉత్తమ మార్గం. మార్క్స్‌కున్న స్పష్టమైన లక్ష్యాలు, తీవ్రకృషి ఫలితంగా ఐరోపా కార్మికుల్లో అంతర్జాతీయ సంస్థ ప్రతిష్ఠ పెరిగింది.

మార్క్స్ ప్రోత్సాహంతో ఐరోపా కార్మికవర్గ మహోద్యమం ఒక అంతర్జాతీయ కార్మిక సంస్థ స్థాపనకు అవసరమైన ప్రాతిపదిక సృష్టించింది. 1864 సెప్టెంబర్ 28న అంతర్జాతీయ సమీకరణకు బాటలు వేసిన మార్క్స్ అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.డబ్ల్యు.ఎ.) అవతరణను పరిపూర్తి చేయగలిగాడు. మొదటి ఇంటర్నేషనల్ నాయకుడుగా 1864-72ల మధ్య మార్క్స్ రాజకీయ కార్యాచరణ మకుటాయమానమైనది. అంతర్జాతీయ కార్మిక సంఘాధినేతగా, నిజమైన కార్మిక నాయకుడుగా, ప్రముఖ రాజకీయ వేత్తగా ఎన్నో విలువైన ప్రతిపాదనలు చేశాడు. వర్గ సౌహార్ద్రత, కార్మికవర్గ అంతర్జాతీయతలకు ఐక్య కార్యాచరణ ఉత్తమ మార్గంగా అభివృద్ధి చేసి ఇంటర్నేషనల్ ప్రతిష్టను పెంచాడు.

వలసవాద వ్యతిరేక పోరాటాలకు (ఇండియా, చైనా) మరియు ఐర్లాండ్ పోరాటానికి మద్దతుగా రాసిన వ్యాసాల్లో వలస దేశాల్లోని విముక్తి పోరాటాలన్నింటిని కార్మిక వర్గం బలపరచాలన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

నిరంతరం మార్క్స్, ఏంగెల్స్ మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచేవి. మార్క్స్ మిత్రునికి ఉత్తరం రాయని వారం లేదు. ఒకోసారి రోజూ రాసేవాడు. వారు లేఖల్లో రాసుకున్నదంతా దాదాపు తర్వాత కాలంలో యాథాతథంగా ప్రచురితమయింది. శాస్త్ర, రాజకీయ సమస్యల్నీ తత్వశాస్త్రం, అంతర్జాతీయ రాజకీయాలు, జీవశాస్త్రం, గణితం, చరిత్ర, రాజకీయ అర్థశాస్త్రం ఇలా అన్నింటినీ తమ రాతల్లో చర్చించేవారు. పరస్పర అంగీకారం లేని వాటికి

విలువలేనట్లే. ఏంగెల్స్ మిలిటరీ శాస్త్రం, భాషా శాస్త్రం, జీవశాస్త్రంలలో లోతైన అధ్యయనం చేసినట్లు ఉత్తరాల ద్వారా తెలుస్తుంది. మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతంతోనే ఆగలేదు. సామాజిక మౌలిక వైరుధ్యాలను, వర్గపోరాట ప్రాధాన్యతను, నూతన సామాజిక నియమాలను చెప్పిన 'క్యాపిటల్' ప్రపంచ కార్మిక వర్గానికి అత్యంత ప్రాధాన్యత గల గ్రంథం. ఇటువంటి గ్రంథం మరొకటి రాలేదని ఏంగెల్స్ రాసాడు.

1840 దశకం చివరలో మార్క్స్ పెట్టుబడిదారీ విధానాన్ని అధ్యయనం చేయడం మొదలుపెట్టాడు. అదనపు విలువ సిద్ధాంతాన్ని, ప్రధమ సూత్రాలను ఆయన విశదీకరించాడు. భవిష్యత్ ఆర్థిక పరిశోధనలకు అవసరమైన పునాది తయారు చేసుకున్నాడు. అర్థశాస్త్రంతో పాటుగానే ఇతర శాస్త్రాలను కూడ విస్తృతంగా అధ్యయనం చేశాడు. 1857 సంక్షోభం అనంతరం విప్లవవెల్లువ రావచ్చునన్న ఆశతో కార్మికవర్గానికి బలమైన సిద్ధాంత ఆయుధంగా పనిచేసే ఆర్థిక సిద్ధాంతాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలనుకున్నాడు.

మనిషి సృష్టించిన మహోన్నత జీవి మనిషే. మనిషిని దెబ్బకొట్టే, బానిసను చేసే నిరర్ధక జీవిగా మార్చే పరిస్థితులంనిటినీ కూలదోయాలి. ఈ అమానుష పరిస్థితులు అంతమయ్యేది ఎలాగో చెప్పాలి అని మార్క్స్ భావించి కాపిటల్ రచనకు ఉపక్రమించాడు. మార్క్స్ తన జీవితంలో విలువైన కాలాన్ని ఈ కర్తవ్యానికే అంకితం చేశాడు. ఆరోగ్యాన్ని, జీవితానందాన్ని, సంసారాన్నికూడ అందుకే దారబోశాడు.

కాపిటల్‌లో మార్క్స్ ముఖ్యంగా పెట్టుబడికి శ్రమకు మధ్య గల సంబంధాన్ని పరిశోధించాడు. బూర్జువా వర్గానికి, శ్రామిక వర్గానికి మధ్యగల సంబంధాలను విశ్లేషించాడు. పెట్టుబడిదారీ సమాజంలో వర్గ పోరాటం బూర్జువావర్గంపై శ్రామికవర్గ విజయానికే దారి తీస్తుందని నిరూపించాడు.

రాజకీయ అర్థశాస్త్ర అధ్యయనంలో బ్రిటీష్ మ్యూజియం లైబ్రరీ మార్క్స్‌కు ఒక యుద్ధ భూమిగా మారింది. పెట్టుబడిదారీ అర్థశాస్త్ర అధ్యయనం కొద్ది నెలల్లో పూర్తవుతుందనుకున్నాడు. ఎప్పటికప్పుడు కొత్త ప్రశ్నలు రావడంతో మళ్లీ చదివి ఆదర్శప్రాయమైన అధ్యయనంతో, నేర్చుకోవాలన్న తపనతో వాటిని విమర్శనాత్మకంగా పరిశీలించి స్పష్టీకరించుకోవలసి వచ్చింది.

అదనపు విలువ సిద్ధాంతం ప్రాతిపదికగా మార్క్స్ ముందుకు తెచ్చినవాదం తిరుగులేనిది. కేవలము ఆర్థిక పోరాటం ద్వారా మాత్రమే కార్మికవర్గం ఎన్నడూ దోపిడీని నిర్మూలించలేదు. పెట్టుబడిదారులకు ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం ఉండడమన్నది అసలు పునాది. ఆ పునాది ధ్వంసం చేస్తేనే దోపిడీకి భరతవాక్యం. ఉత్పత్తి సమాజ పరం కావాలి. సమాజ ఉత్పత్తి శక్తులు బ్రహ్మాండంగా పెరగాలి. ఉత్పత్తి క్రమానికి సమాజం మార్గదర్శకత్వం వహించి తోవచూపడం అవసరం. అన్నిటికన్నా కొత్తది, ప్రగతిశీలమైనది కార్మికవర్గమే. నూతన సామాజిక ఉత్పత్తి శక్తి విధాతలు వారే. మానవాళి సహసోపేత స్వప్నమైన ఆ ఆశయాన్ని సాధించగలిగింది కార్మికవర్గం ఒకటే అని మార్క్స్ అత్యంత విపులంగా విశదీకరించాడు.


1870 జూలై 19న ఫ్రాన్స్, ప్రష్యాల మధ్య యుద్ధం మొదలైంది. జాతి దురభిమానం, బూర్జువా జాతీయత, సెంటిమెంట్లు రెండు దేశాల్లో పెచ్చరిల్లాయి. మార్క్స్ నాయకత్వంలో ఇంటర్నేషనల్ మాత్రం 'సైనిక తత్వాన్ని ప్రతిఘటించాలని' దేశ దేశాల కార్మికులకు సూత్రబద్ధమైన పిలుపునిచ్చింది. అనేకానేక పరిణామాలూ, ఆర్థిక-రాజకీయ సంక్షోభాల పర్యవసానంగా 1871 మార్చి 18న పారిస్ కార్మికులు అధికారాన్ని హస్తగతం చేసుకుని సిటీ హాలుపై అరుణపతాకాన్ని ఎగురవేశారు. సైనికులలో అత్యధికులు కార్మికులతో కలసిపోయారు. చరిత్రలో మొదటిసారి కార్మికవర్గం అధికారానికొచ్చింది. కమ్యూన్ ఆవిర్భావాన్ని అధికారికంగా ప్రకటించింది. వారి పట్టుదల, చొరవ, త్యాగనిరతి, పట్టువిడుపులను మార్క్స్ శ్లాఘించాడు. "ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం" రచనలో చారిత్రక పరిస్థితుల్ని వివరంగా చర్చించాడు. రష్యన్ పెటీ బూర్జువా విప్లవ ప్రవాసి బకూనిన్ అరాచకవాదంతో ఇంటర్నేషనల్‌ను చేజిక్కించుకునేందుకూ, శాస్త్రీయ కమ్యూనిజంతో తగాదాకు దిగాడు. అరాచకవాదుల, ఒంటెత్తువాదుల భావాలను తిప్పికొడుతూ మార్క్స్ పారిస్ కమ్యూన్ అనుభవాన్ని, ఇంటర్నేషనల్ అనుభవాన్ని గుర్తు చేశాడు. సిద్ధాంతంతోపాటు పార్టీ వుంటేనే రాజ్యాధికారం గెలుచుకుని సోషలిస్టు పరివర్తన సాధించగలదని రుజువైన సత్యాన్ని శాస్త్రీయంగా వివరించాడు.

మార్క్స్ రచనల్లో 'కమ్యూనిస్టు ప్రణాళిక', 'కాపిటల్' తర్వాత 'గోథా కార్యక్రమ విమర్శ'కు అంతటి ప్రాధాన్యత వచ్చింది. "జర్మన్ వర్కర్స్ పార్టీ కార్యక్రమంపై స్థూల వ్యాఖ్యలు" అన్నదే ఆ పుస్తకం. ప్రజాతంత్ర రిపబ్లిక్‌కు కార్మికవర్గ నియంతృత్వంకు ఎంత తేడా వుందో వివరించాడు. కార్మికవర్గ విప్లవం, కార్మికవర్గ నియంతృత్వం లేకుండా సోషలిజం రాదనీ, అటువంటి అద్భుతాలు జరగవనీ, ఆ భ్రమలు పనికి రావని చెపుతూ కార్మికవర్గం అలా ఆలోచించడం ప్రమాదకరం, వినాశనాన్ని కోరి తెచ్చుకోవడమేనని బలంగా చెప్పాడు. రెండు దశల అభివృద్ధిని చెప్పి మొదటి దశ అయిన సోషలిస్టు దశలో 'పనిని బట్టి ప్రతిఫలమివ్వడం' జరగాలని, రెండవ దశలో 'ప్రతి ఒక్కరికి శక్తిని బట్టి పని, అవసరాన్ని బట్టి ప్రతిఫలం వుంటుందని' సామాజికాభివృద్ధిని సూచించాడు.

మార్క్స్‌కు అన్ని కష్టాల్లోనూ తోడునీడగా నిలిచిన ప్రియాతి ప్రియమైన జెన్నీ 1881 డిసెంబర్ 2న మరణించడంతో మార్క్స్ కోలుకోలేని దెబ్బతిన్నాడు. విప్లవ కార్యక్రమ బాధ్యత మరికొంత

# మార్క్స్, ఎంగెల్స్-మార్క్సిజం

వర్గ సమాజంలో నిష్పాక్షిక సామాజిక శాస్త్రం ఉండదు. తత్వశాస్త్రం, అర్థశాస్త్రం, సోషలిజంలలో మహా పండితులు చేసిన బోధనలకు సూటి అయిన తక్షణమైన కొనసాగింపుగానే మార్క్స్ సిద్ధాంతం ఆవిర్భవించింది. మానవజాతిలో అగ్రశ్రేణికి చెందిన భావుకులు ఇదివరకే లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలను ఇవ్వడంలోనే మార్క్స్ ప్రతిభ ఉన్నది. మార్క్సిస్టు సిద్ధాంతం సర్వశక్తివంతమైనది. అది సత్యమైనది. సమగ్రమైనది, సముచితమైనది. మూఢనమ్మకాలు, అభివృద్ధి నిరోధకత్వం, రాజీవిధానం లేని పరిపూర్ణమైన ప్రపంచ దృక్పథం మానవులకు సమకూర్చుతుంది. జర్మన్ తత్వశాస్త్రంలోనూ, ఇంగ్లీషు అర్థశాస్త్రంలోనూ, ఫ్రెంచి సోషలిజంలోనూ వ్యక్తమయిన విధంగా 19వ శతాబ్దంలో మానవాళి సృజించిన దానిలో ఉత్తమమైన దానికి న్యాయమైన వారసురాలు.



మార్క్స్



ఏంగెల్స్

**మార్క్సిజం యొక్క మూడు మూలాధారాలు, మూడు అంశీభూతములు గురించి లెనిన్ చెప్పాడు.**

ఆధునిక యుగంలో శాస్త్ర సాంకేతిక పురోగమనం ఫలితంగా గొప్ప ఆవిష్కరణలు జరిగాయి. అందులో జీవకణాన్ని కనుగొనడం, శక్తి నిత్యత్వ నియమం, జీవ పరిణామ సిద్ధాంతం చాలా ప్రాముఖ్యతగలవి. భౌతికవాదానికి కావలసిన శాస్త్రీయ నిరూపణకు తోడ్పడ్డాయి.

అలాగే ఆనాటికి అభివృద్ధి చెందిన సాంప్రదాయక జర్మన్ తత్వశాస్త్రం, సాంప్రదాయక బ్రిటిష్ అర్థశాస్త్రం, ఫ్రెంచి ఊహాజనిత సోషలిజం మార్క్స్, ఎంగెల్స్ మార్క్సిజం ఆవిష్కరణకు కావలసిన భూమికను అందించాయి. మార్క్స్ బోధనలలోని ముఖ్యాంశాలను గురించి కామ్రేడ్ లెనిన్ 1914లో రచించారు అందులో భౌతికవాద తత్వశాస్త్రం, గతితర్కం, చారిత్రక భౌతికవాద దృక్పథం, వర్గపోరాటం, మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం, సోషలిజం, కార్మికవర్గ పోరాటం ఎత్తుగడలు అర్థం చేసుకోవడం ద్వారా మార్క్సిస్టు సిద్ధాంత అవగాహన–ఆచరణలు తెలుస్తాయి.

మార్క్స్ 18వ శతాబ్దపు భౌతికవాదంతోనే ఆగిపోలేదు. ఇంకా ముందుకు తీసుకు వెళ్ళాడు. జర్మన్ సాంప్రదాయక తత్వశాస్త్రం సాధించిన విజయాలతో, ముఖ్యంగా హెగెల్ గతితర్క సిద్ధాంతంలో పరిపుష్టం చేసాడు. అది ఫాయెర్‌బాఖ్ భౌతికవాదానికి దారితీసింది. మానవుని ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా ఉనికిలో ఉన్న ప్రకృతిని అతని జ్ఞానం ఏవిధంగా ప్రతిబింబిస్తుందో అలాగే మానవుని సామాజిక (మతతత్వ రాజకీయ) జ్ఞానం సమాజపు ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబిస్తుంది. రాజకీయ సంస్థలు ఆర్థిక పునాది మీద నిర్మింపబడిన ఉపరి నిర్మాణం.

---

కాలం ఆయనను దీక్షగా పని చేయించినా జెన్నీ లేని మార్క్స్‌లో ఆ వెలుగు కానరాలేదు. మార్క్స్ నూతన ప్రాపంచిక దృక్పథం శాస్త్రీయ కమ్యూనిస్టు సమాజాన్ని వాగ్దానం చేయడమేకాదు, అది చరిత్రలో సాధ్యమేన్న సత్యాన్ని మన ముందుకు తెచ్చింది. కార్మికవర్గ పార్టీ, కార్మికవర్గ నియంతృత్వం ఆవశ్యకతను పారిస్ కమ్యూన్ గుణపాఠంగా నొక్కి చెప్పిన మార్క్స్ చారిత్రక దృష్టి సునిశితమైనది. ప్రపంచ కార్మికవర్గ నేతగా ఎదిగిన మార్క్స్ శత్రువుల గుండెల్లో గుబులు పుట్టించాడు. మార్క్స్ ఎన్నోసార్లు బహిష్కరణలు, నిర్బంధాలనూ, ఆర్థిక ఇబ్బందులనూ, అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూనే మొక్కవోని దీక్షతో కృషి చేశాడు. మార్క్స్ రచనా వ్యాసంగం, గ్రంథ రచన, ఏంగెల్స్‌తో మైత్రి, ఉద్యమాలలో చురుకైన మార్గదర్శక పాత్ర చిరకాలం నిలిచి వుంటాయి. ఆకలి దారిద్ర్యాల మధ్యనే నిరంతరం కృషి చేస్తూ **"ప్రాపంచిక చిరకాల జ్ఞాపకంగా ప్రపంచ జ్ఞానాన్ని వెలిగించిన మహనీయుడు మార్క్స్ భవిష్యత్ తరాల చరిత్రకు దిక్సూచి"** అని అంతర్జాతీయ సమాజం నివాళు లర్పించింది. మానవ సమాజ పరిణామ క్రమాన్ని శాస్త్రీయంగా చెప్పిన చరిత్రకారుడు మార్క్స్. మార్క్స్ మరణానంతరం క్యాపిటల్ మిగిలిన భాగాల రచనలను ఏర్చి కూర్చి ఏంగెల్స్ ప్రచురించాడు. మార్క్స్ మిగిల్చిన కర్తవ్యాల పరిపూర్తికి అంకితమై కృషి చేశాడు. మార్క్స్ సంపూర్ణంగా వ్యక్తం కావడంలో వారిద్దరి అపూర్వ మైత్రి ఎంతో దోహదం చేసింది. చరిత్రలో అభివృద్ధి చెందిన లెనినిజం, మావోయిజం, రష్యా, చైనా విప్లవాలతో పాటు అనేక సామాజిక విప్లవాలు మార్క్సిజం కొనసాగింపే, మార్క్సిజం తాలూకు విస్తృత పరిణామమే.

ఇంతటి జ్ఞానాన్నీ, కార్యాచరణ మార్గాన్ని అందించిన మన మార్గదర్శి మార్క్స్‌ను మన జ్ఞానంలో వెలిగించుకుంటూ, సరైన కార్యవిధానం ద్వారా మనల్ని మనం సంస్కరించుకుందాం. అదే మార్క్స్‌కు సరైన నివాళి కాగలదు. ✦

**కారల్ మార్క్స్ 200వ జన్మదిన వారోత్సవాలను విప్లవ చైతన్యంతో విజయవంతం చేద్దాం**

మార్క్స్, ఎంగెల్స్ తాత్విక భౌతికవాదాన్ని అత్యంత దృఢ నిశ్చయంతో సమర్ధించారు. ఎంగెల్స్ రచించిన ''లుడ్విగ్ ఫాయిర్‌బాఖ్,'' ''యాంటీ డ్యూరింగ్'' అనే రచనల్లో వారి అభిప్రాయాలు అత్యంత స్పష్టంగానూ, విపులంగానూ ఉన్నాయి. "కమ్యూనిస్టు ప్రణాళిక" లాగనే వర్గ చైతన్యం కలిగిన ప్రతీకార్మికుడు చదవాల్సిన పాఠ్యగ్రంథాలు. మార్క్స్ తత్వశాస్త్రం మానవజాతికి, అందులోనూ ముఖ్యంగా కార్మిక వర్గానికి శక్తివంతమైన జ్ఞాన సాధనను సమకూర్చిన పరిపూర్ణమైన తాత్విక భౌతికవాదమే.

**అదనపు విలువ సిద్ధాంతం మార్క్స్ రాజకీయ ఆర్థిక సిద్ధాంతానికి పునాదిరాయి:**

ఆర్థిక వ్యవస్థ పునాదిపైననే రాజకీయ ఉపరి నిర్మాణం కనుక మార్క్స్ ఆర్థిక వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించడానికి ఎక్కువ శ్రద్ధ చూపాడు. ఇంగ్లండులో ఆడమ్‌స్మిత్, డెవిడ్ రికార్డోలు పరిశీలించి శ్రమజన్య విలువ సిద్ధాంతానికి పునాదులు వేశారు. మార్క్స్ వారి కృషిని కొనసాగించి, రుజువును సమకూర్చి, అభివృద్ధి చేసాడు. ప్రతీ సరుకు విలువ దానిని ఉత్పత్తి చేయడానికి ఖర్చు చేయబడే సామాజికంగా అవసరమైన శ్రమ కాలాన్ని బట్టి నిర్ణయం అవుతుందని నిరూపించాడు.

మార్కెట్ వ్యక్తిగత ఉత్పత్తిదారుల మధ్య సంబంధాన్ని ఐక్యం చేస్తే, ధనం విడి ఉత్పత్తిదారుల ఆర్థిక జీవితాన్ని విడదీయరాని విధంగా ఏకం చేస్తుంది. మానవ శ్రమశక్తి ఒక సరుకుగా తయారవడాన్ని పెట్టుబడి తెలియజేస్తుంది. కార్మికుడు తన శ్రమశక్తిని పెట్టుబడిదారునికి అమ్ముకుంటాడు. బూర్జువా అర్ధశాస్త్ర వేత్తలు వస్తువుల మధ్య నున్న సంబంధాన్ని గుర్తిస్తే, మార్క్స్ మనుషుల మధ్యగల సంబంధాన్ని బైట పెట్టాడు.

కార్మికుడు తాను పనిచేసే రోజులో ఒక భాగాన్ని తనను, తన కుటుంబాన్ని పోషించడానికి అయ్యే ఖర్చుల సంపాదన కోసం (జీతం కోసం) వినియోగిస్తాడు. రెండవ భాగం పెట్టుబడిదారుని లాభానికి మూలాధారమయిన అదనపు విలువను సృష్టించడానికి వినియోగిస్తాడు. ఈ అదనపు విలువే పెట్టుబడిదారీ వర్గపు సంపదకు మూలాధారం అని మార్క్స్ సవివరంగా నిరూపించాడు.

**కార్మికవర్గ నాయకత్వంలో వర్గపోరాటాన్ని ఆవిష్కరించిన శాస్త్రీయ సోషలిజం:**

ఫ్యూడల్ వ్యవస్థ కూలదోయబడి 'స్వేచ్ఛాయుత' పెట్టుబడిదారీ సమాజంలో శ్రామికులను పీడించి దోచుకునే స్వేచ్ఛ పెట్టుబడిదారీ వర్గానికి లభించింది. దీనికి అసమ్మతిగా రకరకాల సోషలిస్టు సిద్ధాంతాలు, ఊహాజనిత సోషలిజం ముందుకొచ్చాయి. విమర్శ, ఖండన, దూషణలతో పాటు పెట్టుబడిదారీ వర్గం నాశనం కోసం కలలు కనడం చేసింది. నచ్చచెప్ప ప్రయత్నించింది. అది ఉత్తమ సమాజ వ్యవస్థను వూహించింది. కానీ, అది నిజమైన పరిష్కార మార్గాన్ని చూపలేక పోయింది, వేతన బానిసత్వ సారాన్ని వివరించ లేకపోయింది, అభివృద్ధి నియమాలను బైటపెట్ట లేదు, నూతన సమాజ సృష్టికర్త కాగల సామర్థ్యం ఏ నూతన సామాజిక శక్తికి ఉందో చూపలేదు. విప్లవాల చరిత్ర పొడవునా "వర్గపోరాటమే చోదకశక్తి" అని రుజువు పరుస్తూ చరిత్ర నడుస్తున్నప్పటికి వారు గుర్తించ లేదు.

ప్రజలు రాజకీయ వంచనకు, ఆత్మవంచనకు బలవుతున్నారు. అన్ని రకాల నైతిక, మత, రాజకీయ, సాంఘిక ప్రకటనల వెనుక ఒకవర్గం ప్రయోజనాలున్నాయి. ఈ దుష్ట వ్యవస్థను కాపాడే శక్తులు ఎప్పుడు మోసం చేస్తూనే ఉంటారు. ఈ వర్గాల అణచివేతను తుడిచివేసే ఒకే ఒక మార్గం ఉంది. ఈ సమాజంలోనే పాతను ప్రతిఘటించి కొత్తను సృష్టించే సామర్థ్యం గల శక్తులున్నాయి. అది వారికి తప్పనిసరి అవసరం ఆ శక్తుల్ని వెలికి తెచ్చి పోరాటాలకోసం విజ్ఞానవంతం చేసి సంఘటితం చేయాలి. కార్మికవర్గాన్ని తాత్విక బానిసత్వం నుండి విముక్తులను చేసింది తాత్విక భౌతికవాదమే. వారి నిజమైన స్థానాన్ని వివరించింది మార్క్స్ ఆర్థిక సిద్ధాంతమే. వర్గ పోరాటం ద్వారా విజ్ఞానాన్ని, వికాసాన్ని పొందిన కార్మికవర్గం భ్రమలు వీడి, వ్యూహాత్మకంగా తన బలాన్ని సంఘటితం చేసుకుని విజయాలు సాధిస్తుంది. ఈ వ్యవస్థను కూల్చి తన వర్గాన్ని సమస్త వర్గాల్ని దోపిడీ, పీడనల నుండి విముక్తి గావించుతుంది. అని మార్క్సిజం చెబుతుంది.

**సమగ్రత కోసం ముందుగా గతితర్కం అంటే ఏమిటో తెలుసుకుందాం**

"బాహ్య ప్రపంచంలోనూ మానవ చింతనలోనూ జరిగే చలనం యొక్క సాధారణ నియమాలను వివరించే శాస్త్రం గతితర్కం"– మార్క్స్.

వస్తువు యొక్క పరిపూర్ణం, ప్రగాఢం, అత్యంత సమగ్రం అయిన అభివృద్ధిని చేప్పే సిద్ధాంతం, నిత్యం అభివృద్ధి చెందే పదార్థ ప్రతిబింబాన్ని ప్రదర్శించే మానవ విజ్ఞాన సాపేక్షత సిద్ధాంతం. ప్రకృతి యొక్క క్రమ విధానం గతితార్కికమే. ఏదీ అంతిమం కాదు. పరమం కాదు. పవిత్రం కాదు. ప్రతిదానిలోని పరివర్తనా లక్షణాన్ని బైటపెడుతుంది. ఉనికిలోకి రావడం, అంతరించిపోతూ ఉండడం అనే నిరంతరాయ క్రమం, నిమ్న దశనుండి ఉన్నత దశకు ఆరోహణక్రమంగా ఉంటుంది.

గతితర్కంలో జ్ఞాన సిద్ధాంతం ఇమిడి ఉంది. జ్ఞాన సిద్ధాంతం తన విషయ వస్తువును, పరిజ్ఞానం యొక్క ఆవిర్భావాన్ని, అభివృద్ధిని, జ్ఞానేతరమై పరిజ్ఞానంగా పరివర్తన చెందడాన్ని అధ్యయనం చేసి

సాధారణ ధర్మాలను వివరించడంలో చారిత్రక దృష్టిని ప్రదర్శించాలి. సరళరేఖలో కాకుండా మరచుట్టలాగ సర్పిలాకృతులలో కొనసాగే అభివృద్ధి, పరిమాణం గుణంగా మారడం, ఈ చలన క్రమం పరస్పరాశ్రయం, అత్యంత సన్నిహితమైన, అభేద్యమైన సంబంధం, ఏకరీతిగా వుండే సార్వత్రిక చలన క్రమాన్ని సమకూర్చే సంబంధం, ఈ చలన క్రమం నిర్దిష్టమైన నియమాలను అనుసరిస్తుంది.

ఇది అధి భౌతిక భావనకు భిన్నం. అధి భౌతిక భావన (లేదా) క్షుద్ర పరిణామ వాదుల ప్రాపంచిక దృక్పథం (19,20 శతాబ్దాలు) ఇదే యాంత్రిక భౌతికవాదం (ఐరోపా 17,18 శతాబ్దాలు). వస్తువులు విడి విడిగా ఉంటాయి. వస్తువులు ఎదుగూ బొదుగూ లేనివి. వస్తువులు ఏకపక్షమైనవి. సమస్త వస్తువులు, రూపాలు వాటి జాతులు మార్పు లేనివిగాను ఒక వేళ ఉన్నా పరిమాణంలో మాత్రమే మార్పు చెంది, పెరగడం తరగడం, స్థాన చలనంగాను ఉంటుంది. ఆ మార్పుకు కారణం మాత్రం బహిరంగంగానే ఉంటుందని, ఉనికిలోకి వచ్చినవి అన్నీ అలాగే ఉండిపోతాయని, పునరావృతం అవుతాయి తప్ప భిన్నంగా కాలేవు అని అంటారు. ఉదాహరణకు చైనాలో నాకం మారదు, తావోమారదు అంటే లోకం మారదు, మార్గం మారదు అని అంటారు. ఇది వాస్తవ విరుద్ధం. గతితర్క భావన దీనిని వ్యతిరేకిస్తుంది.

గతితార్కిక భావన వస్తువు ఆంతర్యాన్ని, ఇతర వస్తువులతో దానికి గల సంబంధాన్ని తెలియజేస్తుంది. వస్తుజాలం అభివృద్ధిని, చలనాన్ని, పరస్పర సంబంధంలో ప్రభావాన్ని అంతర్గతమైన, ఆవశ్యకమైన స్వయం చలనంగా చూడాలి. చలనానికి అంతర్గతం ప్రధానం. అది వైరుధ్య శీలతలోనే ఉంటుంది. అదే అభివృద్ధికి కూడా కారణం అదే మూలకారణం కూడా. పరస్పర సంబంధం, ప్రభావాలు సెకండరీ మాత్రమే. అసంఖ్యాక పద్ధతులు, గుణాత్మకంగా భిన్నత్వంతో ఉంటాయి. వస్తువు మరో వస్తువుగా మారడం అన్నీ అంతర్గత చలన ఫలితం. ఆఖరుకు బహిర్ చలనం, యాంత్రిక చలనం కూడా అంతర్గత చలనశీలత ఫలితమే. అంతర్గత కారణాలు మార్పుకు పునాది అని చెబుతుంది.

జర్మన్ తత్వవేత్త హెగెల్ గతితర్కాన్ని అభివృద్ధి చేసాడు. అయితే అది భావవాదపరమైనది. మార్క్స్ ఏంగెల్స్‌లు మానవ విజ్ఞాన చరిత్రలో పాజిటివ్ జ్ఞానాంశాలను సమ్మిళితం చేసి-హెగెల్ గతితర్కంలోని హేతుబద్ధ అంశాలను విమర్శనాత్మకంగా స్వీకరించి, మహత్తరమైన గతితార్కిక, చారిత్రక భౌతికవాదాన్ని రూపొందించారు. సామాజిక అస్థిత్వం నుండే సామాజిక చైతన్యం పుట్టిందని మానవ సామాజిక జీవితానికి భౌతికవాదాన్ని వర్తింపజేసి నిరూపించాడు మార్క్స్.

ఆదిమానవుడు మొట్టమొదటి శ్రమ సాధనాలయిన రాతి ఆయుధాలను (అవి ఎంత మొరటువి అయినప్పటికి) తయారు చేయడం నేర్చుకోవడంతో శ్రమ, ఉత్పత్తి మొదలయ్యాయి. శ్రమ మానవుణ్ణి సంఘజీవిని చేసింది. అంతేకాదు, అది అతడి శారీరక, మానసిక శక్తి అభివృద్ధిలో అత్యంత కీలకమైన పాత్ర నిర్వహించింది. అందువల్లనే ఎంగెల్స్ "ఒక అర్థంలో చెప్పాలంటే మానవుణ్ణి సృష్టించింది శ్రమే"నని అన్నాడు.

"ప్రకృతి పట్ల మానవుడు క్రియాశీలంగా వ్యవహరించే విధానాన్ని, తన జీవితంలోని సూటి ఉత్పత్తి విధానాన్ని సాంకేతిక శాస్త్రం బహిర్గతం చేస్తూ, తద్వారా మానవుని సామాజిక సంబంధాలు రూపొందే విధానాన్ని, ఆ సంబంధాల నుండి ఉత్పన్నమయ్యే మానసిక భావనలనూ బహిర్గతం చేస్తుంది." (పెట్టుబడి" 1వ సంపుటి) **"మానవుల అస్థిత్వాన్ని నిర్ణయించేది వారి చైతన్యం కాదు. తద్విరుద్ధంగా వారి సామాజిక అస్థిత్వమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది" అన్నారు.**

శ్రమ చేసే క్రమంలోనే సామాజిక ఆచరణ క్రమంలోనే మానవుడు చైతన్యం గల జీవిగా మారాడు. మానవ చైతన్యం అభివృద్ధి చెందింది. జ్ఞానం సామాజిక కార్యాచరణ ఫలితం. ప్రధానంగా సామాజికోత్పత్తికి సంబంధించిన ఆచరణ ఫలితం. జ్ఞానం యొక్క సామాజిక స్వభావాన్ని, ఆచరణతో దానికున్న విడదీయరాని అనుబంధాన్ని గుర్తించడమన్న విజ్ఞాన సిద్ధాంత విశిష్ట లక్షణం.

### గతితార్కిక చారిత్రక భౌతికవాద దృక్పథం

"మార్క్స్ సైద్ధాంతిక కృషిలో చరిత్ర గురించిన భౌతికవాద దృక్పథంను ఒక ప్రధాన ఆవిష్కరణ" అని ఏంగెల్స్ చెప్పాడు. "మార్క్స్‌తత్వం భౌతికవాదం. భౌతికవాదాన్ని ఆయన గతితర్కం ద్వారా మరింత ప్రగాఢం చేసి అభివృద్ధి పరిచాడు. భౌతికవాదాన్ని మానవ సమాజానికి అన్వయించడం ద్వారానూ, సమాజంలోని ఆర్థిక పునాదిపైనే మొత్తం సమాజంలోని రాజకీయ, సైద్ధాంతిక ఉపరితల నిర్మాణం ఆధారపడుతుందని తెలియ జెప్పడం ద్వారానూ మార్క్స్ చారిత్రక భౌతికవాదాన్ని అభివృద్ధి చేసాడు" అని లెనిన్ అన్నాడు.

గతితార్కిక చారిత్రక భౌతికవాద ప్రాపంచిక దృక్పథం అనేది విభిన్న వస్తువులలోని విరుద్ధాంశాలను పరిశీలించడం, వాటి గమనాన్ని విశ్లేషించడం ద్వారా వైరుధ్యాలను పరిష్కరించే పద్ధతులను బోధిస్తుంది.

ప్రజారాశుల సామాజిక జీవిత పరిస్థితులనూ, ఈ పరిస్థితులలో మార్పులనూ, ప్రకృతిశాస్త్రాలకు స్వాభావికమైన యదార్థంతో అధ్యయనం చేయడానికి చారిత్రక భౌతికవాదం తొలిసారిగా అవకాశం కల్పించింది. ప్రజలే తమ చరిత్రను సృష్టించుకుంటారు.

కాని ప్రజల యొక్క-ప్రజా రాశి యొక్క ప్రేరక హేతువులను ఏది నిర్ణయించుతుంది-అనగా, పరస్పర విరుద్ధ భావాల, ఆశయాల సంఘర్షణలకు మూల కారణం ఏమిటి? మానవ సమాజాల సంపూర్ణ రాసిలో ఈ సంఘర్షణలన్నింటిని కలిపి కూడితే వచ్చిన ఫలితార్థం దేనిని నిరూపిస్తుంది? చరిత్ర అంతటిలోనూ ప్రదర్శిత మవుతున్న మానవ క్రియాశీలశక్తి అంతటికి ప్రాతిపదికగా ఏర్పడుతున్న భౌతిక జీవితావసర వస్తువుల ఉత్పత్తికి అవసరమైన బాహ్య గతాత్మక పరిస్థితులు ఏవి? ఈ పరిస్థితుల క్రమాభివృద్ధి యొక్క నియమం ఏమిటి? వీటన్నిటి ప్రాముఖ్యత వైపూ మన దృష్టిని సారింపజేసి, అపరిమిత వైవిధ్య వైరుధ్యాలను కలిగిన విధానవే అయినప్పటికి, వాటి నుండి ఏకరూపం కల్గి నియమబద్ధమైనట్టి విధానంగా చరిత్రను శాస్త్రీయ పద్ధతులలో అధ్యయనం చేసే మార్గాన్ని మార్క్సు మనకు చూపించాడు.

**ప్రతి వర్గపోరాటం ఒక రాజకీయ పోరాటమే**

"కమ్యూనిస్టు ప్రణాళిక"లో "ఇంతవరకు నడిచిన చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్ర" అని చెప్పాలి అని మార్క్సు అన్నాడు. ఆదిమ సమాజం మినహా అని తర్వాత ఏంగెల్స్ చేర్చాడు. బానిస-బానిస యజమాని, భూస్వామి-భూదాసుడు, పెట్టుబడిదారుడు-కార్మికుడు ఒక్క ముక్కలో చెప్పాలంటే పీడకుడు-పీడితుడు. నిరంతరం ఒకరికి వ్యతిరేకంగా మరొకరు ఘర్షణ పడుతూనే ఉన్నారు. ఫ్యూడల్ సమాజపు శిధిలాల నుండి ఆవిర్భవించిన ఆధునిక బూర్జువా సమాజం వర్గ వైషమ్యాలను అంతమొందించ లేదు. పైగా పాతవాటి స్థానే కొత్త వర్గాలనూ, కొత్త హింస పరిస్థితులనూ, పోరాటం యొక్క కొత్త రూపాలనూ స్థాపించింది. మొత్తం సమాజం రెండు మహత్తర శత్రు శిబిరాలుగా, రెండు వర్గాలుగా చీలిపోతూ ఉంది. వర్గ పోరాటవే చోదక శక్తి అని జరిగిన ఘటనల నుండి స్పష్టమవుతున్నది.

"ఈనాడు బూర్జువా వర్గాన్ని ముఖా ముఖి ఎదిరించి నిలబడే వర్గాలన్నింటిలోనూ ఒక్క శ్రామిక వర్గం మాత్రమే అసలైన విప్లవకర వర్గం. ఇతర వర్గాలు ఆధునిక పరిశ్రమ సమక్షంలో క్షీణించిపోయి చిట్ట చివరకు అదృశ్యమైపోతాయి."

శ్రామికవర్గ దృక్పథం పురోగామి దృక్పథం. అందుకు అనుగుణంగా మారే ఇతర వర్గాల ప్రజలు తమతమ స్వంతవర్గ దృక్పథాలను పరిత్యజించాల్సి ఉంటుంది. ప్రతివర్గ పోరాటం ఒక రాజకీయ పోరాటమే.

**మార్క్సు ఆర్థిక సిద్ధాంతం**

ఆధునిక బూర్జువా సమాజం యొక్క చలన నియమాలను బయటపెట్టడం పెట్టుబడి గ్రంథం యొక్క లక్ష్యం అని మార్క్సు ప్రకటించాడు.

చారిత్రకంగా ఒక నిర్ధిష్ట సమాజంలో ఉత్పత్తి సంబంధాల పుట్టుక, క్రమాభివృద్ధి, క్షయమూ వీటి పరిశోధన మార్క్సు ఆర్థిక సిద్ధాంతం యొక్క విషయం.

పెట్టుబడిదారీ సమాజంలో సరుకుల ఉత్పత్తే ప్రాబల్యాన్ని కలిగి ఉంటుంది. కనుక మార్క్సు విశ్లేషణ సరుకుతో ప్రారంభం అవుతుంది. మానవుని అవసరం తీర్చే సరుకుకు ఉపయోగపు విలువ, మారకపు విలువ రెండూ ఉంటాయి. ఉపయోగపు విలువ ఉన్నప్పుడే మారకపు విలువ ఉంటుంది. రకరకాల వస్తువులతో ఒకదానితో ఒకటి నిరంతరమూ నిర్ధిష్టమైన ఒక సామాజిక సంబంధ విధానమనే ఒక సమీకరణ ఏర్పడుతున్న వస్తువులలో వున్న సామాన్య గుణం శ్రమ యొక్క ఉత్పత్తి వస్తువులు కావడమే. సరుకుల ఉత్పత్తే సామాజిక సంబంధాల వ్యవస్థ. సరుకులన్నింటికి ఉన్న సామాన్య గుణం నిరపేక్షమైన మానవ శ్రమ (సాధారణ మానవ శ్రమ). ఏ సమాజంలోనయినా సరే, ఆ సమాజంలో వున్న అన్ని సరుకుల యొక్క మొత్తం విలువ రూపంలో ఉన్న శ్రమశక్తి అంతా మానవ శ్రమశక్తే. వస్తువుల మధ్య ఉండే సంబంధమే అలా ముసుగు వేసి చూపబడిన సంబంధం నిజానికి ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే సంబంధం. ఒక నిర్ధిష్టమైన చారిత్రక సామాజిక పద్ధతిలో ఉన్న సామాజిక ఉత్పత్తి సంబంధాల యొక్క దృక్పథం నుండి పరిశీలించినపుడే విలువ అంటే ఏమిటో మనం అర్థం చేసుకోగలుగుతాం.

"ధనం అనే విషయాన్ని మనం పరిశీలించేటపుడు, సరుకుల మారకపు విధానంలో ఒక నిర్ధిష్టమైన ఉన్నత దశను తెలియజేస్తుంది. కేవలం సరుకుల యొక్క తుల్యతనే తెలియజేసేదైతేనేమి, నిల్వ చేసుకునేదైతేనేమి, చెల్లింపు సాధనంగానైతేనేమి, చలామణీ సాధనంగానైతేనేమి, సర్వసాధారణ డబ్బు రూపంలోనైతేనేమి, ధనం నిర్వర్తించే ప్రత్యేకపు వ్యాపారాలు, ఆయా వ్యాపారాల యొక్క సాపేక్ష విస్తృతాన్నీ, ప్రాభల్యాన్నీ, సామాజిక ఉత్పత్తి క్రమాభివృద్ధిలో ఒకదానితో ఒకటి విభేదించే వివిధ దశలలో ఒక్కొక్క దానిని సూచిస్తాయి."

(పెట్టుబడి 1వ సంపుటి)

**అదనపు విలువ:**

సరుకుల ఉత్పత్తి క్రమాభివృద్ధి ఒక నిర్ధిష్ట దశకు చేరుకుని ధనం పెట్టుబడిలోకి మారిపోతుంది. ఒక సరుకు కొనడం కోసం అమ్మడం (సరుకు-డబ్బు-సరుకు) అనే విధానంపోయి దానికి భిన్నంగా అమ్మడం కోనవేకొనడంగా మారుతుంది. (డబ్బు-సరుకు-డబ్బు) చలనంలో వినియోగించిన డబ్బు అసలు విలువకన్నా మించిన విలువ సరుకులో చేరి అమ్మిన తర్వాత డబ్బుకు చేరుతుంది. దానికి అదనపు విలువ అని మార్క్సు

పేరుపెట్టాడు. ఈ విధమైన 'పెరుగుదలే' ధనాన్ని ఒక ప్రత్యేక, చారిత్రక, సామాజిక-ఉత్పత్తి సంబంధమైన పెట్టుబడిగా రూపొందించుతుంది. సరుకుల ప్రసారంలో నుండి అదనపు విలువ పుట్టదు. ధరలు పెంచడం వలన అదనపు విలువ పుట్టడానికి వీలులేదు.

అదనపు విలువ లభించాలంటే డబ్బు కలిగినవాడు "ఏ సరుకు యొక్క ఉపయోగపు విలువకు, విలువను సృష్టించగల విశిష్ట గుణం ఉందో అట్టి సరుకును మార్కెట్లో వెతికిపట్టుకోవాలి" ఆ సరుకు ఎటువంటిదై ఉండాలంటే, దాని వినిమయ విధానమే విలువను సృష్టించే విధానం కూడా అయి ఉండాలి. అటువంటి సరుకు ఉంది. అది మానవ శ్రమశక్తి, దాని వినిమయమే శ్రమ. విలువను సృష్టించేది శ్రమ. డబ్బు ఉన్న వ్యక్తి శ్రమశక్తిని ఒకరోజుకు దాని విలువను చెల్లించి కొంటాడు. శ్రమశక్తి విలువ కూడా అన్ని విలువలాగానే సామాజిక శ్రమ (ఉదాహరణకు ఒకరోజు 12 గంIIలకు) కాలాన్ని బట్టి నిర్ణయించబడుతుంది. అంటే కార్మికుడికి, అతని కుటుంబానికి జీవించడానికి అవసరమయ్యే వ్యయం అన్నామాట.

అయితే శ్రామికుడు తన జీవన భృతికి అవసరమైన ఖర్చుకు సమానమైన విలువను కలిగిన వస్తువులను ''అవసరమైన శ్రమకాలం"లోనే (6 గంIIలలోనే) తయారు చేస్తాడు. ఇక మిగిలిన 6 గంటలలో "అదనపు శ్రమకాలం"లో అదనపు వస్తువులను లేదా అదనపు విలువను తయారు చేస్తాడు. ఈ అదనపు విలువకు పెట్టుబడిదారుడు కార్మికునికి ఏమీ చెల్లించడు. ఉత్పత్తి సాధనాలైన యంత్రాలు, పనిముట్లు, ముడిసరుకులు కోసం వినియోగించిన పెట్టుబడిలో ఒక భాగమైన స్థిర పెట్టుబడి ఏరకమైన మార్పులకు (విలువ రీత్యా) గురికాకుండానే తయారైన వస్తువులోకి మారిపోతుంది. ఇక రెండవ భాగమైన అస్థిర పెట్టుబడి అంటే శ్రమశక్తి కోసం వినియోగించిన పెట్టుబడి విలువ స్థిరమైనది కాదు. అది శ్రమ విధానంలోనే అదనపు విలువను సృష్టించుతూ, పెరుగుతూనే ఉంటుంది. ఈ కారణం వల్ల పెట్టుబడి ఏ విధంగా శ్రమశక్తిని దోపిడీ చేస్తుందో స్పష్టంగా చూపించాలంటే అదనపు విలువను మొత్తం పెట్టుబడితో పోల్చకుండా అస్థిర పెట్టుబడితో మాత్రమే పోల్చి చూడాలి. ఈ విధంగా పైన పేర్కొన్న ఉదాహరణలో అదనపు విలువరేటు, ఈ నిష్పత్తికి మార్క్స్ పెట్టిన పేరు, 6:6 అనగా అవసర శ్రమ: అదనపు శ్రమ. అది 100%కు సమానం.

చారిత్రకంగా చూసినట్లైతే పెట్టుబడి ఉద్భవించడానికి

1. కొద్దిమంది వ్యక్తుల దగ్గర డబ్బు పోగుపడి ఉండి, దానితో పాటు సరుకుల ఉత్పత్తి సాపేక్షికంగా ఉన్నత స్థాయిలో ఉండాలి.

2. ఎటువంటి నిర్బంధం లేకుండా శ్రామికుడు తన శ్రమశక్తి అమ్ముకునే స్వేచ్ఛను కలిగి ఉండడం, అలాగే ఎటువంటి ఉత్పత్తి సాధనం లేకుండా ఉండడం అనే ద్వివిధ 'స్వేచ్ఛ' కలిగి జీవనోపాదికి శ్రమశక్తిని అమ్ముకునే ఒకే విధానం గల శ్రామికులు కావాలి.

అదనపు విలువను వృద్ధి చేయడానికి ప్రధానంగా 2 విధానాలున్నాయి.

1. రోజూ పని చేసే కాలాన్ని పెంచడం 2. "అవసరమైన" పని కాలాన్ని తగ్గించడం రోజువారీ పని కాలాన్ని తగ్గించడానికి 14-17 శతాబ్దాల నడుమ జరిగిన పోరాటం తెలిసిందే. పనికాలాన్ని పెంచడానికి శ్రామిక వర్గం ఇంక అంగీకరించదు. కనుక మిగిలినది అవసర కాలాన్ని తగ్గించడం, అదనపు శ్రమకాలాన్ని పెంచడం అవసరం. కాబట్టి పెట్టుబడిదారీ వర్గం అదే చేస్తుంది. అందుకు పని వేగాన్ని పెంచుతుంది. నూతన సాంకేతికతను అభివృద్ధి చేస్తుంది. కార్మికుల తొలగింపు జరిగిపోతుంది. నిరుద్యోగ సైన్యాన్ని పెంచుతుంది. వేతనాలు పెంచకుండా శ్రామికుల మధ్య పోటీని పెంచుతుంది. అధికోత్పత్తి ఒక పక్కన పెరిగితే, ప్రజల కొనుగోలు శక్తి మరో పక్కన తరిగిపోతుంది. ఇది సంక్షోభానికి దారితీస్తుంది.

పెట్టుబడి సంచయం మొదటిదశలో ఉత్పత్తి సాధనాల నుండి కార్మికుని వేరుచేయడం, రైతును భూమి నుండి తరిమి వేయడం, సాముదాయక భూములను కాజేయడం, వలసలు, జాతీయ రుణాల వ్యవస్థలు, రక్షణ సుంకాలు లాంటి పద్ధతుల్లో పెట్టుబడి పోగుపడింది. ప్రపంచపు ఒక చివరన కార్మికుడిని, మరో చివరన పెట్టుబడిదారుని సృష్టించింది.

"పెట్టుబడిదారీ విధానపు సంచయం యొక్క చారిత్రక ధోరణి" గురించి మార్క్స్ తన సుప్రసిద్ధ వచనాల్లో ఈవిధంగా వర్ణించాడు. ''సరుకులను ఎవరైతే వాస్తవంగా ఉత్పత్తి చేస్తారో అట్టి ఉత్పత్తిదారులనే, అతి తుచ్ఛమైనట్టీ, నీచాతినీచమైనట్టీ, అతి స్వల్పమైనట్టీ, అతి క్షుద్రమూ అసహ్యకరమూ అయినట్టీ భావాలను రెచ్చగొట్టడం ద్వారా, నిర్దాక్షిణ్యమైన మూర్ఖకర్కోటక పద్ధతులలో ఆస్తి హక్కులు లాక్కోవడమూ జరుగుతూంది. కష్టపడి ఆర్జించుకున్న సొంత ఆస్తి" (రైతూ చేతిపనివాడూ), "అనగా ఏకాకిగా స్వతంత్రంగా తనమట్టుకుతాను కష్టించుతూన్న శ్రమజీవి తన శ్రమ పరిస్థితులతో, ఒక విధంగా చెప్పాలంటే, మిళితమైపోయి ఏకమైపోయిన ఫలితంగా సంభవించిన ఆస్తి అంతరించిపోయి దాని స్థానే ఇతరుల యొక్క నామక: సేచ్ఛాయుతమైన శ్రమను దోచుకోవడంపైన ఆధారపడినట్టి పెట్టుబడిదారీ విధానపు సొంత ఆస్తి అవతరించుతూంది. కాయకష్టం చేసి తనంతటతాను ఆర్జించుకున్న శ్రామికుని ఆస్తి కాదు ఇప్పుడిక కాజేయవలసినది; అనేక మంది శ్రామికులను దోచుకుంటూన్న పెట్టుబడిదారుని ఆస్తినే ఇప్పుడు కాజేయ్యాలి. పెట్టుబడిదారీ విధానపు ఉత్పత్తిలో అంతర్గర్భితంగా

ఉండే నియమాల యొక్క క్రియాశక్తి వల్లే, పెట్టుబడి కేంద్రీకరణం వల్లే ఈ ఆస్తి హక్కులు లాక్కోవడం జరుగుతుంది. ఒక పెట్టుబడిదారుడు తన తోటి పెట్టుబడిదారులను ఎంతమందినో నాశనం చేస్తాడు. ఈ కేంద్రీకరణతోపాటే, అనగా కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో అనేకులు పెట్టుబడిదారులు నాశనమైపోవడంతో పాటుగానే, శ్రమ విధానం యొక్క సహకార రూపమూ, సాంకేతిక పద్ధతులలో భౌతిక విజ్ఞానశాస్త్రాలను లక్ష్యసాధనకోసం చైతన్యవంతంగా వినియుక్తం చేయడమూ, క్రమవిధానంలో భూమిని సాగుచేయడమూ, శ్రమ పరికరాలను ఇక ఏ ఇతర పరికరాలవల్లనూ కాకుండా సమిష్టిగానే ఉపయోగించడానికి మాత్రమే వీలయే శ్రమ పరికరాలుగా మార్పు చేయడమూ, ఉత్పత్తి సాధనాలనూ సమిష్టి సామాజిక శ్రమయొక్క సాధనాలుగా ఉపయోగించడం ద్వారా అన్ని ఉత్పత్తి సాధనాలను మార్పు చేయడమూ, ప్రపంచ మార్కెట్టు వలలో అందరు ప్రజలూ చిక్కుకొని పోవడమూ, ఇదంతా రానురాను మరింత విస్తృత స్థాయిలో అభివృద్ధి పొందడమూ, వీటన్నిటితోపాటూ పెట్టుబడిదారీ విధానం యొక్క అంతర్జాతీయ స్వభావం కూడా అభివృద్ధి చెందడమూ సంభవించుతుంది. ఈ పరివర్తనా విధాన ఫలితంగా చేకూరిన లాభాలన్నింటినీ గుత్తాధికారంగా తమ గుప్పెట్లోనే గుంజుకున్నట్టి బడిపెట్టుబడిదారుల సంఖ్య క్రమేణా తగ్గుతూండడంతోపాటు దారిద్ర్యమూ, బాధలూ, బానిసత్వమూ, నైచ్యమూ, దోపిడీ రాశి కూడా పెరిగి పోతూనే వుంటుంది. కాగా దీనితోనే ప్రతిరోజూ అధిక సంఖ్యలో పెరుగుతూ, మరే ఇతర కారణాలూ లేకుండానే కేవలం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన యంత్రం ఫలితంగానే క్రమశిక్షణను అలవరచుకొని, ఐక్యతను కలిగి, ఆర్గనైజైన కార్మికవర్గం యొక్క విప్లవం కూడా అభివృద్ధి పొందుతూనే వుంటుంది. ఉత్పత్తి విధానంతో పాటే పుట్టి పెరిగి, దీనితోపాటే, దీని కిందనే పరిడవిల్లిన పెట్టుబడి యొక్క గుత్తాధిపత్యం ఆ ఉత్పత్తి విధానానికే ఇప్పుడు సంకెళ్ళుగా తయారవుతుంది. ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణమూ, శ్రమను సామాజికం చేయడమూ ఎంత ఉచ్ఛస్థాయిని అందుకున్నాయంటే, వాటిపై పెరుగుతూన్న ఆ పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అండకవచంలో అవి ఇక ఇమడలేకపోతాయి. ఈ కవచమే తప్పనిసరిగా బ్రద్దలైపోయి పటాపంచలైపోతుంది. పెట్టుబడిదారీ విధానపు ప్రైవేటు ఆస్తి యొక్క మరణాన్ని చాటిస్తూ చావుబాజా వినబడుతుంది. ఆస్తి హక్కులు లాక్కొన్నవారి ఆస్తి హక్కులే లాక్కొనబడతాయి." ("పెట్టుబడి", 1వ సంపుటం)

పెట్టుబడి 2వ సంపుటంలో మొత్తం సామాజిక పెట్టుబడి యొక్క పునరుత్పత్తిని నూతన పద్ధతుల్లో విశ్లేషించి పరిశీలించాడు మార్క్స్. విడివిడిగాకాకుండా సర్వ వ్యాప్త స్వరూపంలో వున్న సంఘటనగానూ, ఆర్థిక సమాజంలో ఏ స్వల్ప భాగానికో సంబంధించిన సంఘటనగా కాకుండా ఆర్థిక వ్యవస్థ అంతటికి సంబంధించిన సంఘటనగా మార్క్స్ తీసుకుని పరిశీలించాడు. 1. ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి 2. వినిమయ వస్తువుల ఉత్పత్తి అని రెండుగా విభజించి మొత్తం సామాజిక పెట్టుబడి ప్రసరణాన్ని (పునరుత్పత్తి, సంచయనం రూపాల్లో) సోదాహరణంగా లెక్కలనిస్తూ సవివరంగా పరిశీలించాడు.

విలువ నియమాన్ని ప్రాతిపదికగా తీసుకుని లాభం యొక్క సగటు రేటు ఏ విధంగా నిర్దేశించబడుతుందో ఆ సమస్యను పెట్టుబడి 3వ సంపుటంలో మార్క్స్ పరిష్కరించాడు. పైపైనకనబడే, వ్యక్తిగత దృష్టాంతాల దృక్పథం నుండి కాకుండా మొత్తం రాశి ఆర్థిక సంఘటనల దృక్పథం నుండి, మొత్తం సమగ్ర సామాజిక ఆర్థిక వ్యవస్థా దృక్పథం నుండే పరిశీలన చేస్తాడు. అదనపు విలువ ఎలా ఆరంభమవుతుందో మొదట విశ్లేషించి, దానిని తరువాత లాభం, వడ్డీ, భూమిశిస్తు కింద అది విభజించబడడం పరిశీలిస్తాడు. ఒక వ్యాపారంలో వచ్చిన అదనపు విలువకు, పెట్టిన పెట్టుబడికి మధ్య ఉండే నిష్పత్తే ఆ వ్యాపారంలో వచ్చిన లాభం. స్థిర పెట్టుబడికి (ఘనాంగ నిర్మాణం) సగటు లాభం రేటుకన్నా తక్కువగాను, అస్థిర పెట్టుబడి (హస్వాంగ నిర్మాణం) సగటు లాభం రేటుకన్నా ఎక్కువగాను లాభాన్ని చేకూరుస్తుంది.

భూమిశిస్తు యొక్క చరిత్రను తెలుసుకోవాలంటే మార్క్స్ చేసిన విశ్లేషణను మనం గమనించాలి. శ్రమరూపంలో ఉన్న శిస్తు ఏ విధంగా వస్తు రూపంలో ఉన్న శిస్తుగా, తరువాత నగదు రూపంలోకి మారిపోతుందో, ఇక చిట్ట చివరకు రైతుస్థానే కూలికి పనివాళ్ళను పెట్టి వ్యవసాయం చేయించే వ్యవసాయపు ముస్తాజరీ వ్యాపారస్థులు బయలు దేరారో అప్పుడు ఈ నగదు శిస్తు పెట్టుబడిదారీ విధానపు శిస్తుకింద ఎలా మారిందో మార్క్స్ విశ్లేషణ చేసి చూపుతాడు. వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధాన పరిణామం గురించి వివరించుతాడు.

వ్యవసాయ ప్రజానీకంలో కొందరి నుండి ఆస్తి హక్కులు లాక్కొనబడి భూముల నుండి భూ దఖలు చేయబడడం ఫలితంగా, పరిశ్రమ పెట్టుబడికి అవసరమైన శ్రామికులు విడుదల కావడమే కాకుండా వారి జీవనభృతి, వారు వినియోగించవలసిన శ్రమసరుకు తయారై, దానితో పాటు దేశీయ మార్కెట్టు కూడా ఒకటి ఏర్పడుతుంది.

మొదట వ్యవసాయక ప్రజానీకం దరిద్రులయిపోయి నాశనమైపోయి, తత్ఫలితంగా తరువాత పెట్టుబడికి అవసరమైన నిరుద్యోగపు నిలువ సైన్యం కింద తయారవుతారు. ఈ పరిస్థితుల ఫలితంగా వ్యవసాయ కూలీకి కనిష్ట పరిమాణపు కూలి డబ్బులు ముట్టుతూ, ఒక కాలు ఎల్లప్పుడు దుర్భర దారిద్ర్యం అనే ఊబిలో దిగబడుతూనే నిలబడి ఉంటుంది. రైతాంగాన్ని, పారిశ్రామిక శ్రామిక వర్గాన్ని దోచుకునే పద్ధతి ఒక్కటే కాకుంటే రూపంలో తేడా ఉంటుంది. రెండుచోట్ల దోపిడీ చేసేది పెట్టుబడే. పెట్టుబడిదారీ

విధానపు వ్యవసాయంలో జరిగిన అభ్యుదయ మంతా, శ్రామికుని కొల్లగొట్టడ మనే కళలోనే కాకుండా, భూమిని కొల్లగొట్టడమనే కళలో కూడా సాధించిన అభ్యుదయమే. పెట్టుబడిదారీ ఉత్పత్తిలో సంపద అంతటికి మూలాధారమైన భూమిని, శ్రామికుని మాత్రం క్షీణింపజేసి నాశనం చేయడం వల్లనే సామాజికంగా వివిధ విధానాలను సమైక్యం చేస్తుంది.

**సోషలిజం**

ఆధునిక సమాజపు ఆర్థిక చలన నియమం ఒక్క దానిని మాత్రమే సంపూర్ణంగా అన్వయించడం ద్వారానే పెట్టుబడిదారీ సమాజం సోషలిస్టు సమాజంలోకి పరివర్తన చెందుతుందని మార్క్స్ స్పష్ట పరిచాడు. భారీ స్థాయి ఉత్పత్తి, పెట్టుబడిదారీ విధానపు కార్టెల్స్, సిండికేట్స్, ట్రస్టులు, వీటన్నిటి అభివృద్ధి, ఇవేకాక ఆర్థిక పెట్టుబడి పరిమాణం, ఉత్పత్తి శక్తుల బ్రహ్మాండమైన విజృంభణ, పురోగమనం అన్నీ శ్రమ సామాజికీకరణమే. అది విధిగా రానున్న సోషలిజం అవతరణకు భౌతిక పునాదిగా ఏర్పడుతుంది. ఈ పరివర్తనాన్ని ముందుకు నడిపే నైతిక మేధాశక్తి, ఈ పరివర్తనాన్ని అమలుపరిచే భౌతిక బలం కలిగినది పెట్టుబడిదారీ విధానం చేత స్వయంగా తర్ఫీదు చేయబడిన శ్రామిక వర్గమే. బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా శ్రామికవర్గ పోరాటం, రాజకీయ శక్తిని హస్తగతం చేసుకునే (శ్రామికవర్గ నియంతృత్వ) లక్ష్యాన్ని కలిగిన రాజకీయ పోరాట రూపాన్ని విధిగా ధరించి తీరుతుంది. ఉత్పత్తి యొక్క సామాజికీకరణం ఉత్పత్తి సాధనాలు సమాజం యొక్క ఆస్తిగా మారడానికే.'' ఆస్తి హక్కులు లాక్కొన్న వారి ఆస్తి హక్కులే లాక్కోవడానికే" విధిగా దారితీసి తీరుతుంది. దీనితో ఉత్పాదకత పెరగడం, పనిగంటలు తగ్గడం, ఉత్పత్తి అభివృద్ధి, సమిష్టి శ్రమ ఆక్రమించుకోవడం, విజ్ఞాన శాస్త్రాలను చైతన్యవంతంగా వినియోగించడం, వ్యవసాయం, పరిశ్రమల మధ్య పరస్పరాశ్రీయ నూతన సంబంధాలను అభివృద్ధి చేయడం జరుగుతుంది. అయితే మానవ క్రమాభివృద్ధిలోని అప్రయత్నంగానే పెరిగిన ఈ ఉత్పత్తి విధానం శ్రామికుని కోసమే ఉనికి కలిగి ఉండడానికి బదులు, ఉత్పత్తి విధానం కోసమే శ్రామికుడు ఉనికి కలిగి ఉన్నాడనే స్వభావాన్ని కలిగి ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థ అమానుష రూపం, దుర్నీతికి, బానిసత్వానికి చీడపురుగుల పుట్టగా తయారవుతుంది.

పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందినకొలదీ, ఒకనాటి జాతీయ నినాదం స్థానే మార్కెట్ తర్వాత పెట్టుబడుల అంతర్జాతీయ కారణం కొరకు జాతీయ అడ్డంకులను తొలగించి జాతీయ వైషమ్యాల స్థానే అంతర్జాతీయ స్థాయిలో వర్గ వైషమ్యాలను స్థాపిస్తుంది. సకలదేశాల కార్మికుల "ఐక్యకార్యాచరణ" శ్రామికవర్గ విముక్తికి ఒక ముఖ్యమైన షరతు అని కమ్యూనిస్టు ప్రణాళికలో ఉంది. వర్గ వైరుధ్యాల నుండి పుట్టిన రాజ్యాంగ యంత్రం దోపిడీ వర్గం చేతిలో అణచివేత సాధనం. సోషలిజం వర్గాలనే అంతమొందించడానికి దారితీయడం వల్ల రాజ్యాంగ యంత్రమే అంతమయ్యే విధంగా చేస్తుంది. రాజ్యాంగయంత్రాన్ని ఎత్తివేయడం జరగదు. దానంతట అది క్షీణించిపోతుంది.

శ్రామికవర్గం రాజ్యాంగ యంత్ర శక్తిని హస్తగతం చేసుకున్నాక బడా భూస్వాముల నుండి వారి భూములను బలాత్కారంగా లాగుకొనేటట్టుగా, సన్నకారు రైతుల నుండి భూములు లాక్కోవడం చేయరాదు అని స్పష్టపరిచారు.

**శ్రామికవర్గ పోరాటంలోని ఎత్తుగడలు**

మార్క్స్ తన జీవితకాలంలో తదేక దీక్షతో సిద్ధాంత గ్రంథాల రచనలతో పాటు శ్రామికవర్గం సాగించే పోరాటంలో పాల్గొని ఆ వర్గం అవలంభించ వలసిన ఎత్తుగడలను గురించి కృషి చేసాడు. మార్క్స్ రచనలలోను, ఏంగెల్స్‌తో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలలోను కనబడుతుంది. ఈ ఎత్తుగడల భాగాన్ని వివరించకపోతే భౌతికవాదం దృఢమైన కార్యదీక్ష లేకుండా ముందుకూ వెనుకకూ ఊగిసలాడుతూ, సంకుచితంగా వుండి జీవచ్ఛవంలాగ తయారవుతుందన్న మార్క్స్ అభిప్రాయం న్యాయమైనదే అంటాడు లెనిన్. మార్క్స్ తన రచనల్లో శ్రామికవర్గపు ఎత్తుగడ సాధించవలసిన మౌలిక కర్తవ్యాన్ని స్పష్టంగా నిర్వచించాడు.

ఒక నిర్ధిష్ట సమాజంలో ఉన్న అన్ని వర్గాల యొక్క పరస్పరాశ్రీయ సంబంధాలన్నింటి మొత్తాన్ని స్వతస్సిద్ధంగా పరిశీలించడం, తదానుషంగికంగా ఆ సమాజానికి తదితర సమాజాలకు వున్న పరస్పరాశ్రీయ సంబంధాలనూ పరిశీలించడం, ఇదొక్కటే పురోగామి వర్గం అవలంభించవలసిన సరైన ఎత్తుగడలకు పునాదిగా ఏర్పడగలుగుతుంది. అన్ని వర్గాలు, అన్ని దేశాలు చలన స్థితిలో ఉన్నట్లు మనం భావికాలపు దృష్ట్యా పరిశీలించాలంటాడు. ఈ సందర్భంలో మార్క్స్ ప్రతిపాదించిన రెండు వాదనలు ప్రాముఖ్యం కలిగినవి. 1. శ్రామికవర్గం యొక్క ఆర్థిక పోరాటానికి, ఆర్థిక సంస్థలకు సంబంధించినది (తత్వశాస్త్ర దరిద్రం గ్రంథంలో మార్క్స్ వివరించాడు) 2. శ్రామికవర్గం యొక్క రాజకీయ కర్తవ్యాల గురించి (కమ్యూనిస్టు ప్రణాళికలో) వివరించారు.

పారిస్ కమ్యూన్ సందర్భంగా పరిస్థితి పరిపక్వం కాకుండా తిరుగుబాటు కూడదని ఫ్రెంచి కార్మికవర్గాన్ని (1870) హెచ్చరించిన మార్క్స్, తిరుగుబాటు వాస్తవంలో (1871) ప్రారంభంకాగానే "స్వర్గాన్నే ముట్టడిస్తున్నారు" అని వారి విప్లవాత్మక చొరవను అత్యంత ఉత్సాహంతో ఆహ్వానించాడు. ఇది వరకు ఆక్రమించిన స్థానాన్ని వదులుకోవడం కంటెను; యుద్ధం చేయకుండానే అస్త్ర సన్యాసం చేయడం కంటేనూ ఈ ఓటమి తక్కువ నష్టం చేస్తుంది. దీనిలో పాల్గొనకుండా అస్త్ర సన్యాసం చేసి ఉంటే శ్రామికవర్గంలో నిరాశా నిస్పృహను పుట్టించి, దాని యుద్ధ సామర్థ్యాన్ని నాశనం చేసేసి వుండేది అని మార్క్స్ అన్నాడు.

పారిస్ కమ్యూన్ ఓటమి తర్వాత వెంటనే దాని నుండి విలువైన గుణపాఠాలు తీసి బలమైన పార్టీ అవసరాన్ని, కార్మికవర్గ నియంతృత్వం అవసరాన్ని, దోపిడి వర్గాల రాజ్యాంగయంత్రాంగాన్ని ధ్వంసం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాడు.

ఫ్రెడరిక్ ఏంగెల్స్ గురించి లెనిన్ చాలా వివరంగా చెప్పాడు. గొప్ప వివేచనా జ్యోతి అని, గొప్ప హృదయ స్పందన అని ఏంగెల్స్ గురించి స్మరించాడు. ఏంగెల్స్ మహా పండితుడని, నాగరిక ప్రపంచమంతటా ఉన్న యావత్ ఆధునిక శ్రామికవర్గానికి గురుతుల్యులుగా, మార్క్స్ తర్వాత ఏంగెల్స్ ద్వితీయస్థానాన్ని అలంకరించాడని చెప్పాడు. వారిద్దరూ పరిచయం అయిన నాటి నుండి చివరి శ్వాస వరకు ఇద్దరి జీవిత కార్యం సమిష్టి కర్తవ్యంగా పరిణమించిందన్నాడు. సంఘటితమైన, చైతన్యవంతమైన శ్రామిక వర్గం సాగించే వర్గ పోరాటమే మానవాళినిప్పుడు దోపిడీ చేస్తున్న దుర్మార్గం నుండి విముక్తి చేయగలదని నిరూపించగలిగారు అని, అంతేగాకుండా ప్రతివర్గ పోరాటమూ రాజకీయ పోరాటమేనని లెనిన్ వ్యాఖ్యానించాడు.

కార్మికవర్గం తన్ను తాను తెలుసుకుని, తన శక్తిని చైతన్యవంతంగా తెలుసుకోవడం ఎలాగో బోధించారు. ఇక, కలలు కనే స్థానంలో విజ్ఞాన శాస్త్రాన్ని నెలకొల్పారు. శ్రామికవర్గం బాధలను అనుభవించుతున్న వర్గ మవడమేకాకుండా, అవమానకరమైన ఈ ఆర్థిక దుస్థితే శ్రామికవర్గాన్ని నిరాఘాటంగా ముందుకు తీసుకునిపోతూ, ఇక విధిలేక తన అంతిమ విముక్తి కోసం యుద్ధం చేసేటట్లు చేసిందని, ఈ శ్రామికవర్గం తన స్వయం సహాయం పైనే ఆధారపడుతుందని, రాజకీయోద్యమ ఫలితంగా సోషలిజం ఒక్కటే విముక్తి మార్గ మని కార్మికులు తప్పక గ్రహించుతారని మొదటగా ఏంగెల్స్ ప్రకటించాడు. "ఇంగ్లండులో కార్మికవర్గం స్థితి" గ్రంథంలో ఏంగెల్స్ సవివరంగా స్పష్టత నిచ్చాడు. ఆనాడు ఈనాడు కూడా ఆ గ్రంథానికి విశేష ప్రాధాన్యత ఉందని, శ్రామిక జన జీవనాన్ని గొప్పగా ఆవిష్కరించిన గ్రంథంగా ప్రపంచమంతటా గొప్ప ప్రశస్తి ఉందని లెనిన్ వ్యాఖ్యానించాడు.

వారిద్దరూ రహస్యంగా పనిచేస్తున్న "కమ్యూనిస్టులీగ్"లో చేరి ఆ సంస్థ కోరికమేరకు 'కమ్యూనిస్టు ప్రణాళిక"ను రాసి గొప్ప చారిత్రక కర్తవ్యాన్ని నిర్వహించారు. యూరప్ అంతటా విస్తరించిన ఆనాటి విప్లవాలలో పాల్గొంటూ విప్లవాత్మక ప్రజాస్వామిక ఆశయాలకు, పోరాటాలకు మిత్రులిద్దరూ నిర్బంధాలకు ఎదురునిలిచి, గుండెకాయగా పనిచేసారు (1844 నుండి 1883 వరకు). 4 దశాబ్దాల పాటు ఇద్దరూ రాసుకున్న ఉత్తరాల (1,386) ద్వారా అత్యంత శ్రమోత్సాహాలతో అభిప్రాయాలనూ, విజ్ఞానాన్ని తెలుసుకుంటూ, శాస్త్రీయ సోషలిజాన్ని స్థాపించే కృషిలో పరస్పరం సహకరించుకునే వారు. ఆ ఉత్తరాలు 4 సంపుటాలుగా ముద్రించారు. ఈ లేఖలు చదువుతున్నప్పుడు సర్వ ప్రపంచ కార్మికోద్యమ చరిత్ర, కార్మికవర్గ రాజకీయ చరిత్ర, కార్మికవర్గ రాజకీయ కర్తవ్యాలు గురించి లోతైన జ్ఞానం కలుగుతుంది. ఆ ఉత్తరాల నిండా ఉన్న గతితర్కం మార్క్స్, ఏంగెల్స్‌లకు అన్నింటికన్నా ఎక్కువ అభిలాష కల్గించిన విషయం అని స్పష్టమవుతుంది. అర్థశాస్త్ర పున: స్వరూప కల్పనకు, చరిత్రకు, ప్రకృతిశాస్త్రానికి, తత్వశాస్త్రాలకు, కార్మికవర్గ ఎత్తుగడలకు, రాజనీతికి భౌతిక గతితర్కాన్ని అన్వయించారు.

మార్క్స్ మరణానంతరం పెట్టుబడి 2వ, 3వ సంపుటిలను ప్రచురణకు సిద్ధం చేయడంలో ఏంగెల్స్ కృషి ఎన్నదగినది. ఏంగెల్స్ తరచు వాదోపవాద పూరితములైన గ్రంథాలను, సర్వ సాధారణ శాస్త్రీయ సమస్యలపైననూ, భౌతిక చారిత్రక భావనా దృక్పథం నుండి మార్క్సీయ ఆర్థిక సిద్ధాంత దృక్పథం నుండి భూతవర్తమాన కాలాల వివిధ సంఘటనలను పరిశీలించి సులభశైలిలో గ్రంథాలను రచించాడు. వాటిలో అత్యంత విషయ వైవిధ్యం గల రచన ద్యూరింగ్ ఖండన; కుటుంబం, వ్యక్తిగత ఆస్థి, రాజ్యాంగాల పుట్టుక; లుడ్విగ్ ఫొయిర్ బాఖ్ లాంటి ఎన్నో ప్రముఖ గ్రంథాలున్నాయి.

1864లో మార్క్స్ "అంతర్జాతీయ కార్మికుల సంఘం" అనే సంస్థను స్థాపించి, ఒక దశాబ్దం పాటు దానిని నడిపాడు. 1889జూలై 14న పారిస్‌లో బాస్టిల్ పతనపు శతజయింతి మహాసభ జరిపిన సందర్భంగా ఏంగెల్స్ రెండవ ఇంటర్నేషనల్‌ను ఏర్పరచి, దానికి నాయకత్వం వహించాడు. మార్క్సిజానికి వ్యతిరేకంగా వచ్చిన అన్యవర్గ సిద్ధాంతాలను, రివిజనిస్టు పోకడలను ఎదుర్కొన్నాడు. సైద్ధాంతిక, రాజకీయ రంగాలలో మార్క్స్, ఎంగెల్స్ జరిపిన పోరాటాల ఫలితంగా యూరప్‌లో వర్గపోరాటం నిశితమైంది. ఈ సంఘ కార్యకలాపాల్లో ఏంగెల్స్ చురుగ్గా పాల్గొన్నాడు. ఆ సంస్థ అంతమయినప్పటికి కార్మికోద్యమం నిరవధికంగా అభివృద్ధి చెందింది. మార్క్స్ మరణానంతరం ఏంగెల్స్ (1995లో ఏంగెల్స్ మరణం వరకు) యూరప్‌లోని సోషలిస్టులకు అచారత్వాన్ని, నాయకత్వాన్ని అందించాడు.

శాస్త్రీయ విశ్లేషణ వల్ల పెట్టుబడిదారీ విధాన పతనమూ, ఏ విధానం కిందనైతే మానవునిచే మానవుని దోపిడీ ఇక జరగనేరదో అట్టి కమ్యూనిజంలోకి పెట్టుబడిదారీ విధానం యొక్క పరివర్తనా తప్పనిసరి అని నిరూపించిన మహత్తర చారిత్రక కీర్తి మార్క్స్, ఏంగెల్స్‌లకే దక్కింది. సంఘటితపరచి పోరాడటంలో శ్రామికవర్గం పాత్రను, కర్తవ్యాన్ని, విధ్యుక్త ధర్మాన్ని తెలియజేప్పడంలోనే మార్క్స్, ఏంగెల్స్‌లు కావించినట్టి ప్రపంచ చారిత్రాత్మకమైన మహత్తర కృషి ఉంది. సోషలిజం అంతిమ విజయాన్ని సాధించి తీరుతుంది. ✦

**మార్క్సిజం - లెనినిజం - మావోయిజం వర్థిల్లాలి!!**

# రెండవ ఇంటర్నేషనల్ పతనం – మూడవ ఇంటర్నేషనల్ ఏర్పాటు

**మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నిర్మాణానికి చారిత్రక పూర్వరంగం**

**యుద్ధకాలంలో కార్మికోద్యమంలో వచ్చిన మార్పులు**

సామ్రాజ్యవాదము, కార్మికవర్గ విప్లవాల యుగంలో, కార్మికవర్గ పోరాటాల అవసరాల దృష్ట్యా, కొత్తతరహా విప్లవకర పార్టీలు ఏర్పడటం, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో అవి సమీకృతం కావటం ఒక చారిత్రక ఆవశ్యకత. రెండవ ఇంటర్నేషనల్ పతనమైన వెంటనే, మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభంలోనే, ఒక కొత్త, నిజమైన విప్లవకర ఇంటర్నేషనల్‌ను ఏర్పరచవలెననే సమస్యని లెనిన్ లేవనెత్తాడు.

1914 జూలై చివర నుండి ప్రారంభమైన యుద్ధం, రెండు వైపుల నుండి, సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధం. అంతర్జాతీయ కార్మికోద్యమంలోని అన్ని ధోరణులకు అది ఒక కఠినమైన పరీక్షాసమయమైంది. రెండవ ఇంటర్నేషనల్ యొక్క రాజకీయ, సైద్ధాంతిక దివాళాకోరుతనాన్ని అది నిర్దాక్షిణ్యంగా బహిర్గతం చేసింది. సోషల్ డెమోక్రటిక్ పార్టీలలో అత్యధిక సంఖ్య అవకాశవాద ఊబిలో ఎంతగా కూరుకుపోయాయో ఇది వెల్లడి చేసింది. 1914 ఆగస్టు 4న జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు అందరూ బూర్జువావర్గంతోను, పెద్ద భూస్వాములతోను చేతులు కలిపి, రైహ్‌స్టాగ్‌లో యుద్ధపద్దులకు అనుకూలంగా వోటుచేశారు. రెండవ ఇంటర్నేషనల్‌లో అన్నిటికంటె బలమైన, పలుకుబడి గలిగిన పార్టీ సభ్యులు వీరు. ఆస్ట్రోహంగరీ, ఫ్రాన్సు, బ్రిటన్, బెల్జియం, తదితర అనేక దేశాలలోని సోషలిస్టు పార్టీలు అన్యాయమైన ఈ సామ్రాజ్యవాద యుద్ధంలో "తమ తమ" ప్రభుత్వాలను బలపరచ సాగారు. ఈ విధంగా ఈ అవకాశవాదులు "తమ" జాతీయ బూర్జువావర్గంతో బహిరంగంగా చేతులు కలిపారు. కార్మిక వర్గ ప్రయోజనాలకు ఇది పూర్తిగా ద్రోహం చేయటమే. రెండవ ఇంటర్నేషనల్ చేసిన యుద్ధ వ్యతిరేక నిర్ణయాలన్నిటినీ ఈ విధంగా ఉల్లంఘించటం ద్వారా ఈ అవకాశవాదులు అంతర్జాతీయ కార్మికోద్యమ ఐక్యతను చావు దెబ్బ కొట్టారు. ఏమంటే, "తమ తమ" బూర్జువావర్గాలతో చేతులు కలపటమంటే, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కార్మికోద్యమాన్ని చీల్చి విచ్ఛిన్నం చేయటమే.

కార్మికోద్యమంలో ఉన్న సంక్షోభాన్ని సామ్రాజ్యవాద యుద్ధం బహిర్గతం చేసింది. పెట్టుబడిదారీ విధానం సాపేక్షంగా శాంతియుతంగా అభివృద్ధి అవుతున్న దశలో కార్మికోద్యమంలో దీర్ఘకాలంగా పెరుగుతూ వచ్చిన జాడ్యం బహిర్గతమైంది. ఈ దశలోని వస్తుగత పరిస్థితులే ఈ అవకాశవాద ధోరణులను పెంచి పోషించాయి. తాము సంపాదించిన అధిక లాభాలను కొంతమంది కార్మికులను, వారి నాయకులను కొనివేయటానికి గుత్త బూర్జువావర్గం వినియోగించింది. ఆ విధంగా కార్మిక అగ్రవర్గం, కార్మిక బ్యూరాక్రసీల రూపంలో ఒక అగ్ర సామాజిక విభాగాన్ని సృష్టించింది. బూర్జువా తత్వం అలవరచుకున్న ఈ కార్మికులు, పెటీ బూర్జువా సహచరులతో కలసి కార్మికోద్యమంలో, బూర్జువావర్గానికి ప్రధానమైన అండగా, అవకాశవాదానికి ప్రధానమైన కేంద్రంగా తయారయ్యారు. రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన పార్టీలు అంతకంతకు అవకాశవాదంలో కూరుకుపోసాగాయి. యుద్ధానికి పూర్వపు సంవత్సరాలలో, వామపక్ష శక్తుల ప్రభావం వలన, రెండవ ఇంటర్నేషనల్ సరియైన తీర్మానాలను ఆమోదించింది. కాని ఆ సంస్థ మితవాద నాయకుల ఆచరణ అంతకంతకు బూర్జువా విధాన ప్రయోజనాలకు అనుకూలంగా మారింది.

యుద్ధానికి ముందున్న పరిస్థితులను శాస్త్రీయంగా అధ్యయనం చేయడం ద్వారా కా॥ లెనిన్ 1907 నాటికే, ప్రపంచయుద్ధ ప్రమాదాన్ని గురించి హెచ్చరించాడు. పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికవర్గం, యుద్ధం కారణంగా ఏర్పడగల అద్భుతమైన విప్లవ సంక్షోభాన్ని ఉపయోగించుకుని విప్లవాలను పరిపూర్తి చేయాలని, ఆయన పిలుపునిచ్చాడు.

1907లో స్టట్‌గార్ట్‌లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ ఏడవ కాంగ్రెస్, ప్రపంచయుద్ధ ప్రమాదాన్ని గురించి వివరంగా చర్చించింది. లెనిన్, రోజా లగ్జెంబర్గ్‌లు రూపొందించిన సుప్రసిద్ధమైన స్టట్‌గార్ట్ తీర్మానం సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధం సందర్భంగా కార్మికవర్గం చేపట్టవలసిన కర్తవ్యాలను నొక్కిచెప్పింది.

"యుద్ధ బద్దలయ్యే ప్రమాదమే ముంచుకువస్తే, ఆ దేశానికి సంబంధించిన కార్మికవర్గమూ కార్మికవర్గపు పార్లమెంటరీ ప్రతినిధులూ, అతర్జాతీయ సోషలిస్టు బ్యూరో సంఘటిత కార్యకలాపాల మద్దత్తుతో, యుద్ధాన్ని నివారించడంకోసం శాయశక్తులా కృషిచేయాలి. ఏ పద్ధతులు అత్యంత సమర్ధవంతమైనవని వారు భావిస్తే, ఆ పద్ధతులలో వారు కృషిచేయాలి. వర్గపోరాట తీవ్రతను బట్టి, సాధారణ రాజకీయ పరిస్థితులను బట్టి ఆ పద్ధతులు సహజంగానే మారుతుంటాయి.

"యుద్ధమేగనుక బద్దలైతే, అది అతి త్వరగా ముగిసిపోవడానికి దోహదపడేవిధంగా అందులో జోక్యంచేసుకోవడం వారి కర్తవ్యం. యుద్ధం నుండి ఉత్పన్నమయ్యే ఆర్థిక, రాజకీయ సంక్షోభాన్ని ప్రజలను జాగృతంచేయడానికీ, తద్వారా పెట్టుబడిదారీ వర్గపాలనను నిర్మూలించడాన్ని త్వరితం చేయడానికీ, వారు తమ శాయశక్తులా కృషిచేయాలి."

('హిస్టరీ ఆఫ్ త్రీ ఇంటర్నేషనల్స్', సం. 1, పేజీ. 223)

ఈ విషయాన్నే 1910లో, కోపెన్ హేగన్‌లో జరిగిన రెండవ

ఇంటర్నేషనల్ ఎనిమిదవ కాంగ్రెస్ పునరుద్ఘాటించింది.

ప్రపంచయుద్ధం ముంచుకొస్తుండగా నవంబరు 1912లో, బాస్లేలో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ అసాధారణ మహాసభ, యుద్ధానికి వ్యతిరేకంగా విప్లవకర వైఖరిని చేపట్టాలనీ, విప్లవాన్ని పురోగమింపజేయడం కోసం ఆ పరిస్థితిని ఉపయోగించుకోవాలనీ, ప్రపంచ కార్మికవర్గానికి పిలుపునిచ్చింది.

ఈ కాలంలోనే బోల్షివిక్ పార్టీలో ఊగిసలాడేటటువంటి కార్మికవర్గేతర శక్తులను, లిక్విడేటర్లను (రద్దువాదులను), మధ్యేవాదులను, వివిధ రకాలైన అవకాశవాదులను పార్టీనుంచి ఏరివేసే క్రమం ప్రారంభమైంది. బ్రద్దలుకానున్న యుద్ధం నుండి ఉత్పన్నంకాగల నూతన విప్లవ అవకాశాలను వినియోగించుకోవడానికిగాను, 1912లో ఒక నూతన తరహా పార్టీ తయారవుతూ వచ్చింది. బెర్నెస్టీన్ కాట్స్కీ, ఆట్టో బాయర్ అడ్లర్ అండ్ కో వంటివారు, సామ్రాజ్యవాద యుగంలోని పెట్టుబడిదారీ విధానపు సాధారణ సంక్షోభాన్ని అర్ధంచేసుకోవడంలో విఫలమయ్యారు. ఈ సంక్షోభాన్ని వారు, అంతకు మునుపటి కాలంలోని క్రమానుగత సంక్షోభాల వంటిదిగానే భావించారు. ఈ సంక్షోభం నుండి పెట్టుబడిదారీ విధానం గతంలో వలెనే బయటపడగలదని వారు భావించారు. శాంతియుత పద్ధతుల ద్వారానే పెట్టుబడిదారీ విధానం తన సంక్షోభాన్ని పరిష్కరించుకోగలదని, వారు సిద్ధాంతీకరించారు కూడా. వాస్తవంగా యుద్ధం బ్రద్దలైనప్పుడు వారు సామ్రాజ్యవాద తొత్తులుగా మారిపోయారు. విప్లవోద్యమానికి ద్రోహం చేశారు. వారు పితృదేశ రక్షణ అని నినాదం యిచ్చినప్పుడు వారిని లెనిన్ ఈ విధంగా ఎండగట్టాడు.

"కుళ్ళిపోయి, పతనావస్థకు చేరిన పెట్టుబడిదారీ విధానానికి చెందిన ఒక నొక చారిత్రక దశనే పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం; ఇది సోషలిజానికి తొలి నంజ. పెట్టుబడిదారీ విధానం ఫ్యూడలిజాన్ని, రాజరికాన్ని కూలద్రోసి విదేశాల గుప్పిటి నుండి విముక్తి సాధించిన 1789 నుండి 1871 మధ్య కాలంలో "పితృదేశ రక్షణ" అనేది చారిత్రక ఎజెండా ముందుకు వచ్చింది. అంటే అణిచివేతకు వ్యతిరేకంగా మాత్రమే దీన్ని తీసుకోవాలి. యుద్ధం కనుక పెద్ద సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా జరిగినట్లయితే ఇప్పటికీ ఈ పదం వర్తిస్తుంది. కాని ఏషియా మైనర్, బాల్కన్ దేశాల్లాంటి వాటిలో పెద్ద ముక్కను పొందడానికి సామ్రాజ్యవాద పెద్ద దేశాల మధ్య జరుగుతున్న యుద్ధానికి వర్తింపజేయడం హాస్యాస్పదమైనది. ఇది ఆశ్చర్యకరమైనదేమి కాదు, ఎందుకంటే దొంగ నేరం చేసిన స్థలం నుండి తప్పించుకోవడం లాగా బాస్లే ప్రణాళిక నుండి ఈ యుద్ధంలో "పితృదేశ రక్షణ" అంటూ ''సోషలిస్టులు'' తప్పించుకొంటున్నారు. ఇతర దేశాలను దోచుకోవడానికి, బానిసత్వంలోకి నెట్టడానికి 'తమ స్వంత' బూర్జువా వర్గానికి సహాయం చేయడాన్ని సోషల్–దురహంకారులుగా అంటే సోషలిస్టులుగా మాటల్లో, దురహంకారులుగా చేతల్లో, వీరిని బాస్లే ప్రణాళిక నిరూపించింది."

(రెండవ ఇంటర్నేషనల్ పతనం – లెనిన్ 1915)

యుద్ధపు రెండు ఏళ్ళలో అన్ని దేశాల్లో అంతర్జాతీయ సోషలిస్టు, కార్మికోద్యమంలో మూడు ధోరణులు రూపొందాయి.

ఆ మూడు ధోరణులూ యివీ:

1. సోషల్ జాతీయ దురహంకారులు, అంటే, మాటల్లో సోషలిస్టులూ, చేతల్లో జాతీయ దురహంకారులూ, ఒక సామ్రాజ్యవాద యుద్ధంలో (ప్రత్యేకించి, ప్రస్తుత సామ్రాజ్యవాద యుద్ధంలో) "మాతృదేశ రక్షణ"ను గుర్తించేవాళ్ళు.

వీళ్లు మన వర్గ శత్రువులు. వీళ్లు బూర్జువావర్గ పక్షాన చేరిపోయారు.

అన్ని దేశాల్లోని అధికారిక సోషల్ డెమోక్రటిక్ పార్టీల అధికారిక నాయకుల్లో వీళ్లదే మెజారిటీ–రష్యాలో ప్లెహానొవ్ ప్రభృతులు, జర్మనీలో షైడెమన్‌లు, ఫ్రాన్సులో రెనొడెల్, గెడ్, సెంబాలు, ఇటలీలో బిస్సొలాతి ప్రభృతులు, బ్రిటన్‌లో హైండ్‌మన్, ఫేబియన్లు లేబరైట్లు ("లేబరు పార్టీ" నాయకులు), స్వీడన్‌లో బ్రాండింగ్ ప్రభృతులు, హాలండులో త్రూల్‌స్ట్రా, ఆయన పార్టీవాళ్లూ, డెన్మార్కులో స్టానింగూ, ఆయన పార్టీవాళ్లూ, అమెరికాలో విక్టర్ బేర్గెర్, తదితర "మాతృదేశ పరిరక్షకులు" యిత్యాది.

2. "మధ్యస్థులు" అనే రెండో ధోరణివాళ్లు సోషల్ జాతీయ దురహంకారులకీ, నిజమైన అంతర్జాతీయవాదులకీ మధ్య ఊగిసలాడేవాళ్లు.

''మధ్యస్థులు'' అందరూ తాము మార్క్సిస్టులమనీ, అంతర్జాతీయవాదులమనీ, తాము శాంతికి అనుకూలురమనీ, ప్రభుత్వాల మీద అన్ని రకాల "ఒత్తిడి" తెచ్చేందుకూ తమ ప్రభుత్వమే "శాంతికి అనుకూలమైన ప్రజాభీష్టాన్ని వక్కాణించి చెప్పాలని" అన్ని విధాలా ''డిమాండుచేసేందుకూ,'' అన్ని రకాల శాంతి ప్రదర్శనలకూ, విదేశ భూభాగాల ఆక్రమణలు లేని శాంతి వగైరా వగైరాలకీ తాము అనుకూలురమనీ, అంతేకాక, సోషల్ జాతీయ దురహంకారులతో శాంతికి అనుకూలురమనీ ప్రమాణంచేసి చాటి చెప్తారు. ఈ "మధ్యస్థులు" "ఐక్యత"కు అనుకూలురు, చీలికకి వ్యతిరేకులు.

"మధ్యస్థులు" తియ్యటి పెటీబూర్జువా పదాలకీ, మాటల్లో అంతర్జాతీయవాదానికీ, చేతల్లో పిరికితనంతో కూడిన అవకాశవాదానికీ, సోషల్ జాతీయ దురహంకారులపట్ల అతివినయ విధేయతలకీ ప్రతిరూపాలు.

ఈ సమస్యకి కీలకం ఏమిటంటే, తమ సొంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవపు ఆవశ్యకత వుందన్న విషయాన్ని "మధ్యస్థులు"

నమ్మరు; వాళ్లు విప్లవాన్ని బోధించరు; వాళ్లు హృదయపూర్వకంగా విప్లవ పోరాటాన్ని సాగించరు; అలాంటి పోరాటాన్ని దాటవేసేందుకుగాను "అధి మార్క్సిస్టు"గా కనిపించే సాకులకు పూనుకుంటారు.

సోషల్ జాతీయ దురహంకారులు మన వర్గశత్రువులు, కార్మికోద్యమంలో వాళ్లు బూర్జువాలు. వాస్తవంలో బూర్జువావర్గంచేత లంచాలు తినిపించబడినవాళ్లు (మరింత మెరుగైన వేతనాల ద్వారా, గౌరవ స్థానాలు వగైరాల ద్వారా), అలాగే, చిన్న, బలహీనజాతులను దోచుకొనేందుకూ, పెట్టుబడిదారీ కొల్ల సొమ్ము పంపిణీకోసం పోరాడేందుకూ తమ సొంత బూర్జువావర్గానికి తోడ్పడే కార్మికవర్గంలోని శ్రేణికి లేక గ్రూపులకు లేక విభాగాలకూ వాళ్లు ప్రాతినిథ్యం వహిస్తారు.

"మధ్యస్థులు"–సాంప్రదాయిక ఆరాధకులు, చట్టబద్ధత అనే చీడచేత పీడింపబడేవారు, పార్లమెంటరీ వాతావరణంచేతా, వగైరాచేతా దుర్నీతి పాలైనవాళ్లు, సౌకర్యవంతమైన స్థానాలకూ, సాఫీ అయిన ఉద్యోగాలకూ అలవాటుపడినవాళ్లు. చారిత్రక ఆర్థిక దృష్ట్యా, వాళ్లొక ప్రత్యేక పౌర కాదు, కార్మికోద్యమపు గత దశ ఒకదాని నుంచి–యిది 1871కీ 1914కీ మధ్య దశ–పరివర్తనకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ దశ ప్రత్యేకించి భారీ, చాలా భారీ స్థాయిలో నిదానమైన, క్రమబద్ధమైన సంఘటనకు సంబంధించిన అనివార్య కళ దశలో శ్రామికవర్గానికి విలువైనదెంతో యిచ్చిన దశనుంచి, సామాజిక విప్లవ యుగాన్ని ప్రారంభించిన మొదటి సామ్రాజ్యవాద యుద్ధ ప్రజ్వలనతో వస్తుపరంగా ఆవశ్యకమైన ఒక కొత్త దశకు పరివర్తన.

ఈ మధ్యస్థుల ప్రధాన నాయకుడు కారల్ కాట్స్కీ రెండవ ఇంటర్నేషనల్‌లో (1889–1914) అత్యంత ప్రముఖ ప్రామాణికుడు, 1914 ఆగస్టుకి దరిమిలా మార్క్సిస్టుగా పరమ దివాళాకోరుతనానికి నమూనాప్రాయుడు, కనీవినీ ఎరుగని చచ్చుదనానికీ, పరమ నికృష్టమైన ఊగిసలాటలకీ, విద్రోహానికీ సాకార రూపం. ఈ "మధ్యస్థ" ధోరణిలో కౌట్స్కీ, హాసే, లెడెబుర్‌లు, రైహ్‌స్టాగ్‌లోని "కార్మిక లేక లేబరు గ్రూపు," ఫ్రాన్సులో యీ ధోరణిలో లోంగె, ప్రెస్‌మోన్, మొత్తంమీద మైనరిటేర్లు అనబడేవాళ్లూ (మెన్షెవిక్కులు); బ్రిటన్‌లో ఫిలిప్ స్నోడెన్, రామ్సే మెక్‌డోనల్డు, "ఇండిపెండెంట్ లేబరు పార్టీ"కి చెందిన పలువురు యితర నాయకులూ, బ్రిటిష్ సోషలిస్టు పార్టీకి చెందిన కొందరు నాయకులూ; అమెరికాలో మోరిస్ హిల్‌క్విట్, యింకా పలువురు యితరులూ; ఇటలీలో టురాటి, ట్రీవెస్, మొడిగ్లియాని, తదితరులూ; స్విట్జర్లండులో రోబెర్ట్ గ్రిమ్, తదితరులూ; ఆస్ట్రియాలో విక్టర్ ఆడ్లర్ ప్రభృతులూ; రష్యాలో ఆర్గనైజింగ్ కమిటీ పార్టీ, అక్సెల్‌రాడ్, మార్తోవ్, ఛెయిడ్జె, త్సెరెతేలి ప్రభృతులూ వగైరాలు వున్నారు.

3. మూడవ ధోరణి–నిజమైన అంతర్జాతీయవాదులది. దాని అత్యుత్తమ ప్రతినిధి "త్సిమ్మెర్‌వాల్డ్ వామపక్షం."

సోషల్ జాతీయ దురహంకారంతోనూ, "మధ్యస్థుల"తోనూ పూర్తిగా తెగతెంపులు చేసుకోవడం, తన స్వదేశీ సామ్రాజ్యవాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా, స్వదేశీ సామ్రాజ్యవాద బూర్జువావర్గానికి వ్యతిరేకంగా దాని వీరోచిత విప్లవాత్మక పోరాటం–యిదే యీ ధోరణి విశిష్ట లక్షణం. దాని సూత్రం యిదీ: "మా ప్రధాన శత్రువు స్వదేశంలో వున్నాడు." తేనెపూసిన సోషల్ శాంతివాద పదాలకి వ్యతిరేకంగానూ (సోషల్ శాంతివాది అంటే మాటల్లో సోషలిస్టు, చేతల్లో బూర్జువా శాంతివాది; బూర్జువా శాంతివాదులు పెట్టుబడి శృంఖలాన్నీ, పెత్తనాన్నీ కూలదొయ్యకుండా శాశ్వత శాంతిని గురించి కలలుగంటారు), ప్రస్తుత యుద్ధానికి సంబంధించి శ్రామికవర్గపు విప్లవాత్మక పోరాటంయొక్కా శ్రామికవర్గపు సోషలిస్టు విప్లవం యొక్కా సాధ్యతనూ, లేక సముచితత్వాన్నీ, లేక సమయోచితత్వాన్నీ తిరస్కరించేందుకు ఉపయోగించే అన్ని సాకులకూ వ్యతిరేకంగానూ యీ ధోరణి తీవ్రమైన పోరాటం జరుపుతుంది.

జర్మనీలో ఈ ధోరణికి అత్యంత ప్రముఖ ప్రతినిధి "స్పార్టకస్ గ్రూపు" లేక "ఇంటర్నేషనల్ గ్రూపు" కార్ల్ లీబ్‌క్నెఖ్ట్ ఈ గ్రూపుకు చెందుతాడు. కార్ల్ లీబ్‌క్నెఖ్ట్ ఈ ధోరణికి, కొత్త, నికరమైన, శ్రామికవర్గ ఇంటర్నేషనల్‌కు అత్యంత సుప్రసిద్ధుడైన ప్రతినిధి.

(శ్రామికవర్గ విప్లవ కర్తవ్యాలు–లెనిన్ నాలుగవ సంపుటి తెలుగు)

శ్రామికవర్గ విప్లవం ద్వారా మాత్రమే తప్ప, ఈ యుద్ధం ప్రజాతంత్ర, బలప్రయోగరహిత శాంతిలో ముగిసే అవకాశం గాని, లేక, యుద్ధం ద్వారా విశేషమైనదను వెనకేసుకున్న పెట్టుబడిదారులకు ప్రజలు వందల కోట్లు వడ్డీగా ముడుపు చెల్లించ వలసిన భారంనుంచి విముక్తులయ్యే అవకాశం గాని లేదు.

బూర్జువా ప్రభుత్వాలనుంచి అత్యంత వైవిధ్యపూరితమైన సంస్కరణలను డిమాండు చెయ్యడం సాధ్యమే, డిమాండుచేసితీరవలసిందే. కాని, మనీలొవిజంలోకీ, సంస్కరణ వాదంలోకీ కూరుకుపోనిదే ఎవరూ కూడా, సామ్రాజ్యవాద పెట్టుబడికి చెందిన వేలాది తాళ్లలో చిక్కుకున్న ప్రజలూ, వర్గాలూ ఆ తాళ్లను తెంచుకోవాలని డిమాండుచెయ్యలేరు. అవి తెంచబడనిదే, యుద్ధానికి వ్యతిరేకంగా యుద్ధం అంటూ చెప్పే మాటలన్నీ శుష్కమైన, మోసపూరితమైన వాగుడే అవుతుంది.

"కౌట్స్కీయెట్లూ," "మధ్యస్థులూ" మాటల్లో విప్లవకారులు, చేతల్లో సంస్కరణవాదులు, వాళ్లు మాటల్లో అంతర్జాతీయవాదులు, చేతల్లో సోషల్ జాతీయ దురహంకారులకు తోడ్పాటుదారులు.

(శ్రామికవర్గ విప్లవ కర్తవ్యాలు–లెనిన్ నాలుగవ సంపుటి)

కాట్స్కీ ముందుకు తెచ్చిన "అతీత సామ్రాజ్యవాద" సిద్ధాంతం విప్లవానికి ఎలా వ్యతిరేకమో ఇక్కడ లెనిన్ వివరించాడు.

"విప్లవ మార్క్సిస్టులకు వ్యతిరేకంగా కాట్స్కీ తన నూతన సిద్ధాంతం అతీత సామ్రాజ్యవాద" సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చాడు. "అంతర్జాతీయ గుత్త పెట్టుబడి ప్రపంచాన్ని కలిసి దోపిడి చేయడం" అనేది "జాతీయ గుత్తపెట్టుబడి మధ్య వైరుధ్యాలను" రద్దుచేస్తుందని ఆయన భావిస్తున్నాడు. కాని ఆయన ఇంకా ఇలా చెబుతున్నాడు. "అయితే ఈ కొత్త దశకు చెందిన పెట్టుబడిదారీ విధానం సాధ్యమా అని చెప్పడానికి ఇప్పటి వరకు తగినంత డేటా మనం కలిగిలేం" అంటున్నాడు. "నూతన దశ" గురించి సుమారు అంచనాకు వచ్చిన పునాదులపై నిలబడి ధైర్యంగా తప్పని సరిగా 'సాధ్యమే' అని చెప్పక పోవడంతో, ఈ 'దశ'ను కనుగొన్న అతనే తన స్వంత విప్లవకరమైన డిక్లరేషనుతో పాటు కార్మిక వర్గానికి చెందిన విప్లవకరమైన ఎత్తుగడలను, విప్లవ కర్తవ్యాలను తిరస్కరిస్తున్నాడు. ఇప్పటికీ బ్రద్దలైన "దశ"కు సంబంధించిన సంక్షోభం; తీవ్రతరమైన వర్గ వైరుధ్యాల వలన ఉత్పన్నమైన యుద్ధ దశను కూడ తిరస్కరించాడు. ఇది అత్యంత జుగుప్సాకరమైన ఫెబినిజం (కాలపయన) కాదా! అని లెనిన్ కాట్స్కీని విమర్శించాడు.

ఈ యుద్ధంలో సోషల్ డెమోక్రటిక్ విప్లవ కార్యకలాపాలు ఎలా ఉండాలో లెనిన్ ఈ విధంగా చెప్పాడు.

ఈ యుద్ధంలో సోషల్ డెమోక్రట్ల కార్యాచరణ పథకం ఇలా ఉండాలని లెనిన్ చెబుతున్నాడు. ప్రజల విప్లవ ఆందోళనను సపోర్టు చేయడం. అభివృద్ధి చేయడం, దాన్ని విస్తరింపజేస్తూ తీవ్రం చేయాలి. రహస్య నిర్మాణాలను ఏర్పరచాలి. ఇవి లేకుండా 'స్వేచ్ఛా' దేశాల్లో కూడ ప్రజలకు సత్యాన్ని చెప్పడానికి మనకు ఎలాంటి దారి లేదు. తక్కిన దంతా అవకాశవాద పూరితమైన లేదా శాంతితో అలంకృతమైన వాగాడంబరం తప్ప మరేమి కాదు. ఆ కాట్స్కీ ఇప్పటికీ వక్రీకరించిన మార్క్సిజం యొక్క నిరర్ధకమైన మాటలు ఎక్కువైపోయాయి. రెండవ ఇంటర్నేషనల్ 25 సంవత్సరాల తర్వాత బాస్లే మేనిఫెస్టు తర్వాత నుంచి మాటలు నమ్మడానికి కార్మికులు సిద్ధంగా లేరు. అవకాశవాదం పండి కుళ్ళిపోయింది. ఇది సామాజిక – దురహంకారంగా పరిణామం చెంది బూర్జువా శిబిరం వైపు మళ్ళింది. ఇది సోషల్ డెమోక్రసీతో తెగ తెంపులు చేసుకొంది. నిర్మాణాత్మక సంబంధాన్ని కూడ తెంచుకొన్నది. ఇప్పటికీ కార్మికులు 'చట్ట రహిత' కరపత్రాలు 'నిషేధిత' మీటింగులను డిమాండు చేస్తున్నారు. అంటే రహస్య నిర్మాణాలు ఈ విప్లవ కరమైన ప్రజాందోళనను సమర్ధించాలి. ఈ విధానంపై ఆధారపడి ''యుద్ధానికి వ్యతిరేకంగా యుద్ధం'' నిర్వహించనిచో అది వట్టి మాటలతో కూడిన సోషల్ డెమోక్రటిక్ పని అవుతుంది. ఎన్ని అడ్డంకులు, వెనుకపట్టు, తప్పులు, వంచనలు, అవాంతరాలు ఎదురైనప్పటికీ, ఈ విధానమే మానవాళిని విజయవంతమైన కార్మికవర్గ విప్లవం వైపు నడిపిస్తుంది.

(రెండవ ఇంటర్నేషనల్ పతనం – లెనిన్)

## II

రెండవ ఇంటర్నేషనల్ నాయకత్వం సోషల్ జాతీయ దురహంకారుల వాదనను స్వీకరించడమూ, తమ తమ సామ్రాజ్యవాద ప్రభుత్వాలతో చేతులు కలిపి, తమలో తాము సంఘర్షించుకున్న పార్టీల క్రింద ఈ సంస్థ చీలిపోవడమూ రెండవ ఇంటర్నేషనల్ యొక్క సైద్ధాంతిక, నిర్మాణ పతనాన్ని వ్యక్తం చేసింది. కార్మికవర్గ అంతర్జాతీయ సంస్థగా అది నశించింది. విచ్ఛిన్నమైంది. కమ్యూనిస్టు వ్యతిరేకులు వాదించినట్లు, రెండవ ఇంటర్నేషనల్ చీల్చింది లెనినూ, బోల్షివిక్కులూ కాదు. కార్మికవర్గానికి ద్రోహంచేసి, అంతర్జాతీయ కార్మికోద్యమ ఐక్యతను విచ్ఛిన్నం చేసిన సోషల్ జాతీయ దురహంకారవాదులు, అవకాశవాదులే రెండవ ఇంటర్నేషనల్‌ను చీల్చినవారు.

ప్రపంచ కార్మికోద్యమానికి రెండు ప్రత్యామ్నాయాలు ఎదురయ్యాయి. చారిత్రకంగా అవసరమైన విప్లవ లక్ష్యాలను విసర్జించి, బూర్జువావర్గంతో రాజీపడటమా లేక సోషల్ జాతీయ దురహంకార వాదులతో ఖచ్చితంగా తెగతెంపులుచేసుకుని, నూతన విప్లవ అంతర్జాతీయ సంస్థను, కార్మికవర్గ మహానాయకులైన కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్సులు అందజేసిన అంతర్జాతీయతా సంప్రదాయాలను కొనసాగిస్తూ, కార్మికుల వర్గ ప్రయోజనాలను కాపాడే సంస్థను ఏర్పరచటమూ?

రెండవ ఇంటర్నేషనల్ విచ్ఛిన్నమై, మార్క్సిజానికి కార్మికవర్గ విమోచన లక్ష్యానికి అంతర్జాతీయ కార్మికవర్గ సౌహార్దతకు అది ద్రోహం చేయడంతో నూతన విప్లవ ఇంటర్నేషనల్ ఏర్పరచే తక్షణ సమస్య విప్లవకర మార్క్సిస్టులను ఎదుర్కొన్నది.

ఒక కొత్త తరహా అంతర్జాతీయ కార్మికవర్గ సంస్థను ఏర్పరచటానికి పరిస్థితులు అప్పటికి పరిపక్వమయ్యాయి. సామ్రాజ్యవాద వైరుధ్యాలు తీవ్రతరమైనందున, కార్మికవర్గ వర్గపోరాటం అభివృద్ధి చెందినందున బలీయమైన ఇట్టి వస్తుగత, ఆత్మగత పరిస్థితులు ఏర్పడ్డాయి. పెట్టుబడిదారీ సాధారణ సంక్షోభం, కార్మికవర్గ విప్లవాలకు సంబంధించిన దశ ఆరంభం కావటం ఒక నిర్ణయాత్మక అంశంగా వుండింది. సోషలిస్టు విప్లవాలకు ప్రవేశిక సామ్రాజ్యవాదమని, సామ్రాజ్యవాద దేశాల ఆర్థిక, రాజకీయ అభివృద్ధిలోని అసమానతలు, గంతులు వేస్తూ ముందుకు సాగటం, పెట్టుబడిదారీ విధానంలోని మౌలిక వైరుధ్యాలను తీవ్రతరం చేస్తున్నదని, లెనిన్ ఎట్టి సందేహానికి వీలులేని విధంగా నిరూపించాడు. కనుక బలీయమైన ప్రజా విప్లవోద్యమాలు వచ్చి తీరుతాయి, సామ్రాజ్యవాదుల ప్రపంచవ్యాపిత గొలుసులో బలహీనమైన లింకులు ఏర్పడతాయి, కార్మికవర్గ విప్లవాలు ఆ లింకులను ఛేదించే అవకాశాలు ఏర్పడి తీరుతాయి. సంకుల వర్గపోరాటాలకు, విప్లవకర తిరుగుబాట్లకు, ప్రపంచం సన్నిహితమౌతున్నదనే నిర్ణయానికి లెనిన్ వచ్చాడు.

సోషలిస్టు విప్లవాలు సన్నిహితం కావటం, విప్లవ పోరాటాలకు

నాయకత్వం సమకూర్చవలసిన తక్షణ ఆవశ్యకత, ఇవి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కార్మిక విప్లవకారులందరినీ ఐక్యంచేసే సమరశీల సంస్థను ఏర్పరచటాన్ని తప్పనిసరిచేశాయి. నూతన యుగంలోని వర్గపోరాటం యొక్క ముఖ్య అవసరాల దృష్ట్యా ఈ కర్తవ్యం రూపొందింది. ఈ కర్తవ్యం మరింత ప్రాధాన్యం వహించటానికి ఒక కారణముంది. అదేమంటే వివిధ దేశాలలో మార్క్సిస్టు విప్లవ గ్రూపులున్నప్పటికీ, రష్యాలోని బోల్షివిక్ పార్టీ మినహా, ప్రజలను విప్లవ పోరాటాలలో నడిపించగల విప్లవ మార్క్సిస్టు పార్టీలు ఏ దేశంలోనూ లేకపోవటం.

లెనిన్ ఇలా రాసాడు: "పెట్టుబడిదారీ ప్రభుత్వాలమీద విప్లవ దాడికీ, రాజకీయాధికారం కైవసం చేసుకోడానికి సకల దేశాల బూర్జువావర్గంతోనూ అంతర్యుద్ధానికీ, సోషలిజం యొక్క దిగ్విజయానికీ కార్మికవర్గ బలాలను సమీకరించే కర్తవ్యం మూడవ ఇంటర్నేషనల్ మీద పడుతున్నది!"

లెనిన్, బోల్షివిక్కులు రూపొందించిన కమ్యూనిస్టు ఉద్యమ సైద్ధాంతిక, ఎత్తుగడల, నిర్మాణ సూత్రాలలో ఒక నూతన అంతర్జాతీయ విప్లవ కార్మిక సంస్థ నిర్మాణానికి అవసరమైన అతి ముఖ్యమైన పూర్వరంగం ఏర్పడి ఉంది. వివిధ ధోరణులకు చెందిన అవకాశవాదులకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో లెనిన్ మార్క్సిజం బోధనలను విస్తృతం చేశాడు. రష్యాలోను, ప్రపంచవ్యాపితంగాను జరిగిన విప్లవ కార్మికవర్గ పోరాట అనుభవాల దృష్ట్యా, లెనిన్ నూతన నిర్ధారణలతో మార్క్సిజాన్ని పరిపుష్టం చేశాడు. "సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అత్యున్నత దశ," "యూరప్ సంయుక్త రాష్ట్రాల నినాదం," "కార్మికవర్గ విప్లవం యొక్క సైనిక కార్యక్రమం" అనే రచనలలోను, జాతీయ, గ్రామీణ సమస్యలపై తన వ్యాసాలలోను, ఇంకా అనేక ఇతర రచనలలోను, లెనిన్ సామ్రాజ్యవాద యుగానికి వర్తించే వర్గపోరాటానికీ, సోషలిస్టు విప్లవానికీ సంబంధించిన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశాడు. సామ్రాజ్యవాద వైరుధ్యాలను గురించి లోతైన శాస్త్రీయ అవగాహన ప్రాతిపదికపై లెనిన్ ప్రారంభంలో పెక్కు లేక ఒకేఒక దేశంలో సోషలిస్టు విప్లవ విజయం సాధ్యమేననే నిర్ధారణకి వచ్చాడు. 1915లో మొట్ట మొదటి సారిగా రూపొందించబడిన ఈ నిర్ధారణ, మార్క్సిస్టు విజ్ఞానంలో ప్రతిభావంతమైన ఆవిష్కరణ. అంతర్జాతీయ కార్మికవర్గ పురోగతికి ఇది నూతన అవకాశాలను సృష్టించింది, వివిధ దేశాలలోని కార్మిక వర్గాల చొరవకు పూర్తి స్వేచ్ఛ నిచ్చింది.

మౌలిక స్వభావం గల అనేక సూత్రీకరణలు లెనిన్ చేశాడు. కార్మికవర్గం, రైతాంగాల మధ్య దృఢమైన ఐక్యత అవసరమని నిరూపించాడు. విప్లవ పోరాటంలో ప్రజాతంత్ర కోర్కెల ప్రాధాన్యం, ప్రజాతంత్ర విప్లవం సోషలిస్టు విప్లవంగా అభివృద్ధిచెందే లక్షణం, సోషలిస్టు విప్లవాన్ని జాతీయ వలస ఉద్యమంతో సమన్వయం చేయటం, మొదలైన మౌలిక సూత్రీకరణలు చేశాడు. అభివృద్ధిచెందిన దేశాలలో బూర్జువావర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గం సాగించే విప్లవపోరాటం పీడిత దేశాలలో జాతీయ విమోచనకై సాగే పెక్కు ప్రజాతంత్ర, విప్లవోద్యమాలతో చేతులు కలుపుతుందని లెనిన్ తెలియజేశాడు. యుద్ధం, రాజ్యాంగయంత్రం, కార్మికవర్గ పార్టీ, దాని పాత్రను గురించిన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని కూడా లెనిన్ అభివృద్ధి చేశాడు.

లెనిన్, బోల్షివిక్ పార్టీ చేసిన సిద్ధాంత సూత్రీకరణలు అతి జటిలమైన, వేర్వేరు పరిస్థితులలో సాగిన వర్గపోరాటాల పరీక్షలో రాటుదేలి, పరిపుష్టం అయ్యాయి. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ యొక్క సైద్ధాంతిక, రాజకీయ నిర్మాణవేదికకు ప్రధాన ఉ పాంగాలయ్యాయి, ఆ సంస్థ వ్యూహము, ఎత్తుగడలకు పునాది అయ్యాయి.

వెన్వెంటనే పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికులలో అగ్రగాములు నూతన విప్లవ నిర్దేశక సూత్రాల ఆవశ్యకతను బాగా గ్రహించారు. సోషల్ జాతీయ దురహంకారవాదుల, సెంట్రిస్టుల విధానం ఎట్టి హానికరమైన దుష్ఫలితాలను కలిగించిందో వారు గ్రహించారు. ఈ కార్మికుల దీక్షను, కృషిని, విప్లవ అంతర్జాతీయవాద పార్టీలు, గ్రూపులు వ్యక్తంచేశాయి.

విప్లవ అంతర్జాతీయవాదుల ధోరణిలో ఈ క్రిందివారున్నారు. లెనిన్ నాయకత్వాన రష్యన్ బోల్షివిక్కులు, డి. బ్లగోయెవ్, జి. కీర్కొవ్, వి. కొలారొవ్‌ల నాయకత్వాన బల్గేరియాకు చెందిన తెస్న్యాకీ, కె. లీబ్‌క్నెఖ్ట్, ఆర్. లుక్సెంబుర్గ్, యఫ్. మేరింగ్ జర్మనీకు చెందిన వామపక్షీయులు, సెర్బియన్ సోషలిస్టులు యఫ్. ఫిలీపొవిచ్, డి. పొపోవిచ్, టి. కత్స్‌లెరోవిచ్, పోలిష్ వామపక్ష సోషల్ డెమోక్రట్లు వై. గానెత్స్కీ, ఎ. వార్స్కీ, లెట్టిష్ సోషల్ డెమోక్రట్లు వై. బేర్జిన్, డచ్ ట్రిబ్యునిస్టులు ఎ. పన్నెకుక్, డి. వైన్‌కూప్, స్వీడెన్, నార్వే, ఇటలీ, ఆస్ట్రో-హంగరీ, ఫ్రాన్సు, బ్రిటన్, యు.యస్.ఎ., ఆర్జెంటీనా, డెన్మార్క్, స్విట్జర్లెండ్, తదితర దేశాలకు చెందిన వామపక్ష సోషలిస్టులు. లెనినిజం దృష్ట్యా, పాశ్యాత్య దేశాలకు చెందిన వామపక్ష సోషలిస్టుల వైఖరి తగినంత దృఢమైనది, ఖచ్చితమైనది కాదు. ఐతే తమ దేశంలోని జాతీయ దురహంకారవాదాన్ని ఎదిరించాలి అనే ప్రధాన కర్తవ్యాన్ని వారు గ్రహించారు, నిస్వార్థ దీక్షతో ఆ కర్తవ్యాన్ని నెరవేర్చారు.

తమ తమ బూర్జువావర్గంతోను, సోషల్ జాతీయ దురహంకారవాదులతోను పోరాటం జరిపిన విప్లవ అంతర్జాతీయవాద పార్టీలు, గ్రూపులు కార్మికోద్యమంలో ఏర్పడటం కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏర్పడటానికి మరొక ముఖ్యమైన తొలి షరతు.

నూతన విప్లవ ఇంటర్నేషనల్ ఏర్పడటానికి పరిపక్వమౌతున్న పరిస్థితులను లెనిన్, బోల్షివిక్కులు, శ్రద్ధగా గమనించారు. అంతర్జాతీయ కార్మికోద్యమంలోని వామపక్షానికి చెందిన,

నిజాయితీగా అంతర్జాతీయ ధోరణి కలిగిన శక్తులను సమీకరించటానికి గట్టిగా పోరాడారు. యుద్ధం ప్రారంభమైన వెంటనే, సామ్రాజ్యవాదుల హత్యాకాండకు వ్యతిరేకంగా పోరాటం అనే నినాదం క్రింద, ఇందుకుగాను నిర్దిష్టమైన చర్యలు తీసుకోబడ్డాయి. సంఘటితమైన ఐక్య సంఘటన రూపంలో బోల్షివిక్ పార్టీ ప్రపంచ సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడింది. సోషలిజం, కార్మిక అంతర్జాతీయతా లక్ష్యాలకై, సాహసం, పట్టుదల, దీక్షలతో కూడిన పోరాటానికిది తార్కాణం. అవకాశవాదానికి వ్యతిరేకంగా దీర్ఘకాలం నిర్విరామ పోరాటం జరిపిన కారణంగా బోల్షివిక్కులు, తమ నెదురుక్కున్న చారిత్రక కర్తవ్యాన్ని నెరవేర్చగల సమర్థులుగా, పరీక్షాసమయంలో రుజువుచేసుకున్నారు. 1914 నవంబరు 1వ తేదీన, ఆర్.యస్.డి.యల్.పి. కేంద్ర కమిటీ విధాన ప్రకటన స్విట్జర్లెండులో ప్రచురితమైంది. "యుద్ధం, రష్యన్ సోషల్ డెమోక్రసీ'' అనే పేరుతో ఈ కరపత్రాన్ని లెనిన్ వ్రాశాడు. సామ్రాజ్యవాదము, యుద్ధము, అవకాశవాదాలకు వ్యతిరేకంగా, ఈ పత్రం సమగ్రమయిన విప్లవ పోరాట కార్యక్రమాన్ని రూపొందించింది. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలనే కేంద్ర నినాదాన్ని బోల్షివిక్ పార్టీ ప్రతిపాదించింది. ఈ నినాదం పారిస్ కమ్యూన్ అనుభవంపై ఆధారపడి రూపొందించబడ్డది. 1912లో రెండవ ఇంటర్నేషనల్ బాసెల్ కాంగ్రెసులో ఆమోదించిన విధాన ప్రకటనకిది విస్తరణ. తమ తమ బూర్జువావర్గాలతో ''అంతశ్శాంతి'' అను సోషల్ జాతీయ దురహంకార నినాదాన్ని ఇది సూటిగా వ్యతిరేకించింది.

రష్యన్, విదేశీ అవకాశవాదులు ఉభయులు లెనిన్ నినాదాన్ని కక్షతో కూడిన శత్రుత్వంతో ఎదుర్కొన్నారు. "ప్రపంచ యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చటం ఉన్మాదం అవుతుంది." అని జర్మన్ సోషల్ జాతీయ దురహంకారవాది ఎడువార్డ్ డేవిడ్ బోల్షివిక్కులతో ఘర్షణపడుతూ వ్రాశాడు. "ఆచరణలో ఒకే ఒక సమస్య ఉంది: నీ దేశం ఓడిపోవటమా లేక గెలవటమా" అని సోషల్ జాతీయ దురహంకారవాదులకు వంత పాడుతూ కౌట్స్కీ వ్రాశాడు.

"నిజమే, సోషలిజాన్ని, వర్గపోరాటాన్ని మరచిపోతే, అదే నిజం" అని వ్రాస్తూ లెనిన్ ఇంకా ఇలా అన్నాడు: "అయితే, సోషలిజాన్ని దృష్టిలో పెట్టుకుంటే పై సమాధానం అబద్ధమౌతుంది. మరొక ఆచరణ సమస్య కూడా ఉంది. బానిస యజమానుల యుద్ధంలో బానిసల వలె మనం కళ్లు మూసుకుని చచ్చిపోవలసిందేనా లేక బానిస వ్యవస్థను కూలద్రోసే యత్నంలో బానిసల మధ్య 'సౌహార్దత నెలకొల్పే ప్రయత్నం'లో మనం మరణించవలెనా?

"ఇది నిజానికి 'ఆచరణ' సమస్య."

''యుద్ధకాలంలో–శాంతికై పోరాటం, శాంతి కాలంలో–వర్గపోరాటం" అని కౌట్స్కీ ప్రకటించాడు. జర్మనీలోని వామపక్షమూ, బోల్షివిక్కులూ, ఉభయలూ ఈ వాదనను నిశితంగా ఖండించారు. రోజా లుక్సెంబుర్గ్ ఎంతో వ్యంగ్యంగా ఇలా వ్రాసింది–కౌట్స్కీ దయవల్ల, కమ్యూనిస్టు ప్రణాళిక ఇచ్చిన చరిత్రాత్మక విజ్ఞప్తికి ఒక ముఖ్యమైన సవరణ జత అయింది. ఆ విజ్ఞప్తి ఇక ఇలా ఉంటుంది: ''ప్రపంచ దేశాలలోని కార్మికులారా, శాంతి కాలంలో మీరంతా ఐక్యంకండి, యుద్ధకాలంలో ఒకరి గొంతులు ఒకరు నరుక్కోండి."

సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చండి అనే నినాదంలో నుండి మరొక రాజకీయ నినాదం ఆవిర్భవించింది: సామ్రాజ్యవాద యుద్ధంలో ఎవరి ప్రభుత్వాన్ని ఓడించటానికి వారే కృషి చేయటం. ''పితృదేశ రక్షణ'' అని సోషల్ జాతీయ దురహంకారవాదులిచ్చిన నినాదానికి వ్యతిరేక మైనది. యుద్ధంలో పాల్గొంటున్న అన్ని దేశాలకు ఇది వర్తిస్తుంది.

"విజయమూ వద్దు, అపజయమూ వద్దు" అనే నినాదాన్ని సెంట్రిస్టులు ప్రచారంలో పెట్టారు. "పితృదేశ రక్షణ" అను జాతీయ దురహంకార వైఖరినుండి, ఈ నినాదం పైకి మాత్రమే విభేదిస్తున్నది. నిజానికి పై నినాదానికిది ఒక రూపాంతరం మాత్రమే. "విజయమూ వద్దు, అపజయమూ వద్దు" అని నినాదం ఇచ్చినవారు ఆచరణలో బూర్జువావర్గంతోను, సోషల్ జాతీయ దురహంకారుల పక్షాన, చేరినట్లే అయింది. ఏమంటే వారి వారి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం విప్లవకార్యాచరణ చేయగలదనే నమ్మకం వీరికి లేదు, అలాంటి కార్యాచరణకు ప్రోత్సహించడానికి వీరికి ఇష్టమూ లేదు. "విజయమూ వద్దు, అపజయమూ వద్దు' అనే నినాదానికి ఎవరైతే అనుకూలురోవారు తెలిసో, తెలియకో జాతీయ దురహంకారవాదులే, మహా అయితే వారు రాజీ ధోరణిలో ప్రవర్తించే పెటీబూర్జువాలు కావచ్చు. కాని ఎట్టి సందర్భములో కూడా వారు కార్మికవర్గ విధానానికి శత్రువులు, అప్పటికున్న ప్రభుత్వాలలో పరిపాలక వర్గాలలో వారు భాగస్వాములు" అని లెనిన్ వ్రాశాడు.

వివిధ దేశాలలోని సెంట్రిస్టులు ప్రకటించిన శాంతివాదుల శాంతి విజ్ఞప్తిని బహిర్గతం చేయటానికి కూడా లెనిన్ ఎంతో శ్రమ తీసుకున్నాడు.

శాంతిద్వారా ఏ ప్రయోజనాలు వస్తాయని తాము అనుకుంటున్నారో అవి సోషలిస్టు విప్లవం లేకుండా రాబోవని ప్రజలకు బోల్షివిక్కులు వివరించారు. "యుద్ధాలకు ముగింపు, జాతుల మధ్య శాంతి, దోపిడీ, దౌర్జన్యాలకు అంతం–ఇది మన ఆదర్శం" అని వ్రాస్తూ లెనిన్ ఇంకా అన్నాడు: "తక్షణ, ప్రత్యక్ష విప్లవ కార్యాచరణకు పిలుపునుండి ఈ నినాదాన్ని వేరు జేసి, బూర్జువా వితండవాదులు మాత్రమే ప్రజలను మోసం చేయగలరు."

లెనిన్ ప్రణాళికలో మొట్ట మొదటి సారిగా నూతన, మూడవ ఇంటర్నేషనల్‌ను ఏర్పరచాలి అనే నినాదం ఇవ్వబడ్డది.'కార్మికవర్గ ఇంటర్నేషనల్ మన్ను కరవలేదు, మన్ను కరవబోదు. యెన్ని

అడ్డంకులు వున్నప్పటికీ, కార్మిక జనులు కొత్త ఇంటర్నేషనల్‌ను సృష్టిస్తారు. అవకాశవాదం నుండి విముక్తి చెంది, కార్మికవర్గ ఇంటర్నేషనల్ వర్ధిల్లాలి!" అని లెనిన్ రాసాడు.

## III

### త్సిమ్మర్‌వాల్డ్ ఉద్యమం

యుద్ధం సృష్టించిన సంక్షోభం మొదట్లో కార్మికులలో గొప్ప గందరగోళాన్ని కలిగించింది. చాలా దేశాలలో కార్మికులు సోషల్ జాతీయ దురహంకారవాదుల మార్గాన్నే అనుసరించారు. ఒకే పార్టీలో ఉన్న విప్లవకారులు, అవకాశవాదుల మధ్య ఏర్పడిన బూటకపు ఐక్యతతో వీరు మోసపోయారు. లేక బూర్జువావర్గం రగిల్చిన జాతీయ దురహంకార జ్వాలకు కొంత వరకు వారు కూడా లొంగిపోయారు. 1915 ప్రారంభంలో గాని, పాత సోషల్ డెమోక్రటిక్ పార్టీలలో క్రమంగా విభేదాలు వ్యక్తం కాలేదు. కార్మిక ప్రజానీకం, సోషల్ జాతీయ దురహంకార వైఖరుల నుండి, నాయకుల నుండి క్రమంగా వామపక్షానికి మొగ్గుచూపసాగారు. విప్లవకర భావాలు వైఖరులకు, విప్లవకర నాయకులకై వీరు కదలసాగారు.

యుద్ధ బీభత్సాలు, హత్యాకాండ, కరువు, సర్వనాశనం, వీటన్నిటి ఫలితంగా, ప్రజలు బాధలు, పడడమే కాక, వారు ధైర్యం పుంజుకున్నారు. దీక్ష పెంచుకున్నారు, యుద్ధానికి మూలకారణాలను గురించి ఆలోచించసాగారు. క్రమంగా ఘటనలను గురించిన స్పష్టమైన విప్లవకర అవగాహనకు రాసాగారు. ప్రజలలో వచ్చిన బలీయమైన ఈ వామపక్ష మొగ్గుకు స్పష్టమైన వ్యక్తీకరణ కార్మికుల యుద్ధవ్యతిరేక ఉద్యమం. 1915 ఆకురాలు కాలంలో, త్సిమ్మర్‌వాల్డ్ (స్విట్జర్లెండ్)లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు కాన్ఫరెన్సులో ఇది సైద్ధాంతికంగా, నిర్మాణాత్మకంగా రూపు ధరించింది. కనుకనే దానికి త్సిమ్మర్‌వాల్డ్ ఉద్యమం అని పేరువచ్చింది.

1915 సెప్టెంబరు 5-8 తేదీలలో త్సిమ్మర్‌వాల్డ్ కాన్ఫరెన్సు జరిగింది. 12 యూరపియన్ దేశాల నుండి 37 గురు ప్రతినిధులు (జర్మనీ, ఫ్రాన్సు, ఇటలీ, రష్యా, పోలండ్, లాత్వియా, బల్గేరియా, రుమేనియా, స్విట్జర్లెండ్, నెదర్లెండ్స్, నార్వే, స్వీడెన్), ఒక పరిశీలకుడు హాజరయ్యారు.

ఈ కాన్ఫరెన్సులోని ప్రతినిధులు వేర్వేరు రాజకీయ అభిప్రాయాలను కలిగి ఉన్నారు. ఏడు దేశాలనుండి హాజరైన 8 మంది ప్రతినిధులు మాత్రమే ఖచ్చితమైన విప్లవకర, అంతర్జాతీయతా వైఖరి తీసుకున్నారు. కాన్ఫరెన్సులో ఈ ప్రతినిధులు త్సిమ్మర్ వాల్డ్ వామపక్ష గ్రూపుగా ఐక్యమయ్యారు. ఈ గ్రూపు తన స్వంత ముసాయిదా తీర్మానాన్ని, ప్రణాళికను ప్రవేశపెట్టడం ద్వారా సైద్ధాంతిక రూపం ధరించింది. లెనిన్ నాయకత్వాన ఒక బ్యూరోను ఎన్నుకోవటంతో అది నిర్మాణరూపం కూడా స్వీకరించింది. ఈ బ్యూరోలోని ఇతర సభ్యులు జినోవ్‌యెవ్ (ఆర్.యస్.డి.యల్.పి. కేంద్ర కమిటీ తరపున), రాడెక్ (పోలిష్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ కార్యవర్గం తరపున). వామపక్ష త్సిమ్మర్ వాల్డ్ గ్రూపులో బోల్షివిక్కులు, పోలిష్ రోజ్లామిస్టు (సోషల్ డెమోక్రటిక్ ప్రతిపక్ష పార్టీ ప్రతినిధులు), లెట్టిష్ సోషల్ డెమోక్రట్లు, స్వీడెన్, నార్వే, స్విట్జర్లెండ్, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలలోని వామపక్ష శక్తులు ఉన్నాయి. ఆపిమ్మట నెదర్లెండ్స్, సెర్బియా, ఫ్రాన్సు, బల్గేరియా, ఆస్ట్రియా, అమెరికాల వామపక్ష సోషలిస్టులు కూడా చేరారు. త్సిమ్మర్‌వాల్డ్ వామపక్ష గ్రూపులో ఈ విధంగా విప్లవకర అంతర్జాతీయవాదులు చేరటం కాన్ఫరెన్సు సాధించిన ప్రధాన విజయం అని లెనిన్ భావించాడు.

మిగిలిన 29 మంది ప్రతినిధులు, కాన్ఫరెన్సులోని మితవాద గ్రూపుగా ఏర్పడ్డారు. వీరిని త్సిమ్మర్ వాల్డ్ మెజారిటీ అన్నారు. సెంటిస్టు వైఖరి తీసుకున్న కౌట్స్కీ అనుయాయులు దానికి ఒరవడి పెట్టారు. విప్లవ ఎత్తుగడలకు, సంస్కరణవాద ఎత్తుగడలకు మధ్య ఊగిసలాడిన శాంతివాదులు, కొంతమంది అస్థిరమైన వైఖరిగల అంతర్జాతీయవాదులు త్సిమ్మర్‌వాల్డ్ మితవాద గ్రూపులో ఉన్నారు. సామ్రాజ్యవాదానికి, యుద్ధానికి వ్యతిరేకంగా జయప్రదమైన పోరాటం నడపాలంటే సోషల్ జాతీయ దురహంకార ధోరణితో పూర్తి తెగతెంపులు చేసుకోవాలి అనే అంశాన్ని చూడ నిరాకరించటం, లేక గుర్తించలేక పోవటం వీరందరికీ సామాన్య లక్షణం.

శాంతి కొరకు కార్మికవర్గ కార్యాచరణ అనే సమస్య త్సిమ్మర్‌వాల్డ్ కాన్ఫరెన్సులో ప్రధాన చర్చనీయాంశం. సోషలిస్టు సమాజాన్ని నిర్మించేందుకై, రాజకీయాధికారాన్ని స్వీకరించటానికి పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా విప్లవపోరాటం చేయాలని కార్మిక ప్రజలకు బహిరంగంగా పిలుపునిచ్చి, వారికి నాయకత్వం వహించటం ఒక్కటే సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతం చేయటానికి ఏకైక మార్గం అని త్సిమ్మర్‌వాల్డ్ వామపక్ష గ్రూపు తమ పత్రాలలో తెలియజేసింది. ఇందుకు విరుద్ధంగా, కౌట్స్కీస్టులు, వారి అనుయాయులు, విప్లవకర సమయం ఆసన్నం కాలేదని, విప్లవకర నినాదాలివ్వటం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కార్మికవర్గం యొక్క నిర్దిష్ట ఎత్తుగడలను నిర్ణయించడం తొందరపాటు అవుతుందని వాదించారు. వారి దృష్టిలో కాన్ఫరెన్సు శాంతికై సాధారణ విజ్ఞప్తిని తొందరపాటు అవుతుందని వాదించారు. వారి దృష్టిలో కాన్ఫరెన్సు శాంతికై సాధారణ విజ్ఞప్తిని చేయటానికి మాత్రమే పరిమితం కావాలి. ఏ పరిస్థితులలోను, పాత ఇంటర్నేషనల్‌కు పోటీగా కొత్త సంస్థను ఏర్పరచే బాధ్యత తలపెట్టనే కూడదు.

ఆ నాటి కీలక సమస్యను కార్మికులు ఎదుర్కోకుండా, కాట్స్కీస్టులు ఏ విధంగా శాంతివాద పదజాలంతో ఆటంక పరచటానికి ప్రయత్నిస్తున్నదీ సమవేశ చర్చలలో పాల్గొంటూ లెనిన్ బహిర్గతం చేయసాగాడు. ప్రపంచ సామ్రాజ్యవాద యుద్ధ పరిస్థితులలో

కార్మికవర్గ విప్లవంతో ప్రమేయం లేకుండా శాంతిని గురించి మాట్లాడటమే అసంభవమని లెనిన్ తెలియజేశాడు. ప్రపంచ యుద్ధం యూరప్‌లో విప్లవకర పరిస్థితిని సృష్టించింది. కనుక కాన్ఫరెన్సు తప్పనిసరిగా, విధిగా ఈ క్రింది కర్తవ్యాన్ని నిర్వర్తించాలి: "విప్లవ అవసరాన్ని కార్మికులకు వివరించాలి, అందుకు పిలుపు యిచ్చి అవసరమైన నిర్మాణాన్ని సృష్టించాలి, బలప్రయోగంతో కూడిన పోరాటం యొక్క వేర్వేరు పద్ధతులను గురించి దాని 'సంవిధానాన్ని' గురించి అత్యంత నిర్దిష్టంగా, నిర్భయంగా మాట్లాడాలి." అని లెనిన్ అన్నాడు.

వామపక్షం ప్రతిపాదించిన సూత్రబద్ధమైన తీర్మానాన్ని 19-12 వోట్లతో, త్సిమ్మర్‌వాల్డ్ కాన్ఫరెన్సు త్రోసిపుచ్చింది. పోరాట లక్ష్యాలను, పద్ధతులను నిర్దిష్టంగా పేర్కొనని ఒక ప్రకటనను ఆమోదించింది. యుద్ధ బాధితులపట్ల సౌహార్దత వెలిబుచ్చే తీర్మానాన్ని కూడా కాన్ఫరెన్సు ఆమోదించింది. డ్యూమలో బోల్షివిక్కుల ఉదాహరణను, శాంతి సోషలిజాల కొరకు విప్లవ పోరాటాలు జరుపుతున్న లీబ్‌క్నెఖ్ట్, తదితర విప్లవకర యోధుల ఉదాహరణ సోషలిస్టులు అనుసరించవలసిందిగా మరొక తీర్మానాన్ని ఆమోదించింది. అంతర్జాతీయ సోషలిస్టు కమిషన్ పేరుతో ఒక పరిపాలక సంస్థను కాన్ఫరెన్సు ఎన్నుకున్నది. గ్రిమ్, నాన్, మోర్గారి, బలబానొవాలు ఇందులో సభ్యులు.

అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోని వామపక్షం దృష్ట్యా త్సిమ్మర్‌వాల్డ్ నిర్ణయాల ప్రాధాన్యత వివరిస్తూ లెనిన్ ఇలా రాసాడు: ఈ కాన్ఫరెన్సు "మూడవ ఇంటర్నేషనల్‌కు తొలి మెట్టు, అవకాశవాదంతో చీలికవైపు అయిష్టమైన, అస్థిరమైన అడుగు. 'జబ్బుతిరగబెట్టే' అవకాశం లేకపోలేదు."

త్సిమ్మర్‌వాల్డ్ కాన్ఫరెన్సులో ఆమోదించబడిన ప్రణాళిక ప్రపంచ యుద్ధాన్ని స్పష్టంగా సామ్రాజ్యవాద యుద్ధం అని వివరించింది. ఈ యుద్ధంలో "పితృదేశ రక్షణ" నినాదం, బూర్జువా వర్గం ప్రచారం చేసే మోసమని ఖండించింది. వామపక్షవాదుల కృషి ఫలితంగా, ప్రణాళిక ఈ క్రింది భావాన్ని వ్యక్తీకరించింది.-విప్లవపోరాటం లేని శాంతి అర్థ రహితము, మోసపూరితము ఐన మాట మాత్రమే. సోషలిజం కొరకు జరిగే విప్లవపోరాటం ద్వారా మాత్రమే యుద్ధబీభత్సం నుండి నిజమైన విముక్తి లభిస్తుంది.

రెండవ ఇంటర్నేషనల్ యొక్క, స్టట్‌గార్ట్, కోపెన్‌హాగెన్, బాస్లె కాంగ్రెసుల నిర్ణయాల ద్వారా సంక్రమించిన బాధ్యతలను సోషలిస్టుపార్టీలలో అధికసంఖ్య ఉల్లంఘించినవని ప్రణాళిక స్పష్టం చేసింది. అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరో కూడా తన విధి నిర్వహణలో విఫలమైందని తెలియజేసింది. అయితే ఇందుకు కారణమేమిటో మాత్రం, ప్రణాళిక వివరించలేదు. అదేదో యాదృచ్ఛికమని, వ్యక్తుల పొరపాటువల్ల జరిగిందని అర్థం వచ్చే విధంగా వదలివేసింది. "పితృదేశ రక్షణ" అనే బూటకపు నినాదాన్ని బూర్జువావర్గంవలెనే, రెండవ ఇంటర్నేషనల్ నాయకులు కూడా ప్రచారం చేశారనే అంశాన్ని ప్రస్తావించలేదు.

త్సిమ్మర్‌వాల్డ్ ప్రణాళికలోని అస్థిరత్వాన్నీ, అరకొరగా చెప్పిన పద్ధతిని లెనిన్ విమర్శించినప్పటికీ, ఆ పత్రంపైన సంతకం పెట్టడం అవసరమని భావించాడు. అవకాశవాదంతో సిద్ధాంత రీత్యానూ, ఆచరణలోనూ తెగతెంపులు చేసుకొనటానికి మొదటి చర్యగా ఈ పత్రాన్ని లెనిన్ గుర్తించాడు.

త్సిమ్మర్‌వాల్డ్ ఐక్యతకు త్సిమ్మర్‌వాల్డ్ కాన్ఫరెన్సు ప్రారంభం చేసింది. సోషల్ జాతీయ దురహంకారవాదులకు వ్యతిరేకంగా, విప్లవకర అంతర్జాతీయవాదులు కౌట్స్కీస్టులతో సహా ఊగిసలాడే శక్తులతో ఒక రాజకీయ బ్లాక్ ఏర్పడ్డది. సామ్రాజ్యవాద యుద్ధ వ్యతిరేకులందరినీ ఈ రాజీ ఐక్యం చేసింది. అంతర్జాతీయవాదుల బలం మరింతగా పెరగటానికి ఇది ప్రోత్సాహమిచ్చింది. సోషల్ జాతీయ దురహంకారవాదులతో తెగతెంపులు చేసుకోవటం లాంటి ముఖ్య సమస్యను తన పత్రాలలో త్సిమ్మర్‌వాల్డ్ కాన్ఫరెన్సు లాంఛనప్రాయంగా ప్రస్తావన కూడా చేయకపోయినప్పటికీ, సోషల్ డెమోక్రటిక్ పార్టీల అధికార నాయకత్వం నిర్ణయాలకు విరుద్ధంగా యుద్ధానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సోషలిస్టు కాన్ఫరెన్సు జరగటమే, అన్ని దేశాలలోని సోషల్ జాతీయ దురహంకారవాదులకు పెద్దదెబ్బ. త్సిమ్మర్‌వాల్డ్ నిర్ణయాల దృష్ట్యా జరిగిన కార్యాచరణ అవకాశవాద నాయకుల నుండి విప్లవ కార్మికులను వేరుచేసింది. అంటే దీని అర్థం ఆయా దేశాల జాతీయ బూర్జువావర్గం నుండి కార్మికవర్గం వేరుపడటమే. పెట్టుబడిదారీ విధానాన్ని విప్లవకరంగా కూలద్రోసేందుకు కార్మికవర్గం మధ్య అంతర్జాతీయ ఐక్యత పునః స్థాపించటమే. సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా కార్మిక ప్రజల తొలి అసమ్మతిని, అర్ధచైతన్యంతో కూడుకున్న అసమ్మతి కావచ్చు, త్సిమ్మర్‌వాల్డ్ కాన్ఫరెన్సు నమోదు చేసింది. అదే సమయంలో యుద్ధము, శాంతికి సంబంధించిన అతి ప్రధానమైన సమస్యలను అది ప్రస్తావించింది. ఆలోచనకు కావలసినంత ఆహారాన్నిచ్చింది. సైనిక నియంతృత్వాలచే అణచివేయబడి, జాతీయ దురహంకార ప్రచారం ద్వారా దిగ్భ్రాంతి చెంది ఉన్న కార్మికులకు వర్గచైతన్యానికి ఒక ఊపు ఇచ్చింది.

యూరప్, అమెరికా, దక్షిణాఫ్రికాలలోని విప్లవదృష్టి కలిగిన కార్మికులు, త్సిమ్మర్‌వాల్డ్ కాన్ఫరెన్సు నిర్ణయాలతో ఎంతో ఉత్సాహం పొందారు. త్సిమ్మర్‌వాల్డ్ ప్రణాళికను చదివినమీదట తానెంత సంతోషం పొందిందీ, ఫోస్సానో పట్టణంలోని స్థానిక సోషలిస్టు శాఖ కార్యదర్శి, ఆ తర్వాత ప్రముఖ ఇటాలియన్ కమ్యూనిస్టు ఐన జెర్మనేట్టో, ఇలా వర్ణించాడు: "కనుక, పని కొనసాగుతూ వుంది! సంబంధాలు తిరిగి ఏర్పడుతున్నాయి. నాయకుల విద్రోహం కార్మికుల సంఘీభావాన్ని చంపలేక పోయింది. నాకు అత్యంత సంతోషంగా ఉంది!" కొడొవిల్లా, గియోల్డి నాయకత్వాన విప్లవ

మార్క్సిస్టు గ్రూపు సాగించిన కార్యాచరణ ఫలితంగా, అర్జెంటీనా కార్మికులు, త్సిమ్మర్‌వాల్డ్ ప్రణాళికను గురించి తెలుసుకున్నారు. వివిధ దేశాలలోని కార్మికులకు, ఈ ప్రణాళిక కార్యాచరణకై పోరాట పిలుపుగా ఉపకరించింది. త్సిమ్మర్‌వాల్డ్ అనే మాట కార్మికవర్గ అంతర్జాతీయత పునరుజ్జీవనానికి చిహ్నమైంది.

త్సిమ్మర్‌వాల్డ్ ప్రణాళికతోపాటు త్సిమ్మర్‌వాల్డ్ వామపక్షవాదుల పత్రాలు, రష్యన్, జర్మన్, ఫ్రెంచి, ఇంగ్లీషు, ఇటాలియన్, పోలిష్, లెట్టిష్ భాషలలో అచ్చయ్యాయి. బోల్షివిక్కుల, సోషల్ డెమోక్రట్లలోని వామపక్షవాదుల సహాయంతో ఈ పత్రాలు వివిధ దేశాలలో ప్రచారంలో పెట్టబడ్డాయి. 1915 నవంబరులో ఇంటర్నేషనల్ ఫ్లూగ్‌బ్లట్టర్' అనే కరపత్రం ప్రచురింపబడ్డది. త్సిమ్మర్‌వాల్డ్ వామపక్షం యొక్క ముసాయిదా ప్రణాళిక, ముసాయిదా తీర్మానములు ఈ కరపత్రంలో ఉన్నాయి. ఈ కరపత్రాన్ని లెనిన్ ఇలా వర్ణించాడు: "అన్ని దేశాల వామపక్ష సోషల్ డెమోక్రట్ల కేంద్రకం ప్రకటించిన మొదటి పత్రం ఇది. ఏమి చెయ్యాలి, ఏ దిశలో ముందుకు సాగాలి అనే ప్రశ్నకు స్పష్టమైన, ఖచ్చితమైన పూర్తి సమాధానం ఈ వామపక్ష సోషల్ డెమోక్రట్లకున్నది."

కౌట్స్కీ పత్రిక 'డైన్యూ జిట్' కు ప్రతిగా, వామపక్ష సోషల్ డెమోక్రట్లు ప్రారంభించిన అంతర్జాతీయ సిద్ధాంత పత్రిక 'వోర్బోటే 'తో వారు మరింతగా ఘనవిజయాలు సాధించారు. కార్మికవర్గ విప్లవపోరాటం యొక్క సిద్ధాంతము, ఎత్తుగడలకు సంబంధించిన అనేకమైన తక్షణ సమస్యలను వివిధ దేశాల అంతర్జాతీయవాదులు ఈ పత్రికలో చర్చించారు. వామపక్ష త్సిమ్మర్‌వాల్డ్ గ్రూపు యొక్క సిద్ధాంత రాజకీయ వేదికను ప్రచారం చేయటంలోను, సోషల్ జాతీయ దురహంకారవాదుల, వారికి ముసుగుగా ఉపకరిస్తున్న సెంట్రిస్టుల సిద్ధాంత పతనాన్ని, విద్రోహపూరితమైన ఎత్తుగడలను బహిర్గతం చేయడంలోను ఈ పత్రిక గణనీయమైన పాత్ర వహించింది.

1916 వసంతానికి, యూరపులోని చాలా దేశాలలో వర్గ వైరుధ్యాలు చాలా తీవ్ర రూపం ధరించాయి. ప్రజా విప్లవ ఉద్యమాభివృద్ధిలో ఒక మలుపు వచ్చింది. యుద్ధరంగములలో మృతుల సంఖ్య, ఆకలి, అవసరాలు, హెచ్చుగా ఉన్న జీవన వ్యయం, ఇవన్నీ కార్మికులలోను, పెటీబూర్జువాలోను యుద్ధ వ్యతిరేక భావాలను, సామూహిక అసంతృప్తిని రెచ్చగొట్టాయి. సైన్యంలో అవిధేయత వ్యాపించింది. శత్రు సైనిక దళాల మధ్య చెలిమి వ్యక్తంచేసుకునే ఘటనలు మరింత తరచుగా జరగసాగాయి. అలాంటి పరిస్థితిలో, 1916 ఏప్రిల్‌లో, స్విట్జర్లెండ్‌లోని కింతాల్‌లో రెండవ త్సిమ్మర్‌వాల్డ్ కాన్ఫరెన్సు జరిగింది. 8 దేశాల నుండి- జర్మనీ, ఫ్రాన్సు, ఇటలీ, రష్యా, పోలండు, సెర్బియా, స్విట్జర్లెండు, పోర్చుగల్ దేశాల నుండి -41 మంది ప్రతినిధులు ఈ కాన్ఫరెన్సుకు హాజరయ్యారు.

త్సిమ్మర్‌వాల్డ్‌లో కంటె, కింతాల్‌లో వామపక్ష త్సిమ్మర్‌వాల్డ్ గ్రూపు ఎక్కువ బలంగా ఉంది. వారి ప్రతినిధుల సంఖ్య 10. అనేక సమస్యల మీద, మరో 12 మంది ప్రతినిధులు వీరిని బలపరుస్తూ వచ్చారు. త్సిమ్మర్‌వాల్డ్ వామపక్ష గ్రూపు అప్పటికీ మైనారిటీలోనే ఉన్నప్పటికీ వారి భావాల పలుకుబడి బాగా పెరిగింది.లెనిన్ నాయకత్వాన వారొక సంఘటితమైన ఐక్యశక్తిగా రూపొందారు. త్సిమ్మర్‌వాల్డ్ గ్రూపు మితవాద గ్రూపు బలం 31 మంది (8 దేశాల నుండి). త్సిమ్మర్‌వాల్డ్‌లో వలెనే ఈ గ్రూపు విపరీతమైన మిశ్రమ స్వభావాన్ని కలిగి ఉంది. సెంట్రిస్టుల నుండి ఊగిసలాడే అంతర్జాతీయవాదులవరకు కొనసాగించగలిగినంత పెద్ద మెజారిటీ త్సిమ్మర్‌వాల్డ్ మితవాద గ్రూపుకు లేదు."

వివిధ శాంతి కార్యక్రమాలపట్ల కార్మికవర్గ వైఖరిపై చర్చ జరిపే సందర్భంలో అధిక సంఖ్యాకులైన సెంట్రిస్టులు వ్యతిరేకించినప్పటికీ, సోషల్ శాంతివాదాన్ని ఖండించే అనేక సూత్రీకరణలను తీర్మానాలలో చేర్పించడంలో వామపక్ష త్సిమ్మర్‌వాల్డిస్టులు కృతకృత్యులయ్యారు. సోషల్ శాంతివాదం విప్లవ వర్గపోరాటం నుండి ప్రజలను పక్కదారి పట్టించేందుకుద్దేశించబడిన ఒక రకం బూర్జువా మోసం అని ఆ సూత్రీకరణలు వివరించాయి.

అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరోను సమావేశపరచడం పట్ల త్సిమ్మర్‌వాల్డిస్టుల వైఖరిపై చర్చ జరిగిన సందర్భంలో సిద్ధాంత పోరాటం అతి తీవ్రంగా జరిగింది. కార్మికులకు పిలుపివ్వవలసింది. పాత దివాళాకోరు ఇంటర్నేషనల్‌ను పునరుద్ధరించేందుకా, లేక కొత్త మూడవ ఇంటర్నేషనల్‌ను ఏర్పరచేటందుకా, అనేది ప్రధాన వివాదాస్పద అంశం. అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరోతో తెగతెంపులు చేసుకోవడాన్ని కౌట్స్కీయిస్టు మెజారిటీ దృఢంగా వ్యతిరేకించింది. చివరకు ఒక రాజీ తీర్మానం ఆమోదించబడ్డది. అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరో అవలంబించిన సోషల్ జాతీయ దురహంకార వైఖరిని ఈ తీర్మానం పేరుకు ఖండించింది. అయితే కార్మికవర్గ లక్ష్యానికి రెండవ ఇంటర్నేషనల్ చేసిన విద్రోహచర్య నుండి వీరు ఆచరణాత్మకమైన నిర్ణయాలేవీ తీసుకోలేదు. "నాశనమౌతున్న, వధింపబడుతున్న ప్రజలకు" విజ్ఞప్తిని కాన్ఫరెన్సు ఆమోదించింది. ఇందులో సోషల్ జాతీయ దురహంకారంపై నిశిత విమర్శ ఉంది.

కింతాల్ కాన్ఫరెన్సు నిర్ణయాలను సమీక్షిస్తూ లెనిన్ ఇలా వ్రాశాడు: "ఫలితం ఊగిసలాడుతూ కాలంగడిపే వైఖరి నుండి ఒక చిన్న ముందడుగు."

ప్రజలలో తీవ్రమౌతున్న యుద్ధవ్యతిరేక విప్లవోద్యమం ఫలితంగా, కింతాల్ కాన్ఫరెన్సులో త్సిమ్మర్‌వాల్డ్ మితవాద గ్రూపు, వామపక్షానికి కొన్ని రాయితీలు ఇవ్వవలసి వచ్చింది. కాగా సోషల్ జాతీయ దురహంకారవాదాన్ని, శాంతివాదాన్ని ఖండిస్తూ వీరు తీర్మానంపై సంతకం చేసినప్పటికీ, ఆచరణలో వీరు, సోషల్ శాంతి

భావాలను మార్చుకోలేదు. సోషల్ జాతీయ దురహంకారవాదులతో రాజీపడేందుకు ద్వారం మూసివేయనూలేదు. త్సిమ్మర్‌వాల్డ్ మితవాద గ్రూపు మూడవ ఇంటర్నేషనల్ ఏర్పడడము అనే భావాన్ని తీవ్రంగా ఖండిస్తూ, అంతర్జాతీయ సోషలిస్టు బ్యూరో సమావేశం జరిగిన వెంటనే, అంతర్జాతీయ సోషలిస్టు కమీషన్‌ను రద్దుచేయాలని పునరుద్ఘాటించింది. ఐతే విప్లవ అంతర్జాతీయవాదులతో బ్లాకును వదలుకోవడానికి వీరు తమ సంసిద్ధతను వెలిబుచ్చి, సోషల్ జాతీయ దురహంకారవాదులతో ఐక్యతకు అనుకూలతని వెలిబుచ్చారు. కాన్ఫరెన్సుపై తమ అభిప్రాయాలను రుద్దడానికి సెంట్రిస్టులు, మొటైన నియంతృత్వ పద్ధతులను మరీ తరచుగా అవలంభించసాగారని కింతాల్ చర్చలు నిరూపించాయి. రెండవ ఇంటర్నేషనల్‌తో తెగతెంపులు చేసుకోవలెనని కాన్ఫరెన్సు నిర్ణయించినట్లయితే, త్సిమ్మర్‌వాల్డ్ సంస్థను చీలుస్తామని కూడా బెదిరించారు.

త్సిమ్మర్‌వాల్డ్ సంస్థలో కొనసాగటం ఇక ప్రయోజనకరమూ అనే సమస్యను కింతాల్ సమావేశం నాటికే త్సిమ్మర్‌వాల్డ్ వామపక్ష గ్రూపు ఎదుర్కొన్నది. కౌట్స్కీస్టులకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించటానికి, సెంట్రిజం అనే ఊబినుండి ఊగిసలాటవాదులు బైటపడి, కార్మికవర్గ విధానాన్ని అనుసరించే విధంగా తోడ్పడటానికి గాను, సంస్థలో కొనసాగటమే మంచిదని త్సిమ్మర్‌వాల్డ్ వామపక్షం అప్పటికి నిర్ణయించింది.

కౌట్స్కీస్టు చర్యల ఫలితంగా త్సిమ్మర్‌వాల్డ్ సంస్థపై రుద్దబడుతున్న ప్రతిష్టంభనకుగల కారణాలను వివరిస్తూ 1916 సెప్టెంబరులో లెనిన్ ఇలా వ్రాశాడు: "అవకాశవాద వ్యతిరేక పోరాటంతో సన్నిహితంగా జతగాని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం అర్థరహితమైన పదం, లేక మోసం. త్సిమ్మర్‌వాల్డ్, కింతాల్ సమావేశాల ప్రధాన లోపాలలో ఒకటి, మూడవ ఇంటర్నేషనల్‌కు బీజప్రాయాలైన ఇవి నిరర్థకమైన గందరగోళంలో ముగిసిపోయే అవకాశం వుండటానికి ఒక కారణం, ఏమంటే అవకాశవాదంతో పోరాటం అనే సమస్యను ఇవి బహిరంగంగా ప్రస్తావించనైనా లేదు, అవకాశవాదులతో తెగతెంపుల రూపంలో ఈ సమస్యను పరిష్కరించటం అనే మాటను అలా ఉంచినా."

1916 ఆఖరికి, సామ్రాజ్యవాద యుద్ధంనుండి సామ్రాజ్యవాద శాంతికి ప్రపంచ విధానం మారింది. వస్తుగత పరిస్థితులు, విప్లవాలంటే భయం, చాలా దేశాలలోని సామ్రాజ్యవాద వర్గాలు దీర్ఘకాల యుద్ధాన్ని అంతంచేసే మార్గాలను అన్వేషించుటకై వత్తిడిచేశాయి. ఈ విధంగా శాంతివాద ప్రచారానికి వస్తుగత పునాది ఏర్పడ్డది. ఈ పునాదిపై సోషల్ జాతీయ దురహంకారవాదులకు, త్సిమ్మర్‌వాల్డ్ మితవాద గ్రూపు పెట్టుబడిదారీ విధానము, సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా విప్లవ పోరాటం అనే భావానికి–త్సిమ్మర్‌వాల్డ్, కింతాల్ కాన్ఫరెన్సులలో ఎంతో గంభీరంగా ప్రకటించబడిన భావానికి–ద్రోహం చేసింది. త్సిమ్మర్‌వాల్డ్ సంస్థ సైద్ధాంతికంగానూ, రాజకీయంగానూ బద్దలవడానికి త్సిమ్మర్‌వాల్డ్‌లోని మెజారిటీ పక్షమే బాధ్యతవహించాలి. సోషల్ జాతీయ దురహంకారవాదాన్ని, బూర్జువా సంస్కరణవాదాన్ని కప్పిపుచ్చటానికి త్సిమ్మర్‌వాల్డ్ పతాకాన్ని వీరు వినియోగించటమే ఆ విద్రోహం.

త్సిమ్మర్‌వాల్డ్ మితవాద, వామపక్ష గ్రూపుల మధ్య ఏర్పడిన అగాధాన్ని రష్యాలో జరిగిన ఫిబ్రవరి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం మరింత విస్తృతం చేసింది. సామ్రాజ్యవాద యుద్ధం అంతర్యుద్ధంగా మారుతున్నదని రష్యాలోని ఘటనలు నిరూపించాయి. రష్యాలోని కార్మికవర్గం అపారమైన విప్లవ శక్తి ఉత్సాహాలను అభివృద్ధి చేసుకున్నది. బహిరంగ పరిస్థితులలో పనిచేసే అవకాశం లభించటంతో రష్యన్ కార్మికవర్గ పార్టీ యుద్ధం, శాంతి, విప్లవం వంటి సమస్యలపై అతి స్పష్టమైన కార్యక్రమం గలిగిన ఏకైక పార్టీ ఐనందువల్ల, సహజంగానే ప్రపంచ కార్మికవర్గ విప్లవ శక్తులకు ఆకర్షణ కేంద్రం ఐంది. అది కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నిర్మాణాని కవసరమైన సన్నాహాల బాధ్యతను సహజంగానే తీసుకోవలసి వచ్చింది.

విప్లవకర అంతర్జాతీయవాదులు త్సిమ్మర్‌వాల్డ్ సంస్థలో వుండటం ఇక అసాధ్యమనే లెనిన్ అనుకున్నాడు. "త్సిమ్మర్‌వాల్డ్ బురదను ఇక సహించటానికి వీలులేదు. త్సిమ్మర్‌వాల్డ్ 'కౌట్స్కీస్టుల' కొరకై, ప్లెహానొవ్‌ల, షైడెమన్‌లతో కూడిన ఈ జాతీయ దురహంకార ఇంటర్నేషనల్‌తో అర్ధ పొత్తు కొనసాగించరాదు. వెంటనే ఈ ఇంటర్నేషనల్‌తో తెగతెంపులు చేసుకోవాలి. సమాచార సేకరణకు మాత్రమే మనం ఇక త్సిమ్మర్‌వాల్డ్ సంస్థలో ఉండాలి" అని లెనిన్ వ్రాశాడు. నూతన విప్లవకర కార్మిక ఇంటర్నేషనల్ వెంటనే ఏర్పాటుచేయాలని లెనిన్ కోరాడు.

త్సిమ్మర్‌వాల్డ్ భ్రమలతో కొట్టుమిట్టాడుతున్న కొందరు పార్టీ సభ్యులు లెనిన్ పిలుపును వెంటనే ఆదరించలేకపోయారు. త్సిమ్మర్‌వాల్డ్ సంస్థ కౌట్స్కీస్టుల పలుకుబడిలో ఉన్నదని ఆర్.యస్.డి.యల్.పి.(బి) 1917 ఏప్రిల్ కాన్ఫరెన్సు హాజరైన ప్రతినిధులలో అధిక సంఖ్యాకులు అప్పటికింకా గ్రహించలేదు. త్సిమ్మర్‌వాల్డ్ వామపక్షం ఎత్తుగడలను సమర్థించేందుకై, త్సిమ్మర్‌వాల్డ్ బ్లాకులోనే కొనసాగాలని కాన్ఫరెన్సు తీర్మానించింది. అంతర్జాతీయ సోషలిస్టు కమిషన్ స్టాక్‌హోమ్‌లో ఏర్పరుస్తున్న మూడవ త్సిమ్మర్‌వాల్డ్ కాన్ఫరెన్సుకు బోల్షివిక్ ప్రతినిధులు హాజరయ్యేందుకు తగు ఏర్పాట్లు చేయవలసిందిగా కేంద్ర కమిటీని కోరింది. సమాచార సేకరణకు మాత్రమే త్సిమ్మర్‌వాల్డ్ బ్లాకులో కొనసాగాలి అనే లెనిన్ ప్రతిపాదన వీగిపోయింది.

పార్టీలో త్సిమ్మర్‌వాల్డ్‌ను గురించిన భ్రమలను జినోవ్‌యెవ్ వ్యాపింపజేశాడు. సెంట్రిస్టులతో తెగతెంపులు చేసుకోవాలనే అంశంపై అనిశ్చిత వైఖరిని ప్రదర్శించిన వామపక్ష సోషల్ డెమోక్రట్ల

వాదనను అతడు ఏకరువు పెట్టాడు. త్సిమ్మర్‌వాల్డ్‌లో కొనసాగుతూ, అందులోని అధిక సంఖ్యాకులను మూడవ ఇంటర్నేషనల్ వైపు ఆకర్షించేందుకు కృషిచేయాలి అని వాదించాడు. ఏప్రిల్ కాన్ఫరెన్సులోను, ఆ తర్వాత కూడా ఇదే అంశాన్ని సమర్థిస్తూ వచ్చాడు. "త్సిమ్మర్‌వాల్డ్ ఇంటర్నేషనల్‌ను ఇప్పుడు స్వాధీనం చేసుకుంటే ఎంతో బాగుంటుంది." అని 1917 జూన్‌లో కూడా వాదిస్తూ వచ్చాడు. అందుకు లెనిన్ ఇలా సమాధానం చెప్పాడు: "నా ఉద్దేశం ఇవి అత్యంత అవకాశవాద పూరితమైన, హానికరమైన ఎత్తుగడలు.... ఇలా చేయడమంటే మన సూత్రాలన్నింటినీ గంగలో కలపడమే. సెంట్రిస్టులను గురించి మనం రాసినదాన్ని, చెప్పినదాన్ని యావత్తు మరచిపోవడమే అవుతుంది. గంద్రగోళంలో ఇరుక్కుని అవమానాల పాలుకావటమే జరుగుతుంది."

త్సిమ్మర్‌వాల్డ్ సంస్థ ఉనికికి కాలదోషం పట్టిందని లెనిన్ నిరంతరం నొక్కి చెబుతూ వచ్చాడు. దానితో తెగతెంపులు చేసుకోక పోవటం ద్వారా, బోల్షివిక్కులు మూడవ ఇంటర్నేషనల్ సత్వరమే ఏర్పరచటానికి అవసరమైన ప్రత్యక్ష చర్యలు తీసుకోవటం మరింత కష్టం చేసుకుంటున్నారు. ఏప్రిల్ కాన్ఫరెన్సు ఐన తర్వాత యీ తప్పును సవరించుకోవలసిందిగా లెనిన్ పట్టుపట్టాడు. అంతర్జాతీయవాదుల ప్రపంచ కాన్ఫరెన్సును ఏర్పరచేందుకు త్వరపడవలసిందిగా కేంద్ర కమిటీని, దాని విదేశీ ప్రతినిధివర్గాన్ని, 1917 గ్రీష్మరుతువు, ఆకురాలు కాలాలలో లెనిన్ పదేపదే కోరుతూ వచ్చాడు. "కౌట్స్కీస్టులకు మాత్రమే వ్యతిరేకంగా, వామపక్షవాదులతో మాత్రమే" కూడుకొనివున్న నిజమైన విప్లవకర ఇంటర్నేషనల్ ఏర్పరచాలని పదేపదే కోరాడు.

ఇప్పటికీ, కేంద్ర కమిటీలో జినోవ్‌యెవ్, కేంద్ర కమిటీ విదేశీ ప్రతినిధివర్గంలో రాడెక్ లెనిన్ సూచనలను భగ్నంచేశారు. కొద్దిమంది ప్రతినిధులు మాత్రమే వస్తారని, అందువల్ల కాన్ఫరెన్సు విఫలమౌతుందని వారు నమ్మారు. ఈ వాదాలను ఖండిస్తూ లెనిన్ ఇలా రాసాడు: '' 'పెద్ద' సంఖ్యలో ప్రతినిధుల కొరకై 'ఎదురుచూడటం' అపారమైన బుద్ధి మాంద్యానికి చిహ్నం. ప్రస్తుతం 'కొద్ది మంది' ఉన్నారని సిగ్గుపడటమూ అంతే. ప్రతినిధుల సంఖ్యతో నిమిత్తం లేకుండా అలాంటి కాన్ఫరెన్సును జరగటం ఇప్పుడొక సిద్ధాంతపు శక్తి ఔతుంది. ఆలస్యం అయితే నోరు నొక్కబడవచ్చు." ఏడవ (ఏప్రిల్) కాన్ఫరెన్సు, పార్టీ ఆరవ మహాసభ తీర్మానాలలోను, బోల్షివిక్కుల కొత్త ముసాయిదా కార్యక్రమంలోను (వోర్బోటే, ట్రిబ్యూన్, ఆర్బెటరో పొలిటిక్ లను చేర్చి) సామ్రాజ్యవాదం లేవనెత్తిన ప్రశ్నలకు ప్రపంచమంతటికి స్పష్టమైన సమాధానాలివ్వటానికీ సోషల్ జాతీయ దురహంకారవాదులకు, కౌట్స్కీస్టులను ఖండించటానికీ తగినంత సిద్ధాంత పునాది ఉన్నది" అని లెనిన్ నొక్కి చెప్పాడు.

దురదృష్టవశాత్తు, అప్పటికి లెనిన్ సూచనలను అమలుజరపలేదు. 1917 సెప్టెంబరు 5-12 తేదీలలో స్టాక్‌హోమ్‌లో జరిగిన మూడవ త్సిమ్మర్‌వాల్డ్ కాన్ఫరెన్సుకు బోల్షివిక్ ప్రతినిధులు హాజరయ్యారు. అందులో నిర్ణయాత్మక పాత్ర సెంట్రిస్టులు వహించినందున, లెనిన్ ముందే ఊహించినట్లు, ప్రపంచ విప్లవోద్యమానికి సంబంధించినంతవరకు కాన్ఫరెన్సు ఎట్టి ఫలితాన్ని సాధించలేదు.

## IV

### మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రథమ (ప్రారంభ) కాంగ్రెసు-లెనిన్ కృషి

అక్టోబరు సోషలిస్టు విప్లవం యావత్తు అంతర్జాతీయ పరిస్థితిని సమూలంగా మార్చివేసి, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నిర్మాణానికి మరింతగా అనుకూలమైన నూతన పరిస్థితులను సృష్టించింది. సమాజాన్ని సోషలిస్టు పద్ధతిలో పునర్నించటమనే మార్క్సిస్టు-లెనినిస్టు భావాలను మానవ చరిత్రలో ఆచరణలో పెట్టిన మొట్ట మొదటి విప్లవం అది. ఆ భావాల వాస్తవికతను, విప్లవ ప్రభావాన్ని నిర్ణయాత్మకంగా నిరూపించింది. సంస్కరణవాదంపైన విప్లవ సిద్ధాంతం, సోషల్ డెమోక్రటిక్ సిద్ధాంతంపైన లెనినిజం సాధించిన విజయం అది. ప్రపంచ విప్లవ పరిణామ క్రమంలో నాయకత్వ పాత్ర వహించిన కమ్యూనిస్టులను ప్రపంచ చరిత్ర అగ్రభాగంలో అక్టోబరు విప్లవం నిలబెట్టింది. అక్టోబరు విప్లవ ప్రభావంతో కార్మికోద్యమంలోని కొత్త అగ్రగామి రాజకీయ గ్రూపులు, విప్లవ ప్రవాహంలో చేరసాగాయి. లెనినిజం ప్రాతిపదికపై సైద్ధాంతికంగాను, రాజకీయంగాను అవి ఐక్యం కాసాగాయి. కార్మికోద్యమంలోను, జాతీయ విముక్తి ఉద్యమంలోను ఒక సిద్ధాంత శక్తిగా లెనినిజం స్థిరపడసాగింది.

శాంతి, నిజమైన స్వాతంత్ర్యం, సోషలిజాలకు జాతులు అవలంబించవలసిన సరైన మార్గాన్ని రష్యన్ అక్టోబరు విప్లవమూ, బోల్షివిక్ పార్టీ సిద్ధాంత, ఆచరణలూ నిరూపించాయి. కార్ల్ లీబ్‌క్నెఖ్ట్ ఇలా రాసాడు: "రష్యన్ సోవియట్ రిపబ్లిక్ పోరాట కేతనమైంది, అంతర్జాతీయ కేతనమైంది. ఇతరులకు ఇది ఉత్సాహాన్ని ఇస్తుంది, ఊగిసలాడేవారికి ధైర్యాన్నిస్తుంది, యోధుల దీక్షను, శక్తిని ఇది పదిరెట్లు పెంచుతుంది." అక్టోబరు విప్లవ విజయం ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి అంతకు ముందులేని ప్రజాపునాదిని సమకూర్చింది. సామ్రాజ్యవాదంపై దాడికి, వేతన బానిసత్వానికి, వలసవాద దోపిడీకి వ్యతిరేకంగాను, ముందుకు సాగుతున్న పెట్టుబడిదారీ ప్రపంచంలోని లక్షలాది శ్రామిక ప్రజలకు మూడవ ఇంటర్నేషనల్ ఏర్పడడం అనే భావం అర్థమయేటట్లుగా సోవియట్ రిపబ్లిక్ చేసింది. కార్మికవర్గ పోరాట ప్రయోజనాలు, అందరి శ్రమజీవుల ప్రయోజనాల దృష్ట్యా, సామ్రాజ్యవాదంపై చావుదెబ్బ కొట్టేందుకు, విముక్తి ఉద్యమాల అన్ని విభాగాల మధ్య వీలైనంత హెచ్చుగా శక్తుల కేంద్రీకరణ కృషి సమన్వయం అవసరమైంది. ప్రపంచ వ్యాపితంగా ఏర్పడిన ఒక కొత్త తరహా కార్మికవర్గ పార్టీ

మాత్రమే ఈ లక్ష్యం సాధించగలదు.

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సన్నాహాలకై మొదటి అంతర్జాతీయ సమావేశం 1918 జనవరిలో పెట్రోగ్రాడ్‌లో జరిగింది. ఈ సమావేశానికి బోల్షివిక్కులు, వామపక్ష సోషలిస్టు రివల్యూషనరీలు, స్వీడెన్, నార్వే, బ్రిటన్, యు.యస్.ఎ.లలోని వామపక్ష సోషల్ డెమోక్రట్లు, పోలిష్, రుమేనియన్, జెక్, క్రోటియన్ అంతర్జాతీయవాదులు–వీరందరి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ క్రింది షరతులపై వామపక్షవాదుల సభను జరపాలని ఆ సమావేశం నిర్ణయించింది: "1. తమ తమ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా, తక్షణ శాంతికై విప్లవ పోరాటం సాగించేందుకు పార్టీల, సంస్థల సమ్మతి;

2. అక్టోబరు రష్యన్ విప్లవానికి, సోవియట్ ప్రభుత్వానికి తోడ్పాటు." వామపక్ష పార్టీలకు, గ్రూపులకు ఈ నిర్ణయాన్ని తెలియజేశారు. వివిధ దేశాలలోని అంతర్జాతీయతా శక్తులను మూడవ ఇంటర్నేషనల్‌గా ఐక్యం చేసేందుకు కష్టభూయిష్టంగా కొనసాగిన కృషికి ఈ నిర్ణయం ప్రాతిపదిక ఐంది.

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ అనే భావాన్ని ప్రచారం చేయటంలో ప్రముఖ పాత్రను ఆర్.సి.పి.(బి) కేంద్ర కమిటీ ఆధ్వర్యాన విదేశీ గ్రూపుల సమాఖ్య, ఆర్.సి.పి.(బి) ముస్లీమ్ సంస్థల కేంద్ర బ్యూరో నిర్వహించాయి. ఈ విదేశీ గ్రూపుల కార్యాచరణను లెనిన్ హర్షించాడు. వాటి కృషి పుణ్యమా అని వేలాది యుద్ధ ఖైదీలు, రాజకీయ ప్రవాసితులు, మాజీ జోక్యందారీ సైనికులు, రష్యాలో బోల్షివిజం తర్ఫీదును పొందారు. చిత్తశుద్ధిగల అంతర్జాతీయవాదులై వారు తమ దేశాలకు తిరిగి వెళ్లిన పిమ్మట తాము చూసిందీ, అనుభవించిందీ తెలియజేశారు. అక్టోబరు విప్లవాన్ని గురించి తమ దేశ ప్రజలలో నిజాన్ని వ్యాపింపచేయటానికి, మూడవ ఇంటర్నేషనల్ పతాకం క్రింద కార్మికులను సమీకరించటానికి ఎంతో కృషిచేశారు.

పెక్కు దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు, గ్రూపులు ఏర్పడటం మూడవ ఇంటర్నేషనల్ ఆచరణలో జీవించి, పనిచేస్తున్నదనేందుకు తార్కాణం ఐంది. కమ్యూనిస్టు ఉద్యమ విభాగాల అన్నిటినీ ఐక్యం చేసి, తద్వారా ప్రజలలో వాటి బలం, పలుకుబడి పెంచడం అనే సమస్య ఏర్పడ్డది. ఇది తక్షణ సమస్య కావటానికి మరో కారణం ఏమంటే ఆ సమయానికి, కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఎదుర్కొనే లక్ష్యంతో సోషల్ జాతీయ దురహంకారవాదులు, సెంట్రిస్టులు సంస్కరణవాద అంతర్జాతీయ సంస్థను నిర్మించసాగారు. రెండవ ఇంటర్నేషనల్ పునర్నిర్మించి తీరాలి అనే ఉద్దేశ్యంతోనే వారిలా చేయసాగారు. ఈ కారణం వలన, మూడవ ఇంటర్నేషనల్ ఐక్యం కావలసిందిగా వివిధ దేశాలలోని కమ్యూనిస్టులకు 1918 డిసెంబరు 24న ఆర్.సి.పి.(బి) విజ్ఞప్తి చేసింది.

1919 జనవరిలో మాస్కోలో మరో అంతర్జాతీయ సమావేశం జరిగింది. సాధ్యమైనంత త్వరలో మూడవ ఇంటర్నేషనల్ ప్రారంభ కాంగ్రెసును జరపాలనే లెనిన్ ప్రతిపాదనను ఆ సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సోవియట్ రష్యా, పోలండు, హంగరీ, ఆస్ట్రియా, లాత్వియా, ఫిన్లండు దేశాల కమ్యూనిస్టులు, బాల్కన్ విప్లవ సోషలిస్టు ఫెడరేషన్, అమెరికన్ సోషలిస్టు లేబరు పార్టీల ప్రతినిధులు, అదే విధమైన విజ్ఞప్తిపై సంతకాలు చేశారు. ఆర్.సి.పి.(బి), స్పార్టకస్ యూనియన్ కార్యక్రమ పత్రాల ప్రాతిపదికపై ఇంటర్నేషనల్ సిద్ధాంత, రాజకీయ వేదికను ఈ విజ్ఞప్తి క్లుప్తంగా రూపొందించింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం యొక్క లక్ష్యాలు, ఎత్తుగడలు, నిర్మాణ సూత్రాలను ఆ విజ్ఞప్తి వివరించింది. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను ఏర్పరచే సమస్యను చర్చించి, ప్రారంభ కాంగ్రెసులో పాల్గొనవలసిందిగా, 39 సోదర పార్టీలకు, గ్రూపులకు, సంస్థలకు ఈ సభ విజ్ఞప్తి చేసింది.

లెనిన్ వివరించినట్లు, మాస్కో కాంగ్రెసుకు ఈ క్రిందివారు ఆహ్వానించబడ్డారు. మొదటిది "ఇంతకుముందే మూడవ ఇంటర్నేషనల్ వేదికలో భాగస్వాములైనట్లు భావించడానికి తగిన ఆధారాలున్నవారు, మూడవ ఇంటర్నేషనల్‌ను లాంఛనంగా ఏర్పరచాలనే సమస్యపై తగినంత ఏకాభిప్రాయమున్న పార్టీలు, గ్రూపులు;" రెండవది, "ఆ వేదికకు సన్నిహితంగా ఉండి, ఎవరి నుండి తోడ్పాటు అనుబంధం ఆశించడానికి వీలుందో ఆ పార్టీలు;" మూడవది, "దాదాపు బోల్షివిజానికి సన్నిహితంగా ఉండే సోషల్ దేశభక్తియుత పార్టీలోని ధోరణులు, గ్రూపులు."

సోషలిస్టు విప్లవ పతాకం క్రింద కార్మిక ప్రజానీకం ఐక్యం కాకుండా నిరోధించే ప్రయత్నంలో, సోషల్ జాతీయ దురహంకారవాదులు, సెంట్రిస్టులు 1919 ఫిబ్రవరిలో బెర్న్‌లో ఒక సమావేశం జరిపి, రెండవ ఇంటర్నేషనల్ శవాన్ని పున: ప్రతిష్ఠించారు. ఈ ఇంటర్నేషనల్, లెనిన్ మాటలలో చెప్పాలంటే, వెన్వెంటనే "కార్మికోద్యమంలోపల పని చేసే అంతర్జాతీయ సామ్రాజ్యవాద ఏజంట్ల సంస్థగా, ఆ ఉద్యమాన్ని బూర్జువా ప్రభావంతో, బూర్జువా భావాలతో, బూర్జువా అబద్ధాలతో, బూర్జువా అవినీతితో కలుషితంచేసే సంస్థగా" నిరూపితమైంది. బెర్న్ ఇంటర్నేషనల్ అసలు లక్ష్యాన్ని దాని నాయకులు రహస్యంగా దాచి పెట్టిందీలేదు. బ్రిటిష్ అవకాశవాది మాక్‌డోనాల్డ్ స్పష్టంగా ఇలా అంగీకరించాడు: "రెండవ ఇంటర్నేషనల్ యావత్తు బోల్షివిస్టు వ్యతిరేకమైనది. నిజానికి, సైనిక చర్యలను తప్పిస్తే బోల్షివిజానికి వ్యతిరేకంగా ఇదే నిజమైన రక్షణ దుర్గం."

1919 ఫిబ్రవరి ఆఖరుకు అపారమైన ఆటంకాలను, దిగ్బంధాన్ని, అంతర్యుద్ధ రంగాల గొలుసును అధిగమించి కమ్యూనిస్టు ప్రతినిధులు మాస్కోకు చేరుకోసాగారు. ఇటాలియన్ సోషలిస్టు పార్టీ ప్రతినిధులు, ఫ్రాన్సు, బ్రిటన్, అమెరికాలలోని వామపక్ష సోషలిస్టు గ్రూపుల ప్రతినిధులు చొచ్చుకు రాలేకపోయారు. హంగేరియన్ కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు, ఒక జర్మన్ ప్రతినిధి

మార్గమధ్యంలో నిర్బంధించబడ్డారు. కొంతమంది ప్రతినిధులు ఆలస్యంగా హాజరయ్యారు.

పెక్కుమంది ప్రతినిధుల ప్రాథమిక సమావేశం మార్చి 1న, లెనిన్ అధ్యక్షతన జరిగింది. కాంగ్రెసు ప్రారంభం, నిబంధనావళి, చర్చనీయాంశాలను ఈ సమావేశం చర్చించింది. ఈ సమావేశంలో జర్మన్ కమ్యూనిస్టు పార్టీకి ప్రాతినిధ్యం వహించే హుగో ఏబెర్‌లైన్ తన పార్టీ కేంద్రకమిటీ ఇచ్చిన ఆదేశం మేరకు, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ వెంటనే ఏర్పరచరాదు అని ప్రకటించాడు. జర్మన్ కమ్యూనిస్టు పార్టీ వైఖరి మూలంగాను, ఇతర దేశాల నుండి చాలామంది ప్రతినిధులు రానందున, మూడవ ఇంటర్నేషనల్‌ను ఏర్పరచే సమస్యపైన ముందుగా యే నిర్ణయమూ చేయకుండా ఒక అంతర్జాతీయ కమ్యూనిస్టు కాన్ఫరెన్సుగా సమావేశం కావాలని ఆ సభ తీర్మానించింది. ఈ కాన్ఫరెన్సు ఒక వేదికను తయారుచేస్తుంది, బ్యూరోను ఎన్నుకుంటుంది, తనలో చేరవలసిందిగా సోదర పార్టీలకు విజ్ఞప్తి చేస్తుంది.

1919 మార్చి 2 తేదీ సాయంత్రం, క్రెమ్లిన్‌లో అంతర్జాతీయ కమ్యూనిస్టు కాన్ఫరెన్సు ప్రారంభమైంది. లెనిన్ (సోవియట్ రష్యా), ఏబెర్‌లైన్ (జర్మనీ), ప్లాటెన్ (స్విట్జర్లండ్)లు అధ్యక్షవర్గంలోని శాశ్వత సభ్యులుగా ఎన్నికయ్యారు. యూరప్, అమెరికా, ఆసియాలలోని 21 దేశాలకు చెందిన 35 సంస్థల నుండి 52 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 19 సంస్థలకు వోటుహక్కుంది. 16 సంస్థలకు వోటుహక్కు లేదు. చర్చలలో పాల్గొనే హక్కు మాత్రం ఉంది. ఆస్ట్రియా, గ్రేట్ బ్రిటన్, జర్మనీ, జెకొస్లొవేకియా, నార్వే, నెదర్లెండ్సు, పోలండు, ఫిన్లండు, ఫ్రాన్సు, బల్గేరియా, యు.యస్.ఎ.కు, రుమేనియా, సెర్బ, క్రోట్, స్లోవేనియా రాజ్యం, సోవియట్ రష్యా, స్విట్జర్లెండ్, స్వీడెన్, హంగరీలకు చెందిన కమ్యూనిస్టు వామపక్ష సోషలిస్టు పార్టీలకు, గ్రూపులకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. యుక్రేయిన్, లాత్వియా, లిథువేనియా, బైలోరష్యా, ఎస్తోనియా, ఆర్మీనియా, వోల్గా ప్రాంతం జర్మన్లు, తుర్కెస్తాన్, జార్జియా, అజర్‌బైజాన్‌లలోని కమ్యూనిస్టు సంస్థల నుండి ప్రత్యేక ప్రతినిధివర్గాలు హాజరయ్యారు. ఇరాన్, చైనా, కొరియా, టర్కీలలోని పీడిత ప్రజల ప్రతినిధులు మొట్టమొదటి సారిగా అలాంటి సదస్సుకు హాజరయ్యారు.

కాన్ఫరెన్సుకు హాజరైన నిజమైన సామూహిక సభ్యత్వంగల ఒకే ఒక పార్టీ ఆర్.సి.పి.(బి). ఫిన్లండు, ఆస్ట్రియా, నెదర్లెండ్స్, హంగరీ, పోలండు, జర్మనీలలో కమ్యూనిస్టు పార్టీలు కొద్దికాలం క్రితం మాత్రమే ఏర్పడ్డాయి. ఇంకా గట్టిగా స్థిరపడలేదు. అయితే, కార్మికోద్యమ వెల్లువ ముందుకు సాగుతున్నందున, ఆ పార్టీలు విప్లవ పోరాట అనుభవాన్ని త్వరగా సంపాదించుకోసాగాయి. కమ్యూనిస్టు పార్టీలుగా రూపొందే ముందు బీజరూపంలో ఉన్న కమ్యూనిస్టు గ్రూపులకు, వామపక్ష సోషల్ డెమొక్రటిక్ పార్టీలకు చెందినవారు ప్రతినిధులలో అత్యధికులుగా ఉన్నారు. నిజానికి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఆనాటి ప్రధాన కర్తవ్యాలలో ఒకటి ఏమంటే, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం యొక్క మొదటి విదేశీ విభాగాలు, వామపక్ష సోషల్ డెమొక్రటిక్ పార్టీలు సిద్ధాంతరీత్యా, నిర్మాణరీత్యా బలపడేందుకు, లెనినిస్టు సిద్ధాంత ఆచరణలపై దృఢంగా నిలదొక్కుకునేందుకు సాయపడటం.

అన్ని దేశాలలోను విప్లవోద్యమం వృద్ధిచెందుతున్నదనీ, అభివృద్ధి చెందుతున్న పోరాట ప్రాధాన్యాన్ని అంతకంతకూ కార్మికులు గ్రహిస్తున్నారని, సమావేశాన్ని ప్రారంభిస్తూ లెనిన్ స్పష్టం చేశాడు. రష్యాలో సోవియట్ అధికారం ఫలితంగా నియంతృత్వం యొక్క ఆచరణాత్మక రూపాన్ని కార్మిక ప్రజానీకం కనుక్కున్నారు.

వివిధ దేశాలలో విప్లవోద్యమ అభివృద్ధిని గురించి నివేదికలు విన్నమీదట, కాన్ఫరెన్సు, మార్చి 3వ తేదీన చర్చనీయాంశాలలోని ఒక ముఖ్యాంశాన్ని–అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ముసాయిదా వేదికను–చర్చించడానికి పూనుకున్నది. ఈ వేదికపై వక్తలు ఏబెర్‌లైన్, బుహరిన్‌లు, సామ్రాజ్యవాదంపై లెనిన్ బోధనలు, సోషలిస్టు విప్లవ సిద్ధాంతంలోని ముఖ్య సూత్రీకరణలను క్లుప్తంగా ఈ వేదిక వివరించింది. ఆ పత్రంలో ఇలా ఉంది: "ఒక నూతన శకం ఆవిర్భవించింది. పెట్టుబడిదారీ విధానం పతనమై, అంతరంగికంగా ముక్కచెక్కలయ్యే శకం ఇది. కార్మికవర్గ కమ్యూనిస్టు విప్లవ శకం ఇది." ఈ శకాన్ని గురించి లెనిన్ చేసిన ఈ వర్ణన కార్మికవర్గ లక్ష్యాలు, పోరాట పద్ధతులను గురించి తదుపరి తీసుకొనే అన్ని నిర్ణయాలకు సిద్ధాంత పునాదిని ఏర్పరచింది.

చాలా పెట్టుబడిదారీ దేశాలలో కార్మికవర్గ నియంతృత్వ స్థాపన తక్షణ కర్తవ్యమైందని ఈ వేదిక స్పష్టం చేసింది. కార్మికవర్గం రాజకీయాధికారాన్ని స్వీకరించడం అంటే ప్రభుత్వంలో వ్యక్తులను మార్పుచేయటంగా పరిమితం చేయరాదు. సైన్యం, పోలీసు బలగం, బ్యూరాక్రటిక్ యంత్రాంగంతో సహా, పాత రాజ్యాంగయంత్రాన్ని బద్దలు చేయటమే దాని అర్థం. బూర్జువావర్గాన్ని నిరాయుధం చేసి, కార్మికవర్గాన్ని సాయుధంచేయాలి. కార్మికవర్గానికి చెందిన నూతన పరిపాలన సంస్థలను ఏర్పరచాలి.

కార్మికవర్గ నియంతృత్వ స్థాపన దానికదే లక్ష్యం కాదు. శ్రమజీవులందరి ప్రయోజనాల దృష్ట్యా, సాంఘిక, ఆర్థిక సంస్కరణలు అమలు జరపడానికి ఒక సాధన మాత్రమే. వేదిక సూచించిన తక్షణ ఆర్థిక కార్యక్రమం ఇది: దోపిడీదారులను రద్దుచేయటం, సొంత ఆస్తి రద్దు, భారీ పరిశ్రమల, వ్యవసాయ ఎస్టేట్ల యాజమాన్యాన్ని కార్మికవర్గ ప్రభుత్వానికి బదలాయించటం. "చిన్న ఆస్తిని ఏ రూపంలోనూ స్వాధీనపరచుకోవటం జరగదు, వేతన శ్రమను దోపిడీచేయని సన్నకారు సొంతదారులు ఎట్టి దౌర్జన్య చర్యలకు గురికారు" అని ఈ స్పష్టం చేసింది.

మితవాద సోషల్ డెమొక్రట్లతోను, సెంట్రిస్టులతోను పూర్తిగా

తెగతెంపులు చేసుకోవటం, కార్మికవర్గ పోరాటం విజయవంతం కావడానికి అత్యవసరమైన తొలి షరతు అని ఈ వేదిక తెలియజేసింది. అదే సమయంలో, సోవియట్ల రూపంలో కార్మికవర్గ నియంతృత్వ భావాన్ని ఇప్పుడు అంగీకరించిన సిండికలిస్టులూ, మొదలైన కార్మికోద్యమంలోని మునుపటి సోషలిస్టేతర శక్తులతో ఒక బ్లాకు ఏర్పరచటం అవసరమని వేదిక తెలియజేసింది.

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ వేదిక కార్మికవర్గ అంతర్జాతీయతా సూత్రాన్ని ధృవీకరించింది. విప్లవ కార్మికవర్గం అంతర్జాతీయ స్థాయిలో తన కార్యక్రమాన్ని సమన్వయం చేసుకోవలసిన తప్పనిసరి అవసరాన్ని, జాతీయ పరిధిలోని వర్గపోరాట లక్ష్యాలను ప్రపంచ విప్లవ లక్ష్యాలతో ముడిపెట్టవలసిన ఆవశ్యకతను నొక్కిచెప్పింది. "ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థ అంతిమ పతనాన్ని వేగిరపరచేందుకై'' సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికవర్గ పోరాటానికి, వలస అర్ధవలస దేశాలలోని పీడిత ప్రజల జాతీయవిముక్తి ఉద్యమాలకు సన్నిహిత సంబంధమును నిరంతరం ఏర్పరచే బాధ్యతను, పీడిత ప్రజల పోరాటాలను బలపరచే బాధ్యతను కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ తనపై వేసుకొన్నది.

అదే సమయంలో కార్మికవర్గ పాలన జయప్రదమైన దేశాలమధ్య, తమ ప్రయోజనాలు ఉమ్మడి రక్షణకు, సోషలిజం నిర్మాణానికిగాను, సన్నిహిత సహకారం, సౌహార్దపూరిత పరస్పర సహకారం అవసరమని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రకటించింది.

ముసాయిదా వేదికపై జరిగిన చర్చలో చాలామంది ప్రతినిధులు పాల్గొన్నారు. వారు అనేకమైన సవరణలను, అనుబంధాలను ప్రతిపాదించారు. తుది మెరుగులు దిద్దిన ఆఖరు పత్రాన్ని ప్రతినిధులందరూ నోటి వోటుతోనే ఆమోదించారు. నార్వేజియన్ కార్మిక పార్టీ ప్రతినిధి ఒక్కరు మాత్రం వోటింగ్‌లో పాల్గొనలేదు.

ఆ మరుసటి రోజున, బూర్జువా ప్రజాస్వామ్యం, కార్మికవర్గ నియంతృత్వాలపై లెనిన్ నివేదికలోని ప్రధాన అంశాలను, నివేదికను కాన్ఫరెన్సు విన్నది. ''రాజ్యమూ, విప్లవమూ,'' ''కార్మికవర్గ విప్లవమూ, స్వపక్ష పరిత్యాగి కౌట్స్కీ'' అనే సుప్రసిద్ధమైన గ్రంథాలలోను, ఇతర రచనలలోను, చేయబడిన అతి ప్రధానమైన సిద్ధాంత, రాజకీయ ప్రతిపాదనలను లెనిన్ వాటిలో విస్తరించాడు. బూర్జువా ప్రజాస్వామ్యం యొక్క వర్గ పరిమితులన్నిటినీ లెనిన్ బహిర్గతం చేసి, దానిని త్రోసివేసి, కార్మికవర్గ నియంతృత్వం ఏర్పడే చారిత్రక ఆవశ్యకతను విశ్వాసజనకంగా నిరూపించాడు. కమ్యూనిజం, సంస్కరణవాదాల మధ్య స్పష్టమైన భేదం ఉన్నదని లెనిన్ తెలియజేశాడు. కార్మికవర్గ విప్లవకారులను అవకాశవాదుల నుండి వేరుచేసే అగాథాన్ని చూపించాడు.

అభివృద్ధి చెందుతున్న విప్లవ సంక్షోభ పరిస్థితిలో కార్మికవర్గ విప్లవాన్ని ఎదుర్కొనడానికిగాను ''శుద్ధ ప్రజాస్వామ్యం''అనే నినాదాన్ని సోషల్ డెమోక్రట్లు వాడారు. "శుద్ధ ప్రజాస్వామ్యం" అనబడేదాన్ని సమర్థిస్తూ బూర్జువావర్గమూ, సోషల్ సంస్కరణవాదులూ చేసిన మోసపు వాదనలన్నిటినీ లెనిన్ తునాతునకలు చేశాడు. ప్రపంచ విప్లవ సంక్షోభం ఏర్పడి, బూర్జువా వ్యవస్థపై సూటిగా దాడి చేయవలసిన సమయం వచ్చినప్పుడు "బూర్జువా నియంతృత్వమో, కార్మికవర్గ నియంతృత్వమో తప్ప, మరో ప్రత్యామ్నాయం లేదు" అని లెనిన్ నొక్కి చెప్పాడు.

"సాధారణ ప్రజాస్వామ్యం," "శుద్ధ ప్రజాస్వామ్యము"లను గురించిన వాదనలన్నీ ఆచరణలో బూర్జువావర్గాన్ని, వారు దోపిడీ ద్వారా పొందిన సౌకర్యాలను రక్షించటానికే ఉద్దేశితమయ్యాయని లెనిన్ నిరూపించాడు. సమావేశ, పత్రికా స్వాతంత్ర్యాలు, సమానత్వం–ఈ నినాదాలన్నీ కార్మికవర్గాన్ని మోస పుచ్చటానికి బూర్జువావర్గము, వారి తొత్తులైన సోషల్ డెమోక్రట్లు వాడుతూ ఉంటారు. పెట్టుబడి పాలనకు ముసుగు కప్పి, బూర్జువావర్గ నియంతృత్వాన్ని సమర్థించటానికి వాడుతుంటారు. భూస్వాముల, పెట్టుబడిదారుల నియంతృత్వం కంటె కార్మికవర్గ నియంతృత్వం మౌలికంగా భిన్నమైందని లెనిన్ నిరూపించాడు. ఈ వ్యత్యాసం ఈ క్రింది అంశంలో ఉన్నదని లెనిన్ వివరించాడు: "భూస్వాముల, బూర్జువావర్గ నియంతృత్వం అంటే, ప్రజానీకంలో అధిక సంఖ్యాకులు, ముఖ్యంగా కార్మికులు చేసే ప్రతిఘటనలను" దౌర్జన్యయుతంగా అణచివేయటం. ఇందుకు విరుద్ధంగా, కార్మికవర్గ నియంతృత్వం అంటే, దోపిడీదారుల ప్రతిఘటనను అనగా జనాభాలో అతిస్వల్ప మైనారిటీ ఐన భూస్వాముల, పెట్టుబడిదారుల ప్రతిఘటనను దౌర్జన్యంతో అణచివేయటం." ఈవిధంగా కార్మికవర్గ నియంతృత్వం శ్రామిక ప్రజల, పీడిత ప్రజల ప్రజాస్వామ్యం ఇదివరకెన్నడూ లేనంతగా విస్తరించడానికి చిహ్నమౌతుంది.

ప్రజలు తమంతగా కనిపెట్టిన కార్మికవర్గ నియంతృత్వం యొక్క ఒక నిర్దిష్ట ప్రభుత్వ రూపం సోవియట్ అధికారం. దోపిడీచేసే అల్ప సంఖ్యాక వర్గం నుండి, దోపిడీకి గురైన అధిక సంఖ్యాకవర్గానికి, అధికారం బదిలీకావటం బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనే పాతపరిధిలో సాధ్యంకాదు. ఆ బదలాయింపు కార్మికవర్గ ప్రజాస్వామ్యం అనే నూతన రూపాలను సృష్టించకుండా వుండజాలదు.

పెట్టుబడిదారీ వ్యవస్థ చేత అత్యంత సాంద్రీకరణా, తర్ఫీదూ పొందిన కార్మికవర్గపు నాయకత్వ పాత్రకు అనువుగా వుండటం సోవియట్ ప్రభుత్వ యంత్రాంగం యొక్క విశిష్ట లక్షణం. "కార్మికవర్గం మాత్రమే, దోపిడీకి గురైన శ్రామిక ప్రజలలోని చెల్లాచెదరైన వెనుకబడిన వర్గాలను ఐక్యంచేసి, నాయకత్వం వహించగలదు" అని చరిత్ర నిరూపించిందని లెనిన్ రాసాడు. కార్మికవర్గ నియంతృత్వాన్ని అమలు జరుపుతూ, సోవియట్ అధికారం మాత్రమే బూర్జువా రాజ్యాంగ యంత్రాన్ని బద్దలు చేసి, శ్రమజీవులకు నిజమైన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని ఇవ్వగలిగింది

అని రష్యాలోని విప్లవానుభవం ధ్రువపరిచింది.

తన నివేదికను ముగిస్తూ లెనిన్ ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు. పెట్టుబడిదారీ విధానంపై సూటిగా దాడికి కార్మికవర్గాన్ని సన్నాహపరుస్తున్న కమ్యూనిస్టు పార్టీల ప్రధాన కర్తవ్యాన్ని ఈ క్రింది విధంగా లెనిన్ ఆ తీర్మానంలో తెలియజేశాడు:

"1. బూర్జువా ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ పద్ధతి స్థానే రాక తప్పని నూతన కార్మిక ప్రజాస్వామ్యపు చరిత్రాత్మక ప్రాముఖ్యాన్నీ, రాజకీయ, చారిత్రక ఆవశ్యకతనూ కార్మిక ప్రజానీకానికి వివరించాలి.

2. పరిశ్రమలలోని అన్ని విభాగాల కార్మికులలోను, సైనికులు, వ్యవసాయ కార్మికులు, పేద రైతులందరిలోను సోవియట్ల నిర్మాణాన్ని వ్యాపింపజేయాలి.

3. సోవియట్లలోపల స్థిరమైన కమ్యూనిస్టు మెజారిటీని ఏర్పరచాలి."

పెట్టుబడిదారీ దేశాలలోని విప్లవోద్యమాల అభివృద్ధిలోని ఇబ్బందులను విశ్లేషిస్తూ, బూర్జువా పార్లమెంటేరియన్, సంస్కరణవాద భ్రమలలో తర్ఫీదు పొందినందున జర్మనీలో రాజకీయ చైతన్యంగల కార్మిక ప్రజానీకానికి సైతం సోవియట్ వ్యవస్థ ప్రాధాన్యం అర్థం కాలేదని లెనిన్ నొక్కి చెప్పాడు. సోవియట్ల వ్యవస్థను మరింతగా విస్తరించటానికి, కమ్యూనిస్టులు తగినంత కృషి చేయటంలేదని కూడా లెనిన్ తెలియజేశాడు. "పట్టణకార్మికులు మాత్రమేకాక, గ్రామీణ కార్మికులు సైతం సంఘటితపడినప్పుడు, ఇదివరకటివలె ట్రేడ్‌యూనియన్లలోను, సహకార సంస్థలలోను మాత్రమేకాక, సోవియట్లలో సంఘటితమైనప్పుడు మాత్రమే విజయం తథ్యం అని చెప్పవచ్చు" అని లెనిన్ చెప్పాడు. చివరకు, సోవియట్లలో స్థిరమైన కమ్యూనిస్టు మెజారిటీ సంపాదించవలసిన ఆవశ్యకతను గురించి లెనిన్ నొక్కి చెప్పాడు. "అప్పుడు మన విజయం తథ్యమౌతుంది. కమ్యూనిస్టు విప్లవానికి వ్యతిరేకంగా ప్రపంచంలోని ఏ శక్తి ఏమీ చేయలేదు. పై కర్తవ్యాలను మనం నెరవేర్చకపోతే, విజయం అంత తేలికగా లభించదు, అది స్థిరంగానూ ఉండదు" అని లెనిన్ వెల్లడించాడు.

బూర్జువా ప్రజాస్వామ్యాన్ని గురించి, కార్మికవర్గ నియంతృత్వాన్ని గురించి లెనిన్ ఇచ్చిన నివేదిక, చేసిన సూత్రీకరణలను కాన్ఫరెన్సు ఎంతో శ్రద్ధగా విన్నది. ఈ సూత్రీకరణను, కమ్యూనిస్టు పార్టీల కర్తవ్యంపై తీర్మానాన్ని, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ మౌలిక పత్రాలుగా కాన్ఫరెన్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం అప్పటికే సాధారణ లక్ష్యాలను, సూత్రాలను నిరూపించుట కవసరమైన అనుభవం సంపాదించిందనీ, తగినంత పరిపక్వతా స్థాయిని చేరుకున్నదనీ నివేదికను, లెనిన్ సూత్రీకరణలను ఏకగ్రీవంగా ఆమోదించటం ద్వారా నిరూపణయింది. కార్యక్రమ పత్రాలలో, పోరాటం యొక్క వివిధ దేశాల కమ్యూనిస్టుల మధ్య భావైక్యతను, కార్యాచరణ ఐక్యతను ఈ పత్రాలు ఏర్పరచాయి. ప్రపంచ కమ్యూనిజం యొక్క ఏకీకృత సిద్ధాంతంగా లెనినిజం యొక్క అంతర్జాతీయ స్వభావాన్ని ఈ పత్రాలు ధ్రువపరచాయి.

కార్యక్రమ పత్రాలు ఆమోదించిన మీదట, లాంఛనగతంగా కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను ఏర్పరచకుండా వాయిదా వేయటానికి ఇక ఎట్టి కారణమూ లేదని స్పష్టమైంది. మార్చి 4 సాయంత్రానికి కొత్త ప్రతినిధులు హాజరుకావటంతో, మూడవ ఇంటర్నేషనల్‌ను స్థాపించే అంశం తిరిగి ప్రస్తావనకు వచ్చింది. ఆస్ట్రియా, హంగరీ దేశాల కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు, స్వీడిష్ వామపక్ష సోషల్ డెమోక్రటిక్ పార్టీ, బాల్కన్ విప్లవ సోషల్ డెమోక్రటిక్ ఫెడరేషన్‌ల ప్రతినిధులు ఒక సంయుక్త ప్రకటన జారీచేశారు. "కనుక మూడవ ఇంటర్నేషనల్‌ను ఏర్పరచటం బేషరతుగా జరగవలసిన కర్తవ్యం. మాస్కో అంతర్జాతీయ కమ్యూనిస్టు కాన్ఫరెన్సు ఈ కర్తవ్యం నెరవేర్చాలి" అని వారా ప్రకటనలో తెలియజేశారు. కార్మికవర్గ నియంతృత్వం కొరకై జయప్రదంగా పోరాడేందుకు, కమ్యూనిజం పతాకం క్రింద కార్మికులను సమీకరించేందుకు, అవకాశవాద బెర్న్ ఇంటర్నేషనల్‌ను త్రోసిపుచ్చేందుకు, మూడవ ఇంటర్నేషనల్‌ను ఏర్పరచటం అత్యవసరం అని వారు తెలియజేశారు.

కాన్ఫరెన్సుకు సమర్పితమైన ఈ ప్రకటన దృష్ట్యా, మూడవ ఇంటర్నేషనల్‌ను ఏర్పరచే సమస్యను సమావేశం తిరిగి చర్చకు తీసుకున్నది. వెంటనే కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను ఏర్పరచరాదనే తన అభ్యంతరాన్ని జర్మన్ కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి ఏబెర్‌లైన్ పునరుద్ఘాటించాడు. ఎత్తుగడల దృష్ట్యా అట్టి నిర్ణయం చేయటానికి సమయం ఇంకా పరిపక్వం కాలేదని భావించాడు. ఐతే, ప్రతినిధులు మాత్రం, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను ఏర్పరచటానికి కాలం పరిపక్వమైందని భావించారు. చిన్న పరిమాణంలో జరిగిన సమావేశం మార్క్సు, అతని సహచరులు మొదటి ఇంటర్నేషనల్‌ను ఏర్పరచటానికి ఆటంకం కలిగించలేదని ఫిన్లండు కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి ఒ. కూసినెన్ జ్ఞాపకం చేశాడు. "నూతన ఇంటర్నేషనల్ బలం విప్లవ కార్మికవర్గ బలంతో సమానంగా ఉంటుంది. ఈ చిన్న సమావేశం బలానికి సమానంగా కాదు" అని కూసినెన్ అన్నాడు.

ఆస్ట్రియా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి కె. స్టైన్‌హార్ట్ ఇలా అన్నాడు: "అన్ని దేశాలకు ఇక్కడ ప్రాతినిధ్యం లేదంటే అది మన తప్పుకాదు. కమ్యూనిస్టు పునాదిపైన ఏదేశాలలో ఒక సంస్థలేదో, ఆ దేశాలలో అట్టి సంస్థలు ఏర్పడేటట్లు చూసేందుకు, మొట్టమొదటగా మూడవ ఇంటర్నేషనల్ శ్రద్ధవహించాలి." ఖచ్చితమైన నిర్ణయం చేయలేక ఊగిసలాడే వారందరికీ స్పష్టతను కలిగించి, విప్లవోద్యమానికి కొత్త ఊతం కలిగించేందుకు మూడవ ఇంటర్నేషనల్ ఏర్పాటు తోడ్పడుతుంది. అని ఐ. రాహ్యా (ఫిన్లండ్ కమ్యూనిస్టు పార్టీ) అన్నాడు.

మూడవ ఇంటర్నేషనల్ ను ఏర్పరుచుటలో జరిగే జాప్యం విప్లవ కార్మికోద్యమంపై నైతికంగాను, రాజకీయంగాను ప్రతికూల ప్రభావం కలిగించవచ్చునని హెచ్. రకోవ్స్కీ (బాల్కన్ విప్లవ సోషల్ డెమోక్రటిక్ ఫెడరేషన్) అన్నాడు. మూడవ ఇంటర్నేషనల్‌ను వెంటనే ఏర్పరచాలనే కోర్కెను ఒ. గ్రిలుండ్ (స్వీడిష్ వామపక్ష సోషల్ డెమోక్రటిక్ పార్టీ), జె. సదూల్ (ఫ్రెంచి కమ్యూనిస్టు గ్రూపు), డి. ఫైన్‌బెర్గ్ (బ్రిటీష్ కమ్యూనిస్టు గ్రూపు), యల్. కషెర్ (స్విస్ కమ్యూనిస్టు గ్రూపు) తదితరులు కూడా వెలిబుచ్చారు.

చర్చ అనంతరం ప్రతినిధులందరి నుండి పేరుపేరునా నోటి ఓటు తీసుకున్నారు. జర్మన్ కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి ఓటింగ్‌లో పాల్గొనలేదు. మిగతావారందరు కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను వెంటనే ఏర్పరచాలంటూ తమ ఓటును నమోదుచేశారు. "అన్ని పార్టీలు, సంస్థలు, గ్రూపులు, మూడవ ఇంటర్నేషనల్‌కు తాము అనుబంధంగా ఉండే విషయమై ఎనిమిది నెలలలోగా తెలియజేసే హక్కున్నది" అని మహాసభ ఆమోదించిన తీర్మానం తెలియజేసింది. జర్మనీ తిరిగి వెళ్లిన తర్వాత తమ పార్టీని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌కు అనుబంధించే విషయమై తాను పూర్తిగా కృషి చేయగలనని, వోటింగ్ తర్వాత ఏబెర్‌లైన్ ప్రకటించాడు. నిజానికి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో చేరిన మొట్టమొదటి పార్టీ జర్మన్ కమ్యూనిస్టు పార్టీ.

1919 మార్చి 4 తర్వాత, అంతర్జాతీయ కమ్యూనిస్టు కాన్ఫరెన్సు కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రథమ (ప్రారంభ) కాంగ్రెసుగా కొనసాగింది. ఆ రోజున అనేక మంది ప్రముఖ త్సిమ్మర్‌వాల్డిస్టుల ప్రతిపాదనపై త్సిమ్మర్‌వాల్డ్ సంస్థను రద్దుచేస్తూ అధికారపూర్వకంగా తీర్మానాన్ని ఆమోదించారు. ఆ సంస్థ ప్రయోజనం తీరినందున అలా చేశారు. ఆ తర్వాత సమావేశాలలో అనేకమైన ముఖ్య నిర్ణయాలు చేశారు. కొమింటర్న్ వేదికలోను, లెనిన్ సూత్రీకరణలలోను, సిద్ధాంత రీత్యా నిరూపించబడిన ప్రతిపాదనలన్నింటినీ నివేదికలు, తీర్మానాలు రూపంగా సవివరంగా, నిర్దిష్ట పరచారు. "సోషలిస్టు' ధోరణులు, బెర్న్ కాన్ఫరెన్సుపట్ల వైఖరి," "అంతర్జాతీయ పరిస్థితి, మిత్రరాజ్యాల విధానం," "సోషలిజం కొరకు జరిగే పోరాటంలో కార్మిక మహిళలు సహకరించవలసిన ఆవశ్యకత"–అనే శీర్షికల క్రింద ఈ నిర్దిష్టీకరణ జరిగింది. ఫిన్నిష్ కమ్యూనిస్టు వై. సిరోలా చేసిన నివేదికమీద "వైట్‌గార్డుల హత్యాకాండ" అనే తీర్మాణాన్ని ఆమోదించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఫలితంగా ఏర్పడే హత్యాకాండను, దోపిడీని అంతం చేయవలసిందిగా ఈ తీర్మానం ప్రపంచ కార్మికులందరికి విజ్ఞప్తి చేసింది. ఈ ప్రథమ కాంగ్రెసు "ప్రపంచ కార్మికులకు కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రణాళిక," "అన్ని దేశాల కార్మికులకు విజ్ఞప్తి" అనే పత్రాలను కూడా ఆమోదించింది.

కొమింటర్న్ ప్రథమ కాంగ్రెసు ఆమోదించిన పత్రాలు రాజకీయాధికారం కొరకు పోరాటానికై సమరశీల కార్యక్రమాన్ని అంతర్జాతీయ కార్మికవర్గానికి అందజేశాయి. కమ్యూనిస్టు పార్టీల ఎత్తుగడల లక్ష్యాలను, ప్రధాన దిశను అవి స్పష్టంగా నిర్దేశించాయి.

సోవియట్ రష్యా, జర్మనీ, ఆస్ట్రియా, హంగరీ, బాల్కన్ విప్లవ సోషల్ డెమోక్రటిక్ ఫెడరేషన్, స్విట్జర్లెండు, స్కాండినేవియా కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులతో కూడిన కార్యవర్గాన్ని (యి.సి.సి.ఐ.) కొమింటర్న్ నాయకత్వంగా ఏర్పరచాలని కాంగ్రెసు నిర్ణయించింది. తీర్మానంలో పేర్కొనబడినట్లు కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సంస్థా నిర్మాణం ఆతర్వాత జరిగే కాంగ్రెసులో జరగవలసి ఉంది. ఈలోగా నిర్మాణ బాధ్యతలు అయిదుగురు సభ్యులతో కూడిన ఒక బ్యూరోకు అధ్యక్షుడుగా, ఎ. బలబానొవా, జె. బేర్జిన్‌లు కార్యదర్శులుగా ధ్రువపరచబడ్డారు.

ప్రథమ కాంగ్రెసు జయప్రదంగా నిర్వహించిన పనిపై వ్యాఖ్యానిస్తూ, తన ముగింపు ఉపన్యాసంలో లెనిన్ ఇలా అన్నాడు: "పోలీసులు ఎన్నో ఆటంకాలు సృష్టించి దౌర్జన్యకాండ సాగించినా, మన, మిక్కడ సమావేశం కాగలిగాము. సమకాలీన విప్లవశకానికి సంబంధించిన అన్ని తక్షణ ప్రధాన సమస్యలపైన తీవ్ర భేదాభిప్రాయాలేవీ లేకుండానే, స్వల్ప వ్యవధిలో, ముఖ్యమైన నిర్ణయాలకు రాగలిగాము. యావత్ప్రపంచంలోని కార్మిక ప్రజానీకం, తమ కార్యాచరణ ద్వారా, ఈ సమస్యలన్నిటినీ నిర్దిష్టంగా ముందుకు తెచ్చి వాటి పరిష్కారానికి పూనుకున్నందుననే, మనమీ విజయాలు సాధించగలిగాము."

కొమింటర్న్ ప్రథమ (ప్రారంభ) కాంగ్రెసుకు గొప్ప అంతర్జాతీయ ప్రాముఖ్యత ఉంది. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏర్పాటును అది అధికార పూర్వకంగా ప్రకటించింది. ప్రారంభమవుతున్న ప్రపంచ కార్మికవర్గ విప్లవం యొక్క తొలి చర్యలను సిద్ధాంత రీత్యా క్రోడీకరించింది. లెనినిజం పతాకం క్రింద ప్రపంచ కార్మికులందరి యొక్క సైద్ధాంతిక, నిర్మాణ ఐక్యతను పునాదివేసింది. సోషల్ జాతీయ దురహంకారవాదుల విద్రోహపూరిత విధానానికి వ్యతిరేకంగా అన్ని రంగాలలోను పోరాడవలసిందిగా కాంగ్రెసు పిలుపిచ్చింది. దొంగ కూలీలతో కూడిన అవినీతికర సంస్థగా బెర్న్ ఇంటర్నేషనల్ కాంగ్రెసు ఖండించింది. సెంట్రిజం నాయకుల నిజస్వరూపాన్ని నిర్దాక్షిణ్యంగా బహిరంగ పరచి, విమర్శించవలసిన అవసరాన్ని, నిర్మాణరీత్యా వారితో తెగతెంపులు చేసుకోవలసిన చారిత్రక అనివార్యతను కాంగ్రెసు నిరూపించింది. ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి సారిగా ఈ కాంగ్రెసులో యూరప్, అమెరికా ఖండాలకు చెందిన కార్మికులు వలస అధీన దేశాలలోని శ్రమజీవులతో ఐక్యమయ్యారు.

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏర్పాటు యొక్క ప్రపంచ చారిత్రక ప్రాముఖ్యతకు అంచనా వేస్తూ లెనిన్ ఇలా వ్రాశాడు: "మూడవ, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను స్థాపించడం... రష్యన్ కార్మికులే కాక, జర్మన్, ఆస్ట్రియా, హంగేరియన్, ఫిన్నిష్, స్విస్ కార్మికులు–ఒక్క

మాటలో చెప్పాలంటే, ప్రపంచ కార్మికులు-గెలుచుకున్నది నమోదు చేయబడిన దస్తావేజు. సరిగ్గా యీ కారణం వల్లనే మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌ను స్థాపించడం నిజంగా స్థిరమైనది." నూతన ఇంటర్నేషనల్ విశిష్ట లక్షణమేమంటే, అదొక దృఢమైన పునాదిపైన, సోవియట్ రష్యాపైన ఆధారపడి ఉంది. కార్మికవర్గ విప్లవ నియంతృత్వానికి, పెట్టుబడిదారీ విధానంపై దాని విజయానికి ప్రతీకగా, అంతర్జాతీయ విప్లవోద్యమంలో సోవియట్ రష్యా నిలచి ఉంది.

చరిత్రలో మూడవ ఇంటర్నేషనల్ స్థానాన్ని లెనిన్ ఈక్రింది మాటలలో నిర్వచించాడు:

"సోషలిజం కొరకై కార్మికవర్గం జరిపే అంతర్జాతీయ పోరాటానికి ప్రథమ ఇంటర్నేషనల్ పునాది వేసింది.

"చాలా దేశాలలో ఉద్యమం విస్తరించి ప్రజా పునాది సంపాదించుకునేందుకు, అవసరమైన క్షేత్రం తయారైన దశకు రెండవ ఇంటర్నేషనల్ తార్కాణం.

రెండవ ఇంటర్నేషనల్ కృషి ఫలితాలను మూడవ ఇంటర్నేషనల్ స్వీకరించింది. అవకాశవాద, సోషల్ జాతీయ దురహంకార, బూర్జువా, పెటీబూర్జువా కుళ్లును కడిగివేసింది. కార్మికవర్గ నియంతృత్వాన్ని అమలు జరపసాగింది." ✦

---

(....41 పేజీ తరువాయి)

కోసం ఐక్య కార్యాచరణను రూపొందించుకోవడం సాధ్యమవుతుంది. కాబట్టి నీల్‌లాల్ జెండాల మధ్య ఐక్యత అనేది సైద్ధాంతిక ఐక్యతగా మనం తీసుకోరాదు. కేవలం పీడిత ప్రజలు కలిసి పోరాడడానికి అవసరమైన విశాలమైన కార్యాచరణగానే ఆ ఐక్యతను చూడాలి.

ఈ సైద్ధాంతిక విభేదాలవలన తరచుగా వర్గము కులానికి మధ్య గల సంబంధం విషయంలో విభేదాలు తలెత్తుతుంటాయి. సామాజిక న్యాయం సాధించకుండా సోషలిజానికి లేదా నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడం సాధ్యం కాదంటూ కులనిర్మూలనే ముందుగా జరగాలనే షరతు విధించడం ద్వారా ఐక్యతకు అవరోధాలు ఏర్పడుతున్నాయి. సామాజిక న్యాయం అనేది ఒక ముఖ్యమైన ప్రజాస్వామిక డిమాండ్. అయితే భూస్వామ్య విధానం, దళారీ నిరంకుశ విధానం దేశంలో నాశనం చేయకుండా నిజమైన ప్రజాస్వామ్యం సాధించడం సాధ్యం కాదు. ఈ వర్గాలను అధికారం నుండి గద్దె దించకుండా, వర్గపోరాటం ప్రధాన ఇరుసుగా లేకుండా సాధ్యం కాదు. కాబట్టి వర్గపోరాటాన్ని ప్రధానంగా ఏంచుకుంటూ ముందుకు సాగుతూనే సామాజిక న్యాయం కోసం నిరంతరం విప్లవకారులు పోరాడవలసిన అవసరం ఉంది. అదే సందర్భంలో సామాజిక న్యాయంకోసం చేసే పోరాటం కుల నిర్మూలన దిశలో సాగాలి. కులం సంఘటితమయ్యే దిశలో ఎట్టిపరిస్థితుల్లో సాగకూడదు. అంబేద్కర్ కూడ ఇదే విషయాన్ని నొక్కి చెప్పాడు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నిటిలోను వర్గపోరాటంతో పాటు కులనిర్మూలనా పోరాటాలు కూడా జరగాలి.

భారతదేశంలో ఉన్న నిర్దిష్ట పరిస్థితుల రీత్యా ప్రజలు వర్గాలు గానే కాక మహిళలు, దళితులు, ఆదివాసీలు, మత మైనార్టీలు అనే ముఖ్యమైన సామాజిక వర్గాలుగా విడివడి ఉన్నారు. వీరందరికి వారి వారి ప్రత్యేక పరిస్థితులున్నాయి. వర్గ పీడనకు తోడు ప్రత్యేక రకాలైన ఆర్థికేతర పీడనకు గురవుతారు. ఈ ప్రత్యేక సమస్యలపై చేపట్టే పోరాటాలన్నీ ప్రజాస్వామిక ఉద్యమంలో భాగంగా ఉంటాయి. ప్రస్తుతం పర్యావరణం, విస్థాపన వంటి సమస్యలను కూడా ఇందులో చేర్చుకోవాలి ఈ అవగాహనకు భిన్నమైనటువంటి అస్థిత్వ సిద్ధాంతాన్ని మనం వ్యతిరేకించాలి. ఈ సిద్ధాంతం వర్గాల అస్తిత్వాన్ని గుర్తించ నిరాకరిస్తూ కేవలం గ్రూపులు (ఐడెంటిటీస్) మాత్రమే అస్తిత్వంలో ఉన్నాయంటుది. పీడిత ప్రజానీకం వివిధ గ్రూపులుగా విడిపోయి ఉండడం వలన వారు సమిష్టి పోరాటాన్ని సాధించడం అసాధ్యమని సిద్ధాంతీకరిస్తుంది. ఏ గ్రూపుకు ఆ గ్రూపు తన ప్రయోజనాల కొరకు మాత్రమే పోరాడాలని, సమిష్టిగా మొత్తం పీడిత ప్రజానీకాన్ని ఐక్యం చేసి పోరాటాలను చేపట్టడం అవసరం లేదని, అసాధ్యమని చెపుతుంది. దీనివలన అస్తిత్వవాద సిద్ధాంతం పీడిత ప్రజల ఐక్యతకు అడ్డంకిగా ఉంటున్నది. కొందరు మార్క్సిజాన్ని, మరికొందరు మార్క్సిజం-అంబేద్కరిజాన్ని కలిపి సృజనాత్మకంగా మన దేశ పరిస్థితులకు అన్వయిస్తున్నామని చెప్పుకుంటూ 'అస్తిత్వవాద సప్త వర్గ కూటమి' సిద్ధాంతం పేరుతో వర్గ అస్థిత్వాన్ని పూర్తిగా అభావం చేసే కుల విప్లవాన్ని ముందుకు తెస్తున్నారు. కాబట్టి అస్తిత్వవాద సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తూ వివిధ సామాజిక బృందాల ప్రజాస్వామిక ఆకాంక్షలకై జరిగే పోరాటాలకు నాయకత్వం వహించాలి.

కులాలుగా సంఘటితం అయ్యే పెటీబూర్జువా కుల సంఘాల ప్రమాదం నుండి జాగ్రత్తపడుతూ కులనిర్మూలనే లక్ష్యంగా పోరాడాలి.

మనం కులాన్ని ఉపరితల అంశంతో పాటు, పునాది అంశంగా గుర్తించడం కులనిర్మూలనకు ప్రత్యేక నిర్మాణ పోరాట రూపాలను ఏర్పర్చడం, సిద్ధాంతంలో నిర్మాణంలో మనం సాధించిన ఒక ముందడుగని చెప్పాలి. దీని ప్రకారం మనం కులాన్ని పునాదిలోను, ఉపరితలంలోను ఎదుర్కొంటూనే ఉండాలి. పునాదిలో భూస్వామ్య, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడడం ద్వారానే కులాన్ని పునాదిలో దెబ్బతీయగలుగుతాము. ఉపరితలంలో నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూనే ఉండాలి. ఈ విధానం ద్వారా కులాన్ని నిర్మూలించడం కొరకు దగ్గర దారి దొరుకుతుంది.

నీల్-లాల్ జెండా ఐక్యత దేశంలో సామాజిక న్యాయం కోసం మాత్రమే పోరాడుతుంది. కాని లాల్ జెండా ఈ భూ ప్రపంచంపై సకల దోపిడి, పీడన అంతం చేసి దేశంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా సోషలిజం తన అంతిమ లక్ష్యమైన కమ్యూనిజం స్థాపన కోసం పోరాడుతోంది. ✦

అమరుల జీవిత చరిత్ర

# మార్చి 2న తడపాల గుట్టల్లో గ్రేహౌండ్స్ బలగాలను వీరోచితంగా ప్రతిఘటించి అమరులైన 10 మంది కామ్రేడ్స్‌కు జోహార్లు!

**వాళ్లు అమరులు**. వాళ్లు మొన్ననే యుద్ధానికి బయలుదేరారు. నిన్న యుద్ధం చేసారు.వాళ్లు అమరులయ్యారు. నేడు మనం వారిని సంస్మరించుకుంటున్నాం. తెలిసి తెలిసి వాళ్లు యుద్ధాన్ని ఎంచుకున్నారు. తల్లితండ్రులకు చెప్పి వచ్చారు. ఊరు ఊరంతా (జనతన సర్కార్‌గా మారిన) వారి ప్రజారాజ్య మంతా ఆనందంగా, ఉత్సాహంతో వారిని అభినందించి పీఎల్‌జీఏలోకి భర్తీ చేసి పంపించింది.

యుద్ధం నడుమ, దాడులను ఎదుర్కొంటూ, నష్టాలను చూస్తూ మరిన్ని కష్టాలు నష్టాలు ఉంటాయని తెలిసి తెలిసి తమ పిల్లల్ని పంపే కర్తవ్యాన్ని చేపట్టారు. జీవి పుట్టుక లాగే మరణం సహజం కావచ్చు. ప్రకృతి సిద్ధమైన మరణానికి కాదుగాని ప్రకృతిని కాపాడడానికి, అందులో సహజంగా జీవించాలనుకుంటున్న జన సమూహాలను కాపాడాలని ప్రకృతిని, ప్రపంచాన్ని, భవిష్యత్‌ను కాపాడాలని వాళ్లు ఆ పిల్లల్ని యుద్ధరంగానికి పంపారు. ఉద్యమాన్ని కాపాడండి అని, నాయకత్వానికి రక్షణ కల్పించండని చెప్పి పంపారు. నియమాలు పాటించాలని, క్రమశిక్షణ తప్పకూడదని, కర్తవ్యాన్ని విడవకూడదని, ప్రాణత్యాగానికి సిద్ధపడాలని ప్రజా సభలో అర్థం చేయించి పంపారు. పేగు బంధాన్ని, రక్త సంబంధాన్ని, హృదయ స్పందనను ఉద్యమ పథాన పంపారు. బిడ్డలు అమరులైతే వాళ్ల నైపుణ్యాలను, ధైర్య సాహసాలను ఎత్తిపట్టి మళ్లీ ఇప్పుడు కొత్త చిగుర్లాంటి లేలేత ప్రాయంగల తర్వాతి వరుస బిడ్డలను అన్నల, అక్కల బాటన నడవండని పంపిస్తున్నారు. నష్టాలు కొనసాగుతున్నా పంపడం ఆగలేదు. యుద్ధం జరుగుతూనే ఉంది. ఇది ఇవ్వాల్టి చరిత్ర కాదు. వేలయేండ్ల నుండి కొనసాగుతున్న, రగులుతున్న చరిత్ర.

వాళ్లు చివరి క్షణం వరకు కర్తవ్య నిర్వహణకు కట్టుబడిన వైనాన్ని కొద్దిగానన్నా చెప్పాలి. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా అమలుచేస్తున్న దాడుల్లో ఒకటి 2005-2006లలో ప్రారంభమైన సల్వాజుడుం పథకం పూర్తిగా విఫలమయ్యింది. 2009 సెప్టెంబర్‌లో ప్రారంభమై నడిచిన గ్రీన్‌హంట్ ఆపరేషన్ మొదటి దశ, రెండవ దశ, 3వ దశ కొనసాగుతూ అందులో భాగంగా "సమాధాన్-2022" గా నడుస్తుంది. దాని కోసం వేలకోట్ల రూ॥ నిధులు, లక్షకుపైగా బలగాలు, ఆధునిక ఆయుధాలు, నూతన సాంకేతికత, నాయకత్వం తలలపై లక్షలాది రూపాయల వెలతో ప్రకటనలు, ఎల్ఐసీ పాలసీ పేరిట నూతన ఎత్తుగడలు, మానసిక యుద్ధం అన్నీ యుద్ధ ప్రాతిపదికనే నడుస్తున్నాయి. అయినా ఇది ప్రజాయుద్ధం, గెరిల్లా యుద్ధం కనుక ప్రజా శత్రువులకు దీనిని అణచడానికి వీలుకావడం లేదు.

కర్రిగుట్టలపైకి వందల సంఖ్యలో వచ్చిన గ్రేహౌండ్స్ బలగాలు మార్చి 2న ఉదయం 6 గంటల 10 నిముషాలకు తడపాల, డోలీ మధ్య గల దేరాను చుట్టుముట్టారు. శత్రు బలగాల ఫైరింగ్, షెల్లింగ్ మధ్యనే వీరోచితంగా ప్రజాగెరిల్లా బలగాలు ప్రతిఘటిస్తూ పోరాడారు. శత్రువుకు ధీటుగా ఫైరింగ్ చేసారు. అమరుడు మల్లేష్ తన ఏకే 47 ఆయుధంతో నిప్పులు కక్కించి ముగ్గురు గ్రేహౌండ్స్ పోలీసులను తీవ్రంగా గాయపరిచాడు. రిట్రీట్ అవుతున్న క్రమంలో ఎల్ఎమ్‌జీతో ప్రజాగెరిల్లా బలగాలు రాపిడ్ ఫైరింగ్ చేసి శత్రు బలగాలను వెనక్కి నెట్టారు. అడ్వాన్స్ అవుతున్న బ్యాచ్ మీద జోగాల్ ఫైర్ చేయడంతో ఒక పోలీసు అక్కడే ప్రాణాలు విడిచాడు. మిగిలిన వాళ్లు వెనక్కి పరిగెట్టారు. ఆ విధంగా చివరి క్షణం వరకు మిగిలిన కామ్రేడ్స్‌ను క్షేమంగా రిట్రీట్ చేయిస్తూ 10 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. పెద్ద నష్టాన్ని తప్పించి ఉద్యమాన్ని కాపాడారు.

## మైదాన ఆర్గనైజర్, క్రాంతి పత్రిక స్టాఫ్ కా॥ ప్రభాకర్ (దాడబోయినస్వామి)కు అరుణాంజలి

కా॥ దాడబోయిన స్వామి అలియస్ ప్రభాకర్‌ది వరంగల్ అర్బన్‌జిల్లా, రాంపేట గ్రామంలో ఒక పేద కుటుంబంలో 53 సం॥రాల క్రితం జన్మించాడు. కుటుంబంలో ఇద్దరన్నల తరువాత మూడో సంతానం. ఐదవ తరగతి వరకు రాంపేట గ్రామంలో, ఇంటర్ కాజీపేటలో, డిగ్రీ కాకతీయ యూనివర్శిటీలో పూర్తి చేశాడు. హన్మకొండ బిఎడ్ కాలేజీలో బిఎడ్ పూర్తి చేశాడు. కా॥ ప్రభాకర్ చదువుకొంటున్న రోజుల్లో రాడికల్ విద్యార్థి యువజనోద్యమం బలంగా ఉండడంతో విప్లవ రాజకీయాలు అప్పటి నుండి బలంగా నాటుకొన్నాయి. రాంపేట గ్రామంలో రాడికల్ విద్యార్థి, యువజనోద్యమాలను నడిపిస్తూ విస్తృతంగా నిర్మాణం చేసిన క్రాంతి రణదేవ్, శ్యాంసుందర్ రెడ్డి వంటి నాయకులు విప్లవోద్యమాలు నిర్మించారు. వీరి ప్రభావంతో కా॥ ప్రభాకర్ చిన్నవయసు నుండే విప్లవకారుడుగా తీర్చిదిద్దబడ్డాడు. రాంపేట గ్రామంలో యువజన సంఘాన్ని ఏర్పర్చి దానికి నాయకత్వం వహించాడు. అక్కడ ఒక స్టడీ సర్కిల్‌ను ఏర్పర్చి విప్లవ రాజకీయాలను ప్రోత్సహించేవాడు. గ్రామంలో విద్యా వాలంటీర్‌గా పనిచేస్తూ అందరికి స్వచ్ఛందంగా

విద్య నేర్పేవాడు. పిల్లలకే కాకుండా పెద్దలకు కూడా చదువు నేర్పేవాడు.

గ్రామంలో తను ఒక్కడే విద్యావంతుడు కావడం, అందరికి చదువు చెప్పడం మూలంగా తనను గ్రామ ప్రజలంతా సారూ అని పిలుచుకొనే వారు. ప్రజలకు ఏ అవసరం వున్నా పరిష్కరించేవాడు. గ్రామంలో కూడా సౌమ్యంగా, మర్యాద పూర్వకంగా ఉండడం మూలంగా ప్రజలంతా కా॥ ప్రభాకర్‌ను చాలా గౌరవించేవారు.

ప్రభాకర్‌ది మూడు దశాబ్దాల విప్లవ జీవితం. 1885 నుండి యవ్వనంలో అనేక విప్లవ కార్యక్రమాలలో పాల్గొంటూ వచ్చాడు. 1990-93లో కొరియర్‌గా పనిచేస్తూ వచ్చాడు. పార్టీ అడవి, మైదాన, పట్టణోద్యమాలను సమన్వయంతో నడిపిస్తూ గ్రామాలల్లో జరిగే రైతాంగ పోరాటాలకు పట్టణ ప్రజల క్రియాశీల మద్దతును కూడగట్టింది. దీంట్లో కా॥ ప్రభాకర్ తనకు తెలిసిన కుటుంబాలను, వివిధ రకాల సెక్షన్ల ప్రజలకు రాజకీయాలు చెపుతూ పార్టీ గొడుగుకిందకు తెచ్చాడు. 1998 నాటికి అర్బన్, మైదాన ప్రాంతంలో శత్రువు నిర్బంధం పెరగడంతో రాడికల్ విద్యార్థి, యువజన సంఘాల నాయకత్వాన్ని, సభ్యులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్యలు చేయడం మూలంగా 1998 నాటికే అర్బన్, మైదాన ప్రాంతాలలో విప్లవోద్యమం దెబ్బతింటూ వచ్చింది. దీనితో ఆర్గనైజర్లను, మైదాన ప్రాంత దళాలను రిట్రీట్ చేయడంలో అక్కడి ప్రజాసంఘాలలో వుంటూ రహస్యంగా పని చేశాడు. ప్రభాకర్ డిఎస్సీలో సెలక్టై ప్రభుత్వోద్యోగం వచ్చింది. ఇదే సమయంలో శత్రువు నిర్బంధం పెరగడంతో 2001లో పూర్తికాలం కార్యకర్తగా దళంలో చేరాడు. నిర్బంధం మూలంగా 2005లో ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాలను కలిపి (కేకేడబ్ల్యూ) డివిజన్‌గా ఏర్పాటు చేయడం జరిగింది. 2006 లాస్ట్‌లో కరీంనగర్, వరంగల్ మైదానాన్ని కలిపి ముగ్గురుతో కూడిన మైదాన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కా॥ ప్రభాకర్ సభ్యునిగా ఉంటూ ఏసీఎస్ స్థాయిలో 2007 లాస్ట్ వరకు మైదాన ఆర్గనైజేషన్ వర్క్ చేశాడు.



కా॥ ప్రభాకర్ పోకడలను పసిగట్టిన తన తల్లిదండ్రులు ప్రభాకర్‌కు పెండ్లి చేసి కళ్ళెం వేయాలని షాపెల్లి గ్రామానికి చెందిన రేణుకతో పెండ్లి చేశారు. పెండ్లి అయిన తర్వాత కూడా కా॥ ప్రభాకర్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం పెరిగింది తప్ప తగ్గలేదు.

2001లో మైదానంలో చిన్న చిన్న టీంలు (1+2) సభ్యునిగా, 2003లో తను జనగామ ఏరియా బాధ్యుడిగా నియమించబడి 2009 వరకు పనిచేశాడు. ఈ సమయంలో తనతో పనిచేసిన సహచరులు ఉద్యమం వదిలేసి పారిపోతే తను ఒక్కడే ఒంటరిగా తిరిగిన సందర్భాలు అనేకం వున్నాయి. విప్లవ రాజకీయాల నుండి ఏనాడు బలహీన పడలేదు. రాజకీయ స్థిరత్వంతో మడమ తిప్పక పోరాడాడు. మైదానంలో ఆర్గనైజేషన్‌కు ప్రతికూలతలు ఏర్పడడం, స్వీయాత్మక శక్తులు తగ్గి తను ఒక్కడే మిగిలి వుండడంతో 2009లో మైదాన ఆర్గనైజేషన్‌ను కేకేడబ్ల్యూ కమిటి రద్దు చేసింది. దీనితో 2009లో ఎటూర్ నాగారం, మహదేవ్‌పూర్ ఏరియా కమిటీ కార్యదర్శిగా సంవత్సర కాలం పనిచేశాడు. ఆ తర్వాత 2010 డీసీఎమ్‌గా ప్రమోట్ చేయబడి పార్టీ అవసరాల రీత్యా సీఆర్‌బీ ప్రెస్‌కు 2012లో బదిలీ అయినాడు.

2012 నుండి 2018 మార్చి వరకు కామ్రేడ్ ప్రభాకర్ సీఆర్‌బీ పరిధిలో నడుస్తున్న 'క్రాంతి' పత్రిక స్టాఫ్‌లో పనిచేసాడు. ఒక సంవత్సరం ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా పని చేసాడు. ఒక ప్రత్యేక విభాగంలో నిర్దిష్టమైన పనిలో కేంద్రీకరించి, ఆ రంగంలో అవసరమైన టెక్నికల్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నాడు. సమాచారం సేకరించి అందరికి వాటిని బాధ్యతగా అందించేవాడు. నాయకత్వ కామ్రేడ్స్ ఇచ్చిన అనేక రకాల టైపింగ్, ప్రింటింగ్ పనులను సకాలంలో పూర్తి చేసేవాడు. కంప్యూటర్ సమస్యలను తను స్వయంగా పరిష్కరించుకోవడంతో పాటు ఇతరులకు వచ్చే అటువంటి సమస్యలను పరిష్కరించేవాడు. సాఫ్టువేర్స్‌కు, రీడింగ్ ఫైల్స్‌ను, దృశ్య, శ్రవణ సమాచారానికి ఒక మంచి వనరుగా ఉండేవాడు. సీఆర్‌బీ పరిధిలోని అన్ని జోన్స్‌కు చెందిన కేడర్‌కు ప్రభాకర్ పరిచయం, స్నేహం సర్వ సాధారణ విషయమే. తెలంగాణ, ఏఓబీ జోన్స్‌లో క్లాసులు జరిగినపుడు పై స్థాయి కామ్రేడ్స్‌తో కూర్చుని చర్చలు చేసేవాడు. నాయకత్వంతోను, కేడర్‌తోను ఒకే విధంగా ప్రేమగా ఉండేవాడు. కా॥ ప్రభాకర్ స్వభావ రీత్యా మితభాషి. తను మాట్లాడే తక్కువ మాటల్లో కూడా ప్రేమ, అప్యాయత, అనురాగం ఉట్టి పడేది. తనకన్నా చిన్నవాళ్లను కూడా గౌరవించడం కా॥ ప్రభాకర్‌కు వెన్నతో పెట్టిన విద్య. మహిళలంటే ఎంతో ప్రేమగా ఉండేవాడు. సమాన భావాన్ని చూపుతూనే వాళ్ళకు వచ్చే అనారోగ్య సమస్యలు విన్నప్పుడు సూచనలు, సలహాలతో పాటు ఫిట్‌నెస్‌గా ఉండటానికి పార్టీ ఇచ్చే స్పెషల్ ఫుడ్ ప్రాముఖ్యతను నొక్కి చెప్పేవాడు. విప్లవ స్ఫూర్తితో చైతన్యవంతమైన కా॥ ప్రభాకర్ విజ్ఞత, ఆర్ద్రత, ఆప్యాయతలు నిండుగా మెండుగా దండిగా గల ప్రభాకర్ వినమ్రతకు, అంకితభావానికి పెట్టింది పేరు. ఎదుటి వారిలో మంచిని గ్రహించి వారిని అభిమానించే అతడు క్రమంగా అటువంటి వారంతా అభిమానించే వాడిగా మారిపోతాడు.

## ప్రజాయుద్ధ వీరుడు పొడియం బామన్ (మల్లేష్)కు విప్లవ జోహార్లు



కా॥ మల్లేష్ (పొడియం బామన్) ఛత్తీస్‌గడ్ రాష్ట్రం, నారాయణపూర్ జిల్లా, ఓర్ఛా బ్లాక్, డుంగా గ్రామంలో పుట్టాడు. ఆయన వయసు సుమారు 28 సంవత్సరాలు.

కా॥ మల్లేష్ సీఆర్‌సీ-2 కంపెనీలో సెక్షన్ కమాండర్. 2 మార్చ్ 2018న శత్రువు ఇన్ఫర్మేషన్‌తో మకాంపై చేసిన చుట్టివేత దాడిని వీరోచింతంగా ప్రతిఘటిస్తూ అమరుడయ్యాడు.

కా॥ మల్లేష్ బాలల సంఘంలో కమాండరుగా పనిచేసాడు. పెద్దయ్యాక గ్రామ రక్షణ దళం (జీఆర్‌డీ)లో చేరాడు. సల్వాజుడుం దాడులను ఎదుర్కోనడానికి మిలీషియా, ప్రజల మద్దతుతో ఎందరో సల్వాజుడుం నాయకులను టార్గెట్ చేసి ఖతం చేయడంలో కా॥ మల్లేష్ ముందుండేవాడు.

పోలీసుల పై బర్మార్‌లతో ఫైరింగ్ చేయడం, మైన్స్ పేల్చడం, బాణాలు వేయడం, బొందలు తవ్వి ఇనుప సువ్వలు ఏర్పాటు చేయడంతో పోలీసులకు కునుకు లేకుండా చేసేవాడు. కా॥ మల్లేష్ పీఎల్‌జీఏ బలగాలతో కూడా మిలటరీ దాడులలో పాల్గొన్నాడు.

కా॥ మల్లేష్ 2005లో పూర్తికాలం కార్యకర్తగా పార్టీలో చేరాడు. ఒక సంవత్సరం పాటు ఇంద్రావతి ఏరియాలో పనిచేసి పార్టీ అవసరాల రీత్యా 2007లో ఏఓబీలో నిర్మాణం చేసిన సీఆర్‌సీ-1 కంపెనీకి కా॥ మల్లేష్‌ను పార్టీ పంపించింది. కా॥ మల్లేష్ సీఆర్‌సీ-1 కంపెనీలో ఉండగా నయాగడ్ దాడితో పాటు ఆ కంపెనీ చేసిన అనేక మిలటరీ చర్యలలో పాల్గొన్నాడు. పీఎల్‌జీఏ విస్తరణలో భాగంగా మన పార్టీ తెలంగాణ, దండకారణ్యం సరిహద్దులలో నిర్మాణం చేయ తలపెట్టిన సీఆర్‌సీ-2 కంపెనీకి వచ్చిన పీఎల్ (ప్లాటూన్)లో కా॥ మల్లేష్ సెక్షన్ డిప్యూటీ కమాండర్‌గా బదిలీపై వచ్చాడు.

2008 బండా ఆంబుష్‌తో పాటు, 2009లో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నాల్కో (దమన్ జోడి) రైడ్, తెలంగాణలోని చర్ల మండలం సత్యానారాయణపురం స్టేట్‌బ్యాంక్‌పై దాడి, 2010లో ముకరం ఆంబుష్‌లోను, ఏఓబీలో నారాయణపట్నా భూ పోరాటానికి మద్దతుగా ఉంటూ అనేక మిలటరీ చర్యలలో పాల్గొన్నాడు. అదే ప్రాంతంలో భూస్వాములపై చేసిన దాడులలో ముందున్నాడు. 2012 డిసెంబర్‌లో తెలంగాణ బార్డర్‌లో గ్రేహౌండ్స్ పోలీసులపై చేసిన అపార్చునిటీ ఆంబుష్‌లో తన ప్లాటూన్ కమాండర్ ఆదేశాలను పాటిస్తూ తన సెక్షన్‌ను సమర్థవంతంగా నడిపించాడు.

కా॥ మల్లేష్ కంపెనీలోనే పని చేస్తున్న కా॥ రత్నంతో 2010లో పెళ్లి జరిగింది.

2013 మేలో దండకారణ్యంలోని దర్భ డివిజన్‌లో సల్వాజుడుం గుండా కాంగ్రెస్ నాయకుడు మహేంద్రకర్మతో పాటు మాజీ కేంద్రమంత్రి వీసీ శుక్లాను ఖతం చేయడంలో తన సెక్షన్‌కు నాయకత్వం వహించాడు. ఈ ఆంబుష్‌లో ఎలాంటి నష్టం లేకుండా ఆంబుష్‌ను విజయవంతం చేశారు.

మార్చి 2న కా॥ మల్లేష్ తన వద్ద ఉన్న ఏకేతో శత్రువును ముందుకు రాకుండా అడ్డుకుంటూ గెరిల్లా సహచరులందరినీ సురక్షితంగా రిట్రీట్‌చేస్తూ సహచరిని కా॥ రత్నతో పాటూ అసువులుబాసాడు.

ఆయనలోని సమిష్టితత్వం అంకితభావం కమ్యూనిస్టులకు, పార్టీ క్యాడర్లకు ఒక ఆదర్శంగా నిలుస్తుంది.

## విప్లవోద్యమ చైతన్య ప్రతీక కా॥ పూనెం జోగాల్‌కు విప్లవ జోహార్లు



కామ్రేడ్ పూనెం జోగాల్ బీజాపూర్ జిల్లా, ఊసూర్ బ్లాక్, బానగూడెం పోలీసు స్టేషన్ పరిధిలోని ఊర్‌నార్ గ్రామంలో 26 సంవత్సరాల క్రితం ఒక పేద ఆదివాసి రైతు కుటుంబంలో జన్మించాడు. కా॥ జోగాల్ చిన్న వయస్సులో తల్లిదండ్రులు చనిపోయారు. ఒక అక్క, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు.

కా॥ జోగాల్ బాలల సంఘంలో, తర్వాత సీఎన్‌ఎమ్ (చేతనా నాట్య మంచ్)లో పనిచేస్తూ 2006 డిసెంబర్‌లో పూర్తికాలం కార్యకర్తగా పార్టీలో చేరాడు. ఏఓబీలో నిర్మాణం చేసిన సీఆర్‌సీ-1 కంపెనీలో చేరాడు. అలాగే పీఎల్‌జీఏను విస్తరించడంలో భాగంగా 2008లో నిర్మాణం చేసిన సీఆర్‌సీ-2 కంపెనీకి పార్టీ బదిలీ చేసింది. మధ్యలో రెండు సంవత్సరాలు ఒక నాయకత్వ కామ్రేడ్ రక్షణ దళానికి కమాండర్‌గా కూడా పనిచేశాడు.

కంపెనీలో ఉండగా జరిగిన నయాగడ్ రైడ్‌లోను, 2008లో సుక్మా జిల్లా, కుంట ఏరియాలో జరిగిన బండా ఆంబుష్, 2009లో ఏఓబీ కోరాపుట్ జిల్లా నాల్కో రైడ్‌లో, 2010లో జరిగిన ముకురం (తాడిమెట్ల) ఆంబుష్‌లోను, 2012 డిసెంబర్‌లో తెలంగాణలోని చర్ల మండలం కుర్నపల్లి వద్ద చేసిన అపార్చునిటీ ఆంబుష్‌లో, 2013 మేలో సల్వాజుడుం నాయకుడు మహేంద్రకర్మను లక్ష్యంగా నిర్వహించిన జీరంఘాటి ఆంబుష్‌లో పాల్గొన్నాడు.

కంపెనీలో 2013 చివరలో 1వ ప్లాటూన్‌లో సెక్షన్ డిప్యూటీ కమాండర్ బాధ్యతను, 2016లో జరిగిన కంపెనీ రెండవ ప్లీనంలో సెక్షన్ కమాండర్ బాధ్యత తీసుకొని పనిచేసాడు.

కా॥ జోగాల్‌కు 2014లో ఆదే నిర్మాణంలో పనిచేస్తున్న కామ్రేడ్‌తో పెళ్లి జరిగింది.

కా॥ జోగాల్ రాజకీయాలు నేర్చుకోవడంలో చొరవ కనబరిచేవాడు. అట్లాగే తన రాజకీయ చైతన్యం పెంచుకోవడంలో భాగంగా అనేక రాజకీయ, మిలటరీ శిక్షణ తరగతులలో పాల్గున్నాడు. కా॥ జోగాల్ మిలటరీ రంగంలో ఉన్నప్పటికీ ఏ ప్రాంతానికి పోయినా అక్కడ ప్రజలతో కలసిపోతూ వాళ్ల భాష నేర్చుకొని, వాళ్ల భాషలోనే రాజకీయాలు చెప్పడానికి ప్రయ్నతం చేసేవాడు.

2 మార్చ్ 2018న పూజారి కాంకేర్ సమీప అడవిలో శత్రువు ఇన్ఫర్మేషన్‌తో మకాంపై చేసిన దాడిలో పోరాడుతూ అమరుడయ్యాడు.

కా॥ జోగాల్ కన్న కలలను ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకుపోవడమే మన ముందున్న తక్షణ కర్తవ్యం.

## ప్రజా గెరిల్లా డాక్టర్, సెక్షన్ కమాండర్ కా॥ సోడి పాండే (రామే)కు విప్లవ జోహార్లు!



సుక్మా జిల్లా, కుంట బ్లాక్, వీరపురం గ్రామంలో ఒక మధ్య తరగతి రైతు కుటుంబంలో కా॥ రామే పుట్టింది. కా॥ రామే చిన్న వయసు నుండి బాలల సంఘంలో, మిలీషియాలో, తర్వాత కేఏఎమ్ఎస్‌లో పనిచేసింది. 2006లో పూర్తికాలం కార్యకర్తగా గొల్లపల్లి ఎల్ఓఎస్‌లో చేరింది, తర్వాత 8వ ప్లాటూన్‌కు, 2007లో ఏఓబీలో నిర్మాణం చేసిన సీఆర్‌సీ-1 కంపెనీలో, తర్వాత 2008లో పీఎల్‌జీఏ విస్తరణలో భాగంగా నిర్మాణం అయిన సీఆర్‌సీ-2 కంపెనీకి బదిలీ అయ్యింది. 2012లో కా॥ రామేను పీపీసీ (ప్లాటూన్ పార్టీ కమిటీ)లోకి తీసుకొని కంపెనీ డాక్టర్‌గా నియమించ బడింది.

ఒడిశా రాష్ట్రంలోని నయాగడ్ దాడిలో, 2008 కుంట ఏరియాలో బండా ఆంబుష్, 2009లో ఒడిశాలోని దమన్‌జోడి (నాల్కో) రైడ్‌లో, 2010లో నారాయణపట్నా భూ పోరాటానికి మద్దతుగా, 2015లో దండకారణ్యం బీజాపూర్ జిల్లా జప్పూర్ అపార్చునిటీ ఆంబుష్‌లో, ముఖ్యమైన దైగూడ ఆంబుష్‌లల్లో పాల్గొంది.

కా॥ రామే 2010లో తోటి కామ్రేడ్‌ను ఇష్టపడి పెళ్లి చేసుకుంది. అతను వేరే అమ్మాయిని తీసుకుని 2017లో రామేను మోసం చేసి పార్టీ నుండి పారిపోయాడు. 2018 జనవరిలో కంపెనీ పార్టీ కమిటి కా॥ రామేను సెక్షన్ కమాండర్ బాధ్యతలు ఇచ్చింది.

కా॥ రామే డాక్టర్ బాధ్యతలతో పాటు మిలటరీ చర్యలలో కూడా పాల్గొనేది. ఏ ప్రాంతం వెళ్లినా అక్కడ ప్రజాల భాష నేర్చుకొని వారితో మాట్లాడేది. అట్లాగే ప్రజలకు వైద్యం చేసి ప్రజల మనసును కూడా గెలుచుకుంది.

కా॥ రామే పూజార్ కాంకేర్ చుట్టివేత దాడిలో తన సహచర కామ్రేడ్స్‌తో కలిసి పోరాడుతూ తన ప్రాణాలర్పించింది.

## కామ్రేడ్ కుహ్డాం కోసి త్యాగాన్ని అంకితభావాన్ని ఎత్తిపట్టుదాం!



సుక్మాజిల్లా కుంట బ్లాక్, రంగాయి గూడెంలో నలుగురు సంతానంలో కా॥ కోసి చిన్నది. చిన్న తనంలోనే తండ్రి చనిపోయాడు. కా॥ కోసి అందరి కంటే చిన్నదైనందున తండ్రి లేని లోటు లేకుండా పెంచుకున్నారు.

కా॥ కోసి మొదట బాలల సంఘంలో, తర్వాత ప్రజా మిలీషియాలో చేరింది. కా॥ కోసి 2007లో పూర్తికాలం కార్యకర్తగా పార్టీలోకి వచ్చింది. డీవీసీ దళం నుండి పార్టీ 2008లో నిర్మాణం అయిన సీఆర్‌సీ-2 కంపెనీకి బదిలీ చేసింది. రెండు సంవత్సరాలు గార్డుగా పనిచేసింది. కా॥ కోసి 2013 మధ్య నుండి 2016 వరకు పార్టీ అప్పగించిన పనిని స్వీకరించి సీఓబీ (విస్తరణ ప్రాంతం)కి పోయి పనిచేసింది. 2018 జనవరిలో పీపీసీఎమ్ (ప్లాటూన్ పార్టీ కమిటీ మెంబర్), సెక్షన్ డిప్యూటీ కమాండర్ బాధ్యతలు నిర్వహించింది.

కా॥ కోసి 2008లో సుక్మా జిల్లా, కుంట ఏరియాలోని బండా ఆంబుష్, 2009లో ఏఓబీలోని దమన్‌జోడి (నాల్కో) రైడ్‌లో, 2010లో కోరాపుట్ జిల్లాలోని నారాయణ పట్నా భూపోరాటానికి మద్దతుగా కంపెనీలో భాగంగా పాల్గొంది. దైగూడ ఆంబుష్. అదే డివిజన్‌లో పాండ్రుతల అనే గ్రామంలో భూస్వామి ఇంటి మీద దాడిలో, అలాగే తెలంగాణ బార్డర్ కుర్నపల్లి వద్ద కంపెనీ గ్రేహౌండ్స్ పోలీసులపై చేసిన అపార్చునిటి ఆంబుష్‌లో పాల్గొంది.

అనేక మిలటరీ చర్యలలో పాల్గొనడమేకాకుండా, శత్రువు చేసిన దాడులలో కూడా పాల్గొని అత్యంత చాకచక్యంగా వాటిని తిప్పికొడుతూ తప్పించుకొనేది. మిలటరీ టెక్నిక్స్ నేర్చుకుంటూ అభివృద్ధి చేసుకునేది.ఏ ప్రాంతం పోయినా అక్కడ ప్రజల భాష నేర్చుకొని వారికి రాజకీయాలు చెప్పేది, అక్కడ భూభాగం

(టెర్రయిన్)పై పట్టు సాధించేది.

2 మార్చి 2018లో పూజారి కాంకేర్ అడవిలో జరిగిన శత్రువు దాడిలో వీరోచితంగా పోరాడుతూ అమరురాలయ్యింది.

కా॥ కోసిలోని దృఢ సంకల్పం, క్రమశిక్షణ, త్యాగనిరతి మనందరికి ఆదర్శం.

## పూజారి కాంకేర్ అమరురాలు కామ్రేడ్ సంగీతకు ఎర్రెర్రని లాల్‌సలాం



కామ్రేడ్ సంగీత పశ్చిమ బస్తర్ డివిజన్, బీజాపూర్ జిల్లా, నేషనల్ పార్కు ఏరియా, సాగుమెట్ట ఆర్‌పీసీ, ముఖవెల్లి గ్రామంలో పుట్టింది. తన అమ్మానాన్నలు పెట్టిన పేరు కుమ్మ ప్రమీల. కా॥ సంగీతకు ఇద్దరు అన్నలు, ఒక్క తమ్ముడు, ఒక చెల్లెలు ఉన్నారు. సంగీత బాల్యంలో ఉండగానే తండ్రి అనారోగ్యంతో చనిపోయాడు. సంగీతకు తల్లి ఉంది.

కా॥ సంగీత ప్రజా మిలీషియాలో పనిచేస్తూ 2009 సంవత్సరంలో రిక్రూట్ అయ్యి నేషనల్ పార్కు ఏరియా దళంలో పనిచేసింది. 2010లో ఉత్తర తెలంగాణకు బదిలీ అయ్యి అప్పటి రాష్ట్ర కార్యదర్శికి గార్డుగా ఉన్నది. తర్వాత 2011లో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి పార్టీ సభ్యురాలిగా, 2015 సం॥లో ఏసీ సభ్యురాలుగా, 2017లో ఖమ్మం ఎల్‌జీఎస్ దళంలో ఉంటూ పనిచేసింది.

కా॥ సంగీత 2012 సం॥లో కా॥ సుధీర్‌ను పెళ్లి చేసుకుంది.

2012 సం॥ సింగంలో శత్రువు చేసిన దాడిలో, 2013 సం॥లో శత్రువు తెలంగాణ-మహరాష్ట్ర సరిహద్దు అహిరి ఏరియా లంకచేను గ్రామం వద్ద జరిగిన దాడిలో, 2014 సం॥ నేషనల్ పార్కు ఏరియాలో గుండం, పెద్ద కాంకేర్ సమీప అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కూడా శత్రువుపై దాడిచేస్తూ నాయకత్వాన్ని రక్షిస్తూ చాకచక్యంగా రిట్రీట్ అయ్యింది. శత్రువు చేసిన దాడులను తిప్పికొట్టింది. ఎన్నో ఆంబుష్‌లల్లో పాల్గొన్నది. శత్రువుకు ధీటుగా సమాధానం చెప్తు ఉద్యమంలో మునుముందుకు సాగిపోయింది కామ్రేడ్ సంగీత.

2018లో చర్ల మండలం పూజారి కాంకేర్ సమీప అడవుల్లో పక్కా సమాచారంతో చేరుకున్న శత్రువు దాడిలో హెూరా హెూరీగా పోరాడుతూ పార్టీ నాయకత్వాన్ని రక్షిస్తూ కామ్రేడ్ సంగీత వెన్నుచూపని వీర సైనికురాలిగా పోరాడుతూ అమరురాలైంది.

## కామ్రేడ్ తెల్లం రామే (రత్న)కు విప్లవ జోహార్లు

కా॥ తెల్లం రామే పశ్చిమ్‌బస్తర్ డివిజన్ (బీజాపూర్ జిల్లా) గంగులూరు ఏరియా కాకె కోర్మా గ్రామంలో పుట్టింది. కా॥ రత్న పేద కుటుంబంలో పుట్టి పెరిగింది.



కా॥ రత్న బాలల సంఘంలో, గ్రామ మిలీషియాలో, కేఏఎమ్ఎస్ (క్రాంతి కారీ ఆదివాసి మహిళా సంఘం)లో పనిచేసి 2004లో పూర్తికాలం కార్యకర్తగా గంగులూర్ దళంలో పనిచేసింది. ఆ తర్వాత నాయకత్వానికి ప్రొటక్షన్‌గా వున్న ప్లాటూన్‌లో పనిచేసింది. 2009లో సీఆర్‌సీ-2 కంపెనీకి పార్టీ బదిలీ చేసింది.

ఒడిశా రాష్ట్రంలో దమన్‌జోడి (నాల్కో) దాడిలో, 2010లో ముకురం ఆంబుష్‌లో పాల్గొన్నది.

2011లో ఒక మిలటరీ ఆపరేషన్‌లో భాగంగా ఒడిశాకు పోయిన సందర్భంలో అనారోగ్యంతో ఉన్న రత్నను పోలీసులు అరెస్టు చేసి, ఎన్నో చిత్రహింసలు పెట్టినప్పటికి పార్టీ రహస్యాలను కాపాడింది. తెలియని ప్రాంతం, పరిచయం లేని భాష, అనుభవం లేని జైలు జీవితం. అయినప్పటికీ ఎలాంటి భయానికి లోనవ్వకుండా ధైర్యంగా ఉంది. నాలుగున్నర సంవత్సరాల జైలు జీవితం గడిపింది. జైల్లో అవసరమైన ఖర్చులకు తను టైలరింగ్ నేర్చుకుని బట్టలు కుట్టి అవసరాలను తీర్చుకుంది. 2012లో విడుదలయ్యి, నేరుగా జైలు నుండి మళ్లీ పార్టీలోకి వచ్చింది. తర్వాత కా॥ రత్న సీఆర్‌బీ-2 కంపెనీలోనే కొనసాగింది.

కా॥ రత్న 2010లో కమిటీ అనుమతితో కా॥ మల్లేష్‌ను పెళ్లి చేసుకుంది. కా॥ రత్న నాలుగున్నర సంవత్సరాలు జైల్లో ఉన్నప్పటికీ ఒకరిపై ఒకరు విశ్వాసంతో వేచిఉండి బయటకు వచ్చిన తర్వాత మళ్లీ కలిసి అమరులయ్యే వరకు ఆదర్శ దంపతులుగా వున్నారు.

కా॥ రత్న పార్టీలోకి వచ్చిన తర్వాత చదువు నేర్చుకున్నది. మిలటరీ క్యాంపుల్లో పాల్గొని తన పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, రాజకీయాలను శ్రద్ధగా నేర్చుకుంటూ తోటి కామ్రేడ్స్‌కు, ప్రజలకు చెప్పేది. వేరే ప్రాంతం పోయినప్పుడు అక్కడ ప్రజలతో కలిసి అనేక పనులలో పాల్గొంటూ అక్కడ భాష నేర్చుకుని వారితో మాట్లాడేది.

2 మార్చ్ 2018లో పూజార్ కాంకేర్ అటవీప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కా॥ రత్న శత్రువును ప్రతిఘటిస్తూ వీర మరణం పొందింది.

## సాహసి కామ్రేడ్ పాయికీ (లలిత)



కా॥మ్రేడ్ ఏముల పాయికీ (లలిత) ఛత్తీస్‌గడ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా (పశ్చిమ్‌బస్తర్, గంగులూర్ ఏరియా) ఆవునార్ గ్రామంలో జన్మించింది. ఏముల కొయ్యాలు, లచ్చి దంపతులకు మొదటి సంతానం. కా॥ పాయికీకి తమ్ముడు కూడా ఉన్నాడు. తన చిన్నతనంలోనే తల్లి అనారోగ్యంతో మరణించింది తల్లి చనిపోవడంతో ఆలనా పాలనంతా చిన్నమ్మ, చిన్నాన్నలే చూస్తూ, తల్లి లేని లోటు తీర్చారు.

కా॥ లలిత మొదట సీఎన్ఎమ్‌లో పనిచేసి 2013 డిసెంబర్‌లో పూర్తికాలం కార్యకర్తగా దళంలో చేరింది. నాయకత్వానికి రక్షణ కోసం 2014లో తనను పార్టీ బదిలీ చేసింది.

దళంలో చేరిన తర్వాతే పట్టుదలతో చదువు నేర్చుకుంది. దళంలో డాక్టర్‌గా, సెంట్రీ వంటి తనకు అప్పగించిన బాధ్యతను ఎంతో ఓర్పుతో చేసేది. తోటి కామ్రేడ్స్‌తో, ప్రజలతో మర్యాదగా మాట్లాడేది. క్రమశిక్షణ, కష్టపడే తత్వం, ఓపికా, దృఢ సంకల్పం కా॥ లలితలో బాగా ఉండేవి.

2018 మార్చి 2 తేదీన పూజారి కాంకేర్ వద్ద జరిగిన గ్రేహౌండ్స్ పోలీసులు చుట్టివేత దాడిలో కా॥ లలిత వీరోచితంగా పోరాడుతూ నాయకత్వాన్ని రక్షించి తను అమరత్వం చెందింది. కా॥ లలిత ఆశయాలను తుదికంటా కొనసాగిద్దాం.

## పాలబుగ్గల పసిడి మొగ్గ కామ్రేడ్ ఉండం జోగి (లలిత)కు లాల్‌సలాం



కా॥ ఉండం జోగి (లలిత) సుక్మా జిల్లా, కుంటా బ్లాక్, జేగురుగొండ పోలీసుస్టేషన్ పరిధిలోని బికిడం గ్రామంలో ఇద్దరు అన్నలకు తోడబుట్టిన ముద్దుల చెల్లెలుగా కా॥ లలిత 17 సంవత్సరాల క్రితం పుట్టింది. కా॥ లలిత చిన్న తనంలోనే తండ్రి అనారోగ్యంతో మరణించాడు. అప్పటి నుండి కా॥ లలితను వాళ్ల అమ్మతో పాటు ఇద్దరు అన్నయ్యలు అల్లారు ముద్దుగా పెంచుకున్నారు.

కా॥ లలిత బాలల సంఘంలో, తర్వాత మిలీషియాలో చేరింది. కా॥ లలిత 2016 సెప్టెంబర్‌లో పూర్తి కాలం కార్యకర్తగా సీఆర్‌సీ-2 కంపెనీలోకి వచ్చింది.

అతి కొద్ది కాలానికే కా॥ లలిత కూడా ప్రజల కోసం పోరాడుతూ ప్రాణాన్ని త్యాగం చేసి ఎందరో కామ్రేడ్స్‌కు ఆదర్శంగా నిలిచింది. కా॥ లలిత మనకు చూపించిన త్యాగనిరతిని ఎత్తిపడుతూ, తన ఆశయాన్ని మును ముందుకు తీసుకుపోదాం అని శపథం చేద్దాం!

## కామ్రేడ్ సోనీ ఆదర్శ జీవితం

కా॥మ్రేడ్ మాడవి శాంతిది (సోనీ) బీజాపూర్ జిల్లా, భైరాంగఢ్ బ్లాక్, టెండోడ్ గ్రామంలో ఆదివాసి కుటుంబంలో జన్మించింది. కా॥ మాడవి శాంతికి తల్లిదండ్రులు, ఒక చెల్లి వుంది. ఇంటికి పెద్దకూతురు. వీరిది పేద కుటుంబం.

కా॥ మాడవి శాంతి ఇంటి వద్ద వుండి సంఘంలో పనిచేసింది. 18 సం॥రాలు నిండిన తరువాత 2012 డిసెంబర్‌లో దళంలో చేరింది. ఏరియాలో సప్లై దళంలో పనిచేసింది.

తర్వాత సీఓబీలోని కందమహల్ ఏరియాలో పనిచేసింది. అలాగే 2014 ఆగస్టులో నాయకత్వ రక్షణ దళంలో చేరింది.

కా॥ సోని 2016 ఫిబ్రవరి 5న కందమహల్ జిల్లా ఫైర్‌గ్యా పంచాయితీ డోడజోడీ ఎదురుకాల్పుల్లో, 2016 మే 12న కలహండి జిల్లాలో రాంపూర్ బ్లాక్ దన్నీ పంచాయితీ బోడ్‌బెడ గ్రామం వద్ద రాజకీయ క్లాసులు జరుగుతొన్న సమయంలో శత్రువు రాత్రికి రాత్రి వచ్చి దాడి చేశాడు. ఈ దాడిని తిప్పికొట్టడంలో, 2016 డిసెంబర్ 2వ తేదీన పీఎల్‌జీఏ వార్షికోత్సవం జరుపుకుంటున్న సమయంలో ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో మకాంపై ఎస్‌ఓజీ పోలీసులు దాడిచేసారు వాటిని తిప్పికొడుతూ తప్పించుకున్నది.

ప్రజల పట్ల అత్యంత విశ్వాసంతో వుండేది. విప్లవ రాజకీయాలు చెప్పడంతో పాటు పాట, నృత్యం ద్వారా ప్రజలకు పోరాట మార్గాన్ని అర్థం చేయించేది. కొత్త ప్రాంతాలకు వెళ్లినప్పుడు గ్రామాలపై ప్రజలపై టెర్రయిన్‌పై చాలా త్వరగా పట్టును సంపాదించేది. కా॥ సోనీ నాయకత్వ కామ్రేడ్స్‌ను రక్షించడానికి ధైర్య సాహసాలతో పోరాడింది. సోని తన నులివెచ్చని నెత్తురు ప్రజలకోసం ధారపోసిన సోనీ నిత్యం వెలుగుజిమ్ముతూ బాట చూపుతుంది. గడ్డు పరిస్థితిని అధిగమించే స్ఫూర్తినిస్తుంది.

**ప్రజాయుద్ధంలో** అనుభవం గడించి, నాయకత్వ స్థాయికి ఎదిగిన ముఖ్యమైన కామ్రేడ్స్ అమరులు కావడం 2వ కంపెనీకి, మొత్తం కమాండ్‌కు తీవ్రనష్టం. అయితే ఇది తాత్కాలికమే. గాయపడిన వాళ్లు కోలుకుని వారి వారి స్థానాల్లోకి, బాధ్యతల్లోకి వచ్చారు. ప్రజాయుద్ధంలో అమరులు నిర్వహించిన కర్తవ్యాలను కొనసాగించడానికి కొత్త వాళ్లు వస్తూనే ఉన్నారు. ఈ సంఘటన జరిగిన కొన్ని రోజులకే శత్రువుకు సమాచారం ఇచ్చిన భరత్‌ను, దువ్వల్ రఘును ప్రజాగెరిల్లా దళం ఖతం చేసింది. ఉద్యమం ముందుకే సాగుతుంది. ప్రజలు పోరాడుతూనే ఉన్నారు. అంతిమ విజయం ప్రజలదే. ప్రజాయుద్ధ వీరులు, వీరవనితలు మృత్యుంజయులు. ✦

(....48 పేజీ తరువాయి)

అనుమానాస్పద మృతి కేసులో ప్రధాన ముద్దాయి అమిత్‌షా. అలాగే బాబ్రీమసీదు కేసు మొదలైనవి రాజకీయంగా కీలకమైన మలుపు తిప్పే ఈ కేసుల్లో తీర్పులు పాలక పక్షానికి అనుకూలంగా ఉండేలా న్యాయవ్యవస్థను ప్రభావితం చేసి, రానున్న ఎన్నికలలో లబ్ధి పొందాలని అమిత్‌షా, మోడీల ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. న్యాయవ్యవస్థపై ఒత్తిడి చేస్తున్నది. దీని పర్యవసానమే ప్రస్తుత సంక్షోభం.

తాజాగా జస్టిస్ చలమేశ్వర్ 'పూర్తి స్థాయి కోర్టును సమావేశ పరచండి' అని భారత ప్రధాన న్యాయమూర్తి మార్చి 21న ఒక లేఖ రాసి దానిని మార్చి 29న పత్రికలకు కూడా పంపారు. అందులో ఆయన ప్రభుత్వ జోక్యాన్ని ప్రశ్నించారు. తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసారు. రాజ్యాంగం ప్రసాదించిన ఉనికిని సుప్రీంకోర్టు వ్యవస్థ కాపాడుకునేందుకు ఆ సమావేశం (ఫుల్‌కోర్టు) అవసరమని వారు భావించారు.

మరో తాజా పరిణామంతో ఏప్రిల్ 19న సీబీఐ ప్రత్యేక జడ్జి బి.హెచ్ లోయా అనుమానాస్పద మృతిపై న్యాయవిచారణ అవసరం లేదని దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు చెప్పింది. ఏప్రిల్ 20న 7 ప్రతిపక్షాలు చీఫ్ జస్టిస్‌ను తొలగించాలని ఐదు ఆరోపణలతో కూడిన నోటీసును రాజ్యసభ ఛైర్మన్‌ను కలిసి ఇచ్చాయి.

బీజేపీ అధికారంలోకి వచ్చి అనుసరిస్తున్న తిరోగామి, వినాశకర విధానాల ఫలితంగా అన్ని రంగాలలో సంక్షోభం నెలకొన్నది. న్యాయవ్యవస్థను కూడా వారి నియంతృత్వ ధోరణి వదలలేదనేందుకు ఈ తాజా పరిణామాలే సాక్ష్యం. ✦

---

(....44 పేజీ తరువాయి)

ఇద్దరి పిల్లలతో పాటు కూర్చొని వుంది. ఆమె చూపులు సూటిగా ఎదుటికి సారించి వున్నాయి.

తర్వాత వచ్చారు మృతుల విడదీయలేని స్నేహితులు, వాళ్ల కామ్రేడ్లు. వాళ్లు నాలుగు నాలుగు వరుసల్లో నడుస్తున్నారు. గృహయుద్ధంలో పాల్గొన్న సైనికుడి మొహం వలెనే వాళ్ల మొహాలు కూడా ఉదాసీనంగా వున్నాయి.

తర్వాత మంచి దుస్తులు ధరించిన పురుషుల, స్త్రీల సమూహం వచ్చింది. వాళ్లలో చాలా మంది ఆల్ట్‌గోల్డ్‌కు తెలిసినవాళ్లే, పరిచయస్తులే. లాయర్, జడ్జి, డాక్టర్, టీచర్, చిన్న వ్యాపారులు, ఇంకా చాలామంది. వీళ్లంతా ఈ అయిదుగురిని కాపాడడానికి పోరాడినవాళ్లు.

తర్వాత వచ్చారు కార్మికులు. వీళ్ల సంఖ్యకు హద్దుల్లేవు. వాళు ప్యాకింగ్ కంపెనీల నుండి, కట్టెల కార్ఖానాల నుండి, మైకార్మిక్, పుల్‌మైన్ కార్ఖానాల నుండి వచ్చారు. వాళ్లు మిల్లుల నుండి, ఎరువుల కంపెనీల నుండి, రైల్వే యార్డుల నుండి, రేకు పీపాల గోదాముల నుండి వచ్చారు. వాళ్లు నిరుద్యోగులు నివసించే ధర్మశాలల నుండి, రోడ్ల నుండి, గోధుమ చేన్ల నుండి, షికాగో, ఇంకా డజన్ల కొద్ది ఇతర నగరాల వీధుల నుండి వచ్చారు. చాలా మంది తమకున్న వాటిలోకెల్లా మంచి బట్టలను ధరించారు. తమ ఏకైక నల్ల పెళ్లి సూట్‌ను ధరించారు. చాలా మందితో పాటు వాళ్ల భార్యలు కూడా వున్నారు. పిల్లలు కూడా వాళ్లతో పాటు నడుస్తున్నారు. కొంత మంది పిల్లలను ఎత్తుకొని వున్నారు. కానీ వాళ్లలో చాలా మందికి పని దుస్తులు తప్ప వేరే బట్టలు లేవు. వాళ్లు తమ మొత్తం దుస్తులు, నీలి జీన్స్, కమీజు ధరించి వున్నారు. పశువుల కాపర్లు కూడా వున్నారు. వాళ్లు అయిదు వందల మైళ్ల దూరం నుండి తమ గుర్రాలపై వచ్చారు. వాళ్లసలు వీళ్ల శిక్ష మాఫీ అవుతుందనుకొని వచ్చారు. షికాగో ప్రజల పట్ల వాళ్లకు విశ్వాసం వుండింది. కానీ ఆ శిక్ష మాఫీ కానీ పరిస్థితిలో అంత్యక్రియల్లో పాల్గొనడానికి ఆగిపోయారు. వాళ్లు తమ మొరటైన ఎత్తు మడుమల చెప్పులు తొడుక్కొని నడుస్తున్నారు. వాళ్లలో నగరానికి సమీపంలోని గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ఎర్ర ముఖపు రైతులున్నారు. ఇంజన్ డ్రైవర్లున్నారు. విశాలమైన జలాశయాల నుండి వచ్చిన నావికులు వున్నారు.

వందలాది పోలీసులు, పింకర్‌టన్ మనుషులూ రోడ్డుకు రెండు దిక్కులా నిలబడి వున్నారు. కానీ వాళ్లు జులూస్‌ను చూసి నిశ్శబ్దంగా నిలబడిపోయారు. వాళ్లు తుపాకులను పక్కన పెట్టేశారు. చూపులను నేలమీదికి వాల్చేసుకున్నారు.

ఎందుకంటే కార్మికులు శాంతంగా వున్నారు. వినిపిస్తున్నది కేవలం వాళ్ల ఊపిరులూ, నడుస్తున్న పాదాల సవ్వడులే. ఒక్క శబ్దం కూడా వినబడడం లేదు. ఎవరూ మాట్లాడడం లేదు. పురుషులూ, స్త్రీలూ, ఆఖరికి పిల్లలు కూడా మాట్లాడడం లేదు. రోడ్డు పక్కన నిలబడ్డ వాళ్లు కూడా నిశ్శబ్దంగా వున్నారు.

ఇప్పటికీ కార్మికులు వస్తూనే వున్నారు. ఆల్ట్‌గేల్డ్ ఒక గంట దాకా నిలబడి వున్నాడు. కానీ వాళ్లు వస్తూనే వున్నారు. భుజం భుజం కలిపి నడుస్తూ, రాతి వంటి మొహాలతో, కండ్ల నుండి మెల్ల మెల్లగా కన్నీళ్లు కారుస్తూ, కానీ వాటిని ఎవరూ తుడుచుకోవడం లేదు. మరొక గంట గడిచింది. కానీ వస్తున్న వాళ్లకు అంతు లేదు. ఎన్ని వేల మంది వచ్చారు, ఎన్ని వేల మంది ఇంకా రావాల్సి వుంది, అతను అంచనా వేయలేకపోతున్నాడు. కానీ ఒక విషయం అతనికి తెలుసు, ఈ దేశ చరిత్రలో ఇటువంటి అంత్యక్రియలు ఎప్పుడూ జరగలేదు. అత్యంత ప్రియతమ నాయకుడు అబ్రహం లింకన్ మరణించినప్పుడు కూడా జరగలేదు.

"షికాగో పోలీసుల ప్రకారం అమర కార్మిక నాయకుల శోక యాత్రలో ఆరు లక్షలకు మించిన ప్రజలు పాల్గొన్నారు." ✦

**(సంఘర్షరత్ మెహనత్‌కశ్** పత్రిక సౌజన్యంతో)

# మార్క్స్-అంబేద్కర్

నీల్-లాల్ జెండా వాటి మధ్య ఐక్యత గురించి దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా ఈ మధ్య ముందుకు వచ్చింది. హైదరాబాదులో మార్చి 15, 2017లో సీపీఐఎమ్ సభ నిర్వహించింది. ఆ సభలో సీపీఐఎమ్ కార్యదర్శి సీతారామ్ ఏచూరి మాట్లాడుతూ అంబేద్కర్ సిద్ధాంతాన్ని, మార్క్సిజంను కలపాలని చెప్పాడు. కానీ దానికాయన వివరణ ఏమీ ఇవ్వలేదు. ఆయనతో పాటు చాలా మంది నోటి గుండా ఈ రోజు ఇదే మాట వెలువడుతున్నది. అయితే నీల్-లాల్ జెండా ఐక్యత అంటే అదేనా? అంబేద్కర్ సిద్ధాంతం, మార్క్సిజాన్ని సైద్ధాంతికంగా కలపడం ఆచరణ సాధ్యమా? సైద్ధాంతికంగా ఈ అంశాన్ని పరిశీలించినప్పుడు సాధ్యం కాదని మనం గ్రహించక తప్పదు. అంబేద్కర్ సైద్ధాంతిక అవగాహనను, మార్క్సిజాన్ని ఒక సారి మనం పోల్చి చూసినట్లయితే ఈ విషయం మనకు సులువుగా అర్థమవుతుంది.

మార్క్స్ అంబేద్కర్ కాలం ఒకటి కాకపోవడంతో మార్క్స్, అంబేద్కర్ సిద్ధాంతం పై ఏమీ వ్యాఖ్యానించలేదు. కానీ మార్క్సిజంపై అంబేద్కర్ వ్యాఖ్యానించడానికి ఆయనకు ఆ అవకాశం లభించింది. కాబట్టి అంబేద్కర్ సైద్ధాంతిక ఆలోచనలు స్పష్టంగానే ఇక్కడ పేర్కొనవచ్చు. అంబేద్కర్ ప్రధానంగా భారతదేశం కుల సమస్యపై చేసిన సైద్ధాంతిక కృషి ఏమిటో చూడవచ్చు. మార్క్సిజం విశ్వజనీయమైన సిద్ధాంతం. అది అన్ని పార్శ్వాలను తాకింది. అంబేద్కరిజం ఒక పరిమితితో కూడుకున్న సిద్ధాంతం. అది ప్రధానంగా భారతదేశంలో సాంఘిక న్యాయం గురించి చెపుతుంది. మార్క్సిజం సమాజపు అన్ని కోణాలను పరిశీలించి, విశ్లేషించి వాటికి వివరణలతో పాటు పరిష్కారాలు అందించింది.

కారల్‌మార్క్స్ దాదాపు 30సం॥రాల పాటు భారతదేశంపై అధ్యయనం సాగించాడు. 1853-57 మధ్య న్యూయార్క్ దిన పత్రిక 'ట్రిబ్యూన్'కు రాసిన వ్యాసాలతో పాటు మార్క్స్-ఏంగెల్స్‌ల మధ్య ఒక దశాబ్దం పాటు సాగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, 1857-58 మధ్య అసలు కాపిటల్-1 (1857) గ్రంథానికి ముందు తయారు చేసిన నోట్స్ అయిన గ్రుండెస్సె గ్రంథం, ముందు కాపిటల్ గ్రంథాలలో భారతదేశ సామాజిక స్థితి గూర్చిన అధ్యయన భాగాలు, విశ్లేషణలున్నాయి. ఈ కాలంలో చేసిన నిర్ధారణల్లో కాలక్రమంలో కొన్ని మార్పులు కూడ చేసాడు.

ఈ రెండు సిద్ధాంతాల మధ్య గల తారతమ్యాలను పరిశీలిద్దాం. మొదటిగా తాత్విక రంగంలో ఈ రెండు సిద్ధాంతాలను పరిశీలిద్దాం. అంబేద్కర్ తాత్విక ధోరణి ప్రధానంగా బుద్ధిస్టు తాత్విక ధోరణి కాగా మార్క్సిస్టు తాత్విక ధోరణి గతితార్కిక చారిత్రక భౌతికవాద ధోరణికి చెందిన ఆధునిక తత్వశాస్త్రం. అలాంటప్పుడు మనం అంబేద్కర్ తాత్విక ధోరణిని పరిశీలించాలంటే బుద్ధుని తాత్విక ధోరణి ఏమిటో చూడాలి.

**తాత్విక ధోరణులు**

భౌతిక వాస్తవికత మరియు పరమ సత్యం అనే అంశాలలో బుద్ధుడి దృక్పథం, మార్క్సిస్టు దృక్పథంకు భిన్నమైనది. ప్రతిదాని ఉనికి, అస్తిత్వం క్షణభంగురమైనది, అశాశ్వతమైనదని లేదా ప్రతి సత్యం సాపేక్షికమైనదని బుద్ధుడు చెప్పాడు. ఈ విషయంలో ప్రతీది ఉన్నది మరియు ప్రతీది లేదు అనే రెండు సత్యాల దృక్పథాల రెండు చివరలకు చెందినవని, వాటిని భిన్నంగా తనది మధ్యస్థ దృక్పథమనీ, ఒకే కాలంలో ప్రతీది ఉన్నది-లేదు అనే అవగాహన అని, మధ్యస్థమైనదే సత్యమని చెప్పాడు.

మార్క్సిస్టు గతితర్కం సాపేక్షిక సత్యాలగూర్చే కాకుండా ప్రపంచపు భౌతికవాస్తవికత, పదార్థం, చలనం లాంటివి పరమ సత్యాలని, పదార్థం చలనంలను ఎవరూ సృష్టించలేరని, నాశనం చేయలేరని వివరిస్తుంది. భౌతికవాస్తవికత నిరపేక్ష వాస్తవికతలో భాగమని, సాపేక్షిక సత్యాన్ని గుర్తించి వాస్తవికతను, పరమ సత్యాన్ని గుర్తించకపోవడం గతితర్కంకు వ్యతిరేకమైన భావవాదమేనని మార్క్సిజం చెపుతుంది. ఈ కారణంచేత బుద్ధుడి ప్రాపంచిక దృక్పథం అంతిమ సారంలో గతితర్కంకంటే వాస్తవిక, వ్యవహారవాద దృక్పథమే అవుతుంది. బుద్ధుడి దృక్పథం విషయంలో ఏంగిల్స్ ఇలా అన్నాడు.

"అతని దృష్టిలో ఒక వస్తువు ఉనికిలో వుంటుంది లేదా వుండదు! ఒక వస్తువు వుండటమూ, అదే సమయంలో మరొకటిగా వుండటమూ అసాధ్యమైన విషయం. ధనాత్మక (పాజిటివ్), రుణాత్మక (నెగెటివ్) అంశాలు సంపూర్ణమైన విడివిడి అంశాలు కారణమూ ఫలితమూ అంతే విరుద్ధమైన అంశాలుగా వుంటాయి" (యాంటి డ్యూరింగ్' గ్రంథం నుండి)

అదేవిధంగా మరొకమాట ఇలా అన్నాడు.

"మనం చూస్తున్న ప్రకృతి అంతా వ్యవస్థగా, పరస్పర సంబంధం కలిగివున్న వస్తువుల కలయికగా వుంటుంది. ఇక్కడ వస్తువులు అంటే, పరమాణువుల నుండి నక్షత్రాలవరకూ, ఇంకా ఈథరల్ కణాల ఉనికిని గుర్తిస్తే వాటితో సహా ఉనికిలో వున్న సమస్త పదార్థాలు అనీ మనం అర్థం చేసుకుంటాము. అంతేకాదు, పదార్థమనేది ఎవరూ సృష్టించలేనిదీ, నాశనం చేయలేనిదీ అయినట్లయితే చలనం కూడా అదేవిధంగా ఎవరూ సృష్టించలేనిదీ, నాశనం చేయలేనిదీ అవుతుంది.... శాస్త్రవేత్తల కంటే ముందుగానే ఈ సత్యాన్ని గుర్తించినవారు తత్వవేత్తలు" (డయలెక్టిక్స్ ఆఫ్ నేచర్' నుండి)

అందువలన బుద్ధుడు చెప్పినట్టి "ఉనికిలో ఉన్నదంతయూ ప్రత్యేకమైనది, సాపేక్షికమైనది మరియు సార్వజనీనమైనదని చెప్పేదంతా ఆలోచనలకు వికల్పనలకు సంబంధించినదనే అంశం గానీ, మనిషి వివిధ భౌతిక విభాగాలు భౌతికేతరమైన మేధస్సు

రెండింటి సమ్మేళనం అనే అంశం గానీ భౌతిక వాస్తవికత అనే అంశంను తిరస్కరించేవిగా వున్నాయి. అందుమూలంగా బుద్ధుడి దృక్పథం వాస్తవికవాదం, సార్వజనీనతను గుర్తించని సాపేక్షిక వాదమని చెప్పవచ్చును.

బుద్ధుడి తాత్విక ధోరణి అంబేద్కర్‌లో ఈ క్రింది విధంగా ప్రతిఫలించింది.

బ్రాహ్మణిజం లేదా బ్రాహ్మణీయ భావజాలం హిందూ మతం–కులవ్యవస్థను గట్టిపరిచే ప్రతిఘాతుక సిద్ధాంతమని, బ్రాహ్మణిజం ఒక సామాజిక స్పృహకు, మానవీయతకు ,సోదరభావం, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యంకు బద్ధ వ్యతిరేకియని, ఉపనిషత్తులు, బ్రాహ్మణికాలు, స్మృతులు, పురాణాల రాతలు, ఆచరణల ఆధారంగానే రుజువు చేస్తూ ఆ సిద్ధాంతాలను చీల్చి చెండాడాడు. అదే విధంగా ఇతర అన్ని మతాల మాదిరి హిందూ మతం కాదని ఎందుకంటే దేవుడికి–మానవుడికి, మానవులకి మధ్య మరియు కనీసం దేవుడి ముందు అందరూ మానవులు సమానమని చెప్పే మత లక్షణం హిందూమతానికి లేదని స్పష్టంగా చెప్పాడు. బ్రాహ్మణిజం–పెట్టుబడిదారీ విధానం ప్రధాన శత్రువులని చెప్పాడు.

బుద్ధుడి లాగానే అంబేద్కర్ కులవ్యవస్థతో కూడిన మన సమాజాన్ని మత ప్రాతిపదికపైన విశ్లేషించాడు. మనుషుల మధ్య సమానత్వాన్ని బుద్ధుడి తాత్వికత ఆధారంగానే చెబుతూ హిందూ మతంలో అదిలేదని చెప్పాడు. అయితే అదే సమయంలో ఫ్రెంచి విప్లవంలోని స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరభావం అనే నినాదంతో ఉత్తేజితుడైనాడు. ఆయన బుద్ధునిలాగానే మానవుని వికాసంకు వ్యక్తిగత కృషి అవసరమని నమ్ముతాడు. బుద్ధుడిలాగానే అహింస పద్ధతిని అవలంభించాలని అంటాడు.

మార్క్సిజం ఒక సామాజిక వ్యవస్థ ఉనికిని, అది ఏ రూపంలో, ఏ ప్రత్యేకతలతో కూడుకొని వున్నప్పటికీ, భౌతిక వాస్తవికత గానే చూస్తుంది, అదేవిధంగా ఒక సమాజం అంటే కొందరి ప్రజల కూడిక (అంబేద్కర్ మాటల్లో కొన్ని కులాల కూడిక) కాదని, అది చారిత్రికమైనది, భౌతికమైనదే కాకుండా ఒక నిర్దిష్ట ఉత్పత్తి విధానం పునాదులపై ఆ కోవకు చెందిన రాజ్యం–చట్టాలు–నీతి–భావజాలం–సాంఘిక–సాంస్కృతిక అంశాలతో పెనవేసుకొని వుండే సమగ్రత గల సమాజమని మార్క్స్, ఏంగిల్స్‌లు చెప్పారు. వర్గ సమాజాలు లేదా ఇండియాలో లాగ వర్ణం–కులంతో మేళవించుకొన్న వర్గ సమాజాలు లేదా సారాంశంలో వర్గ–కుల సమాజాలు (ద్విముఖ–స్వతంత్ర కుల, వర్గ సమాజం అనే అర్థంలో కాకుండా) అన్నియూ అదిమ కమ్యూనిస్టు సమాజాలతో పోల్చుకొని చూనినప్పుడు అవి చారిత్రక అభివృద్ధి యుగాలకు సంబంధించినవని, వాటిలో ఏ దేశం ఏ ప్రత్యేకతలు కలిగివున్నప్పటికీ చారిత్రక పరిణామం సార్వజనీనమైన క్రమంలో భాగమని చారిత్రక భౌతికవాదం బోధిస్తుంది. మనదేశంలో వర్గ సమాజాలు లేదా కులంతో కూడిన వర్గసమాజాలు అచారిత్రికం అయి వుండివుంటే అవి ఎప్పుడో అంతరించి అదృశ్యం కావాల్సి వుండేది. ఇండియాలో నేటి విలక్షణ కులంతో కలిసివున్న ఈ దోపిడీ వ్యవస్థ ఇప్పటికీ ఉనికిలో వున్నదంటేనే అది చారిత్రికమైనదని, ఒక విలక్షణ సామాజిక పరిణామ క్రమానికి చెందిన వ్యవస్థ అని, దానికి కూడా పుట్టుక, అభివృద్ధి, వినాశనం అను గతితార్కిక సూత్రం వర్తిస్తుందని మరియు అది భౌతికసత్యమని చారిత్రక భౌతికవాదం చెబుతుంది.

**చారిత్రక విశ్లేషణ**

చారిత్రక విశ్లేషణలో మార్క్స్, అంబేద్కర్‌లు అనుసరించిన సంవిధానాన్ని పరిశీలిద్దాం. అంబేద్కర్ మత కోణపు చారిత్రక విశ్లేషణలను చేపట్టాడు. వలస పాలనకు ముందుగల భారతదేశ చరిత్రను మూడు మత వ్యవస్థలతో కూడిన సామాజిక వ్యవస్థలుగా విభజించాడు.

మొదటి వ్యవస్థ బ్రాహ్మణిజం, ఆ తర్వాత బ్రాహ్మణిజం లేని బుద్ధిజం, ఆఖరుది బుద్ధిజంపై ప్రతిఘాతక విప్లవంతో విజయం సాధించిన హిందూయిజం. సామాజిక క్రమాల మార్పులను అంబేద్కర్ పరిగణనలోకి తీసుకొన్నాడు, కాని సామాజిక మార్పులను పునాదిలో ఉత్పత్తి విధానాల మార్పుల పరిణామాలుగా గానీ లేదా ప్రతిబింబాలుగా కాకుండా రాజకీయపరమైన అధికార గ్రూపుల తగాదాల ఫలితాలుగా చూసాడు. సామాజిక క్రమాల్లో గల వైరుధ్యాలు, హింస, దోపిడీ అంశాలు కూడా ఇదే విధంగా ఆర్థిక పునాదిపై ఆధారపడి వుంటాయని గుర్తించలేదు.

"మార్క్స్ సైద్ధాంతిక కృషిలో చరిత్ర గురించిన భౌతికవాద దృక్పథంను ఒక ప్రధాన ఆవిష్కరణ" అని ఏంగెల్స్ చెప్పాడు. "మార్క్సుతత్వం భౌతికవాదం. భౌతికవాదాన్ని ఆయన గతితర్కం ద్వారా మరింత ప్రగాఢం చేసి అభివృద్ధి పరిచాడు. భౌతికవాదాన్ని మానవ సమాజానికి అన్వయించడం ద్వారానూ, సమాజంలోని ఆర్థిక పునాదిపైనే మొత్తం సమాజంలోని రాజకీయ, సైద్ధాంతిక ఉపరితల నిర్మాణం ఆధారపడుతుందని తెలియ జెప్పడం ద్వారానూ మార్క్స్ చారిత్రక భౌతికవాదాన్ని అభివృద్ధి చేసాడు" అని లెనిన్ అన్నాడు.

గతితార్కిక చారిత్రక భౌతికవాద ప్రాపంచిక దృక్పథం అనేది విభిన్న వస్తువులలోని విరుద్ధాంశాలను పరిశీలించడం, వాటి గమనాన్ని విశ్లేషించడం ద్వారా వైరుధ్యాలను పరిష్కరించే పద్ధతులను బోధిస్తుంది.

ప్రజారాశుల సామాజిక జీవిత పరిస్థితులనూ, ఈ పరిస్థితులలో మార్పులనూ, ప్రకృతిశాస్త్రాలకు స్వాభావికమైన యదార్థతతో అధ్యయనం చేయడానికి చారిత్రక భౌతికవాదం తొలిసారిగా అవకాశం కల్పించింది. ప్రజలే తమ చరిత్రను సృష్టించుకుంటారు. కాని ప్రజల యొక్క–ప్రజా రాశి యొక్క ప్రేరక హేతువులను ఏది నిర్ణయించుతుంది–అనగా, పరస్పర విరుద్ధ భావాల, ఆశయాల సంఘర్షణలకు మూల కారణం ఏమిటి? మానవ సమాజాల

సంపూర్ణ రాసిలో ఈ సంఘర్షణలన్నింటిని కలిపి కూడితే వచ్చిన ఫలితార్థం దేనిని నిరూపిస్తుంది? చరిత్ర అంతటిలోనూ ప్రదర్శిత మవుతున్న మానవ క్రియాశీలశక్తి అంతటికి ప్రాతిపదికగా ఏర్పడుతున్న భౌతిక జీవితావసర వస్తువుల ఉత్పత్తికి అవసరమైన బాహ్య గతాత్మక పరిస్థితులు ఏవి? ఈ పరిస్థితుల క్రమాభివృద్ధి యొక్క నియమం ఏమిటి? వీటన్నిటి ప్రాముఖ్యత వైపూ మన దృష్టిని సారింపజేసి, అపరిమిత వైవిధ్య వైరుధ్యాలను కలిగిన విధానమే అయినప్పటికి, వాటి నుండి ఏకరూపం కల్గి నియమబద్ధమైనట్టి విధానంగా చరిత్రను శాస్త్రీయ పద్ధతులలో అధ్యయనం చేసే మార్గాన్ని మార్క్స్ మనకు చూపించాడు.

అందుకే సమాజాలు ప్రధానంగా వర్గ సమాజాలని, వర్గాలని అంతం చేయడం వల్లనే సమాజం సోషలిజానికి ఆ తర్వాత కమ్యూనిజంకు పయనిస్తుందని మార్క్స్ బోధించాడు.

### వర్గం-కులం

అంబేద్కర్ రచించిన 'కుల నిర్మూలన' గ్రంథంలో కులం అనేది భారత సమాజపు ప్రాచీన ఉత్పత్తి సంబంధాల నుండి కాక హిందూమతం నుండి పుట్టుకొచ్చిందనే భావవాద అవగాహనను ముందుంచాడు. కాబట్టి సామాజిక వ్యవస్థను మార్చడం కాక, హిందూమతాన్ని సంస్కరించడం ద్వారా కులాన్ని రూపుమాపవచ్చని, ఆశించాడు. అందువల్ల వేదాలని రద్దుచేయాలని, హిందువులందరికి ఆమోదకరమైన ఒకే ఒక ప్రామాణిక హిందూ గ్రంథాన్ని రూపొందించాలని లాంటి ప్రతిపాదనతో పాటు వర్ణాంతర వివాహాలే కుల నిర్మూలనకు పరిష్కారం అని భావించాడు. ఆ విధంగా కేవలం మనిషి భావాలలోనూ, ఆలోచనలోనూ మార్పు రావడం ద్వారా కుల వ్యవస్థ రద్దు కాబడుతుందనే నమ్మాడు.

అంబేద్కర్ వర్గంను ఆర్థిక అంశంగానూ మరియు కులంను సామాజిక అంశంగానూ చూసాడు.

– 'దడి గట్టుకొన్న వర్గమే కులం' అని అంబేద్కర్ అన్నాడు.

– కులమంటే శ్రమ విభజననే కాదు, శ్రామికుల విభజనగా విశ్లేషించాడు.

శ్రేణిగత అసమాన అంతస్తులవారిగా కులాలను మొదట విభజించడం ఎందుకు జరిగిందో ఇంకా తన పరిశీలనకు అందలేదని, అది తన శక్తికి మించిన పని అని కూడా నిరాడంబరంగా ప్రకటించుకొన్నాడు.

వర్గం-కులం అనే అంశంలో అంబేద్కర్ చెప్పిన ముఖ్యమైన అంశాలను పరిశీలించినప్పుడు మార్క్సిస్టు-లెనినిస్టులు విశ్వసించే చారిత్రక భౌతికవాద దృక్కోణం నుండి సాగే విశ్లేషణ అయిన ఉత్పత్తి విధానం, పునాది-ఉపరితలం, అదనపు ఉత్పత్తి, అదనపు విలువ దోపిడీ, ఉత్పత్తి విధానాల మార్పు మొ॥ అన్ని అంశాలను సంశ్లేషణ చేసే పద్ధతి ఎంచుకోలేదు.

మార్క్స్ కుల వ్యవస్థకు ఇతర అంశాలతోపాటు అనువంశిక శ్రమవిభజన-కుల ప్రాతిపదిక గల వృత్తులు మరియు వ్యవసాయం గ్రామీణ పరిశ్రమలు విడిగా కాకుండా ఒక యూనిట్‌గా ఐక్యం చేయడం అను రెండు అంశాలు మూలస్తంభాలని చెప్పాడు. మార్క్స్ చెప్పిన అనువంశిక శ్రమవిభజన అంటే శ్రామికుల విభజనతో కూడిన శ్రమవిభజన వారసత్వంగా కొనసాగడం, ఒక్కొక్క వృత్తి ఒక సమూహంకు రిజర్వు చేసి ప్రత్యేకతలతో కొనసాగడం అని అర్థం.

అంబేద్కర్ ఆర్థిక దోపిడి గూర్చి చెప్పినప్పటికి అది వర్గంకు తప్ప "వర్గేతరమైన" సామాజిక కులంకు వర్తింపచేసి కులదోపిడీ, పీడనలకు ఉత్పత్తి సంబంధాలలోనే ఎలా పునాది ఉన్నదో చెప్పలేదు. ఆర్థిక అసమానతలు అనగా శ్రేణిగత అసమాన అంతస్తులు కూడా సామాజిక కులంకు పునాదియైన హిందూమతం, సంస్కృతి, బ్రాహ్మణీయ భావజాలం ప్రాతిపదిక నుండి ఆర్థిక రంగంకు విస్తరించబడ్డాయని చెప్పాడు తప్ప వర్గవైషమ్యాల ఉత్పత్తి సంబంధాలే సామాజిక, మత, రాజకీయ రంగాలకు పునాది కారణమని చెప్పలేదు.

అంబేద్కర్ చారిత్రక భౌతికవాద దృక్పథంకు భిన్నంగా వర్గంను ఆర్థిక సమస్యగా, కులంను సామాజిక సమస్యగా చూసాడు. కులంకు పునాది ఉత్పత్తి సంబంధాలు అని కాకుండా హిందూమతం-బ్రాహ్మణీయ భావజాలం పునాది అని చెప్పాడు.

మార్క్స్ ఈ విషయంలో వ్యక్తిగత ఆస్తియే దోపిడీకి పునాదియని, ఆర్థిక పునాదికి చెందిన కౌలు, జీతం, అదనపు విలువ దోపిడీ, వడ్డీలు, మొ॥ మౌలికంగా దోపిడీ కాటగిరీలని అంతేకాక అసలు 'వ్యక్తిగత ఆస్తియే' ఒక చౌర్యం లాంటిదని విశ్లేషించిన అంశాలను చూసినపుడు సామాజిక అసమానతలకు ఆర్థికం పునాదే కాదని చెప్పిన అంబేద్కర్ వాదనలు భౌతికవాదంకు ఎలా భిన్నమైనవో అర్థం చేసుకొనవచ్చును.

### రెండు దశల విప్లవం

అంబేద్కర్ రెండు దశల విప్లవం గూర్చి చెప్పాడు. మొదటి దశలో రాజకీయ ప్రజాస్వామ్యం లక్ష్యంగా వుంటుందని, రెండవ దశలో స్టేట్ సోషలిజం లక్ష్యంగా వుంటుందని చెప్పాడు.

ప్రజాస్వామిక మొదటి దశ విప్లవంలో అంటరానితనం రద్దు, కులవివక్షతలు రద్దు చేయడం లక్ష్యంగా వుంటుందన్నాడు. సామాజిక న్యాయం ప్రజాస్వామ్య కార్యక్రమంగా వుంటుందని చెప్పాడు. రిజర్వేషన్లు ఇందులో భాగమే. కులంను ఆర్థికపునాది ఉపరితలం లేదా చారిత్రక భౌతికవాద కోణం నుండి అంబేద్కర్ విశ్లేషించలేకపోయాడు. అనగా సామాజిక, సాంస్కృతిక, హేతువాద కోణం నుండే విశ్లేషించాడు. అదేవిధంగా స్పృశ్యులు-అస్పృశ్యులు విభజనకు ప్రధాన కారణం సామాజిక, సాంస్కృతిక అంశమేనని చెప్పాడు. అస్పృశ్యులు భూములు, ఆస్తులు లేకుండా, గ్రామంలో నివసించకుండా హిందూమత చట్టాల ద్వారా ఒక స్థిరపడిన సమూహాలుగా సమాజం నుండి కనీసం మానవీయతే నోచుకోని

పురుగులుగా ఎలా పరిగణించబడ్డారో అనేక వివరణలు ఇచ్చినప్పటికీ ఉత్పత్తి సంబంధాల పునాదుల నుండి అస్పృశ్యతను విశ్లేషించలేదు. అందువలన ఈ మొదటి దశ ప్రజాస్వామిక విప్లవంలో ప్రత్యేక రక్షణలతో కూడిన స్వరాజ్‌ను అమలు చేయాలని అందులో భాగంగా అంటరానితనం, కులవివక్షతలను నేరంగా ప్రకటించడం, కులవృత్తులు, కులవతనులు, కులధర్మాలు, కులబానిసత్వం, కులకట్టుబాట్లు మొ॥ వాటన్నింటినీ రద్దుచేసి దళితులకు ప్రత్యేక ఓటింగ్, ప్రత్యేక గ్రామ నిర్మాణాలు, అన్ని రంగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించే కార్యక్రమంను ప్రతిపాదించాడు. ఉన్నతవంశం ప్రాతిపదిక కాకుండా సామర్థ్యం ప్రాతిపదికపై వ్యక్తి స్వేచ్ఛను వికసింపచేసే విధంగా వృత్తి, ఉద్యోగం, ప్రమోషన్ మొ॥ అన్ని రంగాల్లో ప్రభుత్వం ప్రజాస్వామికంగా పనిచేయవలసి వుంటుందని చెప్పాడు.

కుల నిర్మూల విషయంలో వర్ణాంతర భోజనాలు, వర్ణాంతర వివాహాలు కులంను సడలించానికి ఉపయోగపడవచ్చునేమోగాని, ఆ వ్యాధికి మందు సరియైనదేనా, పటిష్టమైనదేనా అని ఆలోచించాలని జాత్ పాత్ తోడక్ మండలిని కోరుతూ అంబేద్కర్ ఈ విధంగా రాసాడు. "హిందువులు పవిత్రంగా ఎంచుకొనే సిద్ధాంతాలకు, విశ్వాసాలకున్నూ, వర్ణాంతర భోజనాలకు, వర్ణాంతర వివాహాలకున్నూ పొసగదు. కులం అనేది హిందువులను కలవకుండా చేసే ఒక ఇటుక గోడో, ముళ్ళ తీగో కాదు-సుళభంగా తొలిగించి పారవేయడానికి. హిందువులలో కులం అనేది ఒక భావన. ఒక విశ్వాసం. ఒక మనఃస్థితి. కులాన్ని తొలగించడం అంటే-భౌతికమైన అడ్డంకిని తొలగించడం కాదు. మనో భావనలోనే ఒక మార్పును సాధించడం.... కులం అనే పిచ్చి నమ్మకాన్ని వాళ్ల మనస్సులో నాటిన వాళ్ల మతం. అటువంటప్పుడు, మనం ఎదుర్కోవలసిన శత్రువు కుల వ్యవస్థను అనుసరిస్తున్న ప్రజా కాదు. అట్టి కుల వ్యవస్థతో కూడిన మతాన్ని, వాళ్లకు ప్రబోధిస్తున్న శాస్త్రాలు." (కుల నిర్మూలన గ్రంథం నుండి)

ఈ విధమైన కుల నిర్మూలనా పోరాటమే ఇతర ఆర్థిక, రాజకీయ విప్లవాలకు ముందు షరతు అని చెప్పాడు. కుల పెనుభూతాన్ని రూపుమాపకుండా కమ్యూనిస్టులు చెబుతున్న కార్మికవర్గ పోరాటాలు, సోషలిస్టు విప్లవాలు సాధించడం ఇండియాలో అసాధ్యమైన విషయం అని చెప్పాడు.

సోషల్ జస్టిస్ (సామాజిక న్యాయం) మొదటి దశ ప్రజాస్వామ్యంను నెలకొల్పిన తర్వాత ప్రైవేటు స్వేచ్ఛా వ్యాపారం, స్వేచ్ఛా పోటీ పద్ధతులను అనుమతిస్తే తిరిగి కొందరు సంపదను ప్రోగేసుకొని సామాజిక, ఆర్థిక అసమానతలు పెరుగుటకు దారి తీస్తుందని తద్వారా మొదటి దశలో సాధించిన రాజకీయ సమానత్వం (ఒక మనిషి-ఒక విలువ) గాలికి ఎగిరిపోయి ధనవంతులదే రాజ్యం-ప్రభుత్వం అవుతుందని చెప్పాడు. దీనిని అరికట్టుటకు రాజకీయ ప్రజాస్వామ్యం సూత్రంను ఆర్థికం మొదలు ఇతర అన్ని రంగాలకు విస్తరించాలన్నాడు. అందుకు ప్రధానమైన పద్ధతి భూములు, ఫ్యాక్టరీలను జాతీయం చేయాలన్నాడు. 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' అను పుస్తకంలో స్టేట్ సోషలిజంను ప్రతిపాదించాడు. ఇదే అంబేద్కర్ ప్రతిపాదించిన సోషలిస్టు జస్టిస్‌తో కూడిన రెండవ విప్లవ దశ. సోషలిస్టు రాజ్యం కార్మికవర్గ నియంతృత్వ సాధనంగా వుండకూడదని గట్టిగా వాదించాడు.

అయితే అంబేద్కర్ చెప్పిన సోషల్ జస్టిస్ కూడా ఏ కోవకు చెందినదో పరిశీలించవలసి వుంటుంది. నూతన ప్రజాస్వామ్యంకు, సోషలిస్టు విప్లవాలకు కమ్యూనిస్టు పార్టీ లీడింగ్ పాత్ర-కార్మికవర్గ నాయకత్వ పాత్ర తప్పనిసరియని, అందులకు భిన్నమైనది ఏదైనా బూర్జువా దృక్పథమని మార్క్సిజం యొక్క రాజకీయ సారం. ఈ విషయంలో అంబేద్కర్, మార్క్సిజంకు భిన్నంగా కార్మికవర్గ నాయకత్వ పాత్రను గుర్తించలేదు, నిరాకరించాడు కూడా. అంతేగాక కార్మికవర్గ సోషలిజం స్థానంలో స్టేట్ సోషలిజంను ప్రతిపాదించాడు. కార్మికవర్గ సోషలిజం-స్టేట్ సోషలిజంల మధ్య తేడాను చూసాడు. కార్మికవర్గ సోషలిజం సాధనలో పారిశ్రామిక కార్మికవర్గంకే ఆ విప్లవలక్ష్యం, నూతన విప్లవాత్మక ప్రపంచాన్ని సృష్టించే గమ్యం వుంటుందని మార్క్సిజం గట్టిగా చెపుతుంది. ప్రపంచ మానవాళి సంపూర్ణ విముక్తి ఇతర వర్గాలతో పాటు తనను కూడా రద్దు చేసుకొనే లక్షణం, కండిషన్లు కేవలం కార్మికవర్గంకే వుంటుందని కావున కార్మికవర్గం ఒక వర్గంగానూ అదే సమయంలో వర్గరహితంగానూ వుండే రెండు స్వభావాలను కలిగివుంటుందని మార్క్సిజం వివరిస్తుంది. అందుచేతనే పెట్టుబడిదారీ సమాజం నుండి కమ్యూనిజం వరకు గల మధ్యస్థ కాలంలో (సోషలిజంలో) కార్మికవర్గ సోషలిజం కార్మికవర్గ నియంతృత్వం ద్వారానే మనగలుగుతుందని మార్క్సిజం చెబుతుంది. మార్క్స్ పారిస్ కమ్యూన్ అనుభవాల తర్వాతనే కార్మికవర్గ నియంతృత్వ అవసరాన్ని నొక్కి చెప్పాడు. రాజ్యం-విప్లవం అనే గ్రంథంలో కా॥ లెనిన్ ఈ విషయాన్ని పరిపుష్టం చేసాడు. అధికారం నుండి కూలదోయబడిన దోపిడి వర్గాలు నూతనంగా అధికారంలోకి వచ్చిన కార్మికవర్గాన్ని అధికారం నుండి కూలదోయడానికి వేయిరెట్లు ప్రయత్నం చేస్తాయని అందుకు నూటికి తొంభైశాతం ప్రజలకోసం కార్మికవర్గ నియంతృత్వం అవసరమని మార్క్సిజం-లెనినిజం బోధిస్తుంది. ప్రపంచ మార్క్సిస్టు-లెనినిస్టు ఉద్యమాలు, ఇంతవరకు ఏర్పడిన సోషలిస్టు సమాజాల అనుభవాలు కూడా ఈ అవగాహనను ఒక వాస్తవంగా రుజువు చేసాయి. కాని అంబేద్కర్ కార్మికవర్గ నియంతృత్వంను సమ్మతించలేదు. వ్యతిరేకించాడు. దీనిని బట్టి అంబేద్కర్ చెప్పిన స్టేట్ సోషలిజం యొక్క స్వభావం ఉదారవాద ప్రజాస్వామిక కోణం గల సోషలిజం తప్ప కార్మికవర్గ సోషలిజం కాదు.

కార్మికవర్గం నియంతృత్వం క్రింద సోవియట్ యూనియన్ సాధించిన అద్భుత విజయాలు నిరాకరించలేని సత్యాలుగా ముందుకు రాగా, కార్మికవర్గ నియంతృత్వం ఉన్నప్పటికీ దాన్ని చాలా తక్కువ కాలం కోసం అనుమతించాలని అంబేద్కర్ అన్నాడు.

ఆయన ప్రజాస్వామ్యం సోషలిజం సాధనకు 'హింసా' మార్గం కాకుండా శాంతియుత మార్గం, పార్లమెంటరీ మార్గంలనే విశ్వసించాడు. బుద్ధుడు అహింసమార్గం సార్వజనీనమైనదిగా వుంటూనే దానికి లోబడే సత్యంను కాపాడుటకు అవసరమైన దండనీతి-హింస (ఎత్తుగడగా) వుండాలని చెప్పాడు. అదే విధంగా అంబేద్కర్ అహింస వ్యూహాత్మక లక్ష్యంగానూ దానికి లోబడి అవసరమైన, పరిమితమైన హింస అనే దృక్పథంనే కొనసాగించాడు. తాత్వికంగా బుద్ధుడి మధ్యస్థమార్గంను నమ్మాడు.

ప్రధానంగా మతావలంభికుడైన అంబేద్కర్ నైతిక విలువలను, సోదర భావాలను పెంపొందించే ఒక మతం లేకుండా కమ్యూనిస్టు వ్యవస్థ మనజాలదని చెప్పాడు. కమ్యూనిస్టు వ్యవస్థలో మానవత్వం, ప్రజాస్వామ్యం మొదలైన అన్ని అంశాలలో మానవాళిలో అత్యున్నతంగా అభివృద్ధి చెందే మానవ చైతన్యం కమ్యూనిజంను కొనసాగిస్తుందని మార్క్స్ చెప్పిన సత్యంలో అంబేద్కర్‌కు విశ్వాసం లేదు.

సమానత్వంపై అంబేద్కర్, మార్క్స్ అభిప్రాయాల్లో మౌళికంగా తేడా ఉంది. అంబేద్కర్ అభిప్రాయంలో "సమానత్వం అనేది కేవలం మిధ్య అనవచ్చు. అయినప్పటికీ సామాజిక జీవితాన్ని నడిపే ప్రాథమిక సూత్రంగా దాన్ని అంగీకరించక తప్పదు. సమాజం దాని సభ్యుల నుంచి వీలైనంత ఎక్కువ ఫలితాన్ని పొందడం మంచిదనుకొన్నప్పుడు వారిని వీలైనంతవరకు జీవిత ప్రారంభ దశ నుండి సమానులుగా చేయడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. (కుల నిర్మూలన గ్రంథం) "సమానత్వం ఒక కల్పన లేదా నూతన సృష్టి కావచ్చును కాని దానిని ఒక పరిపాలన సూత్రంగా అంగీకరించ వలసి ఉంటుంది" అన్నాడు. (రాజ్యాంగ నిర్మాణ వ్యాసం)

"సమానత్వం ఒక కల్పన కాదు అది ఒక భౌతిక సత్యం" అని ఒక సత్యమే కాకుండా ప్రారంభ బిందువుగా వుండాలని మార్క్స్ అన్నాడు. అందుకు ఆయన అనివార్యంగా సోషలిజం ఉనికిలోకి వస్తుందని చెప్పాడు. కార్మికవర్గమే ఈ లక్ష్యాన్ని సాధిస్తుందని ఆయన శాస్త్రీయంగా నిరూపించాడు. మార్క్స్ చెప్పినట్లుగా కమ్యూనిజంలో రాజ్యం దానికదే అంతమవుతోంది (స్టేట్ విదర్ వే) అనే సిద్ధాంతంపై అంబేద్కర్‌కు నమ్మకం లేదు. కాబట్టి కార్మికవర్గ నియంతృత్వం అనేది శాశ్వతం అయి కూర్చోంటుందని, అలా అది ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నిర్మూలిస్తుందని భావించాడు.

అంబేద్కర్ స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం తన అంతిమ లక్ష్యం అని ప్రకటించాడు. ఈ నినాదం ఫ్రెంచి విప్లవంలో ముందుకు వచ్చినప్పటికీ దాని లక్ష్యం నెరవేరలేదని, అలాగే సోవియట్ యూనియన్‌లో కూడ నెరవేరదని చెప్పాడు. ఈ మూడింటిలో సమానత్వం అనేది సోవియట్ యూనియన్‌లో అమల్లోకి రావచ్చు కాని తక్కిన రెండు అంశాలు నెరవేరవు అని చెబుతాడు. పై నినాదాల లక్ష్యం పూర్తిగా బుద్దిస్టు సంప్రదాయంలోనే పరిష్కారం అవుతోందని అంబేద్కర్ గట్టిగా నమ్మాడు. అందుకు ఆయన కార్మికవర్గ నియంతృత్వాన్ని వ్యతిరేకించాడు. మానవ విమోచనకు బుద్ధిజమే పరిష్కారమని చెప్పాడు. ఈ విషయాలను అంబేద్కర్ "బుద్ధుడు లేదా కారల్‌మార్క్స్" అనే తన గ్రంథంలో వివరించాడు.

బూర్జువా ప్రజాస్వామ్యం మౌళిక స్వభావమైన బూర్జువా వర్గ నియంతృత్వ స్వభావాన్ని ఆయన గుర్తించ నిరాకరించాడు. ప్రత్యేకించి, మనదేశంలో సామ్రాజ్యవాదమూ, దానికి తొత్తులుగా ఉన్న భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా యంత్రపు అభివృద్ధి నిరోధక స్వభావాన్ని ఆయన గుర్తించలేదు. ముఖ్యంగా ఆయన తన స్టేట్ సోషలిజంలో రాజ్య స్వభావంపై తప్పుడు అవగాహన కల్గి ఉన్నాడు. రాజ్యం తటస్థమైనది అనే బూర్జువా సిద్ధాంతాన్ని నమ్ముతూ అది అణిచివేత సాధనము అనే దాని వర్గ స్వభావాన్ని గుర్తించ నిరాకరించడం వలన ఆయన చట్టాల మార్పుల ద్వారా, రాజ్యాంగ సంస్కరణల ద్వారా రాజ్యం స్వభావాన్ని మార్చవచ్చునని భావించాడు. అందుకే ఆయన అధికారంలో ఉన్న దోపిడి పాలకవర్గాలను కూల్చి కార్మికవర్గ నాయకత్వంలో ప్రజల నియంతృత్వాన్ని ఏర్పరచాలనే కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని వ్యతిరేకించాడు. అలా అంబేద్కర్ సైద్ధాంతికంగా ఓ ఉదారవాద బూర్జువా సంస్కరణవాదిగా చెప్పవచ్చు.

వర్గ విప్లవంకు ముందు షరతుగా కుల విప్లవాలను ప్రతిపాదించుటలో, సోలిజంను కార్మికవర్గ కోణం నుండి కాకుండా బూర్జువా ప్రజాస్వామికంగా అన్వయించడంలో, రాజ్యాంగబద్ధమైన శాంతియుత మార్గంను ఎన్నుకోవడంలో, ప్రపంచ మార్పుకు బుద్ధిజంను ఒక మతంగానూ, ఒక ప్రత్యామ్నాయ ధోరణిగా స్వీకరించడంలోనూ ఆర్థికంను వర్గ సమస్యగా కుదించి, కులంను ఆర్థికేతరమైన సామాజిక, మత, భావజాల సమస్యగా విశ్లేషించడంలోనూ, సామాజిక చరిత్రనూ మత కోణం నుండి చూడడంలోనూ మార్క్సిజం-బుద్ధిజంకు పోల్చి చూసి బుద్ధిజం మార్క్సిజం కంటే మెరుగైనదని ప్రకటించి ఆచరించడంలోనూ మొ॥ అన్ని విషయాల్లో అంబేద్కర్ దృక్పథం మార్క్సిజంకు భిన్నమైనది. ఈ రెండు సిద్ధాంతాల ప్రాపంచిక దృక్పథం, సంవిధానం వేరుగానే ఉన్నాయి. కాబట్టి పై విషయలన్నింటినీ పరిశీలించినప్పుడు మార్క్సిజం-అంబేద్కర్ మధ్య సైద్ధాంతికంగా పొత్తు కుదరదని అర్థం చేసుకోవాలి.

అయితే భారతదేశ నిర్దిష్ట పరిస్థితుల్లో అంబేద్కర్ హిందూమతం, బ్రాహ్మణిజం, కులం గురించి చేసిన అధ్యయనం నుండి మనం కొన్ని విషయాలను తీసుకొని వాటిని కులనిర్మూలనా పోరాటానికి వినియోగించాలి. ఆ విధంగా దేశంలో కేవలం అంబేద్కర్‌ను అనుసరించేవారితోనయినా, మార్క్సిజాన్ని విశాల పరిధిలో అంగీకరిస్తూ అంబేద్కర్ బాటలో నడిచే వారితో నయినా ఐక్యత సాధించడం సాధ్యమవుతుంది. అదే సందర్భంలో కులనిర్మూలన

(మిగతా 29వ పేజీలో....)

# మేడే అమరగాథ
# పోరుకు ప్రేరణనిచ్చే మేడే

నేటికి 132 ఏండ్ల క్రితం 1886లో మే 1న అమెరికాలోని షికాగో నగర కార్మికులు 'ఎనిమిది గంటల పనిదినం' కోసం చారిత్రాత్మక పోరాటానికి నాందిపలికారు. ఆ రోజుల్లో పని గంటలకు ఏ నియమమూ లేకుండింది. పొద్దు పొడిచింది మొదలు చీకటయ్యే దాకా కార్మికులు కార్ఖానాల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటూ వుండేవాళ్లు.

ప్రారంభదినాల్లో అమెరికాలో కార్మికులకు రోజుకు 12 నుండి 18 గంటల వరకూ శ్రమించవల్సి వచ్చేది. అత్యధిక కార్మికులు చిన్న వయసులోనే ప్రమాదకరమైన రోగాల బారినపడేవారు. చనిపోయేవారు కూడా. దీనికి వ్యతిరేకంగా పోరాడిన కార్మికులపై ప్రైవేటు గూండాలూ, పోలీసులూ, సైన్యంతో దాడులు చేయించేవాళ్లు. పరిస్థితి అత్యంత దారుణంగా వుండేది.

నిర్బంధం నుండి ప్రతిఘటన పుడుతుంది. పోరాట కాంక్ష అలలను సృష్టిస్తుంది. అమెరికా కార్మికయోధులు పోరు మార్గాన్ని ఎంచుకున్నారు. 1877 నుండి 1886 వరకూ ఇక్కడి కార్మికులు దేశవ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినపు డిమాండ్‌పై ఏకం కావడం, సంఘటితం కావడం ప్రారంభించారు. 1886లో అమెరికా అంతటా కార్మికులు 'ఎనిమిది గంటల కమిటీలు' ఏర్పాటుచేసుకున్నారు. షికాగోలోని కార్మిక ఉద్యమం అన్నింటికంటే బలంగా వుండింది. మే 1న కార్మికులందరూ తమ పని ముట్లను పక్కన పెట్టి రోడ్ల మీదికి పోవాలని, ఎనిమిది గంటల పనిదినపు నినాదాన్ని హోరెత్తించాలని షికాగో కార్మికులు నిర్ణయించుకున్నారు.

### ఇలా పుట్టింది మేడే ఉద్యమం

1886, మే1న అమెరికా అంతటా లక్షలాది కార్మికులు ఒకేసారి సమ్మె ప్రారంభించారు. ఈ సమ్మెలో పదకొండు వేల ఫ్యాక్టరీలకు చెందిన కనీసం మూడు లక్షల ఎనభై వేల మంది కార్మికులు పాల్గొన్నారు. షికాగో నగర దరిదాపుల్లోని రైలు రవాణా మార్గమంతా స్థంభించిపోయింది. షికాగోలోని అత్యధిక కార్ఖానాలూ, వర్క్‌షాపులూ బందయ్యాయి. నగరంలోని ప్రధాన మార్గమైన మిషిగన్ ఎవెన్యూపై అల్బర్ట్ పార్సన్స్ నాయకత్వంలో కార్మికులు ఒక భారీ ర్యాలీ నిర్వహించారు.

పెరుగుతున్న కార్మికుల బలమూ, వాళ్ల నాయకుల తొణకని సంకల్పంతో భయభ్రాంతులైన పారిశ్రామికవేత్తలు కార్మికులపై నిరంతరాయంగా దాడులు చేసే ఎత్తుగడలు అవలంబించారు. పెట్టుబడిదారుల యాజమాన్యంలోని మొత్తం పత్రికలన్నీ 'ఎర్ర ప్రమాదం' గురించి మొత్తుకోసాగాయి. పెట్టుబడిదారులు చుట్టుపక్కల ప్రాంతాల నుండి కూడా పోలీసులనూ, సాయుధ బలగాలనూ పిలిపించి మోహరింపజేశారు. వీరితోపాటు కుఖ్యాత పింకర్టన్ ఏజెన్సీకి చెందిన గూండాలను కూడా సాయుధం చేసి కార్మికులపై దాడులు చేయడానికి సర్వసన్నద్ధంగా వుంచారు. పెట్టుబడిదారులు 'అత్యవసర స్థితి'ని ప్రకటించారు. నిరంతరం వాళ్ల సమావేశాలు నడుస్తూనే వుండినాయి. ఆ సమావేశాల్లో ఈ 'ప్రమాదకరమైన స్థితి' నుండి బయటపడడానికి సమాలోచనలు జరుగుతూనే వుండినాయి.

మే 3న మైకార్మిక్ హార్వెస్టింగ్ మెషీన్ కంపెనీ కార్మికులు తమ పోరాటాన్ని ముందుకు తీసుకుపోయినపుడు నగర పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తతకు చేరుకున్నాయి. కార్మికులు ప్రతిఘటనా సభ ప్రారంభించగానే నిరాయుధ కార్మికులపై తూటాలు కురిపించబడ్డాయి. నలుగురు కార్మికులు చనిపోయారు. చాలా మంది గాయపడ్డారు. ఆ తర్వాతి రోజు కూడా కార్మిక బృందాలపై దాడులు కొనసాగాయి. ఈ క్రూరమైన పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా మే 4వ తేదీ రాత్రి షికాగో నగర ప్రధాన మార్కెట్ అయిన హే మార్కెట్ స్క్వేర్ వద్ద ఒక ప్రజా సభ జరిగింది. దీనికి నగర మేయర్ నుండి అనుమతి కూడా లభించింది.

సభ రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభమయింది. దాదాపు మూడు వేల ప్రజల సమక్షంలో కార్మిక నాయకులు పార్సన్స్, స్పాయిస్‌లు ఐక్యంగా, సంఘటితంగా వుండి పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు. మూడవ వక్త సామ్యూల్ ఫీల్డెన్ మాట్లాడ్డానికి లేచేప్పటికి రాత్రి పది గంటలు కావొస్తుండింది. వర్షం కూడా ప్రారంభమైంది. అప్పటికి స్పాయిస్, పార్సన్స్‌లు తమ భార్యలూ, ఇద్దరూ పిల్లలతో పాటు అక్కడి నుండి వెళ్లిపోయారు. జనం పల్చబడ్డారు. సభ ముగింపుకు చేరువవుతుండగా కుఖ్యాత కెప్టెన్ బాన్‌ఫీల్డ్ నాయకత్వంలో గుంపులు గుంపులుగా పోలీసులు ధడేల్‌మని సభాస్థలిలోకి చొరబడ్డారు. సభికులను వెంటనే అక్కడి నుండి వెళ్లిపొమ్మని హుకూం జారీ చేశారు. ఇది శాంతియుత సభ అని సామ్యూల్ పోలీసులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండగానే

> **ప్రపంచంలో ఎక్కడ పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందిందో, అక్కడ ఒక విశాల కార్మిక వర్గం ఆవిర్భవించింది. ఈ కార్మికులు తమ దృఢమైన చేతులతో పెద్ద పెద్ద నగరాలను రూపొందించారు. రోడ్లు, రైలు పట్టాలను పరిచారు. నదులను బంధించారు. ఆకాశాన్ని తాకే భవంతులను నిర్మించారు. పెట్టుబడిదారుల కోసం ప్రపంచంలోని అన్ని భోగ విలాస సాధనాలను సమకూర్చారు. మిల్లుల్లో-కార్ఖానాల్లో తమల్ని తాము కరిగించుకొని పెట్టుబడిదారుల ఇనుపపెట్టెలను నింపారు. కానీ వాళ్లకు వాటాగా వచ్చింది భయంకరమైన పేదరికం, దురవస్థ, దోపిడీ, నిర్బంధం. ఇక్కడి నుండే మొదలైంది తమ హక్కు-అధికారాల పోరాటం, త్యాగాల నిరుపమాన నూతన శకం.**

## చారిత్రక మే డే ఉద్యమ కార్మిక నాయకులు వీళ్లే!



జార్జ్ ఏంజెల్ | మైఖేల్ శ్వాబ్ | అల్బర్ట్ పార్సన్స్ | ఆగస్ట్ స్పాయిస్ | సామ్యూల్ ఫీల్డెన్ | ఎడోల్ఫ్ ఫిషర్ | ఆస్కార్ నీబే

"నలుగురు కార్మిక నాయకులు విప్లవ గీతికలు ఆలపిస్తూ ఉరికొయ్యను చేరుకున్నారు. ఠీవిగా తమ తమ స్థానాల్లో నిలబడ్డారు. ఉరితాళ్లు వాళ్ల మెడల్లో వేయబడ్డాయి. స్పాయిస్ తాడు చాలా గట్టిగా వుండింది. ఫిషర్ దానిని సరిచేస్తే స్పాయిస్ చిరునవ్వు నవ్వి ధన్యవాదాలు చెప్పాడు. తిరిగి స్పాయిస్ గొంతెత్తి 'ఒక సమయం వస్తుంది, ఆనాడు మా నిశ్శబ్దం నువ్వు నేడు నొక్కివేస్తున్న స్వరాల కంటే చాలా బలిష్టమైనది అవుతుంది' అన్నాడు. తర్వాత పార్సన్స్ మాట్లాడడం మొదలుపెట్టాడు, 'నా మాట వినండి, అమెరికా ప్రజలారా! నా మాట వినండి, జనం గొంతుకను నొక్కివేయలేరు', కానీ ఇంతలోనే ఉరికొయ్య లాగబడింది."

- ఆ సమయంలో అక్కడున్న ఒక పాత్రికేయుడి మాటలు.

ఎవరో ఒక బాంబును విసిరారు. బాంబు విసిరిన వాళ్లు పోలీసుల కిరాయి మనుషులని భావించబడుతున్నది. బాంబు పేలుడులో ఒక పోలీసు చనిపోయాడు. అయిదుగురు గాయపడ్డారు. పిచ్చెక్కిన పోలీసులు మార్కెటును నాలుగు వైపులా చుట్టుముట్టి సభికులపైకి విచక్షణా రహితంగా కాల్పులు జరపడం మొదలుపెట్టారు. పారిపోవడానికి ప్రయత్నించిన వాళ్ల పైనా తూటాల, లాఠీల వర్షం కురిపించారు. దీంట్లో ఆరుగురు కార్మికులు చనిపోయారు. రెండు వందలకు పైగా గాయపడ్డారు. కార్మికులు తమ నెత్తుటితో ఎరుపెక్కిన గుడ్డను ఎగిరేసి దానిని కార్మికుల జెండాగా మలిచారు.

ఈ సంఘటన తర్వాత పోలీసులు షికాగో వ్యాప్తంగా కార్మికుల బస్తీలపై, కార్మిక సంఘాల కార్యాలయాలపై, ప్రచురణాలయాలపై దాడులు చేశారు. వందలాది నిర్దోషులను కొట్టారు. తీవ్రంగా హింసించారు. వేలాది మందిని అరెస్టు చేశారు. ఎనిమిది మంది కార్మిక నాయకుల– అల్బర్ట్ పార్సన్స్, ఆగస్ట్ స్పాయిస్, జార్జ్ ఏంజెల్, ఎడాల్ఫ్ ఫిషర్, సామ్యూల్ ఫీల్డెన్, మైఖేల్ శ్వాబ్, లుయిస్ లింగ్, ఆస్కర్ నీబె – పై తప్పుడు కేసు బనాయించారు. విచారణ జరిపి వాళ్లను దోషులుగా నిర్ధారించారు. వీళ్లలో కేవలం సామ్యూల్ ఫీల్డెన్ మాత్రమే బాంబు పేలిన సమయంలో ఘటనా స్థలంలో వున్నాడు. విచారణ ప్రారంభమైనపుడు ఏడుగురే బోనులో వున్నారు. నెలన్నర పాటు పరారీలో వున్న అల్బర్ట్ పార్సన్స్ కార్మికుల పక్షాన స్వయంగా కోర్టుకు వచ్చాడు. 'నేను నిర్దోషులైన నా సహచరులతో పాటు బోనులో నిలబడ్డానికి వచ్చాను' అని ఆయన జడ్జితో అన్నాడు.

### విచారణ డ్రామా, దౌర్జన్యపు శిక్ష

పెట్టుబడిదారీ సుదీర్ఘ న్యాయ నాటకం తర్వాత 1887 అగస్టు 20న షికాగో కోర్టు ఏడుగురికి మరణశిక్ష విధించింది. ఆస్కర్ నీబెకు మాత్రం 15 సంవత్సరాల కారాగార శిక్షను విధించింది. స్పాయిస్ కోర్టులో గొంతెత్తి ఇలా చెప్పాడు – **'మమ్మల్ని ఉరి కొయ్యకు వేళ్లాడదీసి కార్మికోద్యమాన్ని, పేదరికం, దయనీయ పరిస్థితుల్లో రెక్కలు ముక్కలు చేసుకొనే లక్షలాది ప్రజల ఉద్యమాన్ని అణచివేయగలనని నువ్వనుకుంటున్నావా? అలా నువ్వనుకుంటున్నయితే సంతోషంగా మమ్మల్ని ఉరితీయి. అయితే గుర్తు పెట్టుకో. నువ్వీరోజు ఒక అగ్ని కణాన్ని నలిపివేస్తున్నావు. కానీ ఇక్కడా, అక్కడా, నీ వెనుకా, నీ ముందూ, అన్ని దిక్కులా అగ్ని జ్వాలలు భగ్గుమంటాయి. ఇది దావానలం. నువ్వు దీన్ని ఎప్పటికీ ఆర్పలేవు.'**

అమెరికా యావత్తూ, ఇతర అన్ని దేశాల్లోనూ ఈ క్రూర తీర్పుకు వ్యతిరేకంగా భగ్గుమన్న ప్రజల ఆగ్రహం ఫలితంగా సామ్యూల్

యావత్ నిర్బంధ చర్యలూ, నెత్తుటి సముద్రంలో ముంచే ప్రయత్నాలను తట్టుకుంటూ కార్మికోద్యమ పరంపర ముందుకే సాగింది. పని గంటలు నిర్ణయించాలనే డిమాండ్‌తో ప్రపంచవ్యాప్తంగా వేర్వేరు చోట్ల పోరాటాలు జరుగసాగాయి. పోరాటాల నడుమ 'ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంటలు మానసిక ఉల్లాసం, ఎనిమిది గంటలు విశ్రాంతి' అనే నినాదం ముందుకువచ్చింది. భారత దేశంలో కూడా 1862లో కార్మికులు ఈ డిమాండ్‌తో సమ్మె చేశారు. అయితే మొదటిసారి పెద్ద ఎత్తున దీనికి ప్రారంభం అమెరికాలో జరిగింది.

ఫీల్డెన్, మైఖేల్ శ్వాబ్‌ల మరణ శిక్ష ఆజీవన కారావాసంగా మార్చబడింది. 1887, నవంబర్ 10న అందర్లోకి చిన్నవాడయిన లుయిస్ లింగ్ జైలు గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు.

1887, నవంబర్ 11 కార్మిక వర్గ చరిత్రలో చీకటి శుక్రవారం. పార్సన్స్, స్పాయిస్, ఏంజెల్, ఫిషర్‌లను షికాగోలోని కుక్ కౌంటీ జైలులో ఉరితీశారు.

నవంబర్ 13న నలుగురు కార్మిక యోధుల శవయాత్ర షికాగో కార్మికుల భారీ ర్యాలీగా మారింది. అయిదు లక్షలకు మించిన జనం ఈ నాయకులకు ఆఖరి వందనం అర్పించడానికి రోడ్లమీదకి ఉవ్వెత్తున ఎగిశారు.

మూడేళ్ల తర్వాత 1889లో కార్మిక ఉద్యమ ఉపాధ్యాయులు మే 1ని అంతర్జాతీయ కార్మిక దినంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అప్పటి నుండి యావత్ ప్రపంచ కార్మికులు దీనిని పోరాట సంకేత దినంగా పాటిస్తున్నారు. సమరశీల ఐక్యతను చాటుతూ తమ విముక్తి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ప్రేరణను పొందుతున్నారు.

అప్పటి నుండీ గడిచిన ఈ 132 ఏండ్లల్లో అసంఖ్యాకమైన పోరాటాల్లో పారిన కోట్లాది కార్మికుల నెత్తురు అంత సులువుగా భూమిలో ఇంకిపోదు. ఉరి కొయ్య నుండి మారుమోగిన స్పాయిస్ గళం పెట్టుబడిదారుల గుండెల్లో భయాన్ని పుట్టిస్తూనే వుంటుంది. అసంఖ్యాక కార్మికుల నెత్తుటి కాంతితో మెరిసే ఎర్ర జెండా ముందుకు నడవడానికి మనకు ప్రేరణనిస్తూనే వుంటుంది. ✦

# ధ్వనిస్తోన్న ఊపిరులూ, అడుగుల సవ్వడులూ

**మేడే అమరుల ఈ కథ హోవర్డ్ ఫాస్ట్ రాసిన ప్రఖ్యాత నవల 'ది అమెరికన్'లోని ఒక భాగం. కార్మికోద్యమ సానుభూతిపరుడైన పీటర్ ఆల్ట్‌గేల్డ్ అనే జడ్జి సాక్షిగా మేడే అమరుల అంతిమ యాత్ర దృశ్యమిది.**

**– సంపాదకవర్గం.**

వాళ్లకు శుక్రవారం ఉరిశిక్ష విధించబడింది. మరుసటి రోజు వార్తా పత్రికల్లో ఉరికి సంబంధించిన విస్తృతమైన వివరాలు, కుప్పల కొద్దీ సంపాదకీయాలు ప్రచురించబడ్డాయి – చనిపోయిన వ్యక్తుల పైనా, చట్టాలూ–వ్యవస్థపైనా, ప్రజాస్వామ్యం పైనా, రాజ్యాంగమూ దాని అనేకానేక సవరణల పైనా – వీటిలో కొన్నింటిని 'హక్కుల బిల్లులు' అని పిలుస్తారు – విప్లవం, ప్రజాస్వామ్య స్థాపకుల గురించీ, గృహయుద్ధం గురించీ. వీటితో పాటే అంత్యక్రియల సూచనలు కూడా ప్రచురించబడ్డాయి. నగర అధికారులు అయిదుగురి మృతుల – తన గదిలో చనిపోయిన లింగ్‌తో పాటు పార్సన్స్, స్పాయిస్, ఫిషర్, ఏంజెల్‌ల– దేహాలను తీసుకోవడానికి వాళ్ల బంధు మిత్రులకు అనుమతినిచ్చారు. కావాలనుకుంటే బహిరంగ అంత్యక్రియలు జరపడానికి కూడా ఈ బంధుమిత్రులకు అనుమతి ఇవ్వబడింది. వాయిల్డ్‌హోయిమ్ శ్మశాన వాటికకు పోవడానికి శోకయాత్ర ఏయే రోడ్లపై నుండి వెళ్లవచ్చునో మేయర్ రోశ్ ప్రకటన జారీ చేశాడు. ఇదంతా పన్నెండు నుండి రెండు గంటల మధ్యలో ముగియాల్సి వుంటుంది. కేవలం విషాద సంగీతం మోగించవచ్చును. ఆయుధాలు వెంట తీసుకుపోకూడదు. జెండాలు, బ్యానర్లు పట్టుకొని నడవకూడదు. 'మృతులు సమాజానికి శత్రువులుగా ప్రకటించినబడిన వాళ్లు, నేరస్తులు, హంతకులు, అయినప్పటికీ అంత్యక్రియల్లో పాల్గొనడానికి కొన్ని వందల మంది రావొచ్చున'ని వార్తా పత్రికలు రాశాయి. మతస్వాతంత్ర్యానికి గ్యారంటీనిచ్చే రాజ్యాంగంలోని అధికరణం ప్రకారం అంత్యక్రియలకు అనుమతినివ్వడం న్యాయసంగతమైనది.

ఆదివారం నాడు జడ్జి తాను వాకింగ్‌కు వెళ్తున్నానని భార్యతో చెప్పాడు. అయితే అతను వాకింగ్ చేస్తూ ఎక్కడికి వెళ్తాడో ఎమ్మా అనుమానించింది కానీ ఏమీ మాట్లాడలేదు. ఆదివారపు ఉదయం ఒంటరిగా బయటికి వెళ్లాలనే అతని కోరిక విచిత్రంగా వుందని ఆమె అనలేదు. కానీ నిజానికి అది ఆశ్చర్యకరమైన విషయం కాదు. జులూస్ (ఊరేగింపు) మార్గం వైపు వెళ్తున్నప్పుడు తాను వేనవేల షికాగోవాసుల్లో ఒకడిని మాత్రమేనని జడ్జికి అనిపించింది. ఉదాసీనంగా, మురికిగా వున్న షికాగో రోడ్లకు రెండువైపులా దాదాపు సగం నగరం నిలబడి జులూస్ కోసం ఎదురుచూస్తున్నట్లుగా అనిపించింది అతనికి.

ఉదయం చల్లగా వుంది. ప్రజలు తనను గుర్తుపట్టడం అతనికి ఇష్టం లేదు. అందుకని అతను కోటు కాలర్‌ను పైకెత్తుకున్నాడు. టోపీని నుదిటి మీద కిందికి లాక్కున్నాడు. చేతులను జేబుల్లోకి దోపుకొని శరీర భారాన్ని కాసేపు కంపిస్తున్న ఒక కాలుపై కాసేపు మరొకకాలుపై మోపుతూ ఎదురుచూడసాగాడు.

జులూస్ కనిపించింది. అది అనుకున్నట్టుగా లేదు. అనుమతినిచ్చిన అధికారులు అనుకున్నట్టుగానయితే అసలే లేదు. ఏ సంగీతమూ లేదు, అడుగుల చిరు సవ్వడులూ, స్త్రీల మంద్రపు వెక్కిళ్లు తప్ప. శబ్దాలన్నీ, అరుపులన్నీ వీటిలోనే మునిగిపోయాయి. యావత్ నగరాన్ని ఒక విశాలమైన, శోకపూరితమైన నిశ్శబ్ద కఫన్ కప్పివేసినట్టుగా వుంది.

మొదట జెండా పట్టుకొని ఒక మనిషి వచ్చాడు. జులూస్‌లోని ఏకైక జెండా. ఒక పాత, రంగు వెలిసిన నక్షత్రాలూ, పట్టీల జెండా. అది గృహ యుద్ధం సమయంలో సగర్వంగా ఒక రెజిమెంట్ ముందర ఎగిరేది. దాన్ని పట్టుకొని నడుస్తున్నది గృహ యుద్ధంలో పోరాడిన ఒక సైనికుడు. నడీడులో వున్న అతని మోహం రాతితో మలిచినట్టుగా అన్పిస్తున్నది.

తర్వాత వచ్చాయి మృతదేహాలూ, శవపేటికలూ. తర్వాత పాత, కప్పులేని గుర్రపు బండ్లు వచ్చాయి. వాటిల్లో కుటుంబ సభ్యులున్నారు. వాటిల్లో ఒక దాంట్లో ఆల్ట్‌గేల్డ్‌కు లూసీ పార్సన్స్ (అమర కార్మిక నాయకుడు పార్సన్స్ జీవిత భాగస్వామి) కనిపించింది. ఆమె తన

(మిగతా 36వ పేజీలో....)

# రైతుల ఆదాయం పెరిగేది లేదు-ద్రవ్యలోటు తగ్గేది లేదు

# ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచే దగాకోరు విధానాల కేంద్ర బడ్జెట్ (2018-19)

ఎన్నికలే లక్ష్యంగా గ్రామీణ ఓటర్లకు గాలం వేస్తూ, ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం సమర్పిస్తున్న చివరి సంవత్సర బడ్జెట్‌ను గ్రామీణ భారతం చుట్టూ తిప్పారు. మధ్య తరగతి వేతన జీవుల ఆశలపై నీళ్లు చల్లారు. తెలుగు రాష్ట్రాలకు మొండిచేయి చూపించారు. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ వరాలు ప్రకటించారు. సామాన్య ప్రజలపై భారాలు మోపారు. ఎన్నికల దగాకోరు విధానాల బడ్జెట్‌ను 2018 ఫిబ్రవరి 1న జైట్లీ ప్రవేశ పెట్టారు.

1950లో 'ప్లానింగ్ కమిషన్'ను ఏర్పాటు చేసి, 1951 నుంచి పంచవర్ష ప్రణాళికలను అమలు చేశారు. ఇప్పటి వరకు 12 పంచవర్ష ప్రణాళికలను అమలు చేశారు. కానీ ఏ ఆశయాలు సాధించలేదు. ప్రజల బతుకులు బాగుపడలేదు. పైగా పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడిన ప్రణాళిక సంఘాన్ని రద్దు చేసి, ఏ ప్రాధాన్యత లేని నీతి అయోగ్‌ను ఏర్పాటు చేసింది ఎన్‌డిఎ ప్రభుత్వం.

స్వాతంత్రం వచ్చి 70 సంవత్సరాలైయింది. ఇప్పటికీ 70 బడ్జెట్‌లు వచ్చిపోయాయి. ఈ 70 సంవత్సరాలలో 70 బడ్జెట్‌లలో కేటాయించిన కేటాయింపులకు, ఖర్చులకు, సాధించిన ప్రగతి అంచనా లెక్కలు ఏనాడైనా ప్రజల ముందు పెట్టారా? పాలకులు చెప్పే 'అభివృద్ధి' ఫలాలు ప్రజలకు అందాయా? కనీసం సమీక్షలున్నాయా? ఆర్థిక వ్యవస్థ ప్రజలకు జవాబుదారీగా ఉంటూ, పారదర్శకంగా ఉండాల్సింది పోయి అంకెల గారడీలు, తప్పుడు చిట్టా పద్దులతో, ముద్దు ముద్దు మాటలతో ప్రజల్ని ఏడాదికి ఓసారి మోసపుచ్చే తంతే ఈ బడ్జెట్.

ఇక మన ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన రైతు, వ్యవసాయ సంక్షోభం అంతా ఇంతా కాదు. దేశ జనాభాలో 70 శాతం మంది ఆధారపడుతున్న సాగు రంగాన్ని వరుస కరువులు పట్టి పీడిస్తున్నాయి. ప్రకృతి ప్రతికూలతలు, నకిలీ విత్తనాలు, రుణ భారాలు, గిట్టుబాటు ధరలు లభించక దేశ వ్యాప్తంగా రైతులు నిరాశ నిస్పృహలకు లోనయి ఈ దశాబ్దంలో లక్షల సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకున్నారు.

ప్రస్తుత బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని పరిశీలిస్తే రూ. 46,700 కోట్లు కేటాయించారు. ఇందులో రూ. 13 వేల కోట్లు పంటల భీమాకు, రూ.15 వేల కోట్లు వడ్డీ మాఫీకి, రూ. 4 వేల కోట్లు 99 ప్రాజెక్టుల నిర్మాణ వ్యయంకు, రూ. 3,600 కోట్లు గోదాముల నిర్మాణానికి కేటాయించారు. ఉద్యాన వన పంటలకు రూ. 2536 కోట్లు కేటాయించారు. పై 5 పద్దులకు రూ. 38 వేల కోట్లు తీసివేస్తే మిగిలిన 8,700 కోట్లతో ప్రధాన రంగమైన వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి సాధ్యమేనా? సాధ్యంకాదన్నది స్పష్టం.

బడ్జెట్‌లో ప్రధానంగా కనిపిస్తున్న దగాకోరు విధానాలు. చూస్తే అవసరం ఎక్కడుందో అక్కడ నిధులు కేటాయించకపోవడం, గ్రామీణ రంగానికి, చిన్న పరిశ్రమలకు ప్రాముఖ్యత ఇచ్చినట్లు గొప్పగా చెప్పుకున్నా కేటాయించిన నిధులు చూస్తే కొసిరి విదిలించారు. వ్యవసాయం, సహకారం, రైతు సంక్షేమానికి బడ్జెట్‌లో 42,211 కోట్లు కేటాయించారు. అంటే 7 శాతం నిధులు పెంచారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న ఒక రంగానికి ఈ నిధులు ఏ మూలకు సరిపోవు. రైతులకిచ్చే సంస్థాగత రుణాలకు నిధులను రూ. 10 లక్షల కోట్ల నుండి 11 లక్షల కోట్లకు పెంచినట్లు ఆర్థిక మంత్రి చెప్పారు. కానీ దానికి ఆయన నిధులిచ్చిందేమీ లేదు. బ్యాంకులిస్తాయని చెప్పారు. సంక్షోభంలో ఉన్న రైతాంగానికి సంక్షోభంలో ఉన్న బ్యాంకులు అప్పులిస్తాయా? మనం నమ్మాలా? ఈ బడ్జెట్‌లో రైతులకు తీపి కబురుందంటే అది మద్దతు ధరను 1.5 రెట్లు పెంచడమే. కాని అది కూడా ఎంతవరకు అమలు చేస్తారో వేచి చూడాల్సిందే.

ఆరోగ్య రంగానికి రూ. 1.38 లక్షల కోట్లు కేటాయించారు. కొత్త భీమా పథకం అంటూ కొత్త ముసుగు వేశారు. ఈ పథకం 'కొత్త సీసాలో పాత సారా'లా ఉంది. ఈ నిధులు ఎలా సరిపోతాయి? భారత పాలకులు ప్రజలకు వైద్యం అందించే బాధ్యత నుండి ఎప్పుడో తప్పుకున్నారు. ఇక్కడ రోగం మార్కెట్ సరుకుగాను, వైద్యం వ్యాపారంగాను మారింది. చివరికి శవాల మీద కూడా వ్యాపారం జరుగుతుంది. మన దేశంలో ప్రజలు ఆరోగ్యం కోసం ఖర్చు చేస్తున్న డబ్బులో ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది 15 శాతం మాత్రమే. 85 శాతం ప్రజలు తమ సొంత డబ్బుతోనే వైద్యం చేయించుకుంటున్నారు. "ఆయుష్మాన్ భవ" భారత్ నినాదం దగాతప్పు మరోకటి కాదు.

10 లక్షల కుటుంబాలకు ఏడాదికి రూ. 5 లక్షల ఆరోగ్య భీమా కల్పిస్తున్నట్లు ఆర్థిక మంత్రి చెప్పారు. కానీ విచిత్రమేమిటంటే ఈ పథకానికి రూ. 2000 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ఇది ఆరోగ్య సంరక్షణ రంగంలో విప్లవాత్మక పథకమని మీడియాలో ప్రభుత్వం విశేష ప్రచారం చేసింది. ప్రభుత్వం జాతీయ ఆరోగ్య భీమా పథకం గురించి ఊదరగొడుతున్న నేపథ్యంలో ఆ రంగానికి బడ్జెట్‌లో భారీ కేటాయింపు జరిగిందని అంతా భ్రమపడుతున్నారు. అందుకు విరుద్ధంగా ఆరోగ్య, కుటుంబ, సంక్షేమ శాఖకు 2018-19 బడ్జెట్‌లో కేటాయింపు కేవలం రూ. 52,800 కోట్లు, 2017-18 సవరించిన అంచనాల (రూ. 51,550.85 కోట్లు) పై ఇది కేవలం 2.5 శాతం అధికం. అంతేకాకుండా, ఇది సరికొత్త పథకం కానేకాదు. 2016 బడ్జెట్‌లోనే ఇది ఉంది. 2016లో ఈ పథకం మిగిల్చిన అనుభవంపై నివేదికలు లేనే లేవు. పోనీ జాతీయ ఆరోగ్య భద్రతా పథకం గురించి భీమా కంపెనీలతో చర్చించాం అనైనా చెప్పారా అంటే అదీలేదు. 125 కోట్లకుపైగా ఉన్న దేశ

జనాభాలో అత్యధిక శాతం పేదలే. వీరికి వైద్యం అందుబాటులోకి తేవాలన్న చిత్తశుద్ధి ఉంటే ప్రజారోగ్య వ్యవస్థ పటిష్ఠం చేయడం ద్వారానే ఇది సాధ్యపడుతుంది. కానీ పేదలకు వైద్యం పేర వసూలు చేసే ప్రజాధనం సర్కార్ దవాఖానాలను బలోపేతం చేసే బదులు ప్రైవేట్ రంగాన్ని పెంచి పోషిస్తాయనడంలో సందేహం లేదు. గత పథకం లాగానే ఈ పథకం కూడా అటకెక్కక తప్పదు.

ఎంతో ప్రాధాన్యత కలిగిన విద్యా రంగంపై ఎప్పుడూ చిన్న చూపే. సామాజిక లక్ష్యాల సాధనంగా విద్యను గుర్తించి విద్యా లక్ష్యాలను సాధించాల్సి ఉంది. ఇందుకు స్థూల జాతీయోత్పత్తిలో కనీసం ఆరుశాతం నిధులు విద్యకు కేటాయించాలి. ఇది ఎప్పుడూ జరగలేదు. ఫలితంగా విద్య ప్రైవేటీకరించబడి, మార్కెట్‌లో సరుకుగా మారి, విద్యార్థులపై ఒత్తిడి పెరిగి దేశంలో సగటున ప్రతి గంటకు ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నాడు. మెజార్టీ జనాభాగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు, పిల్లలు, మహిళలు పాలక వర్గాల దృష్టిలో అసలు మనుషులే కాదు. వీరి అభివృద్ధికి ఎప్పుడు అరకొర నిధులే. ఎన్ని బడ్జెట్‌లు వచ్చిపోయినా వీరి జీవనంలో ప్రగతి లేదు.

జనాభాలో 16.6 శాతంగా ఉన్న షెడ్యూల్ కులాల సంక్షేమానికి కేటాయించింది 56,619 కోట్లు, 8.6 శాతం జనాభా కలిగిన షెడ్యూల్ తెగలకు కేటాయించింది 39,135 కోట్లు అంటే బడ్జెట్ వ్యయంలో ఎస్‌సిలకు 6.55 శాతం కాగా ఎస్‌టిలకు 4.53 శాతం మాత్రమే కేటాయించారు. ఇక ఎస్.సి. సంక్షేమ పథకాల కింద జరిగే కేటాయింపుల తీరుతెన్నులు చూస్తే వారికి ఉద్దేశించిన పథకాలలో కేవలం 50.7 శాతం (రూ. 28,698 కోట్లు) ఎస్‌టిల విషయంలో 51.24 శాతం (రూ. 19,623 కోట్లు) మాత్రమే నిర్దేశిత లక్ష్యాలకు చేరుతున్నాయి. అత్యధిక భాగం సాధారణ ఖర్చుల కింద జీతభత్యాల కింద పోతున్నాయి. నేరుగా లబ్దిదారులకే ప్రయోజనం అన్న సూత్రానికి ఇది పూర్తి విరుద్ధం. మరోవైపు ఈ బడ్జెట్‌లో ఎస్‌సి ఎస్‌టిలకు సంబంధించిన కేటాయింపుల్లో మౌలికమైన మార్పు ఒకటి తీసుకొచ్చింది. వారి కోసం కొనసాగుతున్న సబ్‌ప్లాను పద్ధతిని మార్చి ఎస్‌సి కంపోనెంట్ (భాగం), ఎస్‌టి కంపోనెంట్ అంటూ చూపించారు. వీటినే ఎస్‌సిసి ఎస్‌సిటి అని పేర్కొన్నారు. ఇదొక అవాంఛిత తిరోగామి చర్య.

మొత్తం బడ్జెట్‌లో గత సంవత్సరం కంటే 7.81 శాతం అధిక నిధులతో రూ. 2.95 లక్షల కోట్లు రక్షణ రంగానికి కేటాయించారు. దీనితో ఈ రంగం వాటా 12.10 శాతం. ఈ మొత్తంలో త్రివిధ దళాలకు కొత్త ఆయుధాలు, విమానాలు, యుద్ధ నౌకలు ఇతర సామాగ్రి కొనుగోలుకు రూ. 99,947 కోట్లు, రెవెన్యూ ఖర్చుగా రూ. 1,95,947 కోట్లుగా ప్రతిపాదించారు. రక్షణ సిబ్బంది పెన్షన్ల కోసం మరో రూ. 1,08,853 కోట్లు ప్రత్యేకంగా కేటాయింపులున్నాయి. గతేడాది 57 శాతం సైన్యానికి, 22 శాతం వాయుసేనకు, 14 శాతం నావికా దళానికి మిగిలిన 7 శాతం రక్షణ పరిశోధన అభివృద్ధి కోసం కేటాయించారు. ఇలా మన బడ్జెట్‌లో కేటాయించినదంతా రక్షణ కోసమేనని చెప్పుకోవడానికి లేదు. నిజానికి రక్షణ అవసరాలన్ని అంతర్గతంగా మరో మార్గాల నుంచి పొందుతున్న స్థితి ఉంది. అలాగే వివిధ రాష్ట్రాల్లో జరిగే గిరిజన, వేర్పాటు వాద ఉద్యమాల నుంచి రక్షణ కల్పిస్తున్న సిఆర్‌పిఎఫ్ బలగాలకు లక్షా డెబ్బైవేల కోట్లు కేటాయించడం జరిగింది. వీటికి తోడు ఇతర బలగాలకు మన ప్రభుత్వాల ఖర్చు నుంచే వెచ్చించడం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో వాస్తవంగా దేశ రక్షణ రంగంలో వ్యయం చేస్తున్నది, కేటాయిస్తున్నది ఎంత అన్నది చూడాల్సిన అవసరముంది. ఇది మొత్తం కలిస్తే 4 లక్షల కోట్లకు దాటుతుంది. మొత్తం కేటాయింపుల్లో ఐదో భాగం.

తెలుగు రాష్ట్రాల ఆశలపై మరోసారి నీళ్లుజల్లారు. విభజన చట్టంలోని హామీలను విస్మరించారు. అమరావతి, రైల్వేజోన్‌ల ప్రస్తావన లేదు. ద్రవ్యలోటును భర్తీచేసేందుకు సాయం, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఉత్తరాంధ్ర, రాయలసీమకు నిధులు, ప్రత్యేక ప్యాకేజీ ఊసేలేదు. తెలంగాణకు ఇదే పరిస్థితి ఎదురైంది. తెలంగాణ ప్రభుత్వం ఆయా ప్రాజెక్టులకు అదనంగా 40 వేల కోట్లు కావాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చినా నిరుపయోగమైంది. కాళేశ్వరం, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులకు కూడా మొండి చెయ్యి చూపించారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎయిమ్స్ హామీలు ఆచరణకు నోచుకోలేదు. ఇక మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు నిధుల కేటాయింపుపైనా చాలా కాలంగా తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతున్నా బడ్జెట్‌లో ఆ ప్రస్తావన లేదు.

భారతదేశం ప్రపంచంలోనే వెలిగి పోతుందని, భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధిరేటు అమాంతంగా 7.5 శాతానికి పెరిగి చైనాను కూడా మించి పోయిందని మోదీ ప్రభుత్వం ఊదరగొడుతుంది. జిడిపి పెరుగుదల గురించి ఒకటే మోత మోగిస్తూ ఉంది. వాస్తవానికి పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టిల వల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని అనిశ్చిత పరిస్థితులు నెలకొని, జిడిపి వృద్ధిరేటు 3.5 శాతానికి పడిపోయింది.

4సం॥రాల ఎన్‌డీఏ పాలనలో భారత్ అప్పుల భారం 60 లక్షల కోట్లు నుండి 90 లక్షల కోట్లుకు పెరిగింది. దీనితో సంపన్నులు మరింత సంపన్నులయ్యారు. మోదీ ప్రభుత్వం ప్రతిఒక్కరిపైనా (పసి పిల్లలతో సహా) 75 వేల రూ॥ అప్పును, దినసరి దారిద్ర్యాన్ని, నోట్లరద్దుతో వచ్చిన సంక్షోభాన్ని, జీఎస్‌టీ వలన తగ్గిన ఆదాయలోటును ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ, వాటిని విదేశీ కార్పొరేట్ శక్తులకు అమ్మివేయడంతో వచ్చిన లక్షకోట్ల పెట్టుబడులతో సరిపుచ్చుకుంటున్నారు. ఉత్పాదకత పెంచి ద్రవ్యలోటు తగ్గించే విధానమే లేని మోడీ ప్రభుత్వం ఉద్యోగ కల్పన, సంక్షేమం కల్పించడం కల్ల. మోసం, దగా, వంచనలతో కూడిన అంకెలగారడీ తప్ప ఈ బడ్జెట్ దేశంలో (కార్పొరేట్ శక్తులను తప్ప) ఏ సెక్షన్ ప్రజల్ని సంతృప్తి పరచలేదు. ✦

# సంచలన పరిణామాల నేపథ్యంలో

# భారత న్యాయవ్యవస్థ

రాజ్యం అనేదాన్ని వర్గ పీడన సాధనంగా చూసిన మార్క్స్, ఎంగెల్స్‌లు చట్టాన్ని, న్యాయవ్యవస్థను కూడ భావజాల వ్యక్తీకరణలుగానే చూశారు. "న్యాయవ్యవస్థ ప్రాథమిక లక్ష్యం సొంత ఆస్తి పరిరక్షణకు అనువైన, సమర్థించే భావజాలాన్ని, చట్టాలను తయారు చేయడమే''నని అన్నారు. ''ఉత్పత్తి సాధనాల యజమానులకూ, ఆ ఉత్పత్తి సాధనాల మీద పనిచేసే శ్రామికులకూ మధ్య ఉన్న దుర్భరమైన ఆధిపత్య సంబంధం మీద మాయపొర కప్పి, దాన్ని కనబడకుండా చేసి, లేని తటస్థత నటించటమే న్యాయవ్యవస్థ పని" అని వాళ్లు అన్నారు.

న్యాయవ్యవస్థకు సంబంధించిన ఈ మౌలిక మార్క్సిస్టు అవగాహనతోనే భారత న్యాయవ్యవస్థను కూడ అర్థం చేసుకోవలసి ఉంది. భారత న్యాయవ్యవస్థ పాలకవర్గాల ప్రయోజనాల కోసం, పాలకవర్గాలు రూపొందించిన, పాలకవర్గాల చట్టాలను వ్యాఖ్యానించే, సమీక్షించే, అన్వయించే సంస్థే తప్ప ప్రజల కోసం పని చేసే సంస్థ కాదు.

వ్యవస్థ మౌలిక అంశాల విషయానికి, సొంత ఆస్తి విషయానికి వచ్చేసరికి న్యాయవ్యవస్థ ప్రజలవైపు, పీడితులవైపు, కనీసం రాజ్యాంగ ప్రవేశికవైపు ఉన్న దాఖలా ఒక్కటి కూడ లేదు.

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గోగోయి, జస్టిస్ మదన్ బి. లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్ జనవరి 12న ఒక పత్రికా సమావేశం ఏర్పాటు చేసి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ప్రవర్తనా సరళి మీద విమర్శనాస్త్రాలు సంధించారు. తాము ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖను ప్రచారసాధనాలకు విడుదల చేశారు. ఈ పరిణామం దేశవ్యాప్తంగా పెద్ద సంచలనానికి దారితీసింది. భారత న్యాయవ్యవస్థలోని అత్యున్నత స్థాయి న్యాయమూర్తులు ఇలా తమ అభిప్రాయాలను బహిరంగంగా ప్రకటించడం కనీవినీ ఎరగని అసాధారణమైన ఘటనగా దేశ ప్రజలను ఒక కుదుపు కుదిపింది.

"ఇది ఈ దేశ చరిత్రలో మాత్రమే కాదు, ఏ దేశ చరిత్రలోనైనా అసాధారణ సందర్భం. మేం ఈ సమావేశం సంతోషంగా ఏమీ ఏర్పాటు చేయడం కాదు. మేం ఇది ఏర్పాటు చేయక తప్పలేదు. కొంతకాలంగా సుప్రీంకోర్టు సరిగా పని చేయడం లేదు. కొన్ని నెలలుగా ఇది అపసవ్యంగా నడుస్తున్నది. ఆశించగూడని పనులు జరుగుతున్నాయి. సీనియర్ న్యాయమూర్తులుగా దీన్ని సరిచేయడం, వ్యవస్థపట్ల, దేశం పట్ల మేం వహించవలసిన బాధ్యత అని మేం అనుకున్నాం. ప్రధాన న్యాయమూర్తిని కలిసి ఈ సమస్యలు పరిష్కరించమని కోరాం. మా ప్రయత్నాలు విఫలం అయ్యాయి. ఈ వ్యవస్థను కాపాడకపోతే ప్రజాస్వామ్యం మనజాలదు. స్వతంత్ర, నిష్పాక్షిక న్యాయమూర్తులు లేకుండా ప్రజాస్వామ్యం మనజాలదు. ఈ రోజు ఉదయం కూడ మేం ప్రధాన న్యాయమూర్తిని కలిశాం. కాని ఆయనను ఒప్పించలేకపోయాం. అందువల్ల ప్రజల ముందుకు రావడం తప్ప మరొక మార్గం లేదని అనుకున్నాం. ఇప్పటికే ఎందరో విజ్ఞులు న్యాయవ్యవస్థ పనితీరు మీద మాట్లాడుతున్నారు. ఇరవై సంవత్సరాల తర్వాత ఎవరో విజ్ఞులు వచ్చి, ఈ నలుగురు న్యాయమూర్తులు సమయానికి స్పందించలేదని, ఆత్మలను అమ్ముకున్నారని, దేశ ప్రయోజనాలను రక్షించలేదని ఆరోపించవచ్చు. అందుకే మేం ప్రజల ముందుకు వస్తున్నాం." అని నలుగురు న్యాయమూర్తుల తరపున జస్టిస్ చలమేశ్వర్ అన్నారు. నలుగురు న్యాయమూర్తులు కలిసి ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖను ప్రచార సాధనాలకు ఇచ్చారు.

న్యాయవ్యవస్థ అనేది ఏ సమాజంలోనైనా రాజ్యాంగయంత్రంలో భాగమైన ఒకానొక అంగమే తప్ప స్వతంత్ర ప్రతిపత్తి కలిగినదో, సంపూర్ణంగా స్వతంత్రంగా వ్యవహరించగలిగినదో కాదనే విషయాన్ని కచ్చితంగా గుర్తు పెట్టుకోవడం ప్రస్తుత సంక్షోభాన్ని అర్థం చేసుకోవడానికి అవసరం. రాజ్యపు అంగాలుగా రాజనీతిశాస్త్రం వివరించే శాసననిర్మాణ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ ఎటువంటి అంగాలో న్యాయవ్యవస్థ కూడ అటువంటి అంగమే. నిజానికి రాజ్యంలో భాగంగా రాజనీతి శాస్త్రం నిర్వచించని పత్రికా వ్యవస్థ కూడ ఇవాళ రాజ్యాంగ యంత్ర బాధ్యతలను ఎక్కువగానే నిర్వర్తిస్తున్నదని గమనించవచ్చు. రాజ్యానికి ఈ శాసననిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలతో పాటే భావజాల సాధనాలు కూడ ఉంటాయని, భావజాల సాధనాల ద్వారా కూడ రాజ్యం ప్రజల మనసుల మీద రాజ్యం చేస్తుందని విశ్లేషించిన మేధావులు కూడ ఉన్నారు.

ప్రస్తుత సంక్షోభానికి బీజాలు గత రెండు సంవత్సరాలల్లో జరిగిన మూడు, నాలుగు ఘటనల్లో ఉన్నాయి. అవి జస్టిస్ కర్ణన్ బహిరంగ లేఖలో, అరుణాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కలిఖో పుల్ ఆత్మహత్యా లేఖలో న్యాయవ్యవస్థ మీద చేసిన ఆరోపణలు, న్యాయమూర్తుల నియామక ప్రక్రియపై, సుప్రీంకోర్టులో న్యాయమూర్తులకు వ్యాజ్యాల కేటాయింపులపై న్యాయమూర్తులలో, న్యాయవాదులలో వెల్లువెత్తుతున్న అసంతృప్తి, సిబిఐ న్యాయమూర్తి బి.హెచ్. లోయా అనుమానాస్పద మృతి. సరిగ్గా ఈ సమయంలోనే

ఎన్నో వివాదాస్పద, అభ్యంతరకర, చట్టవ్యతిరేకమైన తీర్పులు వెలువడ్డాయి. న్యాయమూర్తుల అవినీతి ఆరోపణలు బైటపడ్డాయి. న్యాయమూర్తుల నియామక ప్రక్రియ గురించి కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నించి, భంగపడినప్పటికీ, కొనసాగుతున్న కొలీజియం వ్యవస్థ కూడ ఎన్నో అక్రమాలకు, అవకతవకలకు, పారదర్శకత లేమికి ఆలవాలమని పేరు తెచ్చుకుంది. న్యాయమూర్తి జస్టిస్ జయంత్ పటేల్ బదిలీ, రాజీనామా జరిగాయి. జస్టిస్ లోయా అనుమానాస్పద మృతి కేసును విచారించడంలో సుప్రీంకోర్టు ఉద్దేశపూర్వక నిర్లక్ష్యానికి, సాచివేతకు, వక్రీకరణకు పాల్పడినట్టు కనబడింది.

భారత న్యాయవ్యవస్థ బోలుతనాన్ని, దివాళాకోరుతనాన్ని జస్టిస్ కర్ణన్ ఉదంతం బహిర్గతం చేసింది. అరుణాచల్ మాజీ ముఖ్యమంత్రి కలిఖో పుల్ రాసిన ఆత్మహత్య లేఖ మరింత ఎక్కువగా వివరించింది.

తన ఆత్మహత్యకు ఒకరోజు ముందు ఆయన హిందీలో రాసిన అరవై పేజీల సుదీర్ఘ లేఖలో ఆయన కాంగ్రెస్ నాయకులతో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మీద కూడ ఆరోపణలు చేశారు. స్వయంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్ సింగ్ కొడుకు తన దగ్గరికి వచ్చి అనుకూలమైన సుప్రీంకోర్టు తీర్పు రావాలంటే రూ. 49 కోట్లు లంచం ఇమ్మని అడిగాడని ఆయన ఆ లేఖలో ఆరోపించారు. ఈ లేఖపై, ఆత్మహత్యపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని కలిఖో పుల్ కుటుంబ సభ్యులు, అనుచరులు చేసిన ఆందోళన, డిమాండ్ల మీద ఇంతవరకూ ఏ చర్యా లేదు.

ఈ వ్యక్తిగత ఉదంతాల, ఆరోపణలను మించినది అసలు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలు ఏ ప్రాతిపదిక మీద జరుగుతున్నాయనే ప్రశ్న. ఇప్పటి వరకూ ఈ న్యాయమూర్తుల నియామకాలకు పారదర్శకమైన, హేతుబద్ధమైన విధానం లేదంటే చాలమందికి ఆశ్చర్యం కలగవచ్చు గాని అది వాస్తవం.

భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రాగానే న్యాయవ్యవస్థతో ఘర్షణ ప్రారంభమయింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించమని కొలీజియం చేసిన సిఫారసులలో మాజీ సొలిసిటర్ జనరల్ గోపాల్ సుబ్రమణియం పేరుకు కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం చెప్పింది. ఆయన గతంలో తన పదవి హోదాలో సుప్రీంకోర్టు సహాయకుడిగా అమిత్ షాకు వ్యతిరేకంగా నివేదికలు తయారు చేశాడని భారతీయ జనతా పార్టీకి ఆయన మీద కోపంగా ఉంది. అలాగే, సోహ్రాబుద్దీన్, తులసీరామ్ ప్రజాపతి బూటకపు ఎన్‌కౌంటర్ల కేసులో అమిత్ షాకు డిఫెన్స్ న్యాయవాదిగా పనిచేసిన ఉదయ్‌లలిత్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రతిపాదించాలని కూడ కొలీజియం మీద ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది.

ఇక సిబిఐ న్యాయమూర్తి బి.హెచ్.లోయా అనుమానాస్పద మృతి తర్వాత ఆ కేసు మీద స్వతంత్ర విచారణ జరిపించడంలో సుప్రీంకోర్టు విఫలమయింది. లోయా మృతి తర్వాత ఆ స్థానంలోకి వచ్చిన ఎం.బి గోసావి అనే న్యాయమూర్తి అమిత్ షా మీద కేసు ఎత్తివేయడాన్ని సుప్రీంకోర్టు లో సవాల్ చేసినప్పుడు, మాజీ ప్రధాన న్యాయమూర్తి పి. సదాశివం ఆ సవాలును కొట్టివేసి, ఆ కేసును తిరగదోడనక్కరలేదని తీర్పు ఇచ్చారు. కొద్ది కాలంలోనే ఆయన పదవీ విరమణ పొందగా మోడీ ప్రభుత్వం ఆయనను కేరళ గవర్నర్‌గా నియమించింది.

ఇలా నిత్య సంక్షోభంలో ఉన్న భారత న్యాయవ్యవస్థ ప్రస్తుత వివాదంతో మరొక సంక్షోభానికి చేరింది. ఈ మొత్తం వ్యవహారంలో ప్రజలు, బుద్ధిజీవులు అర్థం చేసుకోవలసిన అంశం భారత న్యాయవ్యవస్థకు జవాబుదారీతనం లేదని, అది పారదర్శకంగా పనిచేయడం లేదని, దానికి ఒక ప్రజాస్వామ్య దేశంలో ఉండవలసిన సంపూర్ణ స్వాతంత్ర్యం లేదని విస్పష్టంగా చూపుతున్నాయనేదే. న్యాయవ్యవస్థ మొత్తం రాజ్యాంగ యంత్రంలో భాగమని, అది ప్రజానుకూలంగా ఉండజాలదని, పాలకవర్గాలకే ఊడిగం చేస్తుందని, పాలకవర్గ ముఠాలలో అధికారం నెరపుతున్న ముఠాకు మద్దతుగా నిలబడుతుందని ఈ ఉతంతాలు చూపుతున్నాయి. న్యాయవ్యవస్థ గురించి మార్క్సిస్టు అవగాహనను ఈ తాజా సంక్షోభం, అంతకు ముందరి అవకతవకలు మరొకసారి రుజువు చేస్తున్నాయి.

ఈ కోవలో చూస్తే 1993లో అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామస్వామిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2011లో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్ర ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. మన రాష్ట్రంలో గాలి జనార్ధన్‌రెడ్డికి బెయిలిచ్చే విషయంలో న్యాయమూర్తి పాత్ర అందరికి తెలిసిందే. లక్నో మెడికల్ కాలేజీ అడ్మిషన్లు అనుమతించిన వ్యవహారంలో ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా పాత్రపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇలా న్యాయవ్యవస్థ దినదినం బట్టబయలు అవుతున్నది.

న్యాయవ్యవస్థలో కుల, మత తత్వాలను, అవినీతి అక్రమాలను న్యాయమూర్తులే బట్టబయలు చేయడం ఇది మొదటిసారి కాదు. ఇంతకు ముందు జస్టిస్ కర్ణన్, జస్టిస్ మార్కండేయ ఖట్జూ వంటి న్యాయమూర్తులు కూడా వీటిని బహిర్గత పరిచారు.

తాజా సంక్షోభానికి గల కారణాలు పరిశీలిస్తే అత్యంత కీలకమైన, ముఖ్యమైన కేసులన్నింటిని ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనమే విచారణ చేపడుతుందని, వీటిని తమ ధర్మాసనాలకు కేటాయించడం లేదని నలుగురు జడ్జీలు భావిస్తున్నారు. సంచలనం సృష్టించిన షాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో విచారణ జరిపిన సిబిఐ ప్రత్యేక జడ్జీ బి.హెచ్.లోయా

(మిగతా 36వ పేజీలో....)

# దక్షిణ బస్తర్ కిష్టారం ఆంబుష్ ఎమ్‌పీవీ ధ్వంసం, 9 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఖతం

## ప్రజా ప్రతిఘటనా యుద్ధంలో ఒక ముందడుగు

మార్చి 13న మధ్యాహ్నం 12.30 గం॥లకు పీఎల్‌జీఏ బలగాలు 11మంది ఉన్న ఎమ్‌పీవీ లక్ష్యంగా ఆంబుష్ చేసి 9 మంది సీఆర్‌పీఎఫ్‌కు చెందిన జవాన్లను హతమార్చారు. ఈ ఘటనలో ఎమ్‌పీవీ ధ్వంసం కాగా, ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. వారిద్దర్ని హెలికాప్టర్‌లో రాయపూర్ ఆసుపత్రికి తరలించారు.

ఉదయం 10గం॥లకు బయలుదేరి సీఆర్‌పీఎఫ్ బలగాలు 2 ఎమ్‌పీవీలలోను 10 మోటారు సైకిల్లపైన కిష్టారం పోలీసు స్టేషన్‌కు అనుబంధంగా కాసారంలో ఏర్పాటు చేసిన మరో క్యాంపుకు వెడుతుండగా మొదట వచ్చిన ఎమ్‌పీవీ ని వదిలి రెండవ దానిని లక్ష్యంగా చేసుకుని మైన్ పేల్చడంతో మధ్యాహ్నం 12.30 గం॥లకు ఈ ఘటన జరిగింది. ముందువున్న ఎమ్‌పీవీ నిలిచి అందులో నుండే పోలీసులు ఫైరింగ్ చేసారు. మోటారుసైకిళ్లపై గల పోలీసులు కూడా ఫైరింగ్ చేయడంతో ఆయుధాల స్వాధీనం కోసం జరిగిన ప్రయత్నం పూర్తి కాలేదు. 4 ఇన్‌సాస్ రైఫిల్స్ మాత్రం పీఎల్‌జీఏ స్వాధీనమయ్యాయి.



ఆంధ్రప్రదేశ్‌లోని ఏటిపాకలోని సీఆర్‌పీఎఫ్ కార్యాలయం ద్వారా ఛత్తీస్‌గడ్ సరిహద్దు బేసు క్యాంపుల నిర్వహణ చేస్తున్న విషయం తెలిసిందే. చనిపోయిన సీఆర్‌పీఎఫ్ జవాన్ల శవాలను మొదట భద్రాచలం ఏరియా ఆస్పత్రికి, తర్వాత సీఆర్‌పీఎఫ్ కార్యాలయానికి తరలించి అక్కడ నుండి వారి కుటుంబ సభ్యులకు అందజేసారు. వీరిలో ఉత్తరప్రదేశ్, బెంగాల్, బీహార్‌లకు చెందిన వాళ్లున్నారు.

ఎమ్‌పీవీ సామర్థ్యాన్ని మరోసారి నిర్ధారించుకోవడానికి జబల్‌పూర్ వెహికల్ ఫ్యాక్టరీ (ఇది ప్రభుత్వ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డ్‌కు చెందిన ఒక యూనిట్) కి చెందిన ఇద్దరు అధికారుల బృందం వచ్చి మార్చి 18న పరిశీలించి రిపోర్ట్ ఇచ్చారు.

ఈ సంఘటన జరిగిన వెంటనే 212 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్‌ధర్‌ను బదిలీ చేసి ఆ స్థానంలోకి 23 బెటాలియన్‌కు చెందిన హరిమిందర్ సింగ్‌ను తెచ్చారు. ఈ మార్పులకు ఘటనకు సంబంధం లేదని, మార్పులు రోటీన్‌లో భాగం అని సీఆర్‌పీఎఫ్‌కి చెందిన ఐజీ పీ. సంజయ్ అరోరా అంటున్నారు. ఇది అనుమానాస్పదమే.

ఘటన తర్వాత ప్రధాని మోదీ, హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఛత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ సంతాపాన్ని ప్రకటించారు. ఆంధ్ర, తెలంగాణ, ఛత్తీస్‌గడ్‌లలో హైఅలర్ట్ ప్రకటించారు.

ఈ ఘటన జరిగిన స్థలంలో అదే రోజు ఉదయం 8 గం॥లకు పోలీసులతో ఒక సారి ఎదురుకాల్పులు జరిగాయి. ఎవరికీ ఏమి నష్టం జరగలేదు. ఈ కాల్పుల సంఘటన తర్వాత రిట్రీట్ అయిన గెరిల్లాలు మళ్లీ రీగ్రూపు అయి మళ్లీ ఆ స్థలాన్ని చేరుకొని ఈ దాడిని విజయవంతం చేసారు.

నక్సల్ వ్యతిరేక ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ పిఎమ్ అవస్థి ఈ ఘటన కిష్టారం పీఎస్‌కు కూతవేటు దూరంలో జరిగిందని చెప్పాడు. అధికారులను ఎస్‌ఓపీ (ముందస్థు తనిఖీలు) గురించి అడిగితే స్వయంగా వారే "అది యుద్ధక్షేత్రం, రోజూ యుద్ధం జరుగుతుంది. ఎస్‌ఓపీ లాంటి వాటిని గురించి ఆలోచించడానికే ఉండదని" చెప్పారు. అంటే వేలాది బలగాలతో మోహరించి తాము యుద్ధాన్ని చేస్తున్నామని ఈ విధంగా అంగీకరిస్తున్నారన్నమాట.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పథకం ప్రకారం అనేక సం॥లుగా ఈ యుద్ధాన్ని బస్తర్ ప్రజలపై రుద్దుతున్నారు. ప్రజలు తమ మాన, ప్రాణ రక్షణకు, వనరుల రక్షణ, పర్యావరణ రక్షణకు ప్రాణాలకు తెగించి పోరాడుతూ ప్రభుత్వ బలగాలను ప్రతిఘటిస్తున్నారు. సల్వాజుడుం పాశవిక దమనకాండను ప్రతిఘటించి విజయం సాధించిన ప్రజలు గ్రీన్‌హంట్ 1,2,3వ దశలను కొనసాగింపుగా జరుగుతున్న సమాధాన్-2022 ను కూడా ఓడించడానికి సిద్ధపడుతున్నారు.

కేంద్ర రాష్ట్ర బలగాలు కేంద్రీకరించి కమాండ్‌ల ద్వారా సమన్వయంతో జాయింట్ ఆపరేషన్స్ చేస్తూ ప్రజాగెరిల్లాలను, విప్లవ ప్రజలను వందల మందిని హతమారుస్తున్నారు. అనేకమంది మహిళలపై అత్యాచారాలు చేస్తున్నారు. అక్కడ నిరంతర దాడులు, లూటీలు, దహనాలు నిత్యం జరుగుతున్న పరిస్థితుల్లో ప్రజాగెరిల్లా బలగాలు శత్రువును ప్రతిఘటించడంలో భాగంగా ఈ ఘటనను విజయంవంతం చేసారు.

నారాయణపూర్ జిల్లా (పూర్వ బస్తర్ డివిజన్) ఇరపనార ఆంబుష్‌లో ఇద్దరు ఎస్‌ఐలు, నలుగురు ఇంటిలిజెన్స్ పోలీసులతో పాటు ఏడుగురు హతం కాగా 26 మంది గాయాలపాలయ్యారు.

దక్షిణ బస్తర్ డివిజన్ బెజ్జి పరిసరాల్లో జరిగిన ఆంబుష్‌లో రోడ్డు ఓపెనింగ్ పార్టీకి చెందిన ఇద్దరు పోలీసులు హతం కాగా ఆరుగురికి గాయాలయ్యాయి. ఇక్కడే 10 వాహనాలను పీఎల్‌జీఏ

# ప్రజా పోరాటాల్లో సంఘటిత మవుతున్న పీడిత ప్రజలు

## 1. భూపోరాటాలు

మల్కనగిరి జిల్లాలో కటాఫ్ ఏరియా, విశాఖ జిల్లాలో పెదబయలు ఏరియాలలో గత 2సం॥లుగా దున్నేవారికే భూమి నినాదంతో సాగుతున్న వ్యవసాయక విప్లవ కార్యక్రమంలో భూస్వాముల భూములనూ, కొందరు తెగ పెద్దల అక్రమ ఆక్రమణలో వున్న ప్రజల భూములనూ, అసైన్డ్ భూములను విప్లవ రైతుకూలి సంఘం నాయకత్వంలో పేదరైతాంగం స్వాధీనపర్చుకొని, పంపిణీ చేసుకొని సాగు చేసుకుంటున్నారు. సాగు భూమి తక్కువగా వున్న గ్రామాలలో, భూమి చదును కార్యక్రమం చేపట్టి, భూమిలేని పేదలకు భూములు అందిస్తున్నారు. మరి కొన్ని గ్రామాలలో భూ పంపిణీకి భూములు లేని చోట వ్యవసాయ కూలీ, పేద రైతాంగం భూ సమస్యలను పరిష్కరించడంలో భాగంగా గ్రామంలోని భూమంతటిని సమిష్టి భూమిగా మార్చి, సమిష్టి వ్యవసాయాన్ని చేపట్టి, పండిన పంటలను సమానంగా పంచుకుంటున్నారు. భూములను సాగులోకి తేవడానికి దుక్కిటెద్దులు, అరకలు వంటి ఉత్పత్తి సాధనాలు అందరివద్ద లేనప్పుడు ఈ సమస్యను పరిష్కరించడంలో భాగంగా గ్రామంలో శ్రమ సహకార టీంలను ఏర్పర్చుకోవడం చేస్తున్నారు. అలాగే ఒంటరి మహిళల, వృద్ధుల వ్యవసాయ పనుల సమస్యను కూడా సహకారతత్వంతో పరిష్కరించుకుంటున్నారు. ఈ కార్యక్రమం అనేక గ్రామాలకు విస్తరించి ప్రజలు ఒక ఉద్యమంలా కొసాగిస్తున్నారు.

గత పోరాట అనుభవాలు, గుణపాఠాల నుండి నేర్చుకున్న విషయాల ఆధారంగా సరైన పోరాట, నిర్మాణ ఎత్తుగడలతో ముందుకు వస్తున్నారు. బందుగాం బ్లాక్‌లో తిరిగి భూ ఆక్రమణ, పంపిణీ, సాగు చేసుకొనే పోరాటం కొన్ని గ్రామాలలో ప్రారంభమైంది. ఈ క్రమంలోనే కత్తులపేట భూస్వాముల సెంటు గడ్డి (లెమన్ గ్రాస్)భూములలో నాలుగు గ్రామాల ప్రజలు జండాలు పాతి తిరిగి ఆక్రమించుకున్నారు. ప్రజలు తమ భూమి సమస్యను పరిష్కరించుకోవడానికి కొత్త రూపాలలో ముందుకు వస్తారనడానికి ఇవి సంకేతాలు.

3 సం॥లుగా పార్టీ, ప్రజా సంఘాలు చేసిన రాజకీయ కృషి ఫలితంగా, క్రమంగా గంజాయి సాగు విస్తీర్ణం తగ్గి, ఈ సం॥రం ఆహర (సాంప్రదాయిక) పంటల సాగు విస్తీర్ణం పెరిగింది.

విశాఖపట్నం జిల్లాలోని కోరుకొండ, గాలికొండ ఏరియాలలో ఎ.పి.ఎఫ్.డి.సి. ఆధీనంలో వున్న సుమారు 1500 హెక్టారుల కాఫీ ఎస్టేట్‌లను విప్లవ రైతుకూలీ సంఘం నాయకత్వంలో ప్రజలు స్వాధీనం చేసుకొని సాగుచేసుకుంటున్నారు. పోలీసులు గ్రామాలపై దాడులు, అక్రమ అరెస్టులు చేసి, తప్పుడు కేసులు బనాయించినా, పంటల సీజన్‌లో పోలీసులే స్వయంగా కాఫీ తోటలను తగుల బెట్టినా, సాగుకు అవసరమయిన ఎరువుల కొనుగోలు సరఫరాలను అడ్డుకున్నా, ప్రజలు మాత్రం పి.ఎల్.జి.ఎ. రక్షణలో కాఫీ ప్లాంటేషన్లను వదలకుండా సాగు చేసుకుంటున్నారు. ఈ పోరాటం కొత్త ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నది. ఈ సం॥రం ఎ.పి.ఎఫ్.డి.సి. అధికారులు మేక తోలు కప్పుకున్న పులి చందంగా గ్రామాలలోకి వచ్చి ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ, తిరిగి కాఫీ తోటలు ఎ.పి.ఎఫ్.డి.సి.కి అప్పగిస్తే, ప్లాంటేషన్ల నిర్వహణలో మెరుగుదల తెస్తామనీ, మీకు కూలీ పనులు కల్పిస్తామని బొంకుతూ

---

తగులబెట్టింది. కెర్లపాల్ సురుసుట్టి దగ్గర జరిగిన ఆంబుష్‌లో ఐదుగురు పోలీసులకు గాయాలయ్యాయి. అక్కడే ఒక ప్రెషర్ బాంబుపేలి ఒకడు చచ్చాడు. మరొకడు గాయపడ్డాడు. బాసగూడ పరిసరాల్లోని అవుటుపల్లి వద్ద బూబీట్రాప్‌తో ఇద్దరు డీఆర్‌జీ పోలీసులు, పశ్చిమ బస్తర్ గంగులూరు ఏరియా పుంబాడ్ పరిసరాల్లోని రాణి బోదిలి క్యాంపు దగ్గర మైన్‌పేలి ముగ్గురు, మద్దేడ్ సమీపంలో ప్రెషర్ బాంబుపేలి ఇద్దరు గంగులూరు ఏరియా హిర్మకొండ పరిసరాల్లో ప్రెషర్ బాంబుపేలి ఒక పట్నం పరిసరాల్లోని ఉళ్లూరు గ్రామం దగ్గర ఇద్దరు గాయపడ్డారు. పట్నంలో బీజాపూర్ చెందిన బీజేపీ నాయకుడు జగదీశ్ కొండను, అలాగే సుక్మాలో సురుసుట్టి సర్పంచి (ఇన్ఫార్మర్స్)ని పీఎల్‌జీఏ ఖతం చేసింది. దర్బ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకుడు అవదేశ్ గౌతమ్ గార్డ్స్‌పై కాల్పులు జరిపి ఒక ఏకే 47 తుపాకిని పీఎల్‌జీఏ స్వాధీనం చేసుకున్నది. మొత్తం ఉత్తర, దక్షిణ, పశ్చిమ రిజియన్స్‌లో ఈ మధ్య కాలంలో 27 మంది పోలీసులను హతమార్చి 76 మందిని గాయపర్చడం జరిగింది.

చర్యా ప్రతిచర్యలుగా, దాడి-ప్రతిఘటనలుగా ఇవి కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజలు, విప్లవోద్యమ ఆత్మరక్షణలో భాగంగానే అప్పుడప్పుడు ఇటువంటి చర్యలకు పాల్పడుతూ ప్రజల ప్రతిఘటనా శక్తిని బయటికి తీసుకురాగలుగుతుంది. ప్రజల్లో విశ్వాసాన్ని కల్పించి విప్లవోద్యమాన్ని పురోగమింప జేయగలుగుతుంది.

కేంద్ర రాష్ట్ర బలగాలు ఒక పథకం ప్రకారం విప్లవోద్యమాన్ని అణచివేసి, పీడిత ప్రజలకు నాయకత్వం లేకుండా చేసి, ఆదివాసులను అడవుల నుండి తరిమివేసి (విస్తాపితం చేసి) అడవులను, అక్కడి వనరులను సామ్రాజ్యవాదులకు దోచిపెట్టడానికి చూస్తున్నారు.

స్థానిక ఆదివాసులు, విప్లవ ప్రజలు సీపీఐ (మావోయిస్టు) నాయకత్వంలో దీనిని ప్రతిఘటిస్తున్నారు. కాబట్టి ప్రజలు ప్రకృతి సంపదలను, తమ జీవితాలను, జీవనాధార భూములను కాపాడుకోవడం కోసం తప్పని సరి పరిస్థితుల్లో ఆత్మరక్షణా యుద్ధాన్ని ప్రతిఘటనాయుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. దోపిడీ పాలకవర్గాలు ఎంత తీవ్ర స్థాయిలో ప్రజలపై యుద్ధాన్ని నడుపుతారో అదే స్థాయిలో ప్రతిఘటన ఉంటుంది. ఇది ప్రజలు నిర్మిస్తున్న చరిత్ర. దోపిడీ వర్గాల కోసం పనిచేసే ప్రభుత్వం, వారి బలగాలు ప్రజల కోపాగ్నికి మాడి మసికాక తప్పదు. ✦

ప్రజాభిప్రాయాన్ని కోరారు. వీరి ప్రతిపాదనను నిర్మొహమాటంగా, ప్రజలు తిరస్కరించడంతో పాటు, ఈ అడవి మీద అధికారము మాదేనని ఖచ్చితంగా తేల్చి చెప్పడంతో ఎ.పి.ఎఫ్.డి.సి. అధికారులు తోక ముడిచారు.

### కత్తులపేట భూముల్లో జెండాలు పాతి, పంటను కోసుకున్న ప్రజానీకం

2017 మార్చిలో కత్తులపేట భూముల విషయంలో మాజీ సంఘ నాయకుడు బిర్సును ప్రజాకోర్టులో నిలబెట్టి, ప్రజలకు చేసిన ద్రోహం విషయంలో ప్రజల ముందు దేహశుద్ధి చేయడంతో పాటు, ప్రజలు తిరిగి భూములను స్వాధీనం చేసుకోవాల్సిందిగా ప్రజలకు పిలుపునివ్వడం జరిగింది. అదే రోజున 4 గ్రామాల ప్రజలు కదిలి గతంలో తమ గ్రామాలకు కేటాయించిన భూముల్లో జెండాలు పాతారు. రాత్రికి రాత్రి కత్తులపేటలో బ్యానర్లు, పోస్టర్లు వేశారు. ఆ తర్వాత ఆ భూముల్లో ఏపుగా పెరిగివున్న సెంటుగడ్డి (లెమన్ గ్రాస్)4 గ్రామాల ప్రజలు కలిసి సమిష్టిగా ఒకదాని తర్వాత ఒకటి కోసేశారు. సెంట్రీలు పెట్టుకొని 3 రోజులు శ్రమ చేసి తీసిన సెంటునూనెను అమ్మగా, వచ్చిన డబ్బులను గ్రామాల వారిగా సమానంగా పంచుకున్నారు. ఒక్కో గ్రామానికి 30,000/- రూ॥ల చొప్పున పంచుకున్నారు.

రెండవ పంట సమయంలో కూడా 4 గ్రామాల నుండి ముఖ్యమైన వాళ్ళతో కోర్‌ను 20 మందితో సమావేశం జరిపి, అందులో నుండి 7గురితో కమిటీ నిర్మాణం చేశారు. కమిటీ పోరాటంలో బలహీనపడిన 4వ గ్రామానికి వెళ్ళి ప్రజలతో సమావేశం జరిపింది. ఈ సమావేశంలో ప్రజలు సెంటు గడ్డి కోయడానికి సిద్ధపడటంతో 4 గ్రామాలు కలిసి ఒక్కపూటలోనే ఆ గడ్డిని కోసి, నూనె ద్వారా వచ్చిన ఆదాయాన్ని సంబంధిత గ్రామానికి ఇవ్వడమే కాకుండా, ఆ భూమిని వెంటనే దున్ని, కొత్త సెంటు మొక్కలను కూడా నాటారు. ఇది ప్రజల సమిష్టితత్వాన్ని, ఐక్యతను తెలియచేస్తుంది.

### 2. నిర్వాసితత్వ వ్యతిరేక పోరాటాలు

ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో, దేవమాలి పర్వతంలో బాక్సైట్ ఖనిజం తవ్వకాల కోసం ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న కార్పొరేట్ కంపెనీని అడ్డుకుంటూ అన్ని వర్గాల, సెక్షన్‌ల ప్రజలు, ప్రజా సంఘాలు కలిసి ఐక్య పోరాట కమిటీగా ఏర్పడి పోరాడుతున్నారు. ప్రజలు అడవిపైనా, భూమిపైనా, నీటిపైనా హక్కు మాదేనంటూ, సంఘటిత పడుతూ ఉద్యమాన్ని వివిధ రూపాలలో మరింత మిలిటెంట్‌గా కొనసాగిస్తున్నారు. ప్రజల ప్రతిఘటన ముందు ప్రభుత్వం, గనుల మాఫియా తోక ముడవక తప్పడం లేదు. ఇదే ఏరియాలో మరికొన్ని ప్రాంతాలలో గనుల తవ్వకాలకు ప్రభుత్వంతో ఎమ్.ఒ.యు.లు కుదుర్చుకున్న బహుళజాతి కంపెనీల ప్రయత్నాలు, ప్రజల ప్రతిఘటన మూలంగా విఫలమైనాయి.

విశాఖపట్నం జిల్లాలో "ప్రాణాలైన ఇస్తాం, బాక్సైట్ తవ్వకాలకు అనుమతివ్వం'' అంటూ ఆదివాసీలు ఏకమై ముక్తకంఠంతో నినదించారు. పీసా, పునరావాస కమిటీలలో చేరిన దళారీలను ప్రజల్లో పెట్టి విచారించి, శిక్షలు విధించారు. ప్రజాభిప్రాయ సేకరణంటూ, ప్రభుత్వం ఆడిన దొంగ నాటకాలను ప్రజలు బహిష్కరించి బహిరంగ పరిచారు. అధికారులెవ్వరిని మన్యంలో అడుగుపెట్టకుండా తరిమి కొట్టారు. పోలీసులు వస్తే ప్రతిఘటించారు. పోలీసు క్యాంపులు ఏర్పాటు చేయడానికి చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. బాక్సైట్ తవ్వకాలు చేపట్టడం సాధ్యం కాదని భావించిన ప్రభుత్వం, జి.ఒ.నెం.97ను తాత్కలికంగా నిలిపివేసింది. ఈ నిర్బంధానికి వ్యతిరేకంగా వివిధ ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, కవులు, కళాకారులు, ప్రతిపక్షాలు ఐక్యంగా ప్రతిఘటిస్తున్నారు.

### 3. కుందిలి అత్యాచార ఘటనకు నిరసనగా పెల్లుబికిన ప్రజాగ్రహం

10-10-2017న కుందిలి పరిసర ప్రాంతంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై నలుగురు సాయుధ జవాన్లు అమానవీయంగా సామూహిక అత్యాచారం చేసారు. దానిని వ్యతిరేకిస్తూ 10, 11 తేదీలలో ప్రజలు చేపట్టిన 'జాతీయ రహదారి బంద్' కొరాపుట్ జిల్లాలోనే కాక, యావత్తు ఒడిశా రాష్ట్రాన్నే కుదిపి వేసింది. ఈ ఘటన పూర్వాపరాల్లోకి వెళితే ....

ముస్కాగూడ గ్రామంలోని దళిత కుటుంబానికి చెందిన మైనారిటీ బాలిక సారిసపొదర్ (పంచాయితీ)స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నది. 10-10-2017న పరీక్షల నిమిత్తం పాస్ పోర్ట్ ఫోటో తీసుకొనేందుకు కుందిలి (పొట్టంగి, సిమిలిగూడ బ్లాక్‌ల మధ్యలో ఎన్.హెచ్-46పై వుంది) వచ్చి తిరిగి గ్రామానికి ఆటోలో కొంతదూరం పోయి, అక్కడినుండి తన గ్రామానికి ఉదయం 11:30 గం॥ల సమయంలో ఒంటరిగా వస్తున్న బాలికను, నలుగురు సాయుధ పోలీసు జవాన్లు అటకాయించి, రోడ్డుకు ఆనుకొని వున్న అడవిలోకి బలవంతంగా ఎత్తుకుపోయారు. వరుసగా నలుగురు బాలికపై అత్యంత దారుణంగా అత్యాచారం చేసారు. తర్వాత ఈ విషయాన్ని బయటకు వెల్లడిస్తే చంపేస్తామని బెదిరించి, నిస్సహాయ స్థితిలో వున్న తనని విడిచి వెళ్ళిపోయారు. కొద్దిసేపటికి ఆ సమీపంలో పశువులను మేపుతున్న ఒక రైతు అచేతనావస్థలో వున్న బాలికను చూసి, రోడ్డుపై వెళుతున్న మరొక వ్యక్తి సాయంతో తన గ్రామానికి చేర్చాడు. జరిగిన సంఘటనను తెలుసుకున్న తల్లిదండ్రులు దుఃఖంతో, ఆగ్రహంతో రగిలిపోయారు. వెంటనే బాలికను కుందిలి హాస్పిటల్‌కు తీసుకెళ్ళగా వైద్యులు కొరాపుట్ మెడికల్‌కు తీసుకెళ్ళాల్సిందిగా చెప్పి పంపించారు.

ఈ సంఘటనకు నిరసనగా బంధువులు, ప్రజలు ఆగ్రహంతో రోడ్లపైకి చేరుకున్నారు. బాలిక అన్నయ్య పొట్టంగి స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే, అక్కడి పోలీసు అధికారులు ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయకపోవడమే కాకుండా, లాఠీలతో తీవ్రంగా చితకబాది పంపించి వేశారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ మధ్యాహ్నం 1:30 గం॥ల ప్రాంతంలో టైర్లను కాల్చి, వాహనాల రాకపోకలను అడ్డుకొని ప్రజలు జాతీయ రహదారిని దిగ్బంధనం చేశారు. ప్రారంభంలో 150 నుండి 200 వరకు వున్న ప్రజల సంఖ్య సాయంకాలానికి 700 గానూ, మరుసటి రోజు (10-10-17) ఉదయానికి సుమారుగా 3000 లకు చేరుకున్నారు. ఆందోళనకారులు ఒక

దశలో బస్సులను తగులబెట్టేందుకు ప్రయత్నించగా, స్థానిక బి.జె.పి. నాయకులు ప్రఫుల్ల పాంగి (ఎమ్.ఎల్.ఎ), రఘురామ్ పడాల్‌లు వచ్చి, బంద్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ, విరమించాలని చెప్పిన మాటలకు, ప్రజలు వారిపై తిరగబడ్డారు. 11వ తేదీ సాయంత్రం 5 గం॥లకు కలెక్టర్, ఎస్.పి., ఇతర ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని చర్చలకై ప్రతిపాదించారు. "మాలి సురక్ష సమితి" నాయకత్వం, దళిత, ఇతర సెక్షన్‌ల నాయకత్వంలోని 12 మంది ప్రతినిధులతో కూడిన ఒక తాత్కాలిక కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ అత్యాచార నిందితులైన నలుగురు జవాన్ల అరెస్ట్, కొరాపుట్ జిల్లాలో మైనింగ్ నిలిపివేత, పోలీస్ క్యాంపుల ఎత్తివేత, బాధితురాలికి 2 కోట్ల నష్టపరిహారంతో పాటు ఉచిత విద్య, వైద్యం, ఉపాధి కల్పన డిమాండ్‌లను ముందుకు తెచ్చింది. దానికి బదులుగా క్యాంపుల ఎత్తివేత, మైనింగ్ రద్దు కేంద్ర పరిధిలోని అంశాలనీ, నిందుతుల అరెస్ట్, ఇతర డిమాండ్ల పరిష్కారానికై రెండు రోజుల గడువు కోరడంతో, చర్చల సారాంశాన్ని ప్రజలకు వివరించి బందు విరమించాలని నాయకత్వం విజ్ఞప్తి చేయగా 12వ తేదీ తెల్లవారు జామున 2 గం॥ల ప్రాంతంలో జాతీయ రహదారిపై తిరిగి వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ఆ నలుగురు జవాన్లను అరెస్ట్ చేయడానికి బదులుగా బాధితురాలి కుటుంబానికి చెందిన నలుగురు యువకులను ఇళ్లనుండి ఎత్తుకుపోయి తావే అత్యాచారం చేశామని ఒప్పుకోవాలని కొట్టడం, కరెంట్ షాక్ ఇవ్వడం లాంటి చిత్రహింస పెట్టడంతో పాటు ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరించారు పోలీసులు. అసలు బాలికపై అత్యాచారం జరగలేదనీ, మెడికల్ రిపోర్టు వచ్చిందని ఎస్.పి. ప్రకటించి, బాలికను ప్రభుత్వ బాలిక సంక్షేమ వసతిగృహంలో పోలీసుల కాపలా మధ్య బంధించారు. ఎస్.పి. ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, కొరాపుట్ జిల్లాలోని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలెక్టర్ ఆఫీసు, అసెంబ్లీల ముందు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. బాధితురాలికి న్యాయం జరిగేంతవరకు ఆందోళన కొనసాగించాలని ప్రజాసంఘాలు నిర్ణయించాయి.

### 4. పనసపుట్ మాజీ సర్పంచ్ అవినీతిపై ప్రజాకోర్టు

కటాఫ్ ఏరియాలోని పనసపుట్ మాజీ సర్పంచ్ అర్జున్ ప్రజావ్యతిరేకిగా, పోలీసు ఏజెంట్‌గా పని చేస్తున్నాడని ప్రజలు, పార్టీ నిలదీయడంతో, గ్రామం వదిలి ఒక సంవత్సర కాలం పారిపోయాడు. ఆ తర్వాత తప్పులు అంగీకరించి, తిరిగి గ్రామంలో వుంటున్నాడు. పంచాయితీలోని అందికల్, జాంగూడ, పనసపుట్ గ్రామాలలో 15 మంది సాధారణ రైతులపై మావోయిస్టులని పోలీసులు కేసులు పెట్టారని అబద్దాలు చెప్పి, వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని, ఒక్కొక్కరు 25,000/- చెల్లిస్తే వకీలుతో మాట్లాడి కేసుల్లేకుండా చేస్తాననీ, 2,50,000/- వసూలు చేశాడు. ఆ డబ్బుతో ట్రాక్టర్ కొన్నాడు. తనకు దగ్గరి బంధువు అయిన ఒక మహిళపై అత్యాచారం చేసి, ఆ కుటుంబంపై దాడి చేసి, కొట్టాడు.

500 మంది ప్రజల అభిప్రాయంపై ఆధారపడి, డబ్బులు వాపస్ యిప్పించడంతో పాటు, శిక్షగా దేహశుద్ధి చేయడం జరిగింది. ఈ సంఘటన తర్వాత అవినీతి పరులైన మరికొందరు సంఘాల ముందు సరెండర్ అయి, అవినీతి చేసిన డబ్బులను వాపస్ యిస్తామని అంగీకరించారు.

### 5. "ఇసుకపై స్థానికులకే హక్కు కావాలి" అని పోరాడి, సాధించుకున్న ప్రజలు

12 గ్రామాల ప్రజలతో ఒక పోరాట కమిటీ ఏర్పడింది. ఆ కమిటీ చర్చించి, కొన్ని డిమాండ్లను రూపొందించింది.

1. ఇసుకపై హక్కు స్థానిక గ్రామాల ప్రజలకే! మెషిన్ల ద్వారా ఇసుకను తవ్వడం తక్షణమే ఆపాలి.

2. కమిటీ నిర్ణయించిన ధరకే (ట్రాక్టర్ లోడు 1500/-) ఇసుకను కొనుగోలు చేయాలి.

3. ప్రతీ గ్రామానికి ఆదాయం వచ్చేలా ఇసుకను సీరియల్ ప్రకారం లోడ్ చేయాలి.

పై డిమాండ్లతో పాటు, ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్న స్థానికేతర షావుకార్లను కూడా హెచ్చరిస్తూ, వేరు వేరు చోట్ల వున్న 5 ఇసుక మెషిన్లను ధ్వంసం చేసి, పోస్టర్లు వేయడం జరిగింది. ఇది జరిగిన తరువాత కాలువకు రెండు వైపులా వున్న గ్రామాలలో పాకెట్ కమిటీలు ఏర్పడ్డాయి.

### 6. అవినీతిపరులు, ఇన్‌ఫార్మర్లపై ప్రజా పంచాయితీలు నిర్వహించి, లొంగదీసిన ఆదివాసీ ప్రజానీకం

1. కొరాపుట్ జిల్లా, నందపూర్ ఏరియా, గొల్లూరు పంచాయితీ, పొట్టుగూడ గ్రామానికి చెందిన రాము 5 లక్షల రూపాయల విలువ చేసే ప్రభుత్వ పనులను ప్రజల చేత చేయించాడు. కానీ ప్రజలకు మాత్రం ఒక్క నయా పైస కూడా ఇవ్వకుండా మొత్తం తానే స్వాహా చేసాడు. ఈ ప్రజా పంచాయితీకి 7 గ్రామాల ప్రజలు సుమారు 100 మంది వరకు హాజరై రామును నిలదీయడంతో తన తప్పును ఒప్పుకున్నాడు. ఈ సందర్భంగా ప్రజలు వాడికి దేహశుద్ధి చేసి, బకాయి పడివున్న 2 లక్షల 50 వేల రూపాయలను తక్షణమే వసూలు చేశారు. 2. కొరాపుట్ జిల్లా, పొట్టంగి బ్లాక్, పేటూరు పంచాయితీ, మొండిగవాడ గ్రామానికి చెందిన రాజు గ్రామ మునసబు, పెత్తందారీగా వుంటూ ఆ గ్రామ ప్రజలపై ఆధిపత్యం కొనసాగించడంతో 5 గ్రామాల ప్రజలు హాజరై రాజు చేసిన అరాచకాలను నిలదీసి, దేహశుద్ధి చేయడంతో పాటు కాంట్రాక్టు పనుల ద్వారా అక్రమంగా స్వాహా చేసిన 30 వేల రూపాయలను ప్రజలకు ఇవ్వాలనీ, అవసరానికి మించి తన దగ్గర వున్న భూములను తీసి, గ్రామంలో వున్న నిరుపేద కుటుంబాలను పంచి పెట్టాలనీ, పోలీసుల అండతో ప్రజలను బెదిరించే పద్ధతులను మానుకోవాలనీ, డిమాండ్ చేసి వాటిని సాధించుకున్నారు.

3. నందపూర్ బ్లాక్, తమ్మడింగ్ గ్రామానికి చెందిన డొంబు అనే వ్యక్తి పెద్దమనిషిగా చలామణి అవుతూ, పోలీసుల అండదండలతో గ్రామంలోనే కాకుండా, ఆ చుట్టపక్కల గ్రామాలలో కూడా గూండాగిరినీ, అనేక అరాచకాలను కొనసాగిస్తున్నాడు. డొంబు ద్వారానే పోలీసులకు 2 సార్లు సమాచారం వెళ్ళిందనే

విషయాన్ని ప్రజల ద్వారా తెలుసుకున్న స్థానిక దళం డొంబును పట్టుకొని ప్రజల ముందు పెట్టి దేహశుద్ధి చేయడంతో, తన తప్పును ఒప్పుకున్నాడు. తన కొడుకు కూడా ఉద్యోగానికి రాజీనామా చేసి, గ్రామంలో బతకాలనీ, స్థానిక ప్రజలు చేసిన డిమాండ్స్‌ను ఒప్పుకున్నాడు.

4. నందపూర్ ఏరియా, మాదల పంచాయితీ, తోంగూడ గ్రామానికి చెందిన పాంగి రాజేష్, పాంగి బింగులతో పాటు, చాపరాయివలస గ్రామనికి చెందిన కామేష్‌లు ఆంధ్ర పోలీసుల లింక్‌లో వుంటూ, దళ సమాచారం సేకరించే పనిని కొనసాగిస్తూ వచ్చారు. అనేక సార్లు దళం ప్రజల సహకారంతో తృటిలో ఎన్‌కౌంటర్స్ నుండి తప్పించుకోగలిగింది. దళం సమాచారం పోలీసులకు చెప్పడంతో పాటు, గ్రామంలో ఉన్న మహిళలపై అత్యాచారం చేయడం, ఎవరైనా ఎదిరిస్తే వాళ్ళపై దౌర్జన్యం చేయడం లాంటి పనులు కొనసాగించేవాళ్ళు. ఆ పాకెట్ ఆదివాసీ రైతు కూలి సంఘం ప్రజా కోర్టును నిర్వహించి, ఆ ముగ్గురికి దేహశుద్ధి చేసింది. అత్యాచారినికి గురైన మహిళలకు వాళ్ళ చేత క్షమాపనలు చెప్పించారు.

## పీఎల్‌జీఏ, ప్రజల ప్రతిఘటన

**ఖంగుతిన్న పోలీసులు, ధ్వసమైన ఇన్‌ఫార్మర్ల నెట్‌వర్క్**

విశాఖపట్నం జిల్లాలోని, రాళ్ళగడ్డ పోలీసు క్యాంపుకు సమీపంలో పి.ఎల్.జి.ఎ. పేల్చిన మందుపాతరలో ఒక హెంగార్డు చనిపోయాడు. దానితో ఖంగుతిన్న పోలీసులు ఆంధ్ర, ఒడిశా సరిహద్దు గ్రామాలపై దాడులు, అక్రమ అరెస్టులు తీవ్రతరం చేశారు. ఈ అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా విప్లవ రైతుకూలీ సంఘం నాయకత్వంలో సరిహద్దు గ్రామాలకు చెందిన సుమారు 1500 మంది ప్రజలు సమావేశం జరుపుకొని ఈ దాడులను, అక్రమ అరెస్ట్‌లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియాలో, గొనబెద గ్రామం వద్ద ముగ్గురు మిలీషియా సభ్యులు అరెస్టుకు నిరసనగా 2 వేల మంది ప్రజలు ఊరేగింపుగా వెళ్ళి, పోలీసు క్యాంపు ముందు బైఠాయించారు. రెచ్చిపోయిన పోలీసులు ప్రజలపైకి ఆయుధాలు లోడ్ చేశారు. ప్రజలు రాళ్ళు, కర్రలతో ప్రతిఘటించడానికి సిద్ధపడడంతో, పోలీసులు ఒక అడుగు వెనక్కి వేశారు. పోలీసులకు ఆహార పదార్థాల సప్లైలు నిలిపివేయాలనీ, ఏరియాలో ప్రజలుగానీ, కిరాణ దుకాణాలుగాని ఎలాంటి వస్తువులు(కూరగాయలు, కోళ్ళు, మేకలు)అమ్మరాదని నిర్ణయం తీసుకున్నారు. రవాణా అవుతున్న సామానులను ప్రజలతో కలిసి పి.ఎల్.జి.ఎ. స్వాధీనం చేసుకున్నది.

విశాఖపట్నం జిల్లాలో బాక్సైట్ తవ్వకాల కోసం, దారకొండ గ్రామంలో సి.ఆర్.పి.ఎఫ్. క్యాంపు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణ పనులను వ్యతిరేకిస్తూ పార్టీలకు అతీతంగా, ఆదివాసీలంతా ఐక్యమై ప్రతిఘటించారు. జిల్లా ఎస్.పి. ఆదేశాలతో పోలీసులు గ్రామాలపై దాడులు చేసారు. పదుల సంఖ్యలో ప్రజలను అరెస్ట్ చేసి, 200 మందిపైన కేసులు పెట్టి, భయానక వాతావరణాన్ని సృష్టించి లొంగదీసుకోవాలని ప్రయత్నించారు. ఈ అక్రమ అరెస్టులను ఖండిస్తూ, అఖిలపక్షం పేరుతో వై.ఎస్.ఆర్.సి.పి., సి.పి.ఎమ్., అధికార టి.డి.పి. (క్రింది స్థాయి)తో సహా వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గిరిజన సంఘాలు, విద్యార్థులు, రచయితలు ఈ అరెస్టులను ఆపివేయాలనీ, పోలీసు క్యాంపులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ, వీటిని నిలిపివేయకపోతే ప్రజా ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మల్కనగిరి జిల్లా, విచ్ఛిన్నాంచల్ ఏరియా, పప్పరమెట్టలో 500 మంది ప్రజలు పప్పరమెట్టలో ఊరేగింపు చేసి సభ జరుపుకున్నారు.

"మేము సురక్షితంగానే వున్నామనీ, మాకు పోలీసుల నుండే రక్షణ కావాలనీ, పోలీసు క్యాంపులు అవసరం లేదని ప్రకటించారు. "ప్రజలపై ప్రేమ వుంటే స్కూల్, హాస్పిటల్ నిర్మించండి" అంటూ ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ బహిరంగంగా పత్రిక ప్రకటనలు చేశారు. పోలీసులు పెదబయలు ఏరియా, సుర్మతి గ్రామంలో క్యాంపు నిర్మాణంతో పాటు, సెల్‌టవర్ నిర్మించాలని నిర్ణయించారు. దానితో మిలీషియా, ప్రజలు కలిసి నిర్మాణ పనులలో వున్న రెండు జె.సి.బి.లను దగ్ధం చేసి, పైపులను స్వాధీనం చేసుకొని తీసుకెళ్ళి తమ త్రాగునీటికి వినియోగించుకోవాలనే నిర్ణయం చేసుకున్నారు. ఇదే ప్రాంతంలో పోలీసు క్యాంపు నిర్మాణం సన్నాహాలు చేస్తూనే, రోడ్డు నిర్మాణం కోసం పోలీసుల రక్షణలో రెండు జె.సి.బి. యంత్రాలను ఉపయోగించి పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణాన్ని, ఇంటర్‌నెట్ కనెక్షన్ పనులను అడ్డుకోవడంలో భాగంగా ఒకేరోజు దాడి చేసి రెండు చోట్ల 4 జె.సి.బి.లను తగలబెట్టారు.

**పోలీసు సమాచార యంత్రాంగాన్ని (ఇన్‌ఫార్మర్స్‌ను) ధ్వంసం చేసిన ప్రజలు, పి.ఎల్.జి.ఎ.**

విశాఖపట్నం జిల్లా, చింతపల్లి మండలంలోని, అన్నవరం గ్రామానికి చెందిన గుంపలోవ శ్రీనివాస్ సీజనల్ వ్యాపారాలు (కందులు, పసుపు, తృణధాన్యాలు) చేస్తూ గ్రామాలకూ, సంతలకు తిరుగుతుంటాడు. ఈ క్రమంలో ఇంటలిజెన్సీ సి.ఐ, నరహంతకుడు వెంకట్రావ్‌తో సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. 2012లో లువ్వసింగి గ్రామం వద్ద దళం వుందని తెలుసుకొని, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కోరుకొండ సంతలో పట్టుకొని విచారించి, సమాచారం రాబట్టి, పి.ఎల్.జి.ఎ. అక్టోబర్‌లో కాల్చిచంపింది.

మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్, కటాఫ్ ఏరియాలోని జొంత్రి గ్రామంలో గ్రామ పెత్తందారు, ప్రజావ్యతిరేకి అయిన సోమ పాంగి సీజనల్ వ్యాపారాలు, కిరాణ దుకాణము, మిషన్ డొంగ ద్వారా చాపల వ్యాపారము వగైరా చేస్తుండేవాడు. 2015లో ఆలౌట్ అభియాన్‌కు కీలకంగా సమాచారాన్ని ఒ.ఎస్.-ఎ.పి. పోలీసులకు అందజేసాడు. ఆ తర్వాత ప్రజా వ్యతిరేకులతో కలిసి, పార్టీకి వ్యతిరేకంగా మీటింగ్ జరిపి, ప్రజలను లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. ఈ విషయాలపై ప్రజాకోర్టు నిర్వహించగా చివరకు అంగీకరించాడు. ఆ సందర్భంగా ఆ పాకెట్ గ్రామాల ప్రజలు వాడి ఆస్తులు స్వాధీనం చేసుకొని, గ్రామం నుండి బహిష్కరించాలని తీర్మానించి అమలు చేశారు.

తర్వాత పోలీసులు క్యాంపులకు సామానుల సరఫరా చేసే

పని అప్పగించారు. పూర్తికాలం ఇన్‌ఫార్మర్‌గా మార్చారు. ఈక్రమంలో ఎ.పి. ఇంటలిజెన్సీ వీడితో సంబంధాలు ఏర్పర్చుకొని, కటాఫ్ ఏరియాలో నాయకత్వాన్ని నిర్మూలించే విధంగా ఒక పెద్ద సంఘటనకు పథకం రూపొందించారు. రాంగూడ ఎన్‌కౌంటర్‌లో పని చేసిన ఏజెంట్లందరూ సోమ తయారు చేసిన వ్యక్తులే. రాంగూడ ఎన్‌కౌంటర్ సందర్భంగా ఎ.పి. గ్రేహౌండ్స్ బలగాలను రహస్యంగా రాత్రి సమయాలలో రిజర్వాయర్ గుండా మిషన్ పడవలో తరలించింది కూడా సోమ పొంగినే. ప్రజల డిమాండ్‌తో పి.ఎల్.జి.ఎ. అక్టోబర్ 22, 2017న స్పీల్‌వే వద్దద్యాం పైన కాల్చి చంపింది. వీడి ఖతం తర్వాత ప్రజలు గ్రామాలలో పండుగ జరుపుకున్నారు.

మల్కనగిరి జిల్లా కలిమెల బ్లాక్‌లోని కొరుబు గ్రామంలో 15 సం॥ర క్రితం డొమ్రు వచ్చి స్థిరపడ్డాడు. మాజీలతో, పోలీసులతో ప్రత్యక్ష సంబంధాలు పెట్టకుని, దళం ఆ ప్రాంతానికి వెళితే వెంటనే సమాచారం ఇవ్వడం, గ్రామంలో వుండకుండా తప్పుకొని తిరగడం, పోలీసు బలగాల కూంబింగ్‌ల మధ్య గ్రామాలకు రావడం, పోవడం చేస్తున్నాడు. వీడిని గ్రామంలో పట్టుకొని విచారించి ఖతం చేయడం జరిగింది.

### సర్పంచ్ జగ్గకు మరణశిక్ష విధించిన ప్రజలు

నందపూర్ బ్లాక్ హత్తిబారి పంచాయితీకి చెందిన జగ్గ కాంగ్రెస్ పార్టీ రాజకీయాలతో గత 15 సం॥లుగా అధికార బలంతో పంచాయితీకి వచ్చే నిధులన్నీ తానే స్వాహా చేసేవాడు. ట్రాక్టరు, బొలొరో, కారు, జీపు, 2 మోటర్ సైకిళ్ళు, 3 ఇళ్ళను సంపాదించి ముగ్గురు భార్యలతో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నాడు. ఏరియాలో దళం కదలికలను తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇస్తున్నాడు. ప్రజల అభిప్రాయంతో 7 గ్రామాల నుండి సుమారు 50 మంది యువకులతో కలిసి మన పి.ఎల్.జి.ఎ. ఆగస్టు 8వ తేదీన వీడి ఇంటి మీద దాడి చేసి, వీడి వాహనాలన్నీ తగులబెట్టి, వీడికి మరణశిక్ష విధించడం జరిగింది.

### ప్రజాయుద్ధంలో పెరుగుతున్న ప్రజల భాగస్వామ్యం

పి.ఎల్.జి.ఎ. 18వ ఆవిర్భావ వార్షికోత్సవాల సందర్భంగా, మన ప్రజాయుద్ధ లక్ష్యాన్ని, ప్రజాయుద్ధంలో ప్రజలు పోషించాల్సిన కర్తవ్యాలను, ముఖ్యంగా యుద్ధం, అధికారానికి మధ్య వున్న సంబంధాన్ని తెలియజేస్తూ, ప్రజానిర్మాణాలలో, మిలీషియాలో ఎడ్యుకేషన్ క్యాంపెయిన్ చేపట్టారు. అలాగే ప్రజలలో ప్రచారం కొనసాగించి, మన శక్తులన్నింటిని శత్రువుకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధంలో భాగస్వాములయ్యేలా పెదబయలు, కటాఫ్ ఏరియాలలో 15 నుండి 20 రోజుల పాటు నిర్దిష్టంగా గెరిల్లా చర్యలు చేపట్టేలా కార్యక్రమం రూపొందించారు.

పెదబయలు ఏరియాలోని బొంగిజంగి గ్రామానికి చెందిన మాజీ సంఘ సభ్యుడు మోహన్‌ను పట్టుకొని ప్రజాకోర్టులో విచారించి, శిక్షించాలని పార్టీ నిర్ణయించింది. దానితో మిలీషియా, దళం కలిసి పట్టుకోవడానికి వెలితే కుటుంబం అప్రమత్తం చేసి తప్పించింది. ఆ పాకెట్‌లోని 15 గ్రామాలకు చెందిన సుమారు 1000 మంది ప్రజల సమక్షంలో ఆ కుటుంబాన్ని విచారించారు. కుటుంబాన్ని గ్రామం నుండి బహిష్కరించాలని ప్రజలు ఏకగ్రీవంగా నిర్ణయించి, గ్రామం నుండి పంపివేశారు. అదే ప్రజా కోర్టులో అంబ్రిపడ సత్తిని కూడా ప్రజల్లో విచారించి దేహశుద్ధి చేసి వదిలేశారు.

పప్పర్లమెట్ట (ఒడిశా) పంచాయితీలోని, పాలెం గ్రామంలో ఇద్దరు హోంగార్డులు సుబ్బారావు, రాజారావులు ప్రజా వ్యతిరేకులుగా పని చేస్తున్నారు. వారి ఇళ్ళ నుండి ధాన్యం, పశువులతో పాటు, భూములను పంచాలని నిర్ణయించారు. వాటిని చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు పంపిణీ చేయడం జరిగింది.

కటాఫ్ ఏరియలో పనసపుట్ పంచాయితీలోని గొనబెడ సంఘటనకు కారణమైన మూలాపుట్ వ్యక్తి రాజబో కుమ్డ, ఎ.పి. గ్రామానికి చెందిన రామాంజనేయులును కూడా పట్టుకొని, విచారించి వాస్తవాలను ప్రజలలో చెప్పించి, పద్ధతి మార్చుకోమని హెచ్చరించి వదిలివేశారు. నారింజోల గ్రామంలో తెగ పెద్ద గ్రోను కుటుంబాన్ని, సిందిగూడ గ్రామానికి చెందిన తెగ పెద్ద మరియు మాజీ వార్డ్ మెంబర్‌ను గ్రామం వదిలి వెళ్ళవద్దని కండీషన్ పెట్టి వదిలివేశారు.

100 మంది మిలీషియా, దళం కలిసి ముదిలిపడ గ్రామం వద్ద రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న క్యాంపుపై దాడులు చేసి, జె.సి.బి., ట్రాక్టర్, 8 వాహనాలను దగ్ధం చేసి, పనులు ఆపాలని హెచ్చరించారు. అలాగే నక్కమామిడి నుండి ఒనకడిల్లీ వరకు కీలకమైన రోడ్డుపైన ప్రజలు, మిలీషియా, దళం కలిసి జె.సి.బి.తోపాటు 3 వాహనాలను దగ్ధం చేసి పనులను నిలిపివేశారు.

### విప్లవ మహిళా సంఘం నాయకత్వంలో మద్యనిషేధం అమలుకై పోరాటాలు

కటాఫ్ ఏరియాలో విప్లవ మహిళా సంఘం నాయకత్వంలో ముందు సారా సమస్యపై ప్రచారం చేసి, ప్రజల అవగాహనను పెంచి, అమ్మేవారికి, త్రాగేవారికి నచ్చచెప్పారు. అయినప్పటికీ అమ్మకాలు మానుకోకుండా, సంతల వద్ద జరుగుతున్న మద్యం వ్యాపారాన్ని బందు పెట్టించారు. రహస్యంగా అమ్ముతున్న కుంతులపొద్దూరు, గురుశెట్టి గ్రామలలో కొనసాగతున్న సారా వ్యాపారాన్ని బట్టబయలు చేసి, ఆ దుకాణాలను ధ్వంసం చేశారు. నాటు సారా తయారీ దారులకు అర్థం చేయించి, బంద్ చేయించారు.

అలాగే సెప్టెంబర్ 21 సి.పి.ఐ.(మావోయిస్ట్) 14వ అవతరణ దినోత్సవాలను జరుపుకోవాలని పిలుపునివ్వడంతో, జోన్ వ్యాపితంగా పోస్టర్స్, బ్యానర్స్ ద్వారా ప్రచారము చేశాం. అన్ని ఏరియాలలో గ్రామ స్థాయిలో పార్టీ సెల్స్, ప్రజా సంఘాలు ప్రజలను సమీకరించి సభలు, సమావేశాలు నిర్వహించారు. కోరుకొండ ఏరియాలోని చెరువూరు పాకెట్‌లో 10 గ్రామాలకు చెందిన సుమారు 500 మంది ప్రజలు, కటాఫ్ ఏరియా, పనసపుట్ పాకెట్‌లో సుమారు 800 మంది ప్రజలు ఊరేగింపు చేసి, సభ జరుపుకున్నారు.

✦

# రాజకీయ పోరాటంగా నిర్వహించిన రాంగూడ అమరుల సంస్మరణ వారోత్సవాలు




**జులై 28, 2017 అమరుల వారోత్సవాల సందర్భంగా, రాంగూడ అమరుల జ్ఞాపకార్థం, గురుశెట్టి చౌక్ వద్ద స్మారక భవనాన్ని నిర్మించుకొని, 10 వేల మందితో బహిరంగ సభను జరుపుకున్న విప్లవ ప్రజానీకం**

ఎ.ఒ.బి.లో విప్లవోద్యమాన్ని పురోగమింపచేసే కృషిలో, 2016 జులై నుండి 2017 జులై వరకు వివిధ స్థాయిలకు చెందిన 36 మంది కామ్రేడ్స్ తమ రక్త తర్పణతో మన విప్లవ మార్గాన్ని మరింత ప్రకాశవంతం చేసి, ఎర్రజెండాను ఎరుపెక్కించి, పోరాడే ప్రజలకు మార్గదర్శకులుగా, పదనిర్దేశకులుగా, ఆదర్శప్రాయులుగా నిలిచారు.

అమరుల వీరోచిత త్యాగాలను ఎత్తిపడుతూ, వారి ఆశయ సాధనకు అంకితం అవుదాం అంటూ గ్రామగ్రామాన అమరుల సంస్మరణ వారోత్సవాలు జరిపారు.

జూలై 28, 2017 అమరుల వారోత్సవాల సందర్భంగా రాంగూడ అమరుల జ్ఞాపకార్థం గురుశెట్టి చౌక్ వద్ద స్మారక భవనాన్ని నిర్మించుకొని విప్లవ ప్రజానీకం బహిరంగ సభను జరుపుకున్నారు.

పార్టీ పిలుపునందుకొని జూలై 28, 2017 అమరుల వారోత్సవాలను జరుపుకున్న కటాఫ్, పెదబయలు (కొజురుగూడ, పనసపుట్, తోటగూడ, జుమ్మ కొసుంపుట్) ఏరియాల విప్లవ ప్రజా సంఘాలు, 16 గ్రామాల విప్లవ ప్రజానీకం సమిష్టిగా ఏకమైన రాంగూడ అమరుల గుర్తుగా దర్లబెడ చౌక్ వద్ద స్మారక భవనం నిర్మించారు.

ఒక్కొక్క భవన నిర్మాణాన్ని రెండు నెలలు శ్రమించి నిర్మించుకున్నారు. భవనం చుట్టు బౌండరి నిర్మాణం చేసి, పండ్ల, పూల మొక్కలు నాటారు. వీటిని నిర్మిస్తున్న సమయంలో శత్రువు నుండి రక్షించుకోవడానికి రాత్రి, పగలు కాపలా(సెంట్రీ) కాశారు. గురుశెట్టిలో స్మారక భవనం ఆవిష్కరణ కార్యక్రమానికి రాంగూడ ఎన్‌కౌంటర్‌లో అమరులైన 9 మంది స్థానిక మిలీషియా తల్లిదండ్రులతో పాటు, బంధుమిత్రులు హాజరైనారు. వీరితో పాటు పెదబయలు ఏరియాకు చెందిన అమరులైన 4గురు పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్ కుటుంబాలు కూడా హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ, భవన ఆవిష్కరణ అమరుల కుటుంబ సభ్యులతో జరిగాయి. 10 వేల మంది ప్రజలతో, జె.ఎన్.ఎమ్. కళాకారుల పాటలతో భారి ఊరేగింపు జరిగింది. వారి అమరత్వం లోటును భర్తీ చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. చివరగా అమరుల కుటుంబాలను పరిచయం చేయగా వేలాది ప్రజలు ఆ కుటుంబాలకు సహాయంగా, ధాన్యం, బియ్యం, బట్టలు, వంటపాత్రలు, డబ్బులు అందజేసి, ఆర్థికంగా హార్థికంగా మీకు అండగా వుంటామని తెలియజేసారు.

పెదబయలు ఏరియాలో స్థూపాలు 5 స్థూపాలు, కటాఫ్ ఏరియాలో 4 స్థూపాలు, కోరుకొండ ఏరియాలోను అతిపెద్ద స్థూపం నిర్మించారు. మల్కనగిరి జిల్లాలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడైన చిన్నబ్బాయి స్వగ్రామంలో స్థూపాన్ని నిర్మించారు. పై నిర్మాణలే కాకుండా ఎ.పి., తెలంగాణా మైదాన ప్రాంతాలలో రాంగూడ అమరులకు చెందిన స్థూపాలు అనేక చోట్ల నిర్మించారు. ఏప్రాలు అమరుడు కామ్రేడ్ ప్రభాకర్ స్థూప నిర్మాణాన్ని పోలీసులు అడ్డుకున్నారు. మెదక్ జిల్లా నర్సంపల్లిలో చాలా పెద్ద స్థూపాన్ని నిర్మించారు. వీటిని నిర్మించడంలో కూడా వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరవీరుల స్మారక వారోత్సవాలను పార్టీ, ప్రజా సంఘాల నేతృత్వంలో ప్రజలు విస్తృతంగా కదిలి పోస్టర్స్, అమరుల ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలు, బ్యానర్స్ ద్వారా, క్యాంపెయిన్ టీంల ద్వారా గ్రామగ్రామాన ప్రచారం నిర్వహించారు. గ్రామ ప్రజలంతా పనులు ఆపుకొని పెదబయలు, కటాఫ్ ఏరియాలోని ఆదివాసి సాంప్రదాయాలను కూడా జోడించి, సభా స్థలం వద్దకు పిల్లల నుండి వృద్ధుల వరకు తరలివెళ్ళి, సామూహికంగా వంటలు చేసుకొని తిని, అమరులను సంస్మరించుకున్నారు. ఈ అమరుల సంస్మరణ వారోత్సవాలను ప్రజలు పార్టీ నాయకత్వంలో ఒక రాజకీయ పోరాటంగా కొనసాగించారు.

జూలై 28 అమరుల సంస్మరణ వారం సందర్భంగా అమరుల కుటుంబాలకు ఆర్థిక, హార్థిక సహకారాన్నందించిన ప్రజానీకం నందపూర్ ఎ.సి. పరిధిలో ప్రజలు ఇచ్చిన విరాళాలను (27,000/– కొరాపుట్ డివిజన్‌లో ఈ సం॥ అమరులైన ముగ్గురు కామ్రేడ్స్ కుటుంబాలకు అందజేయడం జరిగింది. ✦

## పత్రికా ప్రకటన

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటి, తెలంగాణ స్టేట్ కమిటీల సంయుక్త ప్రకటన

# ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టంపై సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా

# ఏప్రిల్ 25న నిరసన దినం పాటించండి

'ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం–1989' నిరోధిక కేసుల్లో తక్షణ అరెస్టులు వద్దని మార్చి 20న సుప్రీంకోర్టు ఆదేశాలకు నిరసనగా...

'ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం' కేసుల్లో తక్షణ అరెస్టులు వద్దని, మార్చి 20న సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. అలాంటి కేసుల్లో వారంలోగా ప్రాథమిక విచారణ నిర్వహించి ఫిర్యాదు సరైందేనని నిర్ధారించుకోవాలని, ప్రాథమిక సాక్ష్యాధారాలు లేకపోతే ముందస్తు బెయిల్ కూడా ఇవ్వవచ్చని కోర్టు పేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదైనా, అరెస్టు తప్పనిసరి కాదని స్పష్టం చేసింది.

ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఫిర్యాదు దాఖలైతే ఏ విధంగా ముందుకెళ్లాలన్న అంశంపై కూడా సుప్రీం ఆదేశాలిచ్చింది. ప్రభుత్వోద్యోగిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మేరకు ఫిర్యాదు చేస్తే... ఆ ఉద్యోగికి అరెస్టుకు సంబంధిత నియామక అధికారి అనుమతి తప్పనిసరి అని చెప్పింది. ఇతరులపై ఫిర్యాదుల విషయంలో సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లేదా డీఎస్పీ అనుమతి అవసరమంది.

ఎస్సీ, ఎస్టీలపై అత్యాచార నిరోధక చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, దళిత సంఘాలు ఏప్రిల్ 2న భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఉత్తర, తూర్పు భారతదేశంపై తీవ్ర ప్రభావం చూపి, దేశవ్యాప్తంగా బంద్ విజయవంతమైంది. మధ్య ప్రదేశ్, రాజస్తాన్, ఉత్తర ప్రదేశ్, బిహార్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో పోలీసు కాల్పులు, అరెస్టులు జరిగాయి. 9 మంది పౌరులు మరణించగా, వందల మంది గాయపడ్డారు. వేలాది మందిని అరెస్టు చేసారు. కొన్ని రాష్ట్రాల్లో విద్యాసంస్థలు బంద్ అయ్యాయి. విద్యాసంస్థలకు శెలవులు ప్రకటించారు. ఇంటర్‌నెట్, మొబైల్ సేవలు నిలిపివేసారు. ఒడిశా, జార్ఖండ్, గుజరాత్‌లోని ప్రధాన పట్టణాలలో జనజీవవనానికి అంతరాయం కలిగింది.

పార్లమెంటు శాసన విధానానికి సుప్రీంకోర్టు ఉత్తర్వులు విరుద్ధంగా ఉన్నాయని ఎస్సీ, ఎస్టీలపై ఈ తీర్పు తీవ్ర ప్రభావం చూపుతుందని, కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానంలో ఏప్రిల్ 1న తీర్పును సమీక్షించాలంటూ, రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. ఎస్సీ, ఎస్టీల భద్రత విషయంలో అనుకూలంగా ఉన్నానని కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రకటించుకుంటుంది. 2014లో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశంలో దళితులు, మైనార్టీపై అత్యాచారాల ఘటనలు పెరిగిపోయాయని కాంగ్రెస్ ఆరోపిస్తుంది. ఏదో మొక్కుబడిగా నిరసనలు ప్రకటిస్తున్నది. కాంగ్రెస్ పాలనలోనే ఎక్కువ జరిగాయని బీజేపీ ప్రత్యారోపణ చేస్తున్నది.

దేశానికి స్వతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా, అధికారంలో ఏ పాలక పార్టీ ఉన్నా, దళితుల, ఆదివాసీ జీవితంలో ఎటువంటి మార్పును తేలేదు. చట్టాలు ఎన్ని చేసినా వాటిని చిత్తశుద్ధితో అమలు చేయలేదు. ఇప్పుడు వారిచే నియంత్రించ బడుతున్న న్యాయవ్యవస్థ దళితుల రక్షణకు అనుకూలంగా ఉన్న ఆ ఒక్క చట్టాన్ని నీరుగార్చడానికి ఉద్దేశించినదే. దళితులు, ఆదివాసులపై ఆధిపత్య వర్గాల దాడులు యధేచ్ఛగా జరగడం వాటికి దాతు ఫిర్యాదు లేకుండా ఉండేది. ఈ చట్టం కొంచెం వారు అవమానాలకు, దాడులకు, గురైనప్పుడు అండగా ఉంటుంది. కానీ సుప్రీంకోర్టు తీర్పు మళ్ళీ ఆధిపత్య వర్గాలకు వరంగా మారబోతున్నది. పాలక వర్గాల పాలనా విధానాలు, ఉన్నత న్యాయస్థానాల ప్రజావ్యతిరేక తీర్పులు ముఖ్యంగా దళితులను మరింత సమస్యల్లోకి నెడుతున్నాయి.

కంచికచర్ల కోటేశ్ నుండి మొదలుపెట్టి కారం చేదు దళితులపై దాడులు, కెల్వెన్‌మణి లాంటి ఘటనలకు వ్యతిరేకంగా పెల్లుబుకిన ఆందోళనలు, మహారాష్ట్రలోని దళిత పాంథర్స్ చేసిన ఆందోళనలు లాంటి చరిత్ర మనకు తెలుసు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశవ్యాప్తంగా దళితులకు వ్యతిరేకంగా ఒక ట్రెండ్‌గానే యూనివర్శిటీల్లోను, మహల్లాలోను దళితులపై దాడి ఎక్కుపెట్టబడింది. అందులో భాగంగానే గుజరాత్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్రలలో జరిగిన వివిధ రకాలైన దళితులపై దాడులను చెప్పవచ్చు. ఆర్ఎస్ఎస్ రిజర్వేషన్ విధానాన్ని నీరుగార్చుతుంది. ఒక పథకం ప్రకారం సోషల్ మీడియాలో రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ ఏప్రిల్ 10న బంద్‌ను ఆర్గనైజ్ చేసింది. గ్లోబలైజేషన్ వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాలు కుదించి వేయబడ్డాయి. విద్యాసంస్థలు మూసివేయబడ్డాయి. ఆ మిగిలిన కొద్దిపాటి రిజర్వేషన్లు కూడా అందకుండా కుట్రలు చేస్తుంది. ఒక పక్క అంబేద్కర్‌ను పొగుడుతూ, అంబేద్కర్ పేరు చాటున ఓట్ల రాజకీయం చేస్తూ, ప్రజలను ధగా చేస్తుంది. దేశంలో ఊనా నుండి నిన్న మొన్నటి ఘటనలు దాకా దళిత వ్యతిరేక సంఘపరివార్ ఉన్మాదం పెట్రేగిపోతూనే ఉంది. దళితుల ఓట్ల కోసం సవర్ణులందరూ (బీజేపీ, కాంగ్రెస్ మొదలగు) దళితుల గురించి మాట్లాడుతున్నారే తప్ప వారికి చిత్తశుద్ధి లేదు. దళితుల్లోంచి ఒక కొత్త యువతరం ముందుకొచ్చి గొప్పగా

# సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు దేవ్‌కుమార్ సింగ్ అలియాస్ అరవింద్ జీకి జోహార్లు!

మార్చి 23న పత్రికలలో కామ్రేడ్ అరవింద్ అనారోగ్యంతో చనిపోయినట్లు వచ్చింది. నక్సల్బరి పోరాటం నుండి పనిచేస్తూ నాయకత్వ కేడర్ స్థాయికి ఎదిగిన కా॥ అరవింద్ సీపీఐ (ఎమ్ఎల్) పీయూలోను, 1998 నుండి సీపీఐ (ఎమ్ఎల్) పీడబ్ల్యూలోను, 2001 తర్వాత సీపీఐ (మావోయిస్టు)లోను కేంద్రకమిటీ, సభ్యుడుగా పనిచేసాడు. బీహార్-జార్ఖండ్ ఉద్యమానికి తలమానికంగా నిలిచిన పొలిట్ బ్యూరో సభ్యుడు కా॥ అరవింద్‌కు క్రాంతి పత్రిక వినమ్రంగా జోహార్లు చెబుతుంది.

(వచ్చే సంచికలో వివరాలు అందజేయగలం)



సంఘటితమవుతున్న సందర్భాన్ని ఆహ్వానిద్దాం. కొరైగావ్ లాంటి ఘటనలకు వెంటనే ప్రతిస్పందన చూపిన చైతన్యాన్ని, దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్న ప్రజాస్వామ్య గళాన్ని, నిరసన ప్రదర్శనలో భాగమవుతున్న వివిధ సెక్షన్ల ప్రజలను ఆహ్వానిద్దాం.

సుప్రీంకోర్టు ఇటువంటి ప్రకటన చేస్తుందని తెలిసి కూడా కేంద్ర ప్రభుత్వం కలుగజేసుకోలేదు. ప్రజలు, అన్ని సెక్షన్లు ఆంధోళనకు దిగడం బంద్‌లు నిర్వహించడం, అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించడం, బీజేపీ పార్టీలోనే కొంత మంది నాయకులు దీన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడడంతో కేంద్ర ప్రభుత్వం ఆత్మ రక్షణలో పడి రివ్యూ ఫిటిషన్ వేసింది తప్ప దానికి చిత్తశుద్ధిలేదు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలుపైకి వ్యతిరేకిస్తున్నాయే తప్ప ఇంత పెద్ద, ముఖ్యమైన సమస్య పట్ల సరైన విధానాన్ని అనుసరించి పోరాటానికి ప్రజలను సిద్ధం చేయడానికి పూనుకోవడం లేదు.

విప్లవోద్యమ ప్రాంతాల్లో దళితులు, ఆదివాసులపై ప్రభుత్వ సాయుధ బలగాలు యధేచ్ఛగా అత్యాచారాలు, హత్యాకాండ చేస్తున్నాయి. వీటిపై అసలు కేసులు నమోదు చేయడం లేదు. ప్రభుత్వ కమీషన్లు ఈ అత్యాచారాల పట్ల ఉదాసీనంగాను, నిర్లక్ష్యంగాను ఉన్నాయి. అత్యాచారాలు చేసిన పోలీసులకు అవుటాప్ టర్న్ ప్రమోషన్లు కూడా ఇస్తున్నారు. రాజ్య స్వభావాన్ని వ్యక్తీకరించే ఈ ఘటనల పట్ల సమాజం సిగ్గుతో తల వంచుకుంటుంది.

దళితులు, ఆదివాసులు తము పోరాడి సాధించుకున్న ఈ చట్టాన్ని రక్షించుకోవడానికి ఉద్యమించాలి. దళితుల ఆదివాసుల మౌలిక సమస్యల పరిష్కారానికి భూమి కేంద్రంగా ఉద్యమించాలి. దళితులకు, ఆదివాసులకు ఆత్మగౌరవం కావాలన్నా, స్వావలంభన ఒనగూరాలన్నా భూమి, అధికారం దక్కాలి. భూమి, భుక్తి, విముక్తి లక్ష్యంగా సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవం ఒక్కటే దళితులతో సహా అన్ని సెక్షన్ల ప్రజల మౌలిక సమస్యలకు పరిష్కారం తప్ప మరొకటి కాదు. 70 సం॥రాల భారత పార్లమెంటరీ రాజకీయాలు పరిష్కారం చూపవని తేటతెల్లమైంది. దళితులపై దాడులు జరగకుండ ఉండాలన్నా, దళితులకు రిజర్వేషన్లు అమలు కావాలన్నా, అభివృద్ధి పథంలో పోవాలన్నా దళితులు పోరాడక తప్పదు. బీజేపీ ప్రభుత్వ విధానాలకు, సుప్రీంకోర్టు దళిత, ఆదివాసీ వ్యతిరేక ఆదేశాలకు నిరసనగా ఈ నెల 25న జరిగే నిరసన దినాన్ని పాటించాలని అన్ని సెక్షన్ల ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

ఉన్నత న్యాయస్థానం తాత్కాలికంగా మార్చి 20 నాటి ఆదేశాన్ని ఉపసంహరించుకున్నా, ఈ ప్రమాదం భవిష్యత్‌లో మరోసారి కూడా వచ్చేందుకు అవకాశం ఉంది కాబట్టి ప్రజాస్వామిక శక్తులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

విప్లవోద్యమం మొదటి నుండి దళితుల పక్షాన నిలిచి దళితులకు అన్ని విధాల రక్షణ కల్పిస్తూ, వారి మౌళిక హక్కుల రక్షణకు చిత్తశుద్ధితో పనిచేస్తుంది. సుప్రీంకోర్టు మార్చి 20న వెలువరించిన తీర్పుకు నిరసనగా ఏప్రిల్ 25వ తేదీన నిరసన దినాన్ని పాటించాలని అన్ని సెక్షన్ల ప్రజలను కోరుతున్నాము.

| | | |
|---|---|---|
| | వికల్ప్ | జగన్ |
| | అధికార ప్రతినిధి | అధికార ప్రతినిధి |
| 12 ఏప్రిల్, 2018 | దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ | తెలంగాణ రాష్ట్ర కమిటీ |
| | సి.పి.ఐ (మావోయిస్టు) | సి.పి.ఐ (మావోయిస్టు) |

(....చివరి పేజీ తరువాయి)

కష్టనష్టాలు అర్థమవుతాయి. ఎన్నో రకాల ప్రతికూలతలను అధిగమించి నిర్వహించిన ప్రతినిధుల సభలు భవిష్యత్‌ను సరిగా రూపొందించుకుని ఐక్యతను మరింత బలపరచుకున్నందుకు జేజేలు పలుకుదాం.

**మహాసభ నిర్వహించే ఏరియాకు**

తడపాల అమరవీరుల పేర కమ్యూన్ నిర్మాణం చేసి అందులో హాల్ నిర్మాణం, వేదిక ఏర్పాటు, స్థూప నిర్మాణం, బ్యానర్లు అన్నీ తయారుచేసుకున్న తర్వాత మధ్యాహ్నం 3 గం॥లకు ప్రారంభమైన ఊరేగింపు సభా వేదిక ముందుకు వచ్చి చేరింది. వరుసలలో నిలబడిన ప్రతినిధుల, విప్లవ ప్రజల సమక్షంలో జనతన సర్కార్ జెండాను అధ్యక్షురాలు ఆవిష్కరించింది. అంతర్జాతీయ గీతాన్ని సాముహికంగా ఆలపించారు. తర్వాత జనతన సర్కార్ స్కూలు టీచరు కమల అమరుల స్థూపావిష్కరణ చేసింది. అమరులకు 2ని॥ మౌనం పాటించి పేరు పేరున జోహార్లు చెప్పారు. తర్వాత హాలులోనికి ప్రతినిధులను ఆహ్వానించి పరిచయం చేసి ప్రతినిధి కార్డులను అందించారు. అప్పుడే శత్రు బలగాలు దగ్గరలోకి వచ్చాయని కబురు రావడంతో తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తం కావడం జరిగింది. పీఎల్‌జీఏ బలగాలు ప్రతిఘటనకు సిద్ధపడ్డాయి. ఆరోజు ఇంక సభ కార్యక్రమాలు జరగలేదు. మొత్తం పరిస్థితిని క్లియర్ చేసుకుని తిరిగి సభ కార్యక్రమం ప్రారంభం కావడానికి తరువాత రోజు ఉదయం 10 గం॥లయ్యింది.



మొదట ప్రతినిధుల ప్రాతిపదికను వివరించి సభ ఆమోదం పొందడంతో సభా కార్యక్రమాలు మొదలయ్యాయి. ముగ్గురితో అధ్యక్షవర్గాన్ని, ఐదుగురితో స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్న ప్రతినిధులు, సభను రాజకీయంగా గైడ్ చేయడానికి విచ్చేసిన ఉన్నత నాయకత్వాన్ని కూడా వేదిక మీదకు ఆహ్వానించారు. తర్వాత అధ్యక్షవర్గం ఒక అజెండాను ప్రకటించింది. దానిని చర్చించి హాలు ఆమోదం తెలిపింది.

నాయకత్వ కామ్రేడ్ తన ప్రారంభోపన్యాసంలో జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను వివరిస్తూ 2008తో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం రోజురోజుకు మరింత లోతుగా విస్తరిస్తుందని వివరించారు. అమెరికా గ్లోబలైజేషన్ విధానాల్లో సంక్షోభం నుండి బయటపడే మార్గం కానరాక స్వీయరక్షణ విధానాలను అనుసరిస్తూ ప్రపంచ వాణిజ్యంలో కొత్త వైరుధ్యాలకు తెరతీస్తుందని, ఆ కారణంగా చైనా లాంటి నూతన సామ్రాజ్యవాద శక్తులతో తలపడడానికి నూతన యుద్ధ వ్యూహాలు, సమీకరణలకు పాల్పడుతుందని చెప్పారు. భారతదేశం అమెరికాకు తోకగా అమెరికా యుద్ధ రథ చక్రాలకు కట్టివేయబడుతున్నందువల్ల భారత ప్రజలు యుద్ధంలోకి లాగబడే ప్రమాదం ఉందని స్పష్టపరిచారు. ఈ 4 సం॥రాలలో మోడీ ప్రభుత్వ విధానాలు ప్రజావ్యతిరేకం అని, కార్పొరేట్ అనుకూలమని స్పష్టమయ్యిందని, నోట్లరద్దు, జీఎస్‌టీ లాంటి వాటి వలన ప్రజల్లో పెరిగిన ఆందోళనలను వివరించారు. ముఖ్యంగా ఆదివాసీ, దళిత, మైనారిటీ, మహిళలపై జరుగుతున్న వందలాది దాడులు, ప్రజాస్వామిక మేధావుల హత్యలను ఉదహరించారు. రాష్ట్రంలో పెరిగిపోతున్న పోలీసుదాడులను, విప్లవ ప్రతీఘాతుక ప్రభుత్వ దుశ్చర్యలను, స్థానికంగా వనరుల దోపిడీకి రంగం సిద్ధం చేస్తున్న కేంద్రరాష్ట్ర బలగాల సన్నాహాలను తిప్పికొట్టాలని, ఇంకా విప్లవానుకూల పరిస్థితులను గురించి వివరించారు. ఆ వెంటనే ముగ్గురు ఇతర విభాగాల నుండి వచ్చిన కామ్రేడ్స్ సభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ మాట్లాడారు. తర్వాత అమరులకు జోహార్లు తీర్మానాన్ని, జైలు నిర్బంధంలో విప్లవ దీక్షతో కొనసాగుతున్న కామ్రేడ్స్‌కు, ప్రజలకు విప్లవ జేజేలు చెపుతూ ఉన్న తీర్మానాలు కొన్ని చేర్పులతో ఆమోదించారు. అమరులైన కామ్రేడ్స్, ప్రజలతో పాటు బీడీ శర్మ, గౌరీలంకేష్, కల్బుర్గి లాంటి మేధావులకు జోహార్లు చెప్పడంతో పాటు, జైలులో పోరాటాలు చేస్తున్న రాజకీయ ఖైదీల పోరాటాలకు హాల్ సంఘీభావాన్ని ప్రకటించి, అన్ని విధాల మద్దతును అందించాలని తీర్మాణంలో పేర్కొన్నది.

2008లో రూపొందించి అమలు చేస్తున్న జనతన సర్కార్ విధాన కార్యక్రమాన్ని, అలాగే క్రాంతికారీ జనతన సర్కార్ ప్రభుత్వ వ్యవస్థను ఉపాధ్యక్షురాలు స్థూలంగా పరిచయం చేసి చర్చకు ఆహ్వానించింది.

భారత జనతా ప్రజాస్వామిక ఫెడరల్ రిపబ్లిక్ లక్ష్యంగా విప్లవ ప్రజల రాజకీయాధికార అంగాలు ఏర్పాడుతున్నాయని, సాయుధ శక్తి ద్వారా అధికారం చేజిక్కించుకోవడం మనదేశ విప్లవ కేంద్ర సమస్య అని, ముందుగా దోపిడీ పాలకవర్గాల విప్లవ ప్రతీఘాతుక అధికారాన్ని ధ్వంసం చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

నూతన ప్రజాస్వామిక విప్లవపు మౌలిక కార్యక్రమంపై ఆధారపడి, డికేలోని నిర్దిష్ట సామాజిక పరిస్థితులను, ఉద్యమ స్థాయిని దృష్టిలో ఉంచుకుని ఉన్నత స్థాయిలో నిర్దిష్టరూపంగా డివిజన్ జనతా సర్కార్లు ఏర్పడి పనిచేస్తున్నాయని స్పష్టపరిచింది.

ప్రజాయుద్ధాన్ని నిర్వహించే బలమైన పార్టీ, బలమైన పీఎల్‌జీఏ, బలమైన ప్రజాఐక్యసంఘటన కలిగి వర్గపోరాట అనుభవంతో జనతా సర్కార్లు ఏర్పడుతున్నాయని గెరిల్లా జోన్‌లను, గెరిల్లా బేసులుగా అభివృద్ధి చేసే లక్ష్యంతో జనతా సర్కార్లు పనిచేస్తున్నాయని వాటికి నిర్దిష్ట వ్యవస్థిత విధానం, కార్యక్రమం ఉన్నదని, నూతన రాజ్యాధికారాన్ని విస్తృతం చేయడానికి విప్లవ యుద్ధాన్ని తీవ్రతరం చేయాల్సిఉంటుందని, ప్రజలందరినీ ప్రజాయుద్ధంలోకి సమీకరించే మౌలిక కర్తవ్యం చేపట్టాలని దానిలో పేర్కొంది.

ఉన్నతస్థాయిలో ప్రజాఅధికార అంగాల ఏర్పాటు జరగాలంటే గెరిల్లా యుద్ధాన్ని విస్తరింపజేయాలి. శత్రు సైనిక బలాన్ని, శత్రు రాజ్యాధికారాన్ని తుడిచిపెట్టడం తప్పనిసరి అని నొక్కి చెప్పింది.

ఇది ప్రజాయుద్ధ స్థితిపైన, అంతర్జాతీయ దేశీయరాజకీయ పరిస్థితిపైన ఆధారపడి ఉంటుందని వివరించింది. ప్రజా స్వేచ్ఛలు గురించి చెబుతూ భావప్రకటన, సమావేశం, సంఘం, సమ్మె, నివాసం, విద్య, వైద్యం, కనీస ఉపాధి లాంటి స్వేచ్ఛలుంటాయని, అలాగే విధులుగా దేశరక్షణ, రాజ్యాంగం చట్టం పట్ల గౌరవం, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, సైనిక సేవలు, పన్నులు కట్టడం కూడా ఉంటాయని స్పష్టపరిచింది. 18 సం॥ల యువతీయువకులకు ఎన్నికయ్యే హక్కు, ఎన్నికచేసే హక్కుకూడా ఉంటుందని అలాగే ఎన్నికయిన ప్రతినిధులను వెనక్కి పిలిచే అధికారం కూడా ఉంటుందని చెప్పింది.

దేశంలో ఎవరిపట్లా రాజ్యం వివక్షచూపదని, అందరిపట్లా ఒకేరకంగా వ్యవహరించి, సమాన అవకాశాలు కల్పిస్తుందని హామీనిచ్చింది. రాజ్యం పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతుందని, 8గం॥ల పనిదినాన్ని, కనీసవేతనాలను, సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయడంతో పాటు కార్మికులందరికి సామాజిక భద్రతను, కనీస సౌకర్యాలను కల్పిస్తుంది. ఆదివాసీ సమాజాల సమగ్ర అభివృద్ధికి స్వయంపాలనకు గ్యారంటీనిస్తుంది. భాషా సంస్కృతుల వికాసానికి తోడ్పడుతుంది. శాస్త్రీయ ప్రజాస్వామిక సోషలిస్టు విద్యావ్యవస్థను ప్రవేశపెడుతుందని వివరించింది.

ఆ తర్వాత జనతన సర్కార్ జెండా, గీతం ప్రభుత్వ ఏర్పాటు ప్రభుత్వ స్వరూపం, ఎన్నిక, పనివిధానం, వివిధ స్థాయిల జనతన సర్కార్ల మధ్య సంబంధాలు, ఎన్నికల విధానం, ప్రభుత్వ శాఖలు విధులు, స్టాండింగ్ కమిటీ, సమావేశాల గురించి వివరంగా చర్చించడం జరిగింది.

హాల్ చర్చలలో భాగంగా విధాన కార్యక్రమానికి చిన్న చిన్న మార్పులను ప్రతిపాదించడం, ఆమోదించడం జరిగింది. దీనికి పూర్తిగా ఒక రోజు సమయాన్ని తీసుకోవడం జరిగింది.

తర్వాత 4 సం॥ జనతన సర్కార్ కర్తవ్యాల నిర్వహణ, పాలనను సమీక్షిస్తూ రాసిన ముసాయిదా సమీక్షను అధ్యక్షురాలు ప్రవేశపెట్టి అన్ని శాఖల గురించిన మంచి చెడులను వివరించింది. సమీక్షలో భాగంగా పని విధానాన్ని, రక్షణ విషయాన్ని, ఆర్థికాభివృద్ధి, విద్య, ఆరోగ్య సంక్షేమాల గురించి, అడవి, పర్యావరణ పరిరక్షణ, వివిధ సెక్షన్ల సమస్యలు, పితృస్వామ్య వ్యతిరేకపోరాటం గురించి, ప్రజాసాంస్కృతిక వికాసానికి చేపట్టాల్సిన చర్యల గురించి వివరంగా హాల్ చర్చించి కొన్ని సవరణలు ప్రతిపాదించి చర్చల అనంతరం హాల్ రాజకీయంగా ఐక్యతను చాటుతూ ఆమోదించడం జరిగింది. ఆ వెంటనే 4సం॥ల జమాఖర్చులను అధ్యక్షురాలు సమర్పించింది. దానిని కూడా హాల్ చర్చించి ఆమోదించడం జరిగింది.

ఆ తర్వాత హాల్ ముందు నాయకత్వం 4 సం॥ పాటు జరిగిన కృషిలో జరిగిన లోపాలు, పొరపాట్లను గురించి ఆత్మవిమర్శను ప్రవేశపెట్టగా హాలు చర్చించి, విమర్శించడం జరిగింది. ఆవిధంగా నిర్మాణ ఐక్యతను కూడా సాధించడం జరిగింది. అనంతరం నూతన నాయకత్వాన్ని ప్రతిపాదన, ఆమోదం, ఎన్నిక ప్రజాస్వామికంగా నిర్వహించింది. క్రాంతికారీ జనతన సర్కార్ ప్రతినిధి సభ నూతనంగా రాబోయే 4 సం॥లకు 18 నూతన కర్తవ్యాలను రూపొందించుకున్నది. అందులో నిర్మాణ పరంగా మెరుగు పరచుకుని పటిష్ఠ పరచుకోవడంతో పాటు నిరంతరం రాజకీయంగా చైతన్యవంతం చేసుకోవలసిన కర్తవ్యాలు, ప్రజాయుద్ధాన్ని పెంపొందించాల్సిన కర్తవ్యాలు, ప్రజల అభివృద్ధి, సంక్షేమాలకు సంబంధించిన కర్తవ్యాలు, పర్యావరణపరిరక్షణ, పితృస్వామ్య వ్యతిరేకపోరాటం, నాలుగు వర్గాల ప్రజల ఐక్యతాకృషి, ఉద్యోగి, మేధావి వర్గాలతో సమన్వయం లాంటి భవిష్యత్ కర్తవ్యాలు హాల్ ఆమోదించింది. పెరుగుతున్న నిర్బంధ పరిస్థితుల్లో తిరిగి తలఎత్తే ప్రజా వ్యతిరేకులు, తెగ పెద్దాల్, పూజారులు విషయంలో అప్రమత్తంగా ఉండాలనుకున్నారు.

60 మంది ప్రతినిధుల సభలో 33 శాతం మహిళా ప్రతినిధులున్నారు. 33 శాతం పేదులు, 65 శాతం మధ్యతరగతి, ఒకరు ధనిక రైతు ఉన్నారు. ప్రతినిధుల సగటు వయస్సు 33 సం॥గా ఉంది. 9 మంది నిరక్షరాస్యులున్నారు.

అలాగే హాల్ వివిధ రాజకీయ అంశాలపై కొన్ని తీర్మాణాలు చర్చించి ఆమోదించింది. అందులో బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ఓడిద్దాం, విస్థాపనకు వ్యతిరేకంగా పోరాడుదాం, క్రాంతికారీ జనతన సర్కార్ ప్రచార ఆందోళనకు దేశ విదేశాల్లో అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్న మిత్రులందరికి విప్లవాభినందనలతో ఒక తీర్మానం, కుటీర పరిశ్రమల అభివృద్ధికి సంబంధించిన ఒక తీర్మానం లాంటివి ఆమోదించడం జరిగింది. హాల్‌లో జరిగిన కార్యక్రమాలు ప్రతినిధులకు స్పష్టతను ఇవ్వడంతో పాటు నూతన కర్తవ్యాలను, బాధ్యతలను అందించిన తర్వాత చివరిగా హాల్ మొత్తం నిలబడి నూతనకర్తవ్యాల కోసం చైతన్యవంతమైన కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేసారు. తర్వాత జెండా దగ్గర విప్లవ కార్యకర్తలు, ప్రజల సమక్షంలో కర్తవ్యాలను వివరించి, నాయకత్వాన్ని పరిచయం చేసారు. చివరగా మంచి ఉత్సాహ వాతావరణంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

విప్లవ ప్రజల సహాయ సహకారాలతో, ప్రజల రక్షణతో దక్షిణబస్తర్ డివిజన్–క్రాంతికారీ జనతన సర్కార్ ప్రతినిధుల సభలు విజయవంతం అయ్యాయి. ✦

# కార్పొరేట్ సెక్యూరిటీ నిరంతర దాడుల మధ్యనే దక్షిణ బస్తర్ డివిజన్ క్రాంతికారీ జనతన సర్కార్ 4వ ప్రతినిధుల సభను విజయవంతం చేసిన విప్లవ ప్రజలకు జేజేలు!

2018 ప్రారంభంలో దక్షిణ బస్తర్ డివిజన్‌లో విప్లవ ప్రజలు పంచాయితీ, ఏరియా స్థాయిలలో జనతన సర్కార్ ప్రతినిధుల సభలు పూర్తి చేసుకొని జిల్లా స్థాయి ప్రతినిధుల సభను నిర్వహించుకున్నారు. 2014లో జరిగిన 3వ ప్రతినిధుల సభ నుండి నేటికి 4సం॥ల కాలంలో జనతన సర్కార్ అమలు చేసిన కార్యక్రమాలు, రూపొందించుకున్న కర్తవ్యాల అమలును సమీక్షించుకుని, నూతన కర్తవ్యాలను రూపొందించుకోవడం, అలాగే నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం లక్ష్యంగా జరిగిన ప్రతినిధుల సభలు విజయవంతమయ్యాయి. ప్రకృతి వనరులను, పర్యావరణాన్ని కాపాడుకోవడంలో భాగంగా తమ మాన ప్రాణాలను కాపాడుకోవడానికి ఇక్కడ ప్రజలు అనేక కష్టానష్టాలకోర్చి దోపిడి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, ఆ ప్రభుత్వ సాయుధ బలగాలను ప్రతిఘటిస్తున్నారు. పెరుగుతున్న క్యాంపులు, మోహరిస్తున్న సాయుధ బలగాలు, ఆధునిక ఆయుధాలు సాంకేతికతతో పాటు డాంబరు రోడ్లు, కమ్యూనికేషన్ టవర్లు నిర్మించి జాయింట్ కమాండ్‌ల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో దాడులు చేస్తున్నాయి. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్లలో వందల మందిని హత్యలు చేస్తున్నా, మహిళలపై నిత్యం అత్యాచారాలు చేస్తున్నా, ఇండ్లలో చొరబడి లూటీ చేసినా, దహనకాండ కొనసాగించినా, జనతన సర్కార్ స్కూల్స్‌ను, వ్యవసాయ క్షేత్రాలను ధ్వంసం చేస్తున్నా ప్రజలు ప్రతిఘటిస్తూనే ఉన్నారు తప్ప లొంగిపోవడం లేదు. ప్రభుత్వ బూటకపు సంస్కరణలను, పోలీసుల సివిక్ ఏక్షన్ ప్రోగ్రాంలను బహిష్కరిస్తున్నారు. సల్వాజుడుం, గ్రీన్‌హంట్ 1,2,3 దశలు, వాటి కొనసాగింపుగా "సమాధాన్-2022"లను ప్రతిఘటిస్తూనే ఉన్నారు. వందల మంది ప్రజల ప్రాణ త్యాగాలతో నిర్మాణమయి ముందుకెడతున్న క్రాంతికారీ జనతన సర్కార్ వేలాది మంది ప్రజల్ని సమీకరించి నక్సల్బరీ 50 సం॥ ఉత్సవాలను, రష్యా 100 సం॥ విప్లవ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించింది. గ్రామగ్రామాన విప్లవ రాజకీయ చైతన్యాన్ని పెంపొందించింది. పంచాయితీ, ఏరియా, జిల్లాస్థాయి ప్రజాసంఘ నిర్మాణాల మహాసభలను విజయవంతంగా పూర్తి చేసుకుని విప్లవ ప్రజలు జనతన సర్కార్ ప్రతినిధుల సభలకు హాజరయ్యారు. అన్ని స్థాయిలలోను క్రింది నుండి ప్రజాస్వామిక ప్రక్రియను పూర్తిచేసుకుని చర్చలు, ఎన్నికలు ప్రజాస్వామికంగా నిర్వహించి జిల్లా స్థాయిలో జనతన సర్కార్ ఎన్నికలకు జిల్లా ప్రతినిధుల సభకు సర్వసన్నద్ధమయ్యింది.



దక్షిణ బస్తర్ డివిజన్ క్రాంతికారీ జనతన సర్కార్ 4వ ప్రతినిధుల సభ ర్యాలీ

2018లో దండకారణ్యంలో అనేక ఘటనలు జరిగాయి. దక్షిణ బస్తర్ ప్రాంతంలో రెండు సంఘటనలు జరిగాయి. తెలంగాణా సరిహద్దులలో గ్రేహౌండ్స్ బలగాలు దాడి చేసి తడపాల గుట్టల్లో 10 మంది విప్లవకారుల్ని హత్యచేస్తే ఆ వెంటనే కిష్టారం దగ్గర సీఆర్‌పీఎఫ్ బలగాలను 9 మందిని పీఎల్‌జీఏ హతమార్చింది. శత్రుదాడులు-ప్రతిదాడులు మధ్యనే ఈ ప్రతినిధుల సభలు విజయవంతం అయ్యాయి. ఈ యుద్ధం ఇవ్వాళ మొదలయ్యింది కాదు. వెంటనే అంతమయ్యేది కాదు. దోపిడీ వర్గాలను సమూలంగా రూపుమాపేవరకు ఈ యుద్ధం వివిధ స్థాయిల్లో, వివిధ రూపాల్లో కొనసాగుతూనే ఉంటుంది. అందులో భాగంగానే జనతన సర్కార్ పాలకవర్గాలు ప్రజలపై రుద్దిన యుద్ధాన్ని ప్రతిఘటిస్తూనే సామాజిక, ఆర్థిక, రాజకీయ కార్యకలాపాలను కొనసాగిస్తుంది. ఈ నేపథ్యం నుండి చూసినపుడు మాత్రమే జనతన సర్కార్ ప్రతినిధుల సభల నిర్వహణలో ఉన్న

*(మిగతాది 58వ పేజీలో...)*